# వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 16 సంచిక : 5 హైదరాబాద్ 202 మే 2018 పేజీలు : 68 రూ. 25

- మార్క్స్ ద్విశత జయంతి ప్రత్యేకం: నాలుగు వ్యాసాలు, మూడు అనువాదాలు
- కరువా - హిందూత్వ దురాగతం
- తెలంగాణపై కాగ్ నివేదిక
- ఆంధ్రప్రదేశ్‌లో కుల - మత పాలన
- చరిత్రాత్మక రైతు లాంగ్ మార్చ్
- ఎస్‌సి, ఎస్‌టి చట్టానికి తూట్లు
- ఖనిజాల కోసం మనుషుల వేట

202
ISSN 2231-6892

# వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

మే 2018
సంపుటి : 16
సంచిక : 5




- ❖ పాఠకుల వీక్షణం — 4
- ❖ సంపాదకీయం — ◆ ఈ పరిణామాలు చెపుతున్నదేమిటి? — 5
- ❖ సంపాదకీయ వ్యాఖ్యలు — ◆ తెలంగాణ జన సమితికి ఒక ఆహ్వానం, ఒక హెచ్చరిక ◆ వంచనకూ ఒక హద్దు ఉంటుంది! — 6
  - ◆ అగ్రరాజ్యాల రణస్థలిగా సిరియా – ఎ.నర్సింహారెడ్డి — 7
- ❖ దేశీయం – సమాజపు పతనస్థితిని చూపిన కరువా – జి.ఉదయ — 9
- ❖ ప్రాంతీయం – ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఎవరి కోసం? – బి. రామకృష్ణ — 10
- ❖ 〃 – తెలంగాణపై కాగ్ నివేదిక – ఎ. పున్నయ్య — 14
- ❖ దేశీయం – దళితులపై కాషాయ కర్కశం – చంద్రం — 18
- ❖ 〃 – ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార చట్టం – చిమ్మె జాన్ బర్నబాస్ — 20
- ❖ ప్రాంతీయం – తెలంగాణ వలస కార్మికులపై నిర్బంధం – అక్కెనపెల్లి దుర్గేశ్ — 22
- ❖ 〃 – మొలకెత్తుతున్న బిటి–3 సమస్యలు – లక్ష్మణ్ గడ్డం — 23


**కార్ల్ మార్క్స్ (1818 – 1883) ద్విశత జయంతి ప్రత్యేకం**


- ◆ మార్క్స్ జీవితం, సిద్ధాంతం, పోరాటం – ఎం. గంగాధర్ — 25
- ◆ మార్క్స్ స్మృతిలో ఎంగెల్స్ మాటలు — 33
- ◆ కార్ల్ మార్క్స్ మృతి — 34
- ◆ చారిత్రాత్మక కమ్యూనిస్టు ప్రణాళిక – ఎ. నర్సింహారెడ్డి — 35
- ◆ కమ్యూనిస్టు ప్రణాళిక – పెట్టుబడి – బ్రహ్మచారి — 40
- ◆ మార్క్సిజం విశ్వజనీన సత్యం – డా. నళిని — 43
- ◆ కార్మికుల అధ్యయనానికి మార్క్స్ ప్రశ్నావళి — 46

- ❖ దేశీయం – మెకనాస్ గోల్డ్ కోసం మనుషుల వేట – వరవరరావు — 49
- ❖ ప్రాంతీయం – ప్రజల్ని ఏమారుస్తున్న సామాజిక మాధ్యమ వేదికలు – బైరెడ్డి సతీష్ — 51
- ❖ దేశీయం – చరిత్రాత్మక 'మహా రైతు' లాంగ్‌మార్చ్ – సంతోష్ — 54
- ❖ అంతర్జాతీయం – కారు చీకట్లో కాంతి రేఖ – రాజేంద్రబాబు అర్విణి — 57
- ❖ ప్రాంతీయం – ఆంధ్రప్రదేశ్‌లో కుల–మత పాలన – డా. కత్తి పద్మారావు — 60
- ❖ ఈనేల – వై. రామచంద్రం — 63
- ❖ ఇరుగు–పొరుగు – వై. రామచంద్రం — 64
- ❖ భూగోళం – సి. రాజశేఖర్ — 65
- ❖ అసహజ మరణాలు – ఎస్. వెంకటేష్ — 66




**'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా**

**వీక్షణం** VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

**వీక్షణం చందా వివరాలు**

| | సంస్థలకు / లైబ్రరీలకు | వ్యక్తులకు |
|---|---|---|
| విడి ప్రతి | రు. 25 | రు. 25 |
| సంవత్సరం | రు. 300 | రు. 250 |
| మూడు సంవత్సరాలు | రు. 900 | రు. 650 |
| ఐదు సంవత్సరాలు | రు. 1500 | రు. 1100 |
| పది సంవత్సరాలు | రు. 3000 | రు. 2000 |

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

**వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2018 ఏప్రిల్ నెలలో వచ్చిన విరాళాలు - వెంకటేశ్వర్లు, గుంటూరు - రు. 5,000; కృష్ణమోహన్, హైదరాబాద్ - రు. 10,000; జైని మల్లయ్య గుప్త, భువనగిరి - రు. 10,000.**
**మిత్రులకు కృతజ్ఞతలు - సం.**

ఇటీవల మహారాష్ట్రలో 'స్ఫూర్తిదాయకం'గా జరిగిన రైతుల పాదయాత్ర గురించి ఏప్రిల్ వీక్షణం సంపాదకీయం, 'నెత్తురోడిన పాదాలు...' పై వ్యాఖ్య.

అంతకుముందే ఉదారవాద అభ్యుదయ పత్రికల, కాలమిస్టుల, వ్యక్తుల అద్భుతోద్వేగ పొగడ్తల వ్యాసాలు, కవితల పరంపరతో నాలో మొదలైన ఇబ్బంది, అసంతృప్తికి పరాకాష్ట అయింది. నేను అత్యంతంగా అభిమానించే పీరియాడికల్, అందునా, సంపాదకుడి నుంచా ఇది! అనిపించింది.

నా అసంతృప్తికి కారణాలు విశ్లేషణలూ ఇవి: 1) ఆ రైతుయాత్ర జరగబోయేది ముందే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి తెలుసు. ఎర్రజెండా అయితేనేం, ఆ పార్టీ సోదర పార్లమెంటరీ ఎన్నికల పాలకపక్ష రాజకీయ పార్టీ అనుబంధ రైతు సంఘమే. దాని ఎర్రదనం తెలిసినదే. ఆ సంఘం సమాచారమివ్వడానికో యాత్ర అనుమతి కోసం వచ్చినపుడో తనవద్దకు వచ్చినపుడు, మాటల్లో 'అవసరం లేదనీ, వద్దనీ నచ్చజెప్ప ప్రయత్నించినా వినకుంటే, వాళ్ల 'అవసర'మేమిటో తెలిసిన ఫడ్నవీస్, 'సరే మీ ఇష్టం' అని పరోక్ష అంగీకారం తెలపడం వల్ల ఆ మహాయాత్ర ఎటువంటి రాజ్య రక్షకభట అడ్డంకులు లేకుండా ప్రశాంతంగా 'విజయవంతంగా' ముగిసింది. 2. సదరు సంఘ గాడ్‌ఫాదర్ పార్టీ గత, వర్తమాన చరిత్ర అందరికీ విదితమే.

దశాబ్దాల తరబడి మూన్నాల్గు రాష్ట్రాలలో అప్రతిహతంగా పాలించి, పాలించని రాష్ట్రాలలో సైతం గుర్తించదగిన పార్టీ కేడర్‌నూ, సంపన్న పార్టీ కార్యాలయ భవనాలను, అదే స్థాయిలో నిధులను కలిగిన పార్టీ అది. అట్లా అది తన లక్ష్యసాధన కోసం ఇతర జాతీయ పార్లమెంటరీ పార్టీల లాగే గేదరింగ్‌లకు యాత్రలకు వేల సంఖ్యల్లో మాస్‌నే గాక పట్టణ నగర పెటీ బూర్జువా సెక్షన్ల మద్దతునూ, సహాయ సహకారాలనూ సిద్ధం చేయగలదు. సామాన్య, ముఖ్యంగా శ్రామిక పీడిత ప్రజా శ్రేణుల సమస్యలకు తాత్కాలిక, శాశ్వత కాదు, ఉపశమన పరిష్కారాలను తాయిలాలను 'సాధించిపెట్ట' గలదు. సుదీర్ఘ భవిష్యత్తులో తమ భవిష్యత్ తరాల, వర్గాల ప్రయోజనాల కోసం త్యాగపూరిత సమరశీల పోరాటాలవసరం లేదు, ఇపుడు మనం బతకాలనే బోధనలను సందేశాలను ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఇవ్వగలదు. అట్లా తమ పాలకవర్గాల పీఠాలను కాపాడుకోగల చరిత్ర ఉన్నదే. కొండొక చోట పార్టీలో దశాబ్దాల తరబడి ఉండి, 'తగినంత' సంపాదించినంక అధికార పార్టీలోకి దుమికిన వాళ్లూ లేకపోలేదు. ఈ చరిత్ర క్రమాన్ని విజయవంతంగా నిలుపడమే ఆ ర్యాలీ సాధించి పెట్టింది. కాకుంటే... కేవలం మహారాష్ట్ర రైతులకే ఉన్న సమస్యలేనా అవి? ఇతర రాష్ట్రాల రైతులకు లేవా?

ఒకటి రెండు అటు ఇటుగా ఉన్న సమస్యల సాధన డిమాండ్ల కోసం స్వతంత్రంగా ఉద్యమించిన రాజస్థాన్, హర్యానా రైతుల మీద లాఠీలు నాట్యమాడినవెందుకు? తుపాకులు పేలి మూన్నాల్గురు హతులయ్యారెందుకు? కాకుంటే వాళ్లు రవాణా మార్గాలను దిగ్బంధించి 'క్రమశిక్షణ'ను ఉల్లంఘించా రంతే. వాళ్ల డిమాండ్‌లలో మహారాష్ట్ర యాత్ర రైతులంత విశాల డిమాండ్ లేమీ లేవే! మధ్య భారతంలో కొన్ని చోట్లనైనా తాము తరతరాలుగా ఆధారపడి బతుకుతున్న నేలను వదలమంటున్న ప్రజాస్వామ్యయుత నిరసనల మీద తూటాలు, గుడిసెల దహనాలెందుకు? అత్యంత 'క్రమశిక్షణాయుత' ఏబికెఎస్ ర్యాలీ ముందుకు ముఖ్యమంత్రులవారు స్వయంగా వచ్చి సమస్యల పరిష్కారానికి ఆరు నెలల వ్యవధినివ్వండని వినయపూర్వక హామీనివ్వగానే, కనీసం ఒకటి రెండు ప్రధాన సమస్యల పరిష్కారానికి తక్షణమే జి.ఓ.లివ్వండని అయినా కోరకుండా సంతృప్తిగా వెనుదిరిగారు రైతు శ్రేణులు. ర్యాలీ తరువాత రెండవరోజో మూడవరోజో అదే మహారాష్ట్ర రైతులు ఔంబై పైచిలుకు రైతులు కొందరు, తమకు ఆత్మహత్య చేసుకొనే హక్కివ్వండని ముఖ్యమంత్రికి దరఖాస్తు చేసుకున్నరెందుకో! మొన్నకు మొన్న వరంగల్‌లో టిపిఎఫ్ ఆధ్వర్యంలో వరంగల్ డిక్లరేషన్‌కు ఇరవై ఏళ్లు పూర్తయిన సందర్భంగా సభకు అనుమతి పొంది, ఆ సభకు, అమరవీరులకు నివాళులర్పించి యాత్రగా వెళతాం అని పట్టుబట్టిన యువ కార్యకర్తల వీపులు చింతపండయినా యెందుకో! ఆడ మగ తేడా లేకుండా పోలీసు వాహనాల్లోనికి విసిరి వేయబడ్డారెందుకో.

చివరగా, మొత్తంగా చెప్పే నా అసంతృప్తి ఇబ్బంది ఏమిటంటే... పార్లమెంటరీ పాలకవర్గాలు కుమ్మక్కై నిర్వహించిన మహా రైతు ర్యాలీని చైనా విప్లవోద్యమానికే సంకేతంగా కాయినేజ్‌గా ముందుకొచ్చిన 'లాంగ్‌మార్చ్' పదాన్ని ఈ రైతు ర్యాలీకి తగిలించిన విధమే పైగా స్ఫూర్తిదాయక మైనదిగా పేర్కొనడం బాగలేదు. ఈ ర్యాలీ కల్గించిన స్ఫూర్తి, ఇచ్చిన సందేశం ఏదైనా ఉందంటే, అవి సమస్యలన్నీ తక్షణంగా పరిష్కరించడం కుదరదనీ, క్రమంగా పాలకులే పరిష్కరిస్తారనీ, వీటి పరిష్కారం కోసం సమరశీల త్యాగపూరిత పోరాటాలనవసరమనేదే. ఈ స్ఫూర్తి సందేశాలు, ప్రస్తుతం అక్కడక్కడైనా, వ్యవస్థ సంపూర్ణ మార్పు కోసం, సమసమాజ లక్ష్యిత వర్గ పోరాటాల కొనసాగింపును చులకన చేసేవే లేదా నీళ్లు చల్లేవే లేదా వాయిదా వేసేవే.

– వీరబ్రహ్మా చారి
హన్మకొండ

ఏప్రిల్ వీక్షణంలో సంపాదకీయం 'నెత్తురోడిన పాదాల లాంగ్ మార్చ్ సందేశం' చదివాను. సమాజంలో, అది ఏ కారణాల వల్లనైతేనేమి, ప్రజల్లో కానీ, ఒక వర్గంలో కానీ, ఎవరికి వారు విడిపోయి ఉన్నారు. తమ సమస్యల పరిష్కారాల కోసం నాసిక్ రైతులు ఒక్కచోట చేరారు. యాభైవేల మంది ఒకచోట చేరి, నూటఎనభై కిమీ దూరం నడిచివెళ్లడం నిజంగా ప్రశంసించాల్సిన విషయం. నాసిక్ నించీ ముంబైకి చేరినప్పుడు అక్కడి ప్రజలు వీళ్లకి భోజనాలూ, నీళ్లూ, చెప్పులూ స్వచ్ఛందంగా అందించడం ఎంతో మంచి విషయం. ప్రజల సమస్యల మీద జరిపే ఒక సమ్మె అయినా, ఊరేగింపు అయినా వాటికి మిగతా ప్రజల సహకారం తప్పనిసరి. కొన్ని చోట్ల కార్మికులు తమ సమస్యల పరిష్కారాల కోసం జరిపే సభలకీ వాటికీ విరాళాలు సేకరించడం ఉంటుంది. అలాంటప్పుడు ప్రజలు తమ వంతు సహకారం వాళ్లకి అందించాలి. ఎందుకంటే మెజారిటీ ప్రజలు ఎక్కడో ఒక చోట కార్మికులే. ఇక దుకాణాలు నడిపేవాళ్లు కూడా – కార్మికులకు సరుకులు అమ్ముకొనడం ద్వారా లాభం సంపాయిస్తారు. కాబట్టి వాళ్లు కూడా విరాళాలు ఇచ్చే సమయంలో విసుక్కోకుండా ఉండాలి. అది దాన

(మిగతా 53వ పేజీలో...)

*గత సంచికలో రాజేంద్రబాబు అర్విణి రాసిన 'అమెరికాలో బతుకు భయం భయం' వ్యాసం పేజీ నం. 62లో కుడివైపు పేరా 17వ లైన్‌లో 'విస్మరించుకోవడం కోసం' అని తప్పుగా అచ్చయింది. దీనిని 'స్మరించుకోవడం కోసం' అని చదువుకోగలరని మనవి. అచ్చు తప్పుకు చింతిస్తున్నాం. – సం.*

**అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు**

**తెలంగాణ :** ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

**ఆంధ్రప్రదేశ్ :** అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

*(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)*

వీక్షణం

# ఈ పరిణామాలు చెపుతున్నదేమిటి?

'దేశమా ఆక్రోశ కోశమా ఇది' అని మన తెలుగు కవి కెవిఆర్ నాలుగు దశాబ్దాల కింద ఆవేదన వ్యక్తం చేశారు. 'ఏప్రిల్ అతి క్రూరమైన మాసం' అని ఇంగ్లిష్ కవి టి ఎస్ ఇలియట్ వంద సంవత్సరాల కింద రాశారు. గడిచిన నెల రోజులలో దేశంలో జరిగిన పరిణామాలు ఈ కవి వాక్కులను నిజం చేస్తున్నట్టున్నాయి. ఈ నాలుగు వారాలలో సంఘ్ పరివార్ పాలకుల, వారి తైనాతీల ప్రత్యక్ష పరోక్ష ప్రోత్సాహాలతో దాదాపు పది విషాద, భయానక పరిణామాలు సంభవించాయి. ఈ సమాజానికి ప్రజాస్వామ్య, లౌకిక, ఆధునిక రాజ్యంగా మనగలిగే భవిష్యత్తు ఉందా, ఇక్కడ కనీస చట్టబద్ధ పాలన అయినా అమలవుతుందా అనే ప్రశ్నలు మాత్రమే కాదు, అసలు సాధారణమైన నాగరిక మనుగడ అయినా కొనసాగుతుందా అని అనుమానించే పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఏప్రిల్ రెండో వారంలో ఉత్తర భారతంలో బైటపడిన దారుణమైన అత్యాచారాల, హత్యల, బెదిరింపుల ఘటనలు దేశాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో గత జూన్ లో స్థానిక శాసనసభ్యుడు, భారతీయ జనతా పార్టీ నాయకుడు తన మీద అత్యాచారం చేశాడని, అందుకు సంబంధించి కేసు నమోదు చేయమని ఒక పదిహేడేళ్ల దళిత యువతి తొమ్మిది నెలలుగా అభ్యర్థిస్తున్నా కదలని పోలీసులు ఆమెను భయపెట్టడానికి ఏప్రిల్ 5న తండ్రిని అరెస్టు చేశారు. అయినా బెదిరిపోకుండా ఆమె ఏప్రిల్ 8న ముఖ్యమంత్రి నివాసం ముందర ఆత్మాహుతి చేసుకుంటానని ప్రకటించింది. ఆ ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. పోలీసుల చిత్రహింసల ఫలితంగా ఆమె తండ్రి ఆ మర్నాడు మరణించాడు. సరిగ్గా ఈ పరిణామాలు జరుగుతున్నప్పుడే జమ్ములోని కథువాలో జనవరి రెండోవారంలో జరిగిన అత్యాచార, హత్య ఘటన బైటపడింది. బకర్‌వాలా సంచార ముస్లిం తెగ తమ ప్రాంతానికి రాకుండా బెదరగొట్టాలని ప్రభుత్వోద్యోగిగా పదవీ విరమణ చేసి, గుడి పూజారిగా ఉన్న ఒక వ్యక్తి పథకం రచించాడు. ఆ పథకంలో భాగంగా ఆ తెగకు చెందిన ఎనిమిదేళ్ల బాలికను అపహరించి, గుడిలో బంధించి, రోజుల తరబడి అత్యాచారం చేసి, చంపేశారు. ఈ అపహరణలో, అత్యాచారంలో, హత్యలో, సాక్ష్యాధారాలు తొలగించడంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, పోలీసు అధికారులు సహకరించారు. తన కూతురు అదృశ్యమయిందని బాలిక తండ్రి ఫిర్యాదు చేస్తే పట్టించుకోని పోలీసులు, మృతదేహం దొరికిన తర్వాత కూడ అదే నిర్లక్ష్యం వహించగా, న్యాయవ్యవస్థ జోక్యంతో కేసు దర్యాప్తు బాధ్యత క్రైం బ్రాంచికి చేరింది. అక్కడ ఒకరిద్దరు నిజాయితీపరులైన అధికారుల వల్ల మొత్తం దుర్మార్గమంతా బైటపడి, సాక్ష్యాధారాలు కూడ దొరికి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. న్యాయస్థానంలో ఛార్జిషీట్ సమర్పించబోయినప్పుడు సంఘ్ పరివార్ ప్రేరేపిత న్యాయవాదులు అడ్డుకున్నారు. నిందితుల మీద చర్య తీసుకోవద్దని కోరుతూ హిందూ ఏకతా మంచ్ ఆందోళన ప్రారంభించింది. సంఘ్ పరివార్ శక్తులు పాల్గొన్న, నిర్వహించిన ఆ ఆందోళనల్లో భాజపాకు చెందిన మంత్రులు పాల్గొన్నారు. నిందితులకు అనుకూలంగా జరిగిన ఊరేగింపుల్లో, ప్రదర్శనల్లో త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. భారత్ మాతాకీ జై అని నినదించారు. ఈ రెండు అత్యాచార ఘటనల మీద దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన పెల్లుబకగా, సంఘ్ పరివార్ ప్రచార యంత్రాంగం అన్ని మాధ్యమాలలోనూ అబద్ధ ప్రచారాలు ప్రారంభించింది. అసలు అత్యాచారమే జరగలేదనీ, తప్పుడు ఛార్జిషీటు తయారు చేశారనీ, రోహింగ్యాలో, ముస్లింలో ఈ అత్యాచారం చేసి హిందువుల మీద నెడుతున్నారనీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఈ ఘటనలను రాజకీయం చేస్తున్నారనీ ఎన్నో అబద్ధాలు ప్రచారంలో పెట్టారు.

ఈ దారుణాలు వాటికవిగా మొదటివీ కావు, చివరివీ కావు. మైనారిటీ మతస్తుల మీద, ఆదివాసుల మీద, దళితుల మీద, స్త్రీల మీద హిందుత్వ సాగిస్తున్న ఫాసిస్టు దాడుల పరంపరలో భాగమే ఇవి. హింస, హత్య, అత్యాచారం, బెదిరింపు... మొత్తంగా ఆ సమూహాన్ని భయభీతావహంలో ముంచడం, విద్వేష రాజకీయాలు వ్యాపింప జేయడం హిందుత్వ శక్తుల కార్యక్రమం. కేంద్ర ప్రభుత్వ అధికారం అందిన ఈ నాలుగు సంవత్సరాలలో ఇటువంటి ఘటనలు మరింత పెచ్చరిల్లిపోయాయి. ఈ అత్యాచారాల మీద నిరసనలు చెలరేగుతుండగానే, హిందుత్వ శక్తుల నేరాల మీద విచారణ జరుగుతున్న మూడు కేసులలో వరుసగా తీర్పులు వచ్చాయి. న్యాయవ్యవస్థలో సంఘ్ పరివార్ జోక్యానికి నిదర్శనంగా అన్నిటికన్ని కేసులలోనూ నిందితులను నిర్దోషులుగా విడుదల చేయడమో, ఆ నేరాలతో నిందితులకు సంబంధం లేదని చెప్పడమో చేశారు. పదకొండు సంవత్సరాల కింద జరిగిన మక్కా మసీదు పేలుళ్ల కేసులో మొదట అది ముస్లిం తీవ్రవాదులు చేసిన పని అని ప్రచారం చేసి, ఎంతోమంది అమాయక ముస్లిం యువకులను నిర్బంధించి వేధించారు. మూడు సంవత్సరాల తర్వాత మరొక కేసులో అరెస్టయి విచారణాక్రమంలో అసీమానంద అనే సంఘ్ పరివార్ కార్యకర్త మక్కా మసీదులో బాంబులు అమర్చింది తామేనని చెప్పాడు. విచారణ సంస్థలు ఆ సాక్ష్యాధారాలన్నిటినీ సంపాదించి, కేసు నడిపాయి. కాని చివరికి హిందూ తీవ్రవాద సంస్థలకు పేలుళ్లతో సంబంధం లేదని ఏప్రిల్ 16న తీర్పు వెలువడింది. అలాగే నాగపూర్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించిన న్యాయమూర్తి బ్రిజ్‌మోహన్ లోయా కేసులో అనుమానాలున్నాయని, అంతకు ముందరి సోహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసు లోంచి భాజపా అధ్యక్షుడు అమిత్ షాను తప్పించడానికే లోయాను అంతం చేసి ఉంటారని, మళ్లీ దర్యాప్తు జరపాలని వచ్చిన కేసులో ఏప్రిల్ 19న తీర్పు ఇస్తూ సుప్రీంకోర్టు పునర్విచారణ జరపనక్కరలేదని అంది. అలాగే గుజరాత్ మారణకాండ సందర్భంలో వంద మంది ముస్లింలను ఊచకోత కోసిన, సజీవ దహనం చేసిన నరోడా పాటియా కేసులో హంతకులను రెచ్చగొట్టిన ఆరోపణలతో కింది కోర్టులో శిక్షకు గురైన భాజపా నాయకురాలు మాయా కొడ్నానీ నిర్దోషి అని ఏప్రిల్ 20న గుజరాత్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. మరొకవైపు, ఇది రాస్తున్న సమయానికి మహారాష్ట్ర లోని గడ్చిరోలిలో ప్రభుత్వ బలగాలు మావోయిస్టుల మీద దాడి చేసి అత్యంత దుర్మార్గంగా 42 మందిని పొట్టన పెట్టుకున్నాయి.

చట్టసభలు, పాలనా యంత్రాంగం, న్యాయవ్యవస్థ, పత్రికా రంగం, సమాజంలో అధికారం నెరపగల శక్తులన్నీ కూడ ఎంత దుర్మార్గంగా మారిపోతున్నాయో ఈ ఘటనలు చూపుతున్నాయి. ఈ కుళ్లిపోయిన వ్యవస్థను కూలదోయడం కన్న మరొక ప్రత్యామ్నాం లేదని ఈ ఘటనలు వేనోళ్ల చెపుతున్నాయి. వీ

## సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

# తెలంగాణ జన సమితికి ఒక ఆహ్వానం, ఒక హెచ్చరిక

తెలంగాణ రాష్ట్ర సమితి పద్నాలుగు సంవత్సరాల పాటు తెలంగాణ ప్రజా ఆకాంక్షల ఆందోళనలో భాగమైనప్పటికీ, నాయకత్వం వహించినప్పటికీ, అధికారానికి వచ్చిన తర్వాత అది ఆ ఆకాంక్షలను తుంగలో తొక్కడం ప్రారంభించింది. తానే ప్రకటిస్తూ వచ్చిన లక్ష్యాలకు దూరం జరుగుతూ వచ్చింది. ప్రజలను వంచించడానికి, భ్రమల్లో ముంచడానికి పాత మాటలనే వల్లిస్తూ, ఆ మాటలకు వ్యతిరేక ఆచరణలో పడింది. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షల ఫలితంగా వచ్చిన అధికారాన్ని పిడికెడు మంది ఆశ్రితుల ప్రయోజనాలకు కుదించింది. ఏ కోస్తాంధ్ర – రాయలసీమ కాంట్రాక్టర్ల, సంపన్నుల ఆధిపత్యం కింద తెలంగాణ నలిగిపోయిందనీ, దోపిడీ పీడనలకు గురైందనీ, ఆ దోపిడీ పీడనల నుంచి విముక్తి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలనీ తెలంగాణ ప్రజలు ఉద్యమించారో, అవే ఆధిపత్యశక్తుల అధికారం చెక్కుచెదర లేదు సరిగదా బలపడుతూ వచ్చింది. తెలంగాణ ప్రజానీకంలో గణనీయమైన భాగం వేచి చూడాలనీ, ప్రత్యర్థుల దృష్టిలో పలుచన కావద్దనీ తొలి రెండు సంవత్సరాలు మౌనం వహించారుగాని తెరాస పాలనా విధానాలు క్రమక్రమంగా అంతకంతకూ ఎక్కువ ప్రజా సమూహాలలో అసంతృప్తిని మిగిల్చాయి. ఆ అసంతృప్తి వ్యక్తీకరణకు కూడ అవకాశం ఇవ్వని నిరంకుశ నిర్బంధ పాలనను కొనసాగించడం ద్వారా తెరాస మరింత అసంతృప్తినీ ఆగ్రహాన్నీ మూట కట్టుకుంది. కోదండరామ్ నాయకత్వంలో తెలంగాణ జన సమితి అనే కొత్త రాజకీయ పక్షం ఆవిర్భవించడాన్ని ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలి. ఇవాళ తెలంగాణలో ఉన్న అసంతృప్తుల, ఆగ్రహాల వాతావరణంలో, ఆ ఆగ్రహం బైటికి కనబడకుండా పాలకులు సాగిస్తున్న అణచివేత, ఉక్కపోత వాతావరణంలో ప్రజల వైపు నుంచి, ప్రజా ఆకాంక్షలు వ్యక్తం చేసే ఎన్ని ప్రయత్నాలు జరిగినా ఆహ్వానించవలసినవే. ఆ రకంగా చూసినప్పుడు ప్రజా ఆకాంక్షల వ్యక్తీకరణకు ఒక కొత్త వేదికగా తెలంగాణ జనసమితిని ఆహ్వానించవలసి ఉంది. అది సొంతంగా రాష్ట్ర రాజకీయాధికారం చేపట్టగలదా లేదా అనేది ఇప్పటికైతే సందేహమే. అటువంటప్పుడు అది కూడ అవకాశవాద రాజకీయ పొత్తులకు దిగి తన ప్రజాపక్ష శక్తిని తానే బలహీన పరచుకుంటుందా చూడవలసే ఉంది. నిజంగా సొంతంగానో, పొత్తులతోనో అధికారంలోకి రాగలిగినా, ఉన్న రాజకీయార్థిక చట్రంలో ప్రజానుకూల విధానాలు అమలు చేయగలదా, కనీసం రాజ్యాంగ బద్ధంగా ఒక రాష్ట్ర ప్రభుత్వం ఉండగలిగినంత ప్రజానుకూలంగానైనా ఉండగలదా ఇప్పటికైతే జవాబు లేని ప్రశ్నలే. అయితే, దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా తెలంగాణ ప్రజా ఆకాంక్షల కెరటాల మీద ఎగిసిన ఎన్నో నురుగులు కరిగిపోయాయని, తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్ముకుని ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఎన్నో నాయకత్వాలు తమ పబ్బం గడుపుకోవడానికి వాడుకున్నాయని, ఆకాంక్షలకు ద్రోహం చేశాయని, అంతిమంగా ప్రజలకు మిగిలింది వంచన మాత్రమేనని చూపడానికి 1951, 1956, 1969, 1972, 2014 వంటి ఎన్నో కొండగుర్తులున్నాయి. తెలంగాణ జన సమితి నిజంగా తెలంగాణ ప్రజా ఆకాంక్షలు వ్యక్తీక రించడానికి, ప్రజా సమస్యలను పరిష్కరించడానికి నిలబడుతుందా, తనను తాను పాలకవర్గ రాజకీయ పక్షాల తానులో మరొక ముక్కగా తేల్చుకుంటుందా చరిత్ర చెపుతుంది. ఒక చారిత్రక సామాజిక అవసరాన్ని తీర్చడానికి కాలం తనకు జన్మనిస్తున్నదని, ఆ అవసరం తీర్చలేకపోతే అనేక పార్టీలలో ఒకానొకటిగా కాలగర్భంలో కలిసిపోక తప్పదని గుర్తించడం తెలంగాణ జన సమితి బాధ్యత. వీ

## సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

# వంచనకూ ఒక హద్దు ఉంటుంది!

వంచనా శిల్పంలో అందెవేసిన చెయ్యి అని పేరు తెచ్చుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన రికార్డులను తానే బద్దలు కొట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రజల కోసం నాలుగు సంవత్సరాలుగా చేయవలసిన పనులూ, చేయగలిగిన పనులూ ఏమీ చేయకుండా తాత్సారం చేసి చివరికి తన అసమర్థతకు నెపం కేంద్ర ప్రభుత్వం మీదపెట్టి నిరాహారదీక్షకు దిగడం ఆయనకే చెల్లింది. ఎన్.డి.ఎ.తో, భారతీయ జనతా పార్టీతో నాలుగు సంవత్సరాలు సఖ్యంగా గడిపి, కేంద్ర ప్రభుత్వంలో మంత్రి పదవులు కూడ అనుభవించి, రాష్ట్రంలో భాజపాకు మంత్రి పదవులు ఇచ్చి, ఆ నాలుగు సంవత్సరాలలో ఒక్కసారైనా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీల గురించి ప్రశ్నించకుండా, నిలదీయకుండా, హఠాత్తుగా ఎన్నికల సంవత్సరం మొదలవుతుందనగా ఆ హామీలు గుర్తు తెచ్చుకోవడం చంద్రబాబు రాజకీయ అవకాశవాదానికి సహజమైనదే. ఇలా పోరాటానికి దిగినట్టు నటిస్తూనే, ప్రజల్లో భ్రమలు కలిగిస్తూనే, గంభీర ప్రసంగాలు చేస్తూనే, వాస్తవంగా కేంద్ర ప్రభుత్వం మీద చీమ కుట్టినంత ప్రభావం అయినా పడకుండా జాగ్రత్త తీసుకోవడమూ చంద్రబాబు తెలివితేటల్లో భాగమే. దేశంలో నిజమైన సమాఖ్య పాలన సాగకపోవడం, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ హక్కులను హరించి వేయడం కొత్తది కాదు. ప్రస్తుత తెలుగుదేశం నాయకులకు తమపార్టీ చరిత్ర గుర్తు ఉండి ఉంటే తమ స్థాపక నాయకుడు కేంద్రం మిథ్య అనే సంచలనాత్మక ప్రకటన చేశాడని తెలుస్తుంది. మరి అటువంటి మిథ్యలో నాలుగు సంవత్సరాల పాటు భాగం పంచుకున్నారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగం ఇచ్చిన అధికారాలనైనా నిలబెట్టుకోవడానికి ప్రయత్నించ లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలకు గండికొట్టే జిఎస్‌టి చట్టాన్ని పరుగెత్తుకు పోయి స్వాగతించారు. ప్రత్యేక హోదానా, ప్యాకేజీనా అనే శుష్క వివాదాలలో సమయం వృథా చేశారు. పేరు ఏదైనా అందిన నిధులను తమ సొంత బొక్కసాలకు మళ్లించుకున్నారు. లేదా తమ ఆశ్రిత కాంట్రాక్టర్ల ద్వారా ప్రవహింపజేసుకున్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు వెల్లువెత్తుతుంటే ఆ సమస్యల పరిష్కారం మీద దృష్టి పెట్టకుండా కేవలం అంతర్జాతీయ రాజధాని మీద, భజనపరుల వందిమాగధ స్తోత్రాల మీద, ఆర్భాటాల మీద కేంద్రీకరించారు. ఐదు సంవత్సరాల కోసం వచ్చిన అధికారంలో దాదాపు నాలుగు సంవత్సరాలు ఇలా కాలక్షేపం చేసి ఇక ఇది చివరి ఏడాది కాబట్టి, తాము చేయని పనులను మరిపించడానికి కేంద్ర ప్రభుత్వం చేయని పనులవైపు వేలు చూపెడుతున్నారు. ఉదయం ఏడు లోపల ఉపాహారం ముగించుకుని, సాయంత్రం ఏడు తర్వాత భోజన సమయానికి ఇల్లు చేరేలా, మధ్య కాలంలో పన్నెండు గంటల పాటు ధర్మపోరాట నిరాహార దీక్ష. ఈ పన్నెండు గంటల దీక్షా వైభోగానికి ముప్పై కోట్ల రూపాయల ఖర్చు, ఎయిర్ కండిషనర్లు, కూలర్లు, పరుపులు, బాలీసులు, అడుగులకు మడుగులొత్తే అధికారగణం, పార్థివదేహం దగ్గర చివరి చూపు కోసం జరిగినట్టు జనాల వరుసలు, కేంద్రం మీద పోరాటం అని పెడబొబ్బలు... పోరాటం అంటే, ప్రజల హక్కులను కాపాడడం అంటే ఈ తతంగమే అయినట్టయితే నిఘంటువులను తిరగ రాయాలి. ప్రజలను వంచించడంలో తనకు ఆకాశమే హద్దు అని చంద్రబాబు మరొకసారి నిరూపించారు. వీ

# అగ్రరాజ్యాల రణస్థలిగా సిరియా

– ఎ.నర్సింహారెడ్డి

బల ప్రయోగం, కుటిల రాజకీయాల విష క్రీడలో సిరియా ఏడు సంవత్సరాలుగా అల్లాడుతోంది. తాజాగా అమెరికా, రష్యా మధ్య మొదలైన పరోక్ష పోరు మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందేమోనని అంతర్జాతీయ సమాజం ఆందోళన చెందుతోంది. ఈ పరిస్థితికి బషల్ అల్ అసద్ కారకుడని అమెరికా ఆరోపిస్తుంటే, గతంలో అఫ్ఘనిస్థాన్, ఇరాక్, లిబియాలలో ఆడిన కపట నాటకాన్నే సిరియాలో మొదలు పెట్టారని అసద్ ఆరోపిస్తున్నాడు. అమెరికాతో సౌది, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ తదితర దేశాలు చేతులు కలిపాయి. సిరియాలో రసాయన ఆయుధాలున్నాయని నెపం మోపి వాటిని ధ్వంసం చేసే సాకుతో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సంయుక్తంగా ఏప్రిల్ 13న అర్ధరాత్రి సాగించిన విధ్వంసకర క్షిపణి దాడుల్లో 14 మంది మృతి చెందారు. దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించాలన్న అంతర్జాతీయ ఒడంబడికను ఉల్లంఘించి, భద్రతా మండలి అనుమతి తీసుకోకుండా ఏకపక్షంగా దాడులకు దిగాయి. ఈ దుశ్చర్యలు, ఇరాక్‌పై దండయాత్రకు నాటి అధ్యక్షుడు జార్జి డబ్ల్యుబుష్ చేసిన తప్పుడు ఆరోపణలను గుర్తుకు తెస్తున్నాయి. సిరియా ప్రభుత్వానికి రష్యా మిలటరీ అండ, ఇరాన్ తోడ్పాటు ఉన్నందున మధ్య ప్రాచ్యంలో పశ్చిమ దేశాల ఆధిపత్య ప్రయత్నాలు నెరవేరనందున సిరియాను దెబ్బతీయాలని అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్‌లు ఈ దుస్సాహసానికి ఒడిగట్టాయి. ఈ దాడులకు నిరసనగా న్యూయార్క్, లాస్ ఏంజల్స్, హైఫా, లండన్, టోక్యో వంటి పలు నగరాల్లో యుద్ధం వద్దంటూ బ్యానర్లు పట్టుకుని ప్రజలు ప్రదర్శనలు జరిపారు. పశ్చిమాసియా నుంచి అమెరికా వైదొలగాలని నినాదాలు చేశారు.


డమాస్కస్‌కు తూర్పున తిరుగుబాటుదారుల అదుపులోని తూర్పు గౌటాలోని డౌమా పట్టణంపై ఏప్రిల్ 7న సిరియా సైన్యం రసాయన పదార్థాలున్న ఆయుధాలు ప్రయోగించిందని అమెరికా ఆరోపించింది. ఈ ఆరోపణపై తనిఖీలు నిర్వహించేందుకు హేగ్ కేంద్రంగా పనిచేసే రసాయనిక ఆయుధాల నిషేధ సంస్థ (ఒపిసిడబ్ల్యు) నిపుణుల బృందం వస్తుండగా, పశ్చిమ దేశాలు కొన్ని గంటల ముందు క్షిపణి దాడులకు పాల్పడ్డాయి. వారి క్షిపణులు పడిన ప్రదేశంలో పలు భవనాలు శిధిలమయ్యాయి. సిరియాలో ఒకవైపున ఇస్లామిక్ టెర్రరిస్టులు, మరోవైపున పశ్చిమ దేశాల ప్రోద్బలమున్న ప్రతిపక్ష తిరుగుబాటుదారులు 2011 నుంచి అసద్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అంతర్యుద్ధం సాగిస్తున్నారు. కొద్ది కాలంలో ఇరాక్, లిబియాల్లాగా సిరియాను పట్టివేయగలమనుకున్న పశ్చిమ దేశాలకు ఎదురు దెబ్బ తగిలింది. అసద్ ప్రభుత్వ సైన్యాలు రష్యా సహాయంతో ప్రతిపక్ష తిరుగుబాటుదారులను అదుపు చేశాయి. శాంతి చర్చల ద్వారా రాజకీయ పరిష్కారం మినహా మరో దారిలేని సిరియా పరిస్థితిని అమెరికా, దాని మిత్ర దేశాల క్షిపణి దాడులు మరింత జటిలం చేశాయి. రష్యా అధ్యక్షుడిగా పుతిన్ తిరిగి ఎన్నికైన నాటి నుంచి అతన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్న ట్రంప్, థెరిసా మే అతనిపై కసితోనే సిరియాపై దాడి చేసినట్లున్నారు. ఒపిసిడబ్ల్యు తనిఖీ ఫలితాల కోసం వేచి చూడకుండా క్షిపణి దాడులకు దిగడం వారి దుర్బుద్ధిని, దుందుడుకు తనాన్ని తెలియజేస్తున్నది. సిరియాలో శాంతి నెలకొనాలంటే రెండు అగ్రరాజ్యాలు సిరియా నుండి వైదొలగి శాంతి స్థాపనకు కృషి చేయాలని ఒత్తిడి తేవాలి. వీ




'ది హిందూ' ఇంగ్లిష్ దినపత్రిక, హైదరాబాద్ ఎడిషన్‌లో విలేకరిగా పనిచేస్తున్న స్వాతి వడ్లమూడి కఠువా దురంతం నేపథ్యంలో సోషల్ మీడియాలో వేసిన ఈ కార్టూన్ మీద సంఘ్ పరివార్ శక్తులు పోలీసు కేసు పెట్టాయి. ఆమెను చంపివేస్తామని బెదిరింపు ఫోన్‌కాల్స్ చేశాయి. హైదరాబాద్ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి దాకా జర్నలిస్టుల నిరసన వెల్లువెత్తడంతో ప్రస్తుతానికి ప్రమాదం తగ్గింది కాని, పూర్తిగా సమసిపోయిందని చెప్పలేం. ఆమెకు వీక్షణం సంఘీభావం.




❖ **అమరుల యాదిలో...** – నాలుగున్నర దశాబ్దాల పౌరహక్కుల ఉద్యమం – 16 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు: నారాయణరావు, ఫోన్: 9866734867





❖ **ఆపరేషన్ గ్రీన్‌హంట్ – ఆదివాసీలపై హత్యాకాండే** – పౌరహక్కుల సంఘం ప్రచురణ (ఆం.ప్ర., తెలంగాణ), ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ – 130 పేజీలు, 1/8 డెమీ, రు. 50




❖ **పౌరహక్కుల సంఘం – నిజ నిర్ధారణలు – సంఘటనలు** – పౌరహక్కుల సంఘం ప్రచురణ (ఆం.ప్ర., తెలంగాణ) – 254 పేజీలు, 1/8 డెమీ, రు. 50

పై రెండు ప్రతులకు: 8-43/8యు/17/ఇ, రోడ్ నం. 3, లేన్ 8, రాజశేఖర కాలనీ, బాలాజీ హిల్స్, ఉప్పల్, హైదరాబాద్ – 500039; ఫోన్: 9441181271, 9866734867




❖ **ఆకాశం కోల్పోయిన పక్షి** – కృష్ణుడు – ఎమెస్కో ప్రచురణ – 166 పేజీలు, 1/8 డెమీ, రు. 125, ప్రతులకు: ఎమ్మెస్కో బుక్స్, 1-2-7, బానూకాలనీ, గగన్ మహల్ రోడ్, దోమలగూడ, హైదరాబాద్ – 500029; ఈమెయిల్ emescobooks@yahoo.com; www.emescobooks.com





❖ **నివురు** – నిజం – 222 పేజీలు, 1/8 డెమీ, రు. 125, ప్రతులకు: నిజం ప్రచురణలు, ఎ-26, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్ – 500 033; ఫోన్: 9440310013





❖ **వీణా వేదనం** – కథలు – గన్నవరపు నరసింహమూర్తి – పాలపిట్ట బుక్స్ – 152 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: గన్నవరం నరసింహమూర్తి, 9-59, రవినగర్, నాయుడుతోట, వేపగుంట పోస్ట్, విశాఖపట్నం – 530 047;





❖ **నది కాలం అతడు** – ఇస్మాయిల్ ఇతివృత్త కవితా సంపుటి – రవూఫ్ – పాలపిట్ట బుక్స్ – 120 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: డా. రవూఫ్, 13-3-41/ఎ, గుంటూరువారి తోట, 3వ లేన్, గుంటూరు – 520 001; ఫోన్: 9849041167





❖ **కౌసల్యా సుప్రజా రామ** – నవల – తాటికొండల నరసింహారావు – పాలపిట్ట బుక్స్ – 104 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: తాటికొండల నరసింహారావు, 6-2-42/6, హబ్సీగూడ, చెరువు బజార్, ఖమ్మం – 507001; ఫోన్: 9885787250





❖ **కవేరా కలం-కాలం** – కణుగుల వేంకటరావు రచనలు – కూర్పు: డా. కె.సుధీర్ సిక్కోలు బుక్ ట్రస్ట్ – 296 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: సిక్కోలు బుక్ ట్రస్ట్, ఎంఐజి-100, హౌసింగ్‌బోర్డు కాలనీ, జిల్లా పరిషత్ ఎదురుగా, శ్రీకాకుళం – 532001; ఫోన్: 9989265444




❖ **అనప పువ్వులు** – కవితల కూర్పు – కూర్పు: అగరం వసంత్ – బస్తి యువక బృందం ప్రచురణ – 128 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: డా. ఎన్. వసంత్, బస్తి యువక బృందం, 2/1097, బస్తి, ఆవులపల్లి రోడ్డు, హోసూరు – 635109, కృష్ణగిరి జిల్లా, తమిళనాడు





❖ **ఏడాది చెప్పితే ఎద్దైన వింటది** – గేయ శతకం – నడిమెట్ల రామయ్య (ప్రజాకవి) – 138 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: నడిమెట్ల రామయ్య, ఇ.నెం. 6-6-834, శివాజీనగర్, కరీంనగర్-505 001; ఫోన్: 8106657657




❖ **అంతర్వేది** – కవిత – డా. అవధానం రఘుకుమార్ – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: ఎ. నాగమణి, ఫ్లాట్ నెం. 401, శశాంక్ రెసిడెన్సీ, స్ట్రీట్ నెం. 11, తార్నాక, హైదరాబాద్-500 017; ఫోన్: 040-27000327, 9391955136, 9000064165, 9441015709




❖ **సహృదయ సాహిత్య విమర్శ – వైవిధ్యం** – సాహిత్య వ్యాసాలు – డా. అమ్మంగి వేణుగోపాల్ – జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక – 360 పేజీలు, 1/8 డెమీ, రు. 300, ప్రతులకు: శ్రీమతి టి. విజయలక్ష్మి, 11-9-317, లక్ష్మీనగర్, రోడ్ నం. 4, కొత్తపేట్, హైదరాబాద్-500035; ఫోన్: 9441054637




❖ **విదేశీ యాత్రీకులు అందించిన మన చరిత్ర** – టి. వెంకట్రావ్ – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 192 పేజీలు, 1/8 డెమీ, రు. 130




❖ **వివేకానందుని సామాజిక, రాజకీయ దృక్పథాలు** – బినయ్ కె. రాయ్ – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 72 పేజీలు, 1/8 డెమీ, రు. 40




❖ **చాణక్య నీతి** – 300 శ్లోకాలు తాత్పర్యంతో... – సంకలనం: కె.వి. రమణ – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 62 పేజీలు, 1/8 డెమీ, రు. 40

పై మూడు ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ, (నాగోల్), జిఎస్ఐ పోస్ట్, హైదరాబాద్ – 500068, ఫోన్ : 040-24224453/54

# సమాజపు పతనస్థితిని చూపిన కరువా

***కరువా ఘటన సమాజపు పతన స్థితిని సూచిస్తుందని, పాలకులే ఈ చర్యలకు అవకాశం కల్పిస్తున్నారని, ఇటువంటి ఘటనలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రజా ఉద్యమమే పరిష్కారమని అంటున్నారు జి. ఉదయ***

జమ్ముకశ్మీర్‌లోని అసీఫా అనే చిన్నారిపై జరిగిన దారుణ అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం అయింది. ఒక 8 ఏళ్ల చిన్నారి, పసితనపు అమాయకమైన, ప్రపంచంలో ఉన్న దుష్టత్వం గురించి ఏమీ తెలియని నవ్వు ముఖంతో ఉన్న ఆ చిట్టితల్లిపై జరిగిన దారుణం ఇవ్వాళ ఈ దేశంలో అమలవుతున్న దుర్మార్గాన్ని, మనుషుల్లో పేరుకుపోయిన దుష్టత్వాన్ని, కుళ్లిపోతున్న ఈ సమాజపు మానవీయతను కళ్లకు కడుతోంది. ఈ దుర్మార్గమైన హేయమైన నేరంలో చదువుకుంటున్న యువకులూ, చదవలేక ఫెయిల్ అయి గ్రామంలో జులాయిగా తిరుగుతున్న యువకులే కాదు, స్వయంగా తన కొడుకును, కొడుకు లాంటి వాడిని ఇలాంటి నేరానికి ఉసిగొలిపి దగ్గర ఉండి చేయించిన రామభక్తుడు, దేవాలయ పూజారి అయిన ఒక తండ్రి ఉన్నాడు. జరిగిన దారుణమైన నేరం గురించిన ప్రతి చిన్న వివరమూ తెలిసి, అన్ని సాక్ష్యాలు తెలిసి, చట్టాలను కాపాడవలసిన స్థాయిలో ఉండి కూడా నిందితులను కాపాడడానికి (5 లక్షలు లంచం తీసుకొని) ఈ నేరాన్ని ఎట్లా కప్పిపుచ్చుకోవాలో, సాక్ష్యాలను ఎలా నాశనం చేయాలో, ఒక తప్పుడు కథనాన్ని ఎలా వినిపించాలో సలహాలు ఇస్తూ సహకరించిన పోలీసు ఇన్‌స్పెక్టర్ (స్థానిక ఎస్ఐ), హెడ్ కానిస్టేబుల్ మరో ఇద్దరు పోలీసుల పాత్ర ఉన్నది. స్థానిక పోలీసుల నుండి కేసు క్రైం బ్రాంచ్‌కు అప్పగించిన తరువాత అసాధారణంగానే అయినా నిజాయితీతో కేసును విచారించి, జరిగిన నేరాన్ని, అందుకు పాల్పడ్డ నేరస్థులను గుర్తించి వారిపై చార్జిషీటు ఫైల్ చేయబోతున్న తరుణంలో, దీన్ని అడ్డుకోవడానికి, నేరస్థులను కాపాడడానికి నల్లకోటు వేసుకొని, న్యాయ గ్రంథాలు చేత పట్టుకున్న లాయర్లు, ఆ అమ్మాయికి న్యాయం నిరాకరిస్తూ, న్యాయ బహిష్కారానికి కోర్టుల బంద్‌కు పిలుపునిచ్చిన న్యాయవాదుల పాత్ర ఉన్నది.

ఈ ఘోరం వెలుగులోకి రాకుండా చేయడానికి, స్వయంగా మంత్రులు నిరసన ర్యాలీలో పాల్గొన్నవారు, వారిని సమర్థిస్తూ మాట్లాడిన వారూ పాత్రధారులే. ఇంత హేయమైన ఘటన జరిగి దేశమంతా రగిలిపోతూ న్యాయం కోసం డిమాండ్ చేస్తుంటే మౌనంతో నేరానికి తన సమర్థన తెలియజేస్తున్న ప్రధానమంత్రి కూడా పాత్రధారుడయ్యాడు. వీరంతా ఈ జరిగిన హేయమైన నేరంలో కనిపిస్తున్న భాగస్వాములు. అయితే ఇక్కడ కనిపించని విషయాలు కూడా చాలా ఉన్నాయి. ఈ దేశంలో ముస్లింజాతి మొత్తం నేరస్వభావం కలిగినవారని, వారివల్ల ఇక్కడి హిందూ సమాజం కలుషితమైందని, వారిని ఇక్కడి నుండి వెళ్లగొట్టాలనే ద్వేష భావాన్నే దేశభక్తిగా ప్రచారం చేస్తున్న భావజాలం మనుషులను కింది స్థాయి దాకా ఎట్లా విద్వేషపూరితం చేస్తుందో ఈ ఘటన తెలియజేస్తుంది. మీరు ఎవరినైనా ద్వేషించ దలుచుకున్నపుడు వాళ్ల స్త్రీలను, వాళ్ల పసిపిల్లలైనా సరే, ఎంతటి దారుణాలకు గురిచేయవచ్చో, పైగా అదంతా దేశభక్తిగా ఎలా చూడవచ్చో ఈ దేశంలో ఇప్పటికే అనేక సార్లు–దేశ విభజనాటి నుండి, బాబ్రీ మసీద్ విధ్వంసం తరువాత ముంబైలో జరిగిన దాడుల్లోనూ, గుజరాత్‌లో మతం పేరుతో ఒక జాతిని నిర్మూలించడానికి జరిగిన అల్లర్లలోనూ, ఇప్పుడు ఈ పసిబిడ్డదాకా–పరమత ఆడవాళ్లపై దాడులకు దాష్టీకానికి తెగబడడమే ఎట్లా దేశభక్తిగా ప్రచారం చేస్తున్నారో చూడవచ్చు. శత్రువులకు చెందిన ఆడవాళ్లు దొరికినప్పుడు–వాళ్లు మావోయిస్టు శత్రువులు కావచ్చు, గుజరాత్‌లో లాగా మనం ద్వేషించే పరాయిమతం ఆడవాళ్లు కావచ్చు, ఖైర్లాంజిలో లాగా మనం అసహ్యించుకునే పరాయి కులం ఆడవాళ్లు కావచ్చు–వాళ్లపై వికృతమైన లైంగిక దాడి. రేప్ చేయాల్సిందే. అలా చేయడం ఏమాత్రం సిగ్గు పడాల్సింది కాదనే సందేశాన్ని పోలీసు స్టేషన్లలో మన పోలీసులు, మన రాజకీయ నాయకులు కింది స్థాయిలో కార్యకర్తలు సామాన్యుల దాకా వ్యాపింపచేశారు. దొరికిన మహిళ మావోయిస్టు సానుభూతి పరురాలైతే ఆమె మర్మాంగాల్లోకి రాళ్లు నెట్టవచ్చునని సోనిసోరి కేసుతో, పట్టుబడిన మావోయిస్టు స్త్రీలపై సామూహిక అత్యాచారం చేయవచ్చుననీ, వారి మర్మాంగాలకి కరెంట్ షాక్‌లు ఇవ్వవచ్చుననీ, వారి రొమ్ములు కోసివేయవచ్చునీ అనేక సందర్భాలలో, ఇంకా మావోయిస్టులకు సహకరిస్తున్నారని, అన్నం పెడుతున్నారని (వాకపల్లి ఘటనలోలాగా) ఆదివాసీ గ్రామాలపై పడి, వాళ్ల మొగవాళ్ల ముందే వాళ్లను రేప్ చేయవచ్చుననీ, ఇదంతా దేశరక్షణ లో భాగమేననీ మన పోలీసు వ్యవస్థ తాను ఆచరించి ప్రజలకు చూపింది. ఈ పోలీసుల ప్రవర్తనను సమర్థిస్తూ మన పాలకులు వాళ్లకు అవార్డులు, ప్రమోషన్లు ఇచ్చి సత్కరిస్తారు. ఆ శత్రు స్త్రీలపై దాడి చేయడం ఇవాళ పసిబిడ్డ దాకా వచ్చింది, ఇదీ దేశరక్షణలో, దేశభక్తిలో భాగమే ఎందుకు కాదు!

ఇటువంటి విష భావజాలాన్ని ఈ దేశంలో వ్యాపింపచేసిన పాలకులు, ఈ భావజాలాన్ని ఎల్లప్పుడూ లేదా ఏదో ఒక సందర్భంలో ఉపయోగించుకున్న అన్ని రాజకీయ పార్టీలు, దాదాపు ఎల్లప్పుడూ ఉపయోగించుకుంటున్న మన పోలీసు వ్యవస్థ ఇంకా ఇటువంటి ఉన్మాదచేష్టల్ని దేశభక్తి ఉన్న వారంతా ఆచరించాల్సినవిగా బిజెపి, ఆర్ఎస్ఎస్ వారి అనుబంధ సంఘాలు చేస్తున్న ప్రచారం–ఇవన్నీ దేశంలో ఈ వికృత మనస్తత్వం పెరగడానికి, మనుషుల నేరపూరిత ప్రవర్తనకు ఒక పెద్దకారణంగా మనం గుర్తించకపోతే మనం పరిస్థితిని సరిగా అర్థం చేసుకోని వారమవుతాం.

# ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఎవరి కోసం?

***కెజి నుండి పిజి వరకు ఉచిత నిర్బంధ విద్య అందిస్తామన్న తెలంగాణ ప్రభుత్వం ఆచరణలో ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లును ఆమోదించి విద్య కొనగలవారికేనని, అట్టడుగువర్గాలకు విద్య అందని ద్రాక్షేనని చెపుతున్నదని అంటున్నారు* బి. రామకృష్ణ**

**2018** మార్చి 28న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లును ఆమోదించారు. నిజానికి ఈ బిల్లు ప్రతిపాదనలు రెండేళ్ల కిందనే వచ్చాయి. 2016 డిసెంబర్ 10న తెలంగాణ కేబినెట్ ఈ బిల్లును అంగీకరించింది. 2015 డిసెంబర్‌లోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇదే బిల్లును ఆమోదించింది. "ప్రపంచ దేశాలతో మన సందర్భంలో ఆర్థిక వ్యవస్థ ముడిపడి ఉన్న మన యువత, విద్యార్థుల సామర్థ్యాలను అభివృద్ధి చేయడానికి ప్రపంచ స్థాయి యూనివర్సిటీలను నెలకొల్పవలసిన అవసరం ఏర్పడుతున్నది. ఉన్నత విద్యా రంగంలో, యూనివర్సిటీలలో బోధన, శిక్షణలను కల్పిస్తూ, పరిశోధనలు, ఆవిష్కరణలు, జ్ఞాన పురోగతి, విస్తరణ కోసం, పరిశ్రమలకు, పబ్లిక్ సంస్థలకు కన్సల్టెన్సీను అందించడం కోసం ఉన్నత విద్యా రంగంలో జాతీయ అంతర్జాతీయ భాగస్వాములు కావడానికి కావల్సిన ఏర్పాట్లు చేయడం కోసం ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించవలసి ఉన్నది" అని చెబుతూ గుణాత్మక, పరిశోధనాధారిత, పారిశ్రామిక ప్రాసంగిక ప్రపంచ స్థాయి ఉన్నత విద్య లక్ష్యంగా ప్రైవేట్ విశ్వవిద్యాలయాల స్థాపన, వాటి నియంత్రణ పేరుతో తెలంగాణ అసెంబ్లీ బిల్లు ఆమోదించింది.

ప్రపంచస్థాయి అని చెబుతున్నప్పుడు అటువంటి విశ్వ విద్యాలయాల్లో ఉండే మౌలిక సదుపాయాలు, పటిష్టమైన, సమర్థవంతమైన బోధనా సిబ్బంది, పరిశోధనా అవకాశాలు, సౌకర్యాలు, స్వతంత్ర భావాల ప్రకటనా స్వేచ్ఛ, సమగ్రమైన స్వతంత్రమైన, సామాజిక ప్రయోజక అధ్యయనాలకు అవకాశమిచ్చేలా ఉన్నత ప్రమాణాలతో కూడిన విశ్వవిద్యాలయాల రూపకల్పనకు సంబంధించిన విధి విధానాల గురించి ఈ బిల్లులో ప్రస్తావించలేదు. ఎంత విస్తీర్ణంలో నిర్మించాలి, ఏఏ సౌకర్యాలుండాలి, వనరుల సమీకరణ ఎలా, గొప్ప అనుభవమున్న అధ్యాపకుల నియామక పద్ధతి, వారి ఉద్యోగ భద్రత, విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు ఏ విధంగా కల్పించబడతాయో తెలుపలేదు. ఎటువంటి అంతర్జాతీయ యూనివర్సిటీలతో, పరిశ్రమలతో సంబంధాలు ఎలా కలిగి ఉంటాయో స్పష్టం చేయలేదు. బిల్లులో ప్రస్తావించిన ప్రపంచ

---

ఇంకా ఇవాళ ప్రపంచం అంతా నిండి పోయిన పెట్టుబడిదారీ మార్కెట్ విష సంస్కృతి సినిమాల ద్వారా టివిల ద్వారా, ఇంటర్నెట్ ద్వారా బూతుబొమ్మలతో, ఆడ మొగ సంబంధమంతా వికృత అసహ్యకరమైన సెక్స్ తప్ప మరేమీ కాదనే భావజాలం (కొన్నిచోట్ల దానికే ప్రేమ అనే పేరు) తలకెక్కిన యువకులే కాదు, బాలలు ముసలి వాళ్లు కూడా ఈ భావజాలం చేత ప్రభావితం చేయబడుతున్న వాళ్లే. అలా ప్రభావితం అవ్వడం వల్లనే సమాజంలో ఇటువంటి నేరాలు పెరుగుతూ పోతున్నాయి.

ఇటువంటి ఘటనలు దేశంలో అనేకచోట్ల జరుగుతూనే ఉన్నాయి. యుపిలోని ఉన్నావ్ ఘటనలో కూడా అధికార బిజెపి ఎంఎల్ఎ చట్టసభల్లో ఉండి ప్రజల సంక్షేమం కోసం పని చేయాల్సిన వాడు, మైనర్ బాలికపై అత్యాచారం చేయడమే గాక ఆ ఘటనపై కంప్లైంట్ ఇచ్చినందుకు ఆ బాలిక కుటుంబాన్ని వేధించి, బాలిక తండ్రినే అరెస్టు చేయించి పోలీసు టార్చర్‌లో చంపేశారు. ఇటువంటి వాళ్లు మననేతలైనందుకు, వాళ్లను పాలకులుగా ఎన్నుకుంటు న్నందుకు మనం సిగ్గుపడాలి.

ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు ఏదో రెండు రోజులు ఆవేశపడి నిరసన ప్రదర్శనలు చేసి ఊరుకుంటే ఈ నేరాలు ఆగవు. నేరస్థులు డబ్బు అధికారం ఉపయోగించి అనేక మార్గాల ద్వారా తప్పించు కుంటారు. తిరిగి ఎన్నికలు రాగానే ప్రజలను ప్రలోభపెట్టి, డబ్బు పంచి మద్యం ఏరులు పారించి, ప్రజలను కులాల పేరిట, మతాల పేరిట రెచ్చగొట్టి ప్రజాస్వామ్యబద్ధంగా తిరిగి అధికారంలోకి వస్తారు. ఇదే ఈనాడు అమలవుతున్న ప్రజాస్వామ్యం!

ఓటు వేసి ఇలాంటి దుర్మార్గులను ఎన్నుకోవడం తప్ప ప్రజల చేతిలో మరేమీ లేకపోవడమే ప్రజాస్వామ్యం అయితే ఈ ప్రజాస్వామ్యం అవసరమా? ఈ ఎన్నికలను బహిష్కరించమని పిలుపునిస్తే నేరమా? ఇటువంటి నేరాలు జరగడం వెనుక సమాజంలో వ్యాపించి ఉన్న భావజాలాన్ని, ఆ భావజాలాన్ని పెంచి పోషిస్తున్న పాలకులను, ఈ వ్యవస్థను నడిపిస్తున్న బలమైన శక్తులను గుర్తించకుంటే ఈ నేరాలను నిర్మూలించలేం. అట్టడుగుదాకా కుళ్లిపోతున్న ఈ సమాజాన్ని బాగుచేయలేం.

ఈ కేసులో ఇప్పటికి నిందితులపై చార్జిషీట్ మాత్రం దాఖలైంది. ఇక కోర్టుల్లో విచారణ ఎదుర్కోవాల్సివుంది. కేసు కోర్టుదాకా రాకముందే అన్యాయం వైపు నిలబడిన న్యాయ వాదులు ఉండగా, అనేక దశల్లో న్యాయం కొనివేయబడడం, సాక్ష్యాలు తారుమారు చేయబడటం మనం రోజూ చూస్తూనే ఉన్నాం గనుక ఈ కేసులో విచారణ అంతా సవ్యంగా జరిగి నేరస్తులందరికీ శిక్షలు పడతాయని మనం ఆశించలేం. వాళ్లు శిక్షించబడడం అనేది ప్రజలు ఈ నేరాలను ఎంతదాకా గుర్తుంచు కుంటారు, ప్రజలు ఎంతదాకా పోరాడుతారు అనేదానిపై ఆధారపడి ఉంటుంది.

*(రచయిత ఉపాధ్యాయురాలు)* వీ

స్థాయి అని అనుకుంటున్నప్పుడు ఆ స్థాయిని చేరుకోవడానికి కల్పించవలసిన మౌలిక వసతులైన భూములు, భవన నిర్మాణాలు, తదితర సౌకర్యాల కోసం పెద్ద మొత్తంలో నిధులు అవసరమౌతాయి. వాటిని ఎక్కడి నుండి, ఎలా సమకూరుస్తారు. ఒకవేళ తెచ్చినా వాటిని తిరిగి ఎలా భర్తీ చేస్తారు. ఈ మొత్తం భారమంతా అందులో ప్రవేశించే విద్యార్థుల నుండే రాబడతారా? ఈ యూనివర్సిటీలు వ్యాపార ధోరణులతో నడుస్తాయా? ఉదారంగా దాతృత్వ స్వభావంతో నాణ్యమైన విద్యను అందిస్తాయా? తెలుపలేదు.

ఈ బిల్లులో 4వ చాప్టర్ 4వ క్లాజ్‌లో ప్రస్తావించిన యూనివర్సిటీ స్థాపన లక్ష్యాలలో రాజ్యాంగ విలువల ప్రస్తావన గాని, సామాజిక ప్రయోజనం గాని, గతంలో నెహ్రూ, కొఠారీ కమిషన్, యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్, కమిటీ ఆన్ మోడల్ యాక్ట్ ఫర్ యూనివర్సిటీస్‌లు వ్యక్తీకరించిన ఉదాత్తమైన, ఉన్నతమైన, మానవీయమైన యూనివర్సిటీ లక్ష్యాలను ప్రస్తావించలేదు.

కెజి నుండి పిజి వరకు ఉచిత నిర్బంధ విద్య, నూతన యూనివర్సిటీల నిర్మాణం, తెలంగాణలో విశ్వవిద్యాలయాలకు తగిన గ్రాంట్లు ఇచ్చి వాటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థలు పరిశోధనా సంస్థల ఏర్పాటు, తెలంగాణ రాష్ట్రంలో మహిళా యూనివర్సిటీ, ట్రైబల్ యూనివర్సిటీ, తెలంగాణ కల్చరల్ యూనివర్సిటీల స్థాపన, ప్రతి జిల్లాకు గవర్నమెంట్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు గురించి తెలంగాణ రాష్ట్ర సమితి 2014 ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పింది. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా ఈ యూనివర్సిటీల ఊసే లేదు. కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, ప్రొ. జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీలు 2014లో ఏర్పాటు అయినవే అయినప్పటికీ, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నవాటినే రాష్ట్ర విభజన తరువాత విభజించడంలో భాగంగా ఏర్పాటైనవి మాత్రమే.

ప్రస్తుత యూనివర్సిటీలలో సగానికి పైగా బోధనా సిబ్బంది ఖాళీలు ఉన్నాయి. బడ్జెట్‌లలో విద్యకు కేటాయించింది ఉమ్మడి రాష్ట్రంతో పోల్చుకున్నప్పుడు తక్కువే. బడ్జెట్ బడ్జెట్‌కు విద్యకు కేటాయించే నిధులు తగ్గుతూ వస్తున్నాయి. ఇక కొత్త యూనివర్సిటీల స్థాపన అనే మాట నీటి మీద రాతగా మారి అర్థం లేకుండా పోయింది. రిలయన్స్, ఇన్‌ఫోసిస్, టెక్ మహేంద్ర, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, గ్లోబల్ యూనివర్సిటీ సిస్టమ్స్ వంటి కంపెనీలు తెలంగాణలో ప్రైవేట్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. వాటికి అనుకూలంగా తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం తాను చెప్పిన వాటిని తానే ఉల్లంఘిస్తూ, ఉచిత విద్యకు తూట్లు పొడుస్తూ ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లును ఆమోదించింది.

1980ల ప్రారంభంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ నుండి ఎన్నో షరతులతో కూడిన రుణాలు వచ్చాయి. ఈ షరతులు ఆర్థిక వ్యవస్థలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేశాయి. అందులో భాగంగా విద్యా వ్యవస్థ కూడా తీవ్రమైన కుదుపులకు లోనవుతూ వస్తున్నది. ఉచితంగా అందించాల్సిన విద్య ఖరీదైన సరుకుగా తయారయింది. 1986లో ప్రపంచ బ్యాంకు అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉన్నత విద్యకు నిధులనందించే విషయంపై 'రిపోర్ట్ ఆన్ ఫైనాన్సింగ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ డెవలపింగ్ కంట్రీస్' అనే డాక్యుమెంటును తెచ్చింది. అందులో ఆయా దేశాలు తమకున్న పరిమిత వనరులతో నిధుల కొరత కారణంగా ఉన్న నిధులను ప్రాథమిక విద్యకు కేటాయించి ఉన్నత విద్యపై సబ్సిడీలను రద్దుచేయమని చెప్పారు. ఉన్నత విద్య వరకు కొంత మెరుగైన కొద్ది మంది మాత్రమే వస్తారు. ఈ కొద్ది మందిపై ఖర్చు చేయడం వివక్షతలకు దారితీస్తుంది. కాని సమానత్వానికి కాదు. ప్రాథమిక విద్యా రంగానికి సబ్సిడీలను ఇవ్వడం ద్వారా ఎంతో మందికి ప్రయోజనం చేకూరి సమానత్వానికి దారితీస్తుందని వివరించారు. ఈ ప్రభావం జాతీయ విద్యా విధానం 1986పై కనిపిస్తుంది. జాతీయ విద్యా విధానం 1986 ఓ వైపు ఉన్నత విద్యా లక్ష్యాలను సరిగ్గానే గుర్తిస్తున్నట్లు అనిపిస్తుంది. అదే సమయంలో ఉన్నత విద్యా వ్యాపారీకరణ విధానానికి దారులు వేసింది. ఇది రివైజ్ చేయబడి కార్యాచరణ ప్రణాళిక (పిఒఎ) గా 1992లో ముందుకొచ్చింది. దీంట్లో ప్రభుత్వ నిధులపై భారం తగ్గించే విధంగా అన్ని విద్యా సంస్థలు స్వయం సమృద్ధిగా ఉండాలనీ అందుకోసం ఫీజుల పెంపు, విరాళాలు సేకరించడం, అవసరమైన వారికి విద్యా రుణాలు సమకూర్చడం వంటి మరెన్నింటినో ప్రతిపాదించి విద్యా ప్రైవేటీకరణను ప్రోత్సహించింది.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 1992లో కేంద్రీయ విద్యాలయాలలో నిధుల సేకరణ కోసం పున్నయ్య కమిషన్‌ను నియమించింది. ఈ కమిటీ 1993 నవంబర్‌లో నివేదికను సమర్పించింది. నిధులను అందించడంలో ప్రధాన బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని చెబుతూనే యూనివర్సిటీలు స్వంతంగా నిధులను పోగుచేసుకోవడంపై సూచనలు చేసింది. తరగతి గదులు, ఆడిటోరియంలు, ఆట స్థలాలు, గెస్ట్ హౌస్‌లు, హాస్టళ్లు, లాబ్‌లు మొదలైన వాటిని కిరాయికి ఇవ్వాలని, ట్యూషన్ తదితర ఫీజులను పెంచాలని సూచించింది. కోర్సుల ప్రాధాన్యతను బట్టి, వాటిపై పెట్టే ఖర్చును బట్టి ఫీజులను ఎప్పటికప్పుడు సవరిస్తూ ఉండాలని తెలిపింది.

సాంకేతిక విద్యకు సంబంధించి వనరుల సమీకరణ కోసం 1994లో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ స్వామినాథన్ కమిటీని వేసింది. ఈ కమిటీ ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించి ప్రస్తుతమున్న 80శాతం ఖర్చును 60 శాతానికి కుదించాలని, రెగ్యులర్ సిబ్బంది వాటాను 60 శాతానికి తగ్గించి మిగతా వారందరిని కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించాలని తెలిపింది. సిబ్బంది విద్యార్థి నిష్పత్తిని పెంచాలని, ఖర్చులను పూడ్చుకోవడం కోసం ఫీజులను పెంచాలని పలు సూచనలు చేసింది.

1994లో ప్రపంచ బ్యాంకు 'హయ్యర్ ఎడ్యుకేషన్ – ది లెస్సన్స్ ఆఫ్ ఎక్స్‌పీరియన్స్' అనే విధాన పత్రాన్ని ముందుకు తెచ్చింది. అందులో ఉన్నత విద్యా రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించింది. ప్రాథమిక, మాధ్యమిక విద్యారంగంలో గుణాత్మకత, సమానత్వం సాధించ బడకుండా అది ఇంకా అందరికీ అందుబాటులో లేని దేశాలలో ఉన్నత విద్యపై ఆయా ప్రభుత్వాలు ఖర్చు చేయడం సరైంది కాదని, ఉన్నత విద్యారంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని కల్పించి దానిపై నామమాత్రపు నియంత్రణ కలిగి ఉండాలని సూచించింది. ప్రాథమిక, మాధ్యమిక విద్యాస్థాయిలో సార్వజనీనమైన, నాణ్యమైన, సమానమైన విద్యావకాశా లను కల్పిస్తూనే ఉన్నత విద్యారంగంలోకి కిందివర్గాల వారు తప్పనిసరిగా

చేరే ప్రజాస్వామిక సానుకూల వాతావరణాన్ని కల్పించాల్సింది పోయి చచ్చీ చెడీ ఉన్నత విద్యలోకి అడుగుపెట్టే అట్టడుగు వర్గాలకు ఆ చదువును దూరం చేసే విధంగా విద్యా రంగంలో ప్రైవేటు పెట్టుబడిదారీ శక్తులకు గేట్లు తెరుస్తూ డబ్బు చెల్లించగలిగే వారికే ఉన్నత విద్యను పరిమితం చేసే దుర్మార్గమైన తలంపును ప్రపంచ బ్యాంకు చేసింది. ఈ భావజాల నేపథ్యంలో ప్రభుత్వాలు తాము అందించాల్సిన విద్యా బాధ్యతల నుండి నెమ్మదిగా వైదొలుగుతూ వస్తున్నాయి.

ప్రపంచబ్యాంకు నమూనాను అనుసరిస్తున్న క్రమంలో 1991 నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా అన్ని రంగాలలో ప్రైవేటీకరణ వేగవంతం అవుతూ వస్తున్నది. మౌలిక రంగం అయిన విద్యా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవేశించేందుకు వీలుగా 1995లో మొదటిసారిగా పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టారు. వ్యతిరేకత మూలంగా అది ఆమోదం పొందలేదు. తిరిగి 2007లో ప్రయత్నం జరిగింది అదీ విఫలమైంది. ఫారిన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ బిల్లు-2010ను 2010 మేలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. నేటివరకు అది చట్టరూపం ధరించ లేదు. కాని ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ప్రైవేట్ యూనివర్సిటీల చట్టాలను చేసి ప్రైవేట్ యూనివర్సిటీల స్థాపనకు దారులు తెరిచాయి. ఇదంతా కూడా స్ట్రక్చరల్ అడ్జెస్ట్‌మెంట్ ప్రోగ్రాం అనే అజెండాను ఇచ్చిన ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేయడంలో భాగంగా జరుగుతున్నది.

2004 నాటి కంటే ముందే దశాబ్దాల కాలానికి పైగా ఉన్నత విద్యకు సంబంధించి నిధులను, వనరులను అందించకపోవడం వల్ల విశ్వ విద్యాలయాలలో నాణ్యత లోపించిందని, లైబ్రరీలు, లాబోరేటరీలు, అధ్యాపక సిబ్బంది, అధునాతన మెరుగైన కార్యక్రమాలు, పరిశోధన మొదలగు వాటికన్నింటికీ బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు విధించిన విషయాలను 2004లో సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నియమించిన కమిటీ తన రిపోర్టులో వివరించింది. బడ్జెట్ కేటాయింపుల్లో విపరీతమైన కోతలు, బోధన బోధనేతర సిబ్బందిని నియమించకపోవడం, ఏర్పడుతున్న ఖాళీలను భర్తీ చేయకుండా ఏళ్లకేళ్లే లాక్కురావడం, మౌలిక వసతులను మెరుగుపరచకపోవడం, ఏ సంస్థ కాసంస్థ స్వంతంగా నిధులను సమకూర్చుకోవాలనే విధానాలను ముందుకు తేవడం వల్ల ప్రభుత్వ విశ్వ విద్యాలయాలెన్నో బలహీనపడి మంచమెక్కుతున్నాయి. వీటిని శక్తివంతం చేయాల్సింది పోయి ప్రైవేట్ యూనివర్సిటీలకు ద్వారాలు తెరిచారు.

1995లో మొట్టమొదటిసారిగా సిక్కింలో సిక్కిం మణిపాల్ యూనివర్సిటీ అనే ప్రైవేట్ యూనివర్సిటీ ఏర్పాటైంది. ఆ తరువాత 2001లో ఉత్తరప్రదేశ్‌లో జగద్గురు రామభద్రచార్య హ్యాండిక్యాప్డ్ యూనివర్సిటీ ఏర్పాటయింది. నేడు దేశం మొత్తం మీద వివిధ రాష్ట్రాలలో 296 ప్రైవేట్ యూనివర్సిటీలు ఉన్నాయి.

పారిశ్రామిక పెట్టుబడిదారులైన ముకేష్ అంబానీ, కుమార మంగళం బిర్లాలతో కూడిన కమిటీ ఎ పాలసీ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఇన్ ఎడ్యుకేషన్ అనే పేరుతో ఒక రిపోర్టును 2000లో అప్పటి వాజ్‌పాయ్ ప్రభుత్వ కోరిక మేరకు సమర్పించింది. విద్యను సామాజిక అభివృద్ధిలో భాగంగా చూడడమనే ఆలోచనల నుండి బయట పడాలనీ, విశ్వవిద్యాలయ విద్యలో ప్రైవేటీకరణను ప్రోత్సహించాలనీ ఈ రిపోర్టు సూచించింది. ఉపయోగించు - చెల్లించు అనే విధానాన్ని పాటించాలని, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడినవారికి రుణాలు, గ్రాంట్-ఇన్-ఎయిడ్‌ను కల్పించడం వలన విద్యారంగంలో పెట్టుబడులు పెట్టేవారికి లాభదాయకం గా ఉంటుందని, అగ్రస్థాయి పారిశ్రామిక సంస్థలను యూనివర్సిటీలు స్థాపించేలా ప్రోత్సహించాలని ప్రభుత్వానికి సూచనలు చేసింది. సైన్స్, టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ వంటి వేటిల్లోనైతే లాభాలు ఆర్జించడానికి అవకాశముంటుందో వాటిలో ప్రైవేట్ శక్తులకు అవకాశమిచ్చి, వేటికైతే మార్కెట్‌లో డిమాండ్ ఉండదో వాటిలో ప్రభుత్వం చురుకైన పాత్రను నిర్వహించాలని, అలాగే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను విద్యా రంగంలో ప్రోత్సహించాలని ఈ కమిటీ సూచించింది. అంబానీ - బిర్లా కమిటీ (2000) సిఫార్సులపై వ్యతిరేకత రావడంతో ఈ సూచనలకు వాజ్‌పాయ్ ప్రభుత్వం చట్టబద్ధతను కల్పించడంలో వెనుకడుగు వేసింది. కాని ఆ భావజాలం ప్రభుత్వ విధానాల్లో ప్రతిబింబిస్తూనే ఉన్నది.

నూతన సరళీకృత ఆర్థిక విధానాల బహిరంగ మద్దతుదారు శామ్‌పిట్రోడా చైర్మన్‌గా 2005లో నేషనల్ నాలెడ్జ్ కమిషన్‌ను వేశారు. ఈ కమిటీ జనవరి 2007లో రిపోర్టును సమర్పించింది. ఈ కమిటీలో వైస్ చైర్మన్‌గా ఉన్న పి.ఎం. భార్గవ పిట్రోడా ఏకపక్ష ధోరణులకు నిరసనగా రాజీనామా చేశారు. ఈ రిపోర్టు కూడా స్థూలంగా ఉన్నత విద్యను ప్రైవేటీకరించమని సిఫారస్ చేసింది. చాలావరకు అంబానీ - బిర్లా రిపోర్టును అనుసరించింది. ఈ రెండు రిపోర్టులలో ఎక్కడా కూడా కొఠారీ కమిషన్ ప్రస్తావించిన విశ్వవిద్యాలయ, ఉన్నత విద్యా లక్ష్యాలు కనిపించవు. ఎంతసేపటికీ యూజర్ - పే పద్ధతిలోనే విద్యను చూశాయి తప్పిస్తే రాజ్యాంగ విలువలకు నిలబడేవిగా విద్యా సంస్థలను చూడలేదు.

ఇప్పుడిప్పుడే కొంత మేరకు దళితులు, మైనారిటీలు, ఆదివాసులు, ఇతర వెనుకబడిన సామాజిక వర్గాలు యూనివర్సిటీల్లోకి వస్తున్నారు. ఈ సందర్భంలోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థను నీరుగారుస్తూ, అవి కుప్ప కూలిపోయేలా చేస్తున్నారు. వాటిని విఫలం చేయడంలో సఫలం అవుతున్నారు. కొత్తగా యూనివర్సిటీలను స్థాపించి, అప్పటికే ఉన్న యూనివర్సిటీలలో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ, బోధనా సిబ్బందిని ఎప్పటికప్పుడు భర్తీ చేస్తూ, ఉన్నత స్థాయిలో పరిశోధనలను సాగించేలా వాటిని విస్తృత పరచాలి. కాని విరుద్ధంగా ఎంతో కొంత మెరుగైన చదువులను అందిస్తున్న ప్రభుత్వ యూనివర్సిటీలను బలహీన పరుస్తూ, నాసిరకంగా తయారు చేసి ఇక సాధారణ ప్రజలు కూడా వాటివైపు చూడలేని దుర్మార్గ పరిస్థితులను కల్పిస్తూ మరోవైపు ప్రైవేట్ యూనివర్సిటీలను ముందుకు తెస్తున్నారు.

నిజమైన అర్థంలో యూనివర్సిటీలను స్థాపించాలంటే చాలా పెద్ద మొత్తంలో నిధులు అవసరమవుతాయి. అది విశాలమైన వందల ఎకరాల స్థలం కావచ్చు, భవనాలు భవన నిర్మాణాలు కావచ్చు, గుణాత్మమైన బోధనా సిబ్బంది నియామకాలు కావచ్చు. లాబోరేటరీ, లైబ్రరీ, హాస్టల్ సౌకర్యాలు, మరెన్నో మౌలిక వసతులు కావచ్చు. వీటన్నింటినీ సమకూర్చాలంటే వేల కోట్ల పెట్టుబడులు కావాలి. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన ప్రైవేట్ యూనివర్సిటీ బిల్లులో పేర్కొన్న విధంగా గుణాత్మక, పరిశోధనాధారిత, ప్రపంచ స్థాయి విద్యను అందించడానికి మరెన్నో నిధులు అవసరమవుతాయి. అంత పెద్ద మొత్తాలను పెట్టుబడిగా

పెట్టేవారు ఏ లాభం కాంక్షించకుండా, సామాజికాభివృద్ధి, అట్టడుగు వర్గాల విద్యావసరాలు పరమావధిగా ముందుకొస్తారా?

ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు నిజంగా అన్నిరకాల ఉన్నత ప్రమాణాలతో, పెద్ద క్యాంపస్‌లతో, మౌలిక వసతులతో నిండి ఉంటాయా అనేది అనుమానమే. ఛత్తీస్‌గడ్‌లో 2002లో స్థాపించబడిన 112 ప్రైవేట్ యూనివర్సిటీల అనుభవం చూసినప్పుడు ఇది చాలా స్పష్టంగా తెలుస్తుంది. ఛత్తీస్‌గడ్ రాష్ట్ర ప్రభుత్వం 2002లో ఛత్తీస్‌గడ్ ప్రైవేట్ సెక్టార్ యూనివర్సిటీ యాక్ట్‌ను తెచ్చింది. దీని ఆధారంగా అక్కడ ఒక్క సంవత్సరంలోనే 112 సెల్ఫ్ ఫైనాన్సింగ్ యూనివర్సిటీలు వచ్చాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ పరిశీలనలో వీటిలో చాలా వరకు పేపర్‌పై మాత్రమే ఉన్నాయి. కొన్నింటిలో కనీస వసతులు లేవు. కొన్ని షాపింగ్ కాంప్లెక్స్‌లలో స్థాపించద్దాయి. కొన్ని దూర విద్య కేంద్రాలుగా ఉన్నాయి. ఫేక్ డిగ్రీ పట్టాలను అమ్మే కేంద్రాలుగా తయారయ్యాయి. ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు 2005లో రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది. మేఘాలయ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం పొందిన ఇటువంటి చట్టం ద్వారా సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ విశ్వవిద్యాలయాలు వచ్చాయి. ఇక్కడ 2009లో సి.ఎం.జె. అనే విశ్వ విద్యాలయం స్థాపించబడింది. ఇది నాలుగు వేల తప్పుడు పి.ఎచ్.డి. లను ఇచ్చిందని, అనేక అవకతవకలకు పాల్పడిందని 2012లో దీని కార్యాలయానికి సీల్ వేయడం జరిగింది. రెండు నుండి ఐదు లక్షలు చెల్లిస్తే చాలు డాక్టరేట్ సర్టిఫికెట్ చేతుల్లోకి వచ్చే పరిస్థితి వచ్చింది. విద్యను మార్కెట్ సరుకుగా చేసిన దుష్ఫలితాలివి. ఒకవేళ ఏవో కొన్ని ప్రమాణాలను పాటించినప్పటికీ వాటిలో ప్రవేశాలు పొంది చదువులు పూర్తి చేసుకునే అవకాశం డబ్బు పెట్టగలిగే వారికే ఉంటుంది. ఇది రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీయడమే అవుతుంది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధంగానే అంటే చట్ట సభల్లో చేసిన చట్టాల ప్రకారం ఈ దుష్ట విధానాలకు పాల్పడుతున్నారు.

మానవీయత, సహనం, హేతువు, సాహసోపేతమైన ఆలోచనలు, సత్యాన్వేషణల కోసం నిలబడేవే విశ్వవిద్యాలయాలన్ని 1947లో అలహాబాద్ యూనివర్సిటీ స్నాతకోత్సవ ఉపన్యాసంలో జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన విషయాన్ని కొఠారీ కమిషన్ ప్రస్తావించింది. రాజ్యాంగ ప్రవేశికలో చెప్పిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సహోదరత్వం వంటి విలువలను పెంపొందించడానికి ఉన్నత విద్య ఒక మార్గం అని కమిటీ ఆన్ మోడల్ యాక్ట్ ఫర్ యూనివర్సిటీస్ 1964 చెప్పింది. సమాజంలోని సమస్యలు, సంక్లిష్టతలపై స్పందిస్తూ పరిష్కరించే మార్గంలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి పనిచేయాలని, విశ్వవిద్యాలయాలు జాతి ఆత్మగా, జాతి జీవన విధానాన్ని అంచనా వేసేవిగా ఉండాలని కొఠారీ కమిషన్ చెప్పింది.

అధ్యాపకులు విద్యార్థులతో కూడిన సమాజం విశ్వవిద్యాలయాలు. వీటిల్లో ఒకరి నుండి మరొకరు నేర్చుకుంటారు. లేదా అందుకోసం పాటుపడుతుంటారు. విశ్వం గురించి, తమ గురించి నిబద్ధతతో కూడిన లోతైన అవగాహనలను పెంపొందించుకుంటూ వాటిని సమాజం మొత్తంలోకి తీసుకుపోవడంతో పాటు మానవజాతికి సేవ చేయడం అనేది విశ్వవిద్యాలయాల లక్ష్యం. ఇవి ఆదర్శాలకు, ఆదర్శ భావాలకు నిలయాలు. వాటి సభ్యుల్లో ఉన్నత ప్రమాణాల ప్రవర్తన, సమగ్రతలను ఆశిస్తామని కొఠారీ కమిషన్ వివరించింది. నూతన జ్ఞానాన్ని శోధించడం, ప్రసరింపచేయడం, నిర్భయంగా సమర్థవంతంగా, సత్యాలను తెలియచేయడం, నూతన అవసరాలు ఆవిష్కరణల వెలుగులో ఒకప్పటి జ్ఞానాన్ని విశ్వాసాలను తరచి చూసుకోవడం, జీవిత అన్ని పార్శ్వాలలో సరైన నాయకత్వాన్ని అందించడం, సరైన ఆసక్తులను, వైఖరులను, నైతిక మేధోపరమైన విలువలను పెంపొందిస్తూ యువతలోని శక్తి సామర్థ్యాలను వికసింపచేయడం. వ్యవసాయం, వైద్యం, శాస్త్ర, సాంకేతిక, సామాజిక తదితర వృత్తులలో సామాజిక ప్రయోజన స్పృహతో మహిళలకు, పురుషులకు సమర్థవంతమైన శిక్షణలివ్వడం, విద్యా వ్యాప్తి ద్వారా సామాజిక, సాంస్కృతిక వ్యత్యాసాలను తగ్గిస్తూ సమానత్వాన్ని సామాజిక న్యాయాన్ని పెంపొందించడానికి కృషి చేయడం అనేవి ఆధునిక ప్రపంచంలో విశ్వవిద్యాలయాల కార్యరంగం అని కొఠారీ కమిషన్ తెలిపింది.

ఈ లక్ష్యాలతో ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తే అభ్యంతరం చెప్పవలసిందేమి ఉంటుంది? దగాపడి, అభివృద్ధికి వికాసానికి దూరమైన సామాజిక వర్గాల, విద్యావసరాలను తీరుస్తామంటే వ్యతిరేకించాల్సిందేముంటుంది? రాజ్యాంగ విలువలకు కట్టుబడి వాటిని పెంపొందించే కృషి చేస్తుంటే అడ్డు చెప్పవల్సిందేముంటుంది? లాభార్జన లేకుండా అట్టడుగు వర్గాల విద్యా విజ్ఞాన వికాసాలకు దారితీసేలా ఆ వర్గాలకు భవిష్యత్‌లో ఉద్యోగ ఉపాధులను గ్యారంటీ చేయగలిగితే తప్పు పట్టేదేముంటుంది? అయితే అలా ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు పనిచేస్తాయని ఆశించడం అమాయకత్వమైనా అవుతుంది, అత్యాశ అయినా అవుతుంది.

*(రచయిత ఉపాధ్యాయులు)* వీ

# తెలంగాణపై కాగ్ నివేదిక

***బడ్జెట్‌లో పొందుపరిచిన ఆదాయ, వ్యయాలకు, వాస్తవాలకు పొంతన లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అంకెల గారడీ చేసిందనేది కాగ్ నివేదిక బట్టబయలు చేసిందని అంటున్నారు ఎ. పున్నయ్య***

ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్ష, నాలుగు దశాబ్దాలుగా అనేక రూపాలుగా సాగిన పోరాటాలు రగులుతూ ఆరుతూ రెండు దశాబ్దాలుగా మరింత చైతన్యవంతంగా సాగిన ప్రజా ఉద్యమం వందలాది మంది అమరుల త్యాగాల పునాదుల మీద ప్రత్యేక తెలంగా ఉదయించింది. ఉద్యమం ప్రకటించిన లక్ష్యాల ఆధారంగా తెలంగాణ ప్రజల ఆకాంక్షల కనుగుణంగా తెలంగాణ రాష్ట్ర సమితి కృషి చేస్తుందని నమ్మి ప్రజలు తెలంగాణ రాష్ట్ర సమితికే పట్టం కట్టినారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పాలనా రంగాలలో గుణాత్మక మార్పుకొరకు పారదర్శకంగా సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తుందని విశ్వసించారు.

తెలంగాణ ప్రజా ప్రయోజనాలే ప్రథమ ప్రాథామ్యాలుగా పాలకుల కుండాలని ప్రజలు కోరుకున్నారు. 2014 జూన్ 2న నాటికి ధనిక రాష్ట్రంగానే తెలంగాణ ఆవిర్భవించింది. నాటి నుండి తెలంగాణ రాష్ట్ర సమితి ఏలుబడిలో రాష్ట్రం మిగులు రాష్ట్రాల జాబితాలోనే ఉన్నదంటూ ఆర్భాటంగా అంకెలతో రంకెలు వేయించారు.

మిగులు లేదా ధనిక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నాలుగు వసంతాలు పూర్తి చేసుకుంది. ఐదు బడ్జెట్‌లను ప్రవేశపెట్టింది. ఇప్పుడు తెలంగాణ మిగులు రాష్ట్రం కాదని లోటు రాష్ట్రాల జాబితాలోకి నెట్టి వేయబడిందని బడ్జెట్ సమావేశాల చివరి రోజున కంట్రోల్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) మొత్తం ఆర్థిక వ్యవస్థను సూక్ష్మంగా పరిశీలించిన నివేదికను సభ ముందుంచింది. ఈ ప్రభుత్వం రెవెన్యూ మిగులును అధికంగా చూపారని, ఎఫ్ఆర్‌బిఎం పరిమితి పరిధి దాటారన్నారు. ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికల నిధుల్లో భారీ మిగుళ్లను గుర్తించింది. ఏకంగా అప్పు తెచ్చిన నిధులను ఆదాయంగా చూపించారు.

జాతీయ పారిశ్రామిక దిగ్గజాల ముందు, అంతర్జాతీయ బహుళజాతి కంపెనీల ప్రతినిధుల మధ్య పారదర్శక విధానాలతో రాష్ట్ర ప్రగతి ఆర్థిక వనరులను ఆహ్వానించిన ప్రభుత్వం రాష్ట్రంలో ప్రకటించిన పథకాలు దేశానికే ఆదర్శమని ప్రపంచదేశాలకు సైతం అనుసరణీయమైన పథకాలంటూ బడ్జెట్‌లో వాటి అమలుకోసం కేటాయించిన కోట్ల రూపాయలను ఖర్చు చేసిన ఘనత గత ప్రభుత్వాల చరిత్రలో లేదని వాదించింది. రాష్ట్రం, కేంద్రం నిధులతో సంబంధం లేకుండానే స్వయం ప్రతిపత్తిని సాధించిందని, ధనిక రాష్ట్రంగా అవతరించామని చాటుకుంది. స్వీయ సంపాదిత నిధులే కాకుండా, కేంద్రం వాటాగా ఇచ్చిన నిధులు సంబంధిత రంగాలకు నిర్దేశిత కాలంలో ఖర్చు చేయకుండా రాష్ట్రాన్ని నాలుగు సంవత్సరాలలో నాలుగు దశాబ్దాల ముందుకు నడిపినట్లు వల్లెవేశారు. వందిమాగదుల ప్రభుత్వాలతో అంటకాగిన మీడియా సహకారంతో పైకి కన్పించకుండా సబ్‌ట్రెజరి, ట్రెజరీ కార్యాలయాల్లో ప్రతిదినం విధించే ఫ్రీజింగ్, దఫాలుగా విడుదల చేసే బ్యాంకు నిధులను చూసిన ఉద్యోగ, వ్యాపార వర్గాలకు ప్రభుత్వం ప్రకటించే 'ధనిక రాష్ట్రం' లోని డొల్లతనం అర్థమైనా, సామాన్యులకు ఆకర్షిత ప్రకటనల జోరులో అవి కన్పించలేదు.

**అస్తవ్యస్తమైన ఆర్థిక క్రమశిక్షణ**

పరిపాలనలో ఆర్థిక క్రమ శిక్షణ, ఆర్థిక నియంత్రణ అత్యంత కీలకం. ఈ రంగాన్ని ఎంతో పరిణతితో వ్యూహాత్మకంగా నిర్వహించాలి. రాష్ట్ర పురోభివృద్ధి ప్రజలందరి సర్వతోముఖాభివృద్ధికి ఈ రంగమే మూలస్తంభం లాంటిది. అయినప్పటికి ఈ ప్రభుత్వం రాష్ట్రంలో రు. 5,392 కోట్ల రెవెన్యూ లోటు ఉండగా ఆశ్చర్యంగా రు. 1,386 కోట్లు రెవెన్యూ మిగులుగా చూపి ప్రజలను భ్రమింపజేసింది. దీనిపై అధ్యయనం చేసిన కాగ్ బృందం ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా పద్దుల నమోదులో సరైన పద్ధతులు పాటించలేదని గుర్తించింది. అత్యంత విచారకరమేమంటే అప్పు తీసుకున్న నిధులను రెవెన్యూ రాబడిగా జమచేసి ద్రవ్యలోటు రు. 2,500 కోట్లు తక్కువ చూపింది. ఇది ఉద్దేశపూర్వకంగానే జరిగిందని కాగ్ గుర్తించింది. ఎఫ్ఆర్‌బిఎం (ఫిస్కల్ రెస్పాన్సిబులిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) చట్టం ప్రకారం అప్పులు 3.5 శాతం లోపుగా ఉండాలని మార్గదర్శకాలున్నాయి. కాని ఈ చట్ట పరిధిని దాటి 4.3 శాతంగా అప్పులు ఈ రాష్ట్రంలో ఉన్నాయి. కాని నమోదు మాత్రం పరిధిలో ఉన్నట్లు 3.5 శాతంగా చూపినారు. ఉదయ్ (ఉజ్వల్ డిస్కం అష్యూరెన్స్ యోజన) పథకం కింద రు. 5,931 కోట్ల రుణాలు తీసుకున్న ప్రభుత్వం రు. 7,500 కోట్లలో రు. 3,750 కోట్లను 50 శాతాన్ని గ్రాంటుకు బదులుగా ఈక్విటి పద్దుల్లో చూపడంతో రెవెన్యూ మిగులు కన్పించింది. ఈ పద్దును తప్పుగా నమోదుచేసి ప్రజలందరి కళ్లకు గంతలుకట్టింది. వాస్తవానికి ఎలాంటి మిగులు లేదని కాగ్ తేల్చి చెప్పింది. ఉదయ్‌లో నిర్దేశించినట్లే విద్యుత్ పంపిణీ సంస్థలు కొత్త బాండ్లు జారీ చేయాలని నిబంధనలున్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం జారీచేయలేదు. అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం వల్ల రు. 5,784 కోట్ల భారం పడింది. విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని చేసుకుంటున్న ప్రచారం కూడా వట్టిదేనని కాగ్ ఆక్షేపించింది. క్యాపిటల్ వ్యయం విషయంలో కూడా ప్రభుత్వ నిబంధనలు పాటించలేదు. బడ్జెట్ అంచనాల

ప్రకారం రు. 29,313 కోట్లు క్యాపిటల్ వ్యయంకాగా అంతకు మించి రు. 33,371 కోట్లు ఖర్చు చేసినట్లు కాగ్ పరిశీలనలో బయటపడింది. దీనిలో సాధారణంగా రాష్ట్రాల సగటు 19.70 శాతం కాగా తెలంగాణలో అత్యధికంగా 28.22 శాతంగా ఉంది. ఇది రాష్ట్రాల సగటు కంటే దాదాపు 10 శాతం అధికమే. సీవరేజ్ బోర్డు తీసుకున్న రు. 1,500 కోట్లు, గృహ నిర్మాణ సంస్థ హడ్కో నుంచి తెచ్చుకున్న రు. 1,000 కోట్లు అప్పుతో పాటు మెట్రో వాటర్ వర్క్స్ లాంటి వివిధ సంస్థల నుంచి తీసుకున్న అప్పులన్నింటిని 'చాలా తెలివిగా' రాష్ట్ర ప్రభుత్వం ఆదాయంగా చూపింది. 2016-17లో బడ్జెట్ కేటాయింపులను మించిన అధిక ఖర్చులు రు. 21,161 కోట్లుగా గుర్తించింది. 16 గ్రాంట్లు 3 అప్రాప్రియేషన్స్ బిల్లులో చేసిన అధిక వ్యయాన్ని క్రమబద్ధీకరించకుండా కనీస ఆర్థిక క్రమశిక్షణ పాటించలేదు. ఆర్థిక నిర్వహణలో కనబరిచిన అత్యంత ఉదాసీనత, నిబంధనల ఉల్లంఘన ఆర్థిక వ్యవస్థపై రుణాత్మక ప్రభావం చూపాయి.

### ముందస్తు అనుమతులు, జవాబుదారీతనం లోపించిన వ్యయాలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పది లక్షలకు మించిన చెక్‌లను రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి కౌంటర్ సంతకం లేకుండా డ్రా చేయరాదు. కాని కాగ్ పరిశీలించిన డి.టి.ఓ. హైదరాబాద్ డ్రా చేసిన చెక్‌లు రు. 10 లక్షల కంటే ఎక్కువ మొత్తాలను 464 చెక్‌ల ద్వారా రు. 4,022 కోట్లు డ్రా చేయడాన్ని కాగ్ బట్టబయలుచేసింది. రు. 10 లక్షల పరిమితిని బాధ్యతాయుతమైన ఆర్థిక కార్యదర్శి నిర్వహించాల్సి ఉండగా 464 చెక్‌లను ఏ అత్యవసర పరిస్థితుల్లో డ్రా చేయాల్సి వచ్చిందో ప్రభుత్వం దగ్గర సమాధానం లేకపోవడాన్ని కాగ్ తీవ్రంగా ఆక్షేపించింది. సమాజం లో అత్యంత వెనుకబడిన దళిత, గిరిజనులను శరవేగంగా అభివృద్ధిచేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికలకు భారీగా నిధులు కేటాయించినారు. ఎస్‌సి ఉప ప్రణాళికకు రు. 8,487.21 కోట్లు కేటాయిస్తే కేవలం 43 శాతం నిధులను అంటే రు. 3,715 కోట్లు మాత్రమే వినియోగించినారు. ఎస్‌టి ఉప ప్రణాళిక కింద రు. 5,315.40 కోట్లు కేటాయిస్తే 45 శాతంగా రు. 2,403.85 కోట్లను వినియోగించినారు. ఈ రెండు ఉప ప్రణాళికల్లో 50 శాతం కన్నా తక్కువ ఖర్చు చేయడంతో ఈ చట్టం లక్ష్యాలను స్ఫూర్తిని ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. మరీ విచిత్రంగా వార్షిక పద్దుల సమర్పణలో 181 సంస్థలు జాప్యం చేశాయని, దీని వలన జవాబుదారీతనం నీరుకారి పోవడంతో పాటు పద్దుల తయారీ ప్రయోజనం కూడా నెరవేరకుండా పోయిందన్నారు. పథకాల అమలు కోసం డ్రా చేసిన నిధులకు ధృవపత్రాలను (యుసి) సమర్పించలేదని ఒక పథకంలోని నిధులను మరో పథకానికి వినియోగించి తప్పుడు (యుసిలు) ధృవపత్రాలను జతపరిచారని కాగ్ కమిటీ ముక్కున వేలేసుకుంది.

2016-17 ఆర్థిక సంవత్సరం మొత్తం వ్యయం రు. 73,783 కోట్లు (67 శాతం) రాబడుల్లో రు. 55,116 కోట్లు 77 శాతం మధ్య సయోధ్య చేయలేదు. ఫలితంగా రాబడుల్లో లీకేజీలనూ, సక్రమంగా జరగని ఖర్చులను కనుగొనడం కష్టసాధ్యమవుతుంది. బడ్జెట్‌లో పేర్కొన్నట్లు లెక్క ప్రకారంగా ఏ ఒక్క ప్రభుత్వ శాఖకు నిధుల విడుదల జరగలేదు. గ్రాంట్లకు మించి ఖర్చుచేయడం ఆర్థిక క్రమశిక్షణ ఉల్లంఘనేనని ఇది శాసన సభ అభీష్టాన్ని ఉల్లంఘించడమేనని కాగ్ తేల్చి చెప్పింది. చేసిన ఖర్చులకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు ఎక్కడా పొంతన లేదని సర్కారు నిర్వాకాన్ని కాగ్ ఎండగట్టింది.

### కమీషన్ల కాకతీయ మిషన్ - కానరాని పారదర్శకత

తెలంగాణ రాష్ట్రం ప్రాథమికంగా వ్యవసాయ ప్రధాన రాష్ట్రం. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఉన్న మొత్తం 46,531 చెరువులను పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చెరువుల పూడిక తీయడం ద్వారా చెరువులోని సారవంతమైన మట్టిని రైతుల పంట పొలాలకు తరలించడం వలన చౌడు భూములు సైతం సారవంతంగా మారుతాయనేది ఈ పథక లక్ష్యం. కాకతీయ పాలకుల దార్శనికతను ముందుకు తీసుకెళ్లాలనే నినాదమే మిషన్ కాకతీయగా మారింది. ప్రభుత్వం గుర్తించిన 46,531 చెరువులను రాబోయే ఐదు సంవత్సరాలలో పూర్తి చేసుకునేందుకు ప్రతి సంవత్సరం 20 శాతం చొప్పున పూర్తి చేయాలని నిర్ణయించారు.

మొదటి విడత కేవలం మూడు నెలల్లోనే పునరుద్ధరణ లక్ష్యం నెరవేరలేదు. రెండవ దశలో కేవలం 25 శాతం పనులను కూడ పూర్తి చేయలేదని, మూడవ దశ పూడిక తీసే పనుల్లో 'సున్నా శాతం' పని జరిగింది. ప్రచార ఆర్భాటాలు పత్రికా ప్రకటనల ఖర్చులు కోట్లు దాటినాయి. చివరగా మిషన్ కాకతీయ పథకం కింద 56 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాని దీనిని బలపరిచే ఆధార గణాంకాలు ప్రభుత్వం దగ్గర లేకపోవడం విచారకరం. పూర్తిచేసిన పనుల్లో కూడా శాస్త్రీయత లేదు.

పూడిక పరిమాణాన్ని శాస్త్రీయంగా అంచనా వేసిన క్షేత్రస్థాయి అధికారులే లేరని, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తమ అనుభవంతో మాత్రమే పూడిక పరిమాణాన్ని అంచనా వేసినట్లు ప్రభుత్వం ఒప్పుకోవడం చూస్తే నిధుల వినియోగంపట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని అంచనా వేయవచ్చు.

కాగ్ పరిశీలకులు సాంపిల్‌గా 27 పనులను తనిఖీ చేస్తే అందులో 12.7 లక్షల ఘనపు మీటర్లు పూడిక తీయాలని అంచనా వేస్తే కేవలం 8.08 లక్షల ఘనపు మీటర్లు మాత్రమే తీసినట్లు ఆధారాలున్నాయి. ప్రభుత్వం 12.7 లక్షల ఘనపు మీటర్ల పూడికకు డబ్బులు చెల్లించినట్లు కాగ్ నివేదిక తేల్చింది. ఈ సాంపిల్స్ ఆధారంగా కాకతీయ మిషన్‌లో కమీషన్‌లు ఏ స్థాయిలో ఉన్నాయోనని కాగ్ అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. ఇక హైదరాబాద్‌లో ఈ ప్రభుత్వం ఏకంగా 17 చెరువులనే మాయం చేసిందని ప్రభుత్వ మాయాజాలాన్ని కాగ్ ప్రజల కళ్లకు కట్టింది.

### నిరాశ పరిచిన పారిశ్రామిక ఉపాధి అవకాశాలు

అభివృద్ధిలో భాగంగా ప్రజలను వ్యవసాయ రంగం నుంచి ప్రాథమిక రంగానికి పరుగులు పెట్టించే లక్ష్యంతో ప్రభుత్వం పరిశ్రమలకు పెద్దఎత్తున భూములు కేటాయించింది. హైదరాబాద్ నగరంలో అత్యంత విలువయిన 1075 ఎకరాల భూమిని ఫ్యాబ్ సిటి నిర్మాణానికి అనుమతించింది. ఇందులో సెమికండక్టర్ పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి అవసరమైన పెట్టుబడులను తీసుకురావడానికి ఒప్పందం కుదుర్చుకొని విఫలమైంది. పెట్టుబడి తీసుకొచ్చే విషయంలో ఇంటలెక్ట్

ఇంక్, సెమి ఇండియా ఇంక్ లాంటి సంస్థల సామార్థ్యాన్నిగాని నిబద్ధతనుగాని ధృవీకరించుకోలేదు. ఇవి రెండు విఫలమైన తర్వాత ప్రత్యామ్నాయ సంస్థల కోసం కనీసంగా కూడ ప్రయత్నించినట్లు ఆధారాలు లేవు. దీని కారణంగా నైపుణ్య కార్మికులుగా మార్చుకునేందుకు మరో అవకాశం కోల్పోయింది. పారిశ్రామిక రంగం నుంచి పెద్ద ఎత్తున అర్ధ నైపుణ్య ఉద్యోగాలతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస వచ్చే విద్యావంతులైన 5.17 లక్షల మందికి ఉపాధి కల్పించే లక్ష్యం కేవలం 3016 మందితో అంటే 0.6 శాతంతో సరిపెట్టుకుంది. ప్రభుత్వ ప్రయత్నలోపం వల్ల దూరదృష్టి లేకపోవడం వల్ల నిధుల లేమితో కోట్ల విలువైన 1075 ఎకరాల భూమిలో 70 శాతం స్థలం నిరుపయోగంగా ఉందని, లక్షలాది మంది ఉపాధిని జారవిడిచినట్లైందని కాగ్ ధృవీకరించింది.

**లక్ష్యం నెరవేరని టిఎస్ఐ పాస్ పథకం**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పారిశ్రామిక ప్రాజెక్టు అనుమతి స్వయం ధృవీకరణ వ్యవస్థ, టి.ఎస్.ఐ.పాస్ 2014 చట్టం రూపొందించింది. పారిశ్రామిక వ్యాపారవేత్తలు తమ గురించి తాము సమర్పించిన ధృవీకరణ పత్రాల ప్రాతిపదికన పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతుల, దరఖాస్తుల పరిశీలన ఏకగవాక్షం నుంచి వేగంగా పూర్తిచేయడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. పారదర్శకంగా ధృవీకరణ పత్రాలు అందించాలి. ఎలాంటి పక్షపాతం ఉండకుండా ఉండాలని ఈ విధానాన్ని రూపొందించింది. దాదాపుగా 2550 పరిశ్రమలకు దీని ఆధారంగా ప్రభుత్వం అనుమతులను ఇచ్చింది. లోప భూయిష్టమైన ఈ ప్రక్రియలో పారిశ్రామిక వేత్తలు అన్ని రకాల అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలనే నిర్దిష్ట నిబంధనలు లేకపోవడం వల్ల ఇంజనీరింగ్, వ్యవసాయాధారిత, ఫార్మా, రసాయనాలు, గ్రానైట్, స్టోన్ క్రషింగ్, ప్లాస్టిక్, రబ్బర్ తదితర ప్రమాదకర పరిశ్రమల్లో సైతం అత్యంత ప్రధానమైన కాలుష్య నియంత్రణ, అగ్నిమాపక అనుమతులను కూడ ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని కాగ్ నివేదికలో ప్రభుత్వాన్ని దుయ్యబట్టింది. ప్రక్రియ వేగంగా ఉండాలనే, పారదర్శకంగా వ్యవస్థ పనిచేయాలనే లక్ష్యాలు మంచివైనప్పటికి ప్రమాదకర పరిస్థితులను నివారించే విధానాన్ని ప్రభుత్వం తప్పక అనుసరించాలి.

**కనుమరుగవుతున్న ప్రభుత్వ విద్యారంగం**

జీవితాలను మెరుగుపరిచే నైపుణ్యాల సాధనకు అక్షరాస్యత పునాదిరాయి. విద్యుత్ శక్తి ఎవరి జీవితాన్నైనా మార్చి వేయగలదనేది ఒక నిరూపిత వాస్తవం. అది సమాజాభివృద్ధి క్రమాన్ని పెంచడంలో కీలక పాత్ర నిర్వహిస్తుంది. ఆర్థిక వ్యవస్థను సంపద్వంతం చేస్తుంది. మానవ జీవిత ప్రమాణాన్ని మరింత విస్తరింపచేసే విధంగా విద్యా విధానం ఉండాలి. లాభాపేక్ష లేని ప్రభుత్వమే ఆ విద్యను అందించాలి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా విధానంలో సమూలంగా మార్పులు తెస్తామన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలుండే విద్యా వ్యవస్థను తెలంగాణలో అభివృద్ధి పరుస్తామన్నారు. ప్రైవేట్ విద్య ద్వారానే అంతరాలు మరింతగా పెరిగినాయని, అందరికి ఆమోదయోగ్యమైన, కుల, మత రహిత కామన్ స్కూల్ విద్యా విధానమే నా కల అని ప్రకటించినారు. ప్రైవేట్ విద్యా విధానమంటే కొనుక్కునే విద్యా విధానమని దానిని కూకటివేళ్లతో ఈ ప్రభుత్వం పెకిలిస్తుందని హామీలిచ్చినారు. కార్పొరేట్ విద్యా సంస్థలను జాతీయం చేస్తామన్నారు. కాని ఆచరణలో అమల్లో ఉన్న ప్రభుత్వ విద్యా విధానాన్ని కనీసంగా సమీక్షించలేదు.

మౌలిక వసతుల లోపం, సిబ్బంది నియామకం లేక ప్రభుత్వ పాఠశాలలు బలహీనంగా మారిపోయినాయి. ఈ ప్రభావంతో ప్రైవేట్ విద్యా సంస్థలు మరింతగా పెరిగినాయి. ప్రైవేట్ విద్యా సంస్థల సమాఖ్య గౌరవాధ్యక్షులుగా ప్రభుత్వ పెద్దలుండడం అత్యంత విచారకరం. కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య ప్రాసకోసమే గాని అమల్లోలేదని ఈ ప్రభుత్వం తేల్చింది. ఈ క్రమంలో ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ అండతో ఇష్టా రాజ్యంగా అపరిమితంగా ఫీజులు వసూలు చేస్తూ కోట్లు గడిస్తూ విద్యా వ్యాపారం చేస్తున్నారు.

పాఠశాల స్థాయిలో సంవత్సరానికి ఏక మొత్తంగా క్యాపిటేషన్ రుసుములు రు. 30 వేల నుంచి లక్షల రూపాయల వరకు బోధనా రుసుములు రు. 16,500 నుంచి 5.42 లక్షల మరకు వసూలు చేస్తున్నాయి. ఇది విద్యా హక్కు చట్టాన్ని అధిగమించడమే. నేటికి 75 శాతం స్కూల్స్‌లో మరుగుదొడ్ల సౌకర్యం, రక్షిత మంచినీటి వసతి కల్పించడంలో ఈ ప్రభుత్వాలు విఫలమయ్యాయి. దీర్ఘకాలంగా సిబ్బంది నియామకాలు లేవని ప్రభుత్వ విద్యా వ్యవస్థను మెరుగుపరిచే పటిష్టమైన ప్రణాళికలు ఈ ప్రభుత్వం దగ్గర లేవని కాగ్ నివేదించింది.

**కాంట్రిబ్యుటరీ ఫించన్ మ్యాచింగ్ గ్రాంట్‌ను క్రమబద్ధీకరించని ప్రభుత్వం**

2004 సెప్టెంబర్ 1 తరువాత నియామకం అయిన ఉద్యోగులందరు పాత పెన్షన్ విధానం కాకుండా కొత్త పెన్షన్ విధానంలోకి వస్తారు. కొత్త పెన్షన్ విధానమే కాంట్రిబ్యుటరీ పెన్షన్ విధానం. ఇందులో మూల వేతనంలో 10 శాతం ఉద్యోగి జీతం నుండి తీసుకొని ప్రభుత్వం అదనంగా 10 శాతం మ్యాచింగ్ గ్రాంటుగా కలిపి ఏదో ఒక బ్యాంకులో గాని బీమా సంస్థలోగాని పెట్టుబడి పెడుతున్నారు. పదవి విరమణ అనంతరం అసలు వడ్డీ కలిపి ఏక మొత్తంగా ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లిస్తుంది. దీనిని క్రమంగా చెల్లించుకుంటుండాలి. కాగ్ పరిశీలించిన ఈ కాంట్రిబ్యుటరీ ఫించన్ అకౌంట్‌లో ఉద్యోగుల నుండి వచ్చే మొత్తాలను మాత్రం జమచేసింది కాని ప్రభుత్వం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్‌లో గండికొట్టింది. రు. 420.14 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా కేవలం రు. 348.23 కోట్లు చెల్లించింది. ఇంకా రు. 71.91 కోట్లు చెల్లించలేదని కాగ్ గుర్తించింది. సిపిఎస్ పట్ల అసహనంతో ఉద్యమాలు చేస్తున్న ఉద్యోగులకు ఇది మరింత అనుమానాలను పెంచుతుంది. ప్రభుత్వం అవసరమైన పథకాలను పక్కకు పెట్టి అనవసరమైన వాటికి అధిక ప్రాధాన్యతనిస్తుందని పేర్కొంది. అర్థంలేని ఖర్చులు ప్రణాళికలు లేని పనులే అధికంగా ఉన్నాయని కాగ్ తప్పుబట్టడాన్ని చూస్తే ప్రభుత్వాల డొల్లతనం అర్థం అవుతుంది.

**కుంటుపడిన ప్రజారోగ్యరంగం**

సంపూర్ణంగా విద్యతోపాటు వైద్యం కూడ ప్రభుత్వాధీనంలో పనిచేస్తూ, ఉచితంగానే ప్రజలందరికి ఆరోగ్యాన్నిస్తే సమగ్ర సమాజాభివృద్ధికి బాటలు

వేస్తుంది. నేడు వైద్య రంగం ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కునారిల్లిపోతోంది. మన రాష్ట్రంలో కేటాయింపులే తక్కువ. కేటాయించిన దాంట్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. దీనితో ప్రజారోగ్యం మరింతగా కుంటుపడింది. నిధుల లేమితో అభివృద్ధి సంక్షేమ శాఖల పనులు మధ్యలో నిలిచిపోతుంటే బహుఘనత వహించిన వైద్య శాఖలో అందుకు విరుద్ధంగా జరిగింది. గడిచిన రెండున్నర ఏండ్లలో ఏకంగా రు. 1,574.19 కోట్లు ఖర్చుకు నోచుకోలేదు. అత్యవసర మందుల కొనుగోళ్లలోను ఇదే పరిస్థితి. జాతీయ ఆరోగ్య మిషన్‌కు కేంద్రం రు. 83.99 కోట్లు మంజూరు చేస్తే కేవలం రు. 10.11 కోట్లు అంటే 12 శాతం మాత్రమే ఖర్చు చేశారు. సంతాన సాఫల్యత, శిశు సంక్షేమం, కుటుంబ నియంత్రణ (ఆర్‌సిఎచ్) ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడం, సిజేరియన్లు నివారించడం, చిన్నారులకు, వ్యాధి నిరోధక టీకాలు, అత్యవసర మందులు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ పంపిణీ, మాతా శిశు సంక్షేమం, భ్రూణ హత్యలు రూపుమాపడం, పుట్టిన శిశువుల్లో తక్కువ బరువు, ఎదుగుదల లోపాన్ని గుర్తించి చికిత్స అందించడానికి కేంద్రం రాష్ట్రాల వాటా 75:25 నిష్పత్తిలో ఉండేవి. 2015-16 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రు. 673.13 కోట్లు జమచేస్తే 54 శాతం అంటే 364.97 కోట్లు ఖర్చు చేసినారు. నిజంగా పేదలకు రోగులకు, ఆరోగ్యన్నందించడానికి ఈ ప్రభుత్వాలు ఎంతమేరకు కృషి చేస్తున్నాయో ఈ నివేదిక వ్యక్తపరిచింది. దీనిని అత్యంత తీవ్రంగా కాగ్ ఆక్షేపించింది.

జనని సురక్ష యోజన కింద సిద్దిపేట ఏరియా ఆస్పత్రిలో రిఫరల్ - డ్రాప్ బ్యాంక్ సేవలను అందించేందుకు 2015లో కార్పెడ్ అనే సంస్థతో ఒప్పందం కుదిరింది. రోగులను ఆస్పత్రికి తరలించేందుకు రు. 80 తిరిగి ఇంటికి చేర్చేందుకు రు. 250 చొప్పున చెల్లిస్తారు. విచిత్రంగా ఒప్పందం చేసుకున్న సంస్థకు అసలు వాహనాలే లేవని ఒప్పందం తర్వాత తెలిసింది. వాహనాలు సేవలందించినందుకు గాను మరో సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. రు. 10.85 కోట్లు వాహనాలకు చెల్లించాలని అధికారులు లెక్కలు తేల్చినారు. కాని ఆ నిధులను సాయిరంగ్ అనే ఫిల్లింగ్ (పెట్రోల్ బంక్) ఖాతాలో వేయడాన్ని కాగ్ తప్పుపట్టింది. అనారోగ్యకరమైన పనులతో ఆరోగ్య తెలంగాణ సాధ్యమేనా అని కాగ్ అడుగుతుంది.

**అస్తవ్యస్తంగా భూపంపిణీ**

దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని ఎన్నికల హామీ. కాని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ పంపిణీ అస్తవ్యస్తంగా ఉంది. 2014 నుంచి 2017 మరకు భూపంపిణీ కోసం సబ్సిడీ రూపంలో రు. 1,887.98 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా కేవలం 412.72 కోట్లు మాత్రమే ఎస్‌సి కార్పొరేషన్‌కు విడుదల చేసింది. 2014 నుండి 2017 వరకు రు. 12,587 మందికి భూ పంపిణీ చేస్తే అందులో కేవలం 2,866 మందికి మాత్రమే ప్రయోజనాలు కల్పించింది. ఈ 2,866 మంది లబ్ధిదారులకు మొత్తం 7,486 ఎకరాల భూపంపిణీ చేశారు. కాని వాటికి సాగునీటి సౌకర్యం కల్పించలేదు. ఇందులో 3,210 ఎకరాల భూమి వర్షాధారమైనదిగా పరిగణించారు. 2,866 మందిలో కేవలం 578 మందికి మాత్రమే పట్టదారు పాసు పుస్తకాలు అందించారు. దళితులకు మూడెకరాల భూమి అనేది ఆచరణ సాధ్యం కాని హామీ అని కాగ్ గుర్తించింది.

**అప్పులతో పై వాళ్లకు పప్పుకూడు, కింది వాళ్లకు అప్పుకూడు**

తెలంగాణ రాష్ట్రం ఓట్ల కోసం రోజుకో వాగ్దానం చేస్తుంది. నెరవేర్చడానికి లక్షల కోట్లు అవుతాయి. అంత ఆదాయవనరు ఇప్పటికిప్పుడు తెలంగాణకు లేదు. అంటే అప్పులు తెస్తామంటారు. అప్పుతో పైవాళ్లు పప్పు కూడు తింటుంటే కింది వారికి మాత్రం అప్పు కూడు వడ్డిస్తున్నారు. మన పాలకులు ఆలోచనా రహితంగా అప్పులు చేయడం మొదలయింది. మొదటి ఆర్థిక సంవత్సరంలో మిగులు బడ్జెట్ ఉన్న కొత్త రాష్ట్రం ఇప్పటికే అప్పుల కుప్పగా మారింది. స్థాయికి మించిన అప్పు ఎప్పుడైనా ముప్పే. ఇది చారిత్రక సత్యం. కాని పాలకులు అప్పు లేనిదే అభివృద్ధి సాధ్యం కాదంటూ తెచ్చిన అప్పులను సహితం సక్రమంగా వినియోగించకపోవడాన్ని కాగ్ తప్పుపట్టింది. చేసే అప్పు అభివృద్ధి కోసం కాదు. 35 శాతం పాత అప్పులను తీర్చడానికేనని లెక్కలతో సహా కాగ్ ముందుంచింది.

2017 మార్చ్ 31 నాటికి అప్పులను లోతుగా పరిశీలిస్తే వచ్చే ఏడాదిలో 49 శాతం రుణాలు అంటే రు. 56,388 కోట్లు తిరిగి చెల్లించాల్సి ఉంది. 2015-16లో పన్నుల రాబడిలో 7.12 శాతం రుణాలు తిరిగి చెల్లించగా 2016-17లో ఇది 32.18 శాతానికి భారీగా పెరిగింది. 14వ ఆర్థిక సంఘం ప్రామాణిక రేటు ప్రకారం రెవెన్యూ రాబడుల్లో వడ్డీ చెల్లింపులు గరిష్టంగా 8.22 శాతంగా మాత్రమే ఉండాలి కాని నేటికీ ఇది 11 శాతం వరకు పెరిగింది. దీనిని నియంత్రణ చేయక పోతే ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది.

**ముగింపు**

ప్రభుత్వం చేపట్టిన ఏ ఒక్క కార్యక్రమం కూడా సజావుగా సాగుతున్న దాఖలాలు లేవని కాగ్ తేల్చిచెప్పింది. ఆయా ప్రభుత్వ శాఖలు చేసుకుంటున్న ప్రచారానికి క్షేత్ర స్థాయిలో అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఎలాంటి పొంతనే లేదని కాగ్ తేల్చింది. భారీ అంకెలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టి మిగులు ఆదాయం ఉన్న రాష్ట్రం అని ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని తేల్చేసింది. ఈ ప్రచారాన్ని నమ్మించడం కోసం భారీ కటౌట్లు, ఖరీదైన హోర్డింగ్‌లు కోట్ల రూపాయలతో మీడియాను ముందుంచుతుంది. చేయకూడని అనేక పనుల్ని సర్కారు చేస్తుందని కాగ్ గుర్తించింది.

ప్రభుత్వ పెద్దలు ఏమి చెప్పినా ఎంత గంభీరంగా చమత్కరించినా ఎంచుకున్న అభివృద్ధి నమూనా ప్రజా ప్రయోజనాలను, ఆకాంక్షలను తీర్చడంలేదనేదే యధార్థం. నిజానికి తెలియకుండానే మనం కళ్లు మూసుకోవచ్చు. చూడనట్లు నటించవచ్చు గాని ఇవాళ కాకపోతే మరో రోజైనా నిజం మన కళ్లు తెరిపిస్తుంది. ఈ విషయం కాగ్ రూపంలో ప్రజల కళ్లు తెరిపించింది. కాగ్ తీవ్రంగా పాలనా విధానాలను విమర్శించింది. సుదీర్ఘకాలం జరిగిన ఉద్యమ ఆకాంక్షకు వ్యతిరేక దిశలో ఉన్నాయని గుర్తించింది.

*(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, అర్థశాస్త్ర విభాగం, తెలంగాణ విశ్వవిద్యాలయం)*

వీ

# దళితులపై కాషాయ కర్కశం

***ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ఆలోచననే సుప్రీం కోర్టు అమలు చేసిందని అంటున్నారు* చంద్రం**

శతాబ్దాలుగా అవిచ్ఛిన్నంగా దేశంలో కొనసాగుతున్న అమానవీయ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా చరిత్ర పొడవునా కుల అణచివేత వ్యతిరేక ఆత్మగౌరవ ఉద్యమాలు ఉనికిలోకి వచ్చినా ఏవో కొన్ని తేలికపాటి సంస్కరణలు అమలులోకి వచ్చాయేగాని కుల అణచివేత ఇప్పటికీ ఒక ప్రబల సామాజిక అంశంగానే కొనసాగుతోంది. డా. అంబేద్కర్ చొరవతో స్వతంత్ర భారత రాజ్యాంగంలో ఎస్‌సి, ఎస్‌టి తదితర అణగారిన కులాలకు కల్పించిన హక్కుల వల్ల ఆ వర్గాల్లో పెరిగిన విద్యాధికుల వల్ల ఆత్మగౌరవ స్ఫూర్తితో వారిలో అతి స్వల్పంగానైనా ప్రశ్నించే తత్వం వచ్చింది. తమిళనాడులో 1868 నాటి కిలవెన్మణి అమానుషం మొదలుకొని 1986 కారంచేడు మారణకాండ, ఇటీవల గుజరాత్‌లో ఉనా ఉదంతం వరకు దళితులపై ఆదిపత్య కులాల అఘాయిత్యాలు సాగుతూనే ఉన్నాయి. 1955లో అంటరానితనం నిషేధిత చట్టం, 1974లో పౌరహక్కుల పరిరక్షణ చట్టంగా మారి, 1969 నాటికి ఎస్‌సి, ఎస్‌టి వేధింపుల నిరోధక చట్టంగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి ఆ చట్టం దుర్వినియోగం చేసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. అది కూడా పాలకవర్గాల ప్రోద్బలంతో వారి ప్రయోజనాల కోసం జరిగిన ఉదంతాలే ప్రబలంగా ఉన్నాయి.

తరతరాలుగా అణచివేత, వివక్ష, అంటరానితనం, అవమానాలు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్‌సి, ఎస్‌టిలపై వేధింపుల నివారణకు హామీ కల్పించేందుకు గత యూపీఏ ప్రభుత్వం 1989లో తీసుకొచ్చిన షెడ్యూల్డు కులాలు, తెగలు (ఎస్‌సి, ఎస్‌టి) చట్టానికి తూట్లు పొడుస్తూ ఇరువురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం మార్చి 20న తీర్పు ఇవ్వడాన్ని నిరసిస్తూ, దళిత సంఘాలు ఏప్రిల్ 2న భారత్‌బంద్‌కు పిలుపు ఇచ్చాయి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి బాధిత వర్గాలకు ఇసుమంతైనా భరోసా కల్పించట్లేదు సరికాదా మరింత భయాందోళనలకు తావిస్తోంది. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, ఏప్రిల్ 1న లక్నోలోని కాన్షీరాం స్మృతివనం నుంచి ఆందోళనయాత్ర ప్రారంభించారు. ఇది కేంద్ర ప్రభుత్వం, బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాల దళిత వ్యతిరేక వైఖరికి దర్పణం పడుతోంది. దళితులకు మైనారిటీలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాచే విధంగా కాషాయ ప్రభుత్వాలు చర్యలకు ఒడిగడుతున్నాయి.

గత నెల 20న సుప్రీం కోర్టు తీర్పు ఇస్తూ ఈ చట్టం దుర్వినియోగం అవుతుందని, బ్లాక్ మెయిల్ చేయడానికి సాధనంగా ఉపయోగపడుతుందని, ప్రతీకారం తీసుకోవడానికి వాడుకుంటున్నారని దుర్మార్గంగా వ్యాఖ్యానించింది, న్యాయమూర్తులు ఎకెగోయల్, యుయు లలిత్‌లతో కూడిన ఇరువురి దర్మాసనం ముంబాయికి సంబంధించిన ఒక కేసు విచారణ సందర్భంగా ఏ ప్రభుత్వ ఉద్యోగినైన అదుపులోకి తీసుకోవాలంటే నియామక అధికారి అనుమతి పొందాలని, ప్రైవేట్ సంస్థలో పనిచేసే ఉద్యోగి అయితే ఎస్పీ అనుమతి పొందాలని పేర్కొంది. మరొక అడుగు ముందుకు వేసి ఈ చట్టం వల్ల కులతత్వం స్థిరపడే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది.

'సుప్రీం' రూలింగ్ వెలువడినప్పుడే దళితులు, గిరిజనులకు కాస్తంత రక్షణగా ఉన్న ఈచట్టానికి తూట్లు పడతాయన్న ఆందోళనలు అలముకోగా నివారణా చర్యలపై మోడీ సర్కారు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించింది. ఇప్పటికే చుండూరు మారణహోమం వంటి కేసుల నుండే నిందితులు తప్పించుకుంటున్నారు. అత్యాచార నిరోధక కేసుల్లో నిందితులకు రెండు శాతానికి మించి శిక్షలు పడట్లేదని ఎన్‌సిఆర్‌బి, కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ నివేదికలు ఘోషిస్తున్నాయి. ఇవన్నీ పట్టించుకోకుండా కేవలం ఒకటి అరా కేసులను ప్రామాణికంగా చేసుకొని సమాజంలో అత్యంత దుర్బలురకు అన్యాయం చేసే విధంగా అదేశాలి వ్వడం వాస్తవికత అనిపించుకోలేదు. సుప్రీం తీర్పు సామాజిక న్యాయానికి గొడ్డలిపెట్టు.

ఈ తీర్పు వెలువడిన మరుక్షణం నుండే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. దళిత సంఘాలన్నీ ఆందోళనకు దిగాయి. బిజెపి మినహా మిగతా జాతీయ పార్టీలన్ని దీనిపై తమ వ్యతిరేకతను ప్రకటించాయి. దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) వెంటనే స్పందించి, ఖండించడమే కాకుండా కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రిని కలిసి రివ్యూ పిటిషన్ వేయాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం స్పందించలేదు. సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయలేదు. బిజెపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో రోజు రోజుకు పెరుగుతున్న దాడులు, హత్యలతో అభద్రతకు గురవుతున్న దళితులు, గిరిజనులకు ఈ తీర్పు మరింత భయాన్ని కల్గించింది. చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని ఆదేశించాల్సిన కోర్టు అందుకు విరుద్ధంగా చట్టాన్ని నీరుగార్చే సవరణలు చేయమని ప్రభుత్వాన్ని ఆదేశించడంతో ఎస్‌సి, ఎస్‌టి ప్రజానికానికి తీవ్ర అన్యాయం చేయడమే అవుతుంది తప్ప మరొకటికాదు.

ప్రభుత్వ సాచివేత ధోరణి ఫలితమే ఏప్రిల్ 2న భారత్ బంద్ సందర్భంగా పలు రాష్ట్రాల్లో నిరసనలు లావాలా ఎగిసిపడ్డాయి. దళిత ఆందోళనకారులు దేశ వ్యాపితంగా రహదారులను దిగ్బంధనం చేశారు. రైళ్లను నిలిపివేశారు. బస్సులను తిరగనియ్యకుండా ఎక్కడికక్కడ అడ్డుకొన్నారు. ప్రశాంతంగా బంద్ పాటిస్తున్న దళితులపై భద్రతా దళాలు విరుచుకుపడ్డాయి. బంద్ భగ్నానికి పోలీసులు లాఠీచార్జి చేయగా దళితులు తిరగబడ్డారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో భారత్ బంద్ ఉద్రిక్తంగా మారింది. రాజస్థాన్‌లో పలు చోట్ల కర్ఫ్యూ విధించారు. దళితుల ఆందోళనలతో ఢిల్లీలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఢిల్లీ, ఆగ్రాలలో దళిత ఆందోళనకారులను పోలీసులు, భద్రతా దళాలు

అడ్డుకోవడం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్, రాజస్థాన్‌లోని బర్మార్ ప్రాంతాల్లో దళిత ఆందోళనకారులను కర్ణిసేన మూకలు అడ్డుకొని, దాడులకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బిజెపి నాయకురాలు, ఉత్తరప్రదేశ్‌లోని బ్రహ్రైయిచ్ పార్లమెంట్ సభ్యురాలు సావిత్రి బాయిపూలే సొంత ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారు. దళితుల రిజర్వేషన్లు తొలగించడానికి కుట్ర జరుగుతోందని, ఒకవేళ రిజర్వేషన్లను తొలగిస్తే రక్తపుటేరులు పారతాయని హెచ్చరించారు.

రెండు వారాలు మిన్నకున్న కేంద్రం, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎస్‌సి, ఎస్‌టిల ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకోవడం, అతి సమీపంలో కర్ణాటకలో ఎన్నికలుండటం ఈ రెండింటి రీత్యా ఎట్టకేలకు సుప్రీంలో ఏప్రిల్ 2న హడావిడిగా రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. ఏప్రిల్ 2న విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు స్టే ఇవ్వడానికి నిరాకరించింది. తక్షణం విచారణ చేపట్టాలంటూ ఇంతకుముందే ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎస్‌సి, ఎస్‌టి ఆర్గనేజేషన్స్ వేసిన రివ్యూ పిటిషన్‌పై సైతం కోర్టు ఇలానే వ్యవహరించింది. సోమవారం నాటి భారత్ బంద్ హింసాత్మకం కావడానికి బిజెపి–సంఘ్ పరివార్ కవ్వింపు దాడులే కారణం. ఆందోళనల్లో 11 మంది మరణించగా, వేలాది మంది గాయపడ్డారు. మధ్యప్రదేశ్‌లో ఎనిమిది మంది ఉత్తరప్రదేశ్‌లో ఇద్దరు, రాజస్థాన్‌లో ఒకరు చనిపోయారు. ఇవన్నీ బిజెపి పాలిత రాష్ట్రాలే. బీహార్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశాలోనూ ఉద్రిక్తతలు తలెత్తాయి.

భారత్ బంద్ సందర్భంగా బిజెపి పాలిత రాష్ట్రాలు సామరస్య పూర్వక వాతావరణం నెలకొనేందుకు చర్యలు చేపట్టకపోగా ఎస్‌సి, ఎస్‌టిల బంద్‌ను అడ్డుకునేందుకు అగ్రకుల, ఆధిపత్య వర్గాలను పోటీగా దింపింది. అందుకే హింస తలెత్తింది. ఇదే అదనుగా తాను కొమ్ముగాసే వర్గాలకు రక్షణ పేరుతో ఎస్‌సి, ఎస్‌టిలను అణచివేసేందుకు కేంద్ర బలగాలను, సైన్యాన్ని దించింది. అసలు ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాల నిరోధక చట్టాన్ని సహించలేకపోతోంది బిజెపి, దాని అనుకూల సంఘాలు, సంఘ్ పరివారం. చట్టానికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనల్లో బిజెపి ఎంపీలు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ప్రజలపై మనుస్మృతిని బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌కు ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలంటే గిట్టదు. బిజెపి సర్కారు వచ్చాక ఆ వర్గాలపై దాడులు తీవ్రమయ్యాయి.

భారత రాజ్యాంగంలోని 17వ ఆర్టికల్ ప్రకారం అంటరానితనాన్ని నిషేధించింది. దళితులు ఎటువంటి వేధింపులకు గురికాకుండా చూడాలని సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక హక్కులను కాపాడాలని చెప్పింది. కనుకనే 1955లో అంటరానితనం నిషేధ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. కాని ఈ చట్టంలో అనేక లొసుగులు ఉండడం వల్ల దోషులు సులభంగా తప్పించుకుంటున్నారని, దళితులకు సరైన న్యాయం జరగడం లేదని 1976లో పౌర హక్కుల పరిరక్షణ చట్టాన్ని తీసుకొచ్చారు. అయినా దళితులపై దాడులు కొనసాగుతూనే ఉండడంతో ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టంను 1989లో రూపొందించి దాని విధి విధానాలను 1995లో రూపొందించారు. అయినా ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులకు పాల్పడుతున్న అగ్రకుల పెత్తందార్లు చట్టంలో లొసుగులను అడ్డం పెట్టుకొని , రాజకీయ పలుకుబడితో సులభంగా శిక్షల నుంచి తప్పించుకుంటున్నారు.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టాకా చట్టాన్ని మరింత కఠినతరం చేయాలన్న ఆందోళనల దరిమిలా 2014లో ఆర్డినెన్స్, 2015లో చట్టం వచ్చాయి. అప్పటి నుంచి ఈ చట్టంపై దుష్ప్రచారం మొదలైంది. బిజెపి, సంఘ్ పరివార్ ముందుండి చట్టం పట్ల వ్యతిరేకతను నూరి పోశాయి. సుప్రీంకోర్టేమో ఆధారాలను బట్టి కాకుండా కేవలం భావావేశం ఆధారంగా చట్టం దుర్వినియోగం అవుతోందని రూలింగ్ ఇచ్చింది. సుప్రీమ్ కోర్టు ధర్మాసనం పూర్వపరాలు ఆలోచించలేదు. దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను పరిశీలించలేదు. నిజానికి మహిళలపై అత్యాచార కేసుల్లో శిక్షలు 10 శాతం మించి ఉండడంలేదు. అలాగే హత్యానేరారోపణలు రుజువుకావడం లేదు. ఈ వాస్తవ పరిస్థితులు గమనించకుండా తీర్పు వెలువరించడం అగ్రకుల తత్వం, ఎస్‌సి, ఎస్‌టి వ్యతిరేక స్వభావాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.

2015 జాతీయ నేరాల ప్రభుత్వ రికార్డు వివరాల ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద నమోదయిన కేసుల్లో 75 శాతం కేసులు విచారణ ముగియడానికి ముందే ఏదో రూపంలో రాజీ పడుతున్నారని, మరో 15 శాతం కేసులు నిరాధారమైనవిగా తేలుతున్నాయి. గనుక ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం దుర్వినియోగం జరుగుతున్నదని ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏ విధంగా సవరణలు చేయమని ప్రభుత్వాన్ని ఆదేశించారు? అంటరానితనాన్ని దళితుల పట్ల వివక్షను నిషేధించిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది విరుద్ధమైన తీర్పు కాదా? 75 శాతం మంది ఫిర్యాదుదారులు ఎందుకు రాజీ పడుతున్నారో? 15 శాతం కేసులు ఎందుకు నిరాధారంగా తేలుతున్నాయో తెలుసుకునేందుకు సుప్రీంకోర్టు ప్రయత్నం చేయలేదు.

చట్టం ముందు అందరూ సమానులే. అయితే ఎస్‌సి, ఎస్‌టి, కేసుల్లోనే అరెస్టులు ఎందుకు నిలుపుదల చేయాలి? ఈ తీర్పు బాధిత వర్గాలకు అన్యాయం చేయడం కాదా? తప్పుడు కేసులు పెడితే వారిపై పోలీసులు చర్యలు తీసుకునే అవకాశం చట్టంలోనే ఉన్నది. పోలీసుల్లో చిత్తశుద్ధి లేని ఫలితంగానే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు. వాటి వెనుక రాజ్యం, దాని అనుచరులు ఉంటున్నారు. భారతదేశంలో నేటికీ అగ్రకుల భూస్వామ్య పెత్తందార్లకు ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా పట్టు ఉంది. బడా బూర్జువా భూస్వామ్య రాజకీయ పార్టీలతో ఏర్పడిన ప్రభుత్వాన్ని, అధికార యంత్రాంగాన్ని, మంత్రులను, ప్రభావితం చేసి ప్రసన్నం చేసుకోగలిగే శక్తి భూస్వామ్య పెత్తందార్లకు ఉంది. అందువల్లనే ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం సరిగా అమలుకావడంలేదు. ఎన్ని అడ్డంకులు, అణచివేతలకు పూనుకున్నా దళిత, మైనారిటీ వర్గాలు, ప్రజాస్వామ్య వాదులు మొక్కవోని ధైర్యం, ఐక్యతతో ముందుకు సాగడం తక్షణం కర్తవ్యంగా పరిగణించాలి.

హిందూత్వ గ్రూపులు దళితులను హత్య చేయడంతో సహా భౌతిక దాడులకు పాల్పడడం, ఇటీవల డా. అంబేద్కర్ విగ్రహాలను ధ్వంసం చేయడం వంటి చర్యలు, ఎస్‌సి, ఎస్‌టి చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాలను నిరసిస్తూ ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన దళితులపై పోలీసు కాల్పులను లౌకిక, ప్రజాస్వామ్యవాదులు అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా ఖండించాలి. కాల్పులు జరిగిన రాష్ట్రాల్లో బాధ్యులైన పోలీసు అధికారులను, అందుకు ఆదేశించిన సంబంధిత మంత్రులను శిక్షించేందుకు ప్రధాని మోడీ తక్షణం జోక్యం చేసుకొని తగుచర్యలు చేపట్టి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. కాల్పుల్లో మరణించిన వారి కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలి. ఇప్పటికైనా కేంద్రం రాజకీయ జిమ్మిక్కులకు స్వస్తిపలికి ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాల నిరోధక చట్టాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదివ షెడ్యూల్‌లో చేర్చాలి. అప్పుడే భవిష్యత్తులో కోర్టులకు ఆ చట్టాన్ని సమీక్షించే వీలుండదు.

*(రచయిత ఉపాధ్యాయులు)* వీ

# ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార చట్టం

***ఎస్.సి, ఎస్.టి అత్యాచార నిరోధక చట్టాన్ని బలహీన పరచడానికి కేంద్ర ప్రభుత్వ వైఖరినే సుప్రీంకోర్టు అమలు చేసిందనీ, ఈ చట్టాన్ని రక్షించుకోవడానికి ప్రజాస్వామిక, విప్లవ శక్తులు ఏకమవ్వాలనీ అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

**1985** జూలైలో జరిగిన కారంచేదు దళితుల ఊచకోత నుండి ప్రభవిల్లిన దళిత ఉద్యమానికి, దేశ వ్యాప్తంగా ఉన్న 110 మంది ఎస్.సి, ఎస్.టి ఎంపిలు పార్లమెంట్‌లో ఉద్యమించిన స్ఫూర్తిగా చేయబడిన షెడ్యూల్డ్ కులాల, తెగల అత్యాచారాల నిరోధక చట్టం 1989 (ఎస్.సి, ఎస్‌టి పిఒఎ యాక్ట్ 1989) నకు మార్చ్ 20న సుప్రీంకోర్టు – సుభాష్ కాశీనాథ్ మహాజన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో (జస్టిస్ యు.యు. లలిత్, ఆదర్శ్ కుమార్ గోయల్) ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పు, దళితులపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని, దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడుల పట్ల భారతీయ జనతా పార్టీ వ్యవహరిస్తున్న తీరుకు అద్దం పడుతున్నది.

సుప్రీంకోర్టు తీర్పు సారాంశం ఈ విధంగా ఉన్నది – 'అత్యాచార నిరోధక చట్టం దుర్వినియోగం అవుతున్న తీరును గమనించాక సదరు కేసుల కింద ప్రభుత్వ అధికారులను అరెస్ట్ చేయాలంటే స్థానిక ఎస్ఎస్‌పి (సీనియర్ ఎస్‌పి) నుండి రాతపూర్వకమైన అనుమతి పొందాలి. ఒకవేళ నిందితుడిని పోలీసుల అదుపులో ఉంచేందుకు, పోలీసులు న్యాయమూర్తి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. భవిష్యత్తులో ఈ చట్టం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు వీలుగా నమోదయ్యే కేసులన్నీ నిజమైనవేనని, ఎటువంటి పక్షపాత వైఖరితో కూడుకున్నవి కాదని నిర్ధారించుకునేందుకు డిప్యూటీ సూపరింటెండెంట్ (డిఎస్‌పి) స్థాయి అధికారి ప్రాథమిక విచారణ చేయాలి. ఆ తర్వాత మాత్రమే కేసు నమోదు చేయాలి' అని పేర్కొన్నది. అంతే కాకుండా ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు కూడా చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించడమంటే అనగా అమలు జరుపడానికి ప్రస్తుతం ఉన్న చట్టాన్ని సవరించడం తప్ప మరోమార్గం లేదు. ఇప్పుడున్న చట్ట పరిధిలో విచారణాధికారుల (డిఎస్‌పి) చేతులు కాళ్లు కట్టివేయడమే, నిందితులను – ఎస్.సి, ఎస్.టి కేసులంటే భయపడాల్సిన పనిలేదని సుప్రీంకోర్టు వారికి భరోసా ఇచ్చినట్లు స్పష్టమవుతున్నది. ముఖ్యంగా దీనికి సంబంధించి, ఎలాగూ శాంతి భద్రతలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం కాబట్టి, బిజెపి పాలిత రాష్ట్రాలలో ఎస్.సి, ఎస్.టి చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర – బిజెపికి చెందిన ఎంపిలు, ఎంఎల్ఎలు ఎలాగూ చేస్తున్నారు. భారతీయ జనతా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఈ చట్టం అంటే ఒక ఏహ్యాభావం, చిన్న చూపు ఏర్పడింది. వారికున్న అగ్రకుల దురహంకారాన్నంతా ప్రదర్శిస్తూ ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, దానిని కేంద్ర ప్రభుత్వ న్యాయవాదుల ద్వారా సరిగా వాదనలు వినిపించకుండా నిందితుల వైపే నిలబడడం వలన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ విధంగా తీర్పునివ్వవలసిన పరిస్థితి కేంద్ర ప్రభుత్వమే తీసుకొచ్చింది.

వాస్తవానికి భారతదేశంలో ఎస్‌సి, ఎస్‌టి చట్టమే కాదు ప్రతి చట్టం దుర్వినియోగం చేయబడినదే. గతంలో 'టాడ' చట్టం కూడా దేశ వ్యాప్తంగా దుర్వినియోగం చేయబడిందే. పోలీసులు అతిగా ప్రవర్తించినట్లు అనేక మార్లు రుజువు చేయబడినది. కశ్మీర్‌లోను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అనేక మంది ఉద్యమకారులపై ప్రయోగించబడింది. ప్రస్తుతం ఎం.సి.ఒ.సి. (మహారాష్ట్ర స్టేట్ కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైం యాక్ట్) కూడా ముంబాయి తదితర ప్రాంతాలలో విస్తృతంగా ప్రయోగించబడుతున్నది. మహారాష్ట్రలోని మారుమూల గ్రామాల ఉద్యమకారులను సైతం అణిచివేయడానికి ప్రయోగించబడుతున్నది.

'చట్టా'న్ని కాపాడవలసిన, సద్వినియోగం చేయవలసిన బాధ్యత పోలీస్ వ్యవస్థది. అంతే కాకుండా నేరాన్ని కోర్టు ముందు రుజువు పరచవలసిన బాధ్యత కూడా వారిదే. కానీ 'నేరం' ఆరోపించబడిన సందర్భం, అరెస్ట్ చేసిన తర్వాత చార్జిషీట్ వేసి, ప్రాసిక్యూషన్ ద్వారా నిందితులకు శిక్ష పడే విధంగా ఎస్.సి, ఎస్.టి కేసులలో పోలీసులు బాధితులతో సరిగా ప్రవర్తించడం లేదు. పైగా నిందితుల వైపే నిలబడుతూ, బాధితులను ఒంటరి వారిని చేస్తూ, బలహీనులను చేస్తూ, మొత్తం కేసులను నీరుగార్చుతున్నారు. ఎస్‌సి, ఎస్‌టి బాధితుల ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారు. వారిని అవమానాలపాలు చేస్తూ, అగ్రకుల భూస్వాములకు వంతపాడుతున్నారు. కేవలం బాధితులు తమకుగా తామే కోర్టులో సాక్ష్యం చెపుతున్నారు తప్ప, పోలీసుల సహకారం ఏమీ ఉండడం లేదు. కేవలం 'శిక్ష' రేటు ఆధారంగా అన్నీ తప్పు కేసులు నమోదవుతున్నాయని భావించడం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల కుంచితత్వాన్ని తెలియజేస్తుంది! ఎస్‌సి, ఎస్‌టి కేసులలో బాధితులందరూ కేవలం ఎవరి మాటో విని కేసు పెట్టేవారే అనే ధోరణి కనబడుతున్నది. లేదా బ్లాక్ మెయిలింగ్ కొరకు వాడుకుంటున్నారనే అపవాదును కూడా దళిత బాధితులపై సుప్రీంకోర్టు వేసింది. ఇది చాలా విచారకరం. కొద్ది శాతం కేసులు ఆ విధంగా ఉండవచ్చు కానీ ఎస్.సి, ఎస్.టి (పి.ఒ.ఎ) యాక్ట్ 1989 నేపథ్యాన్ని, స్ఫూర్తిని సుప్రీంకోర్టు ఆలోచించలేదు. ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే. కేంద్ర ప్రభుత్వ వైఖరినే సుప్రీంకోర్టు తెలియజేసింది తప్ప మరొకటి కాదు. కేవలం దేశ వ్యాప్తంగా చేస్తున్న దళిత ఆందోళనకు స్పందించి ఈ రోజు సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం దీనిపై 'రివ్యూ' (పునఃసమీక్ష) పిటిషన్ కాని వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ వైఖరి ఎస్‌సి, ఎస్‌టి బాధితుల పక్షం లేదు ఇది సుస్పష్టం.

ఈ కేసు పూర్వాపరాలను గమనిస్తే దళితుడైన భాస్కర్ గైక్వాడ్ అనే వ్యక్తి మహారాష్ట్ర రాష్ట్రంలోని పూణేలో ఒక ఫార్మసీ ఇనిస్టిట్యూట్‌లో స్టోర్ కీపర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే సంస్థలో పనిచేసే కొంత మంది ఉద్యోగులు అతని చేత తెల్ల కాగితాలపై సంతకాలు చేయాలని ఒత్తిడి

చేయగా అతడు చేయడానికి నిరాకరించాడు. ఇందుకు అతనిపై ఏదో ఒక విధంగా కక్ష తీర్చుకోవాలనే నెపంతో కొంత మంది అగ్రకుల అధికారులందరూ కుమ్మక్కయి, రాష్ట్ర సాంకేతిక విద్యా సంచాలకునికి తప్పుడు నివేదిక పంపారు. అందులో అతడు విధులు సరిగా నిర్వహించడం లేదని కొన్ని తప్పుడు ఆరోపణలు చేశారు. ఈ భాస్కర్ గైక్వాడ్ ఉద్యోగానికి ఎసరు పెట్టారు. తాను అనవసరంగా ఉద్యోగం కోల్పోతాననే భయంతో ఆయన వాదనలు, రాతపూర్వకమైన తన జవాబును సాంకేతిక విద్యా సంచాలకుడు కూడా సరిగా వినలేదు (తోసిపుచ్చాడు). అందుకై ఆ సంచాలకునిపై ఎస్‌సి, ఎస్‌టి (పిఒఎ) యాక్ట్ 1989 కింద కేసు నమోదు చేశాడు భాస్కర్ గైక్వాడ్. ఆ సంచాలకుడే సుభాష్ కాశీనాథ్ మహాజన్. ఈయనకు ఆ రాష్ట్ర హైకోర్టులో ఊరట లభించక అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అదే సుభాష్ కాశీనాథ్ మహాజన్ వర్సెస్ స్టేట్ మహారాష్ట్ర కేసు. 2018 మార్చ్ 20న వెలువడిన తీర్పు ఎస్.సి, ఎస్.టి కేసులలో నిందితులకు ఊరట లభించే విధంగా ఉన్న తీర్పు, దళిత బాధితులకు నిరాశ – నిస్పృహ, విచారణాధికారులకు మరింత అవినీతి పరులు గాను, అసమర్థులు గాను, ఉదాసీనులు గాను తయారు చేసే తీర్పుగా అభివర్ణించవలసి వచ్చినందుకు బాధపడుతున్నాను. ఇది ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగాను, మరింత అణిచివేయడానికి, కుల వ్యవస్థను కొనసాగించబడే దానికి ఉపయోగించబడుతున్న తీర్పు.

ఎస్‌సి, ఎస్‌టి కేసులను అనవసరంగా ప్రయోగిస్తున్నారంటూ సుప్రీంకోర్టు భావించడంను లోతుగా పరిశీలిస్తే, దళిత బాధితులు కుల వివక్షతను, అంటరాని తనాన్ని, కుల దురహంకారాన్ని ఎదుర్కొవలసిందే. గ్రామాలలో కొనసాగుతున్న అగ్రకుల పెద్ద మనుషుల తీర్పులను మౌనంగా పాటించవలసిందే. కేవలం మీరు భరించడానికే జన్మించారంటూ చెప్పకనే చెప్పినట్లున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే 'రాజ్యాంగం పీఠిక'లో ఉన్న 'సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం' అనే భావనకు ఈ తీర్పు పూర్తి విరుద్ధంగా చెప్పబడింది. ఇది భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ప్రజాస్వామిక రాజ్యాంగం అంతిమ లక్ష్యమైన సంక్షేమ రాజ్యం (వెల్‌ఫేర్ స్టేట్) దిశగా భారత ప్రజలను నిర్దేశించవలసిన సుప్రీంకోర్టు ఈ భావనలన్నింటిని తుంగలో తొక్కింది. పైగా 'కుల వ్యవస్థ'ను ఎదుర్కొంటున్నారు కాబట్టి ఎస్.సి, ఎస్.టి కేసులు నమోదవుతున్నాయనే భావన కాకుండా, కేవలం 'పరిహారం' (డబ్బు) కోసం కేసులు నమోదు చేస్తున్నారు కాబట్టి ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే అడ్డంకులు సృష్టిస్తే, దళితులకు పరిహారం ఇవ్వకుండా ఉండవచ్చనే భావనను కూడా వెలిబుచ్చింది. (ఎఫ్ఐఆర్ నమోదైతేనే 25 శాతం పరిహారం చెల్లించవలసి ఉంటుంది ఎస్‌సి, ఎస్‌టి కేసులలో). మొత్తం మీద ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం అనవసరంగా అగ్రకులస్థులను వేధించడానికి ఉపయోగించబడుతున్నదనే భావనను సుప్రీంకోర్టు వ్యక్తీకరించడం ఈ దేశంలో దాదాపుగా 28 శాతం ఉన్న ఎస్‌సి, ఎస్‌టి లందరినీ అవమానించడమే.

ఇన్నాళ్లు ఈ చట్టం ద్వారా అండగా కొద్దో గొప్పో ఉంటున్నదనే భావన ఎస్‌సి, ఎస్‌టిలలో ఉన్నది. అది తిరిగి పూర్వ స్థితికి నెట్టబడుతున్నామనే భయందోళనకు గురవుతున్న పరిస్థితి నెలకొన్నది. గ్రామాలలో అగ్రకుల భూస్వామ్య శక్తులు మరింత దాడులకు పాల్పడే ప్రమాదమున్నది. విద్యావంతులైన దళిత యువకులను మరింత అవమానాలకు, దాడులకు గురి చేసే ప్రమాదం కొట్టవచ్చినట్లు కనపడుతున్నది. నేడు అగ్రకుల శక్తులకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఒక అండగా, ఆసరాగా, ఓదార్పుగా, భరోసాగా కనబడుతున్నది. అందుకే ఉత్తర భారతదేశంలో ఏప్రిల్ 2న జరిగిన 'భారత్ బంద్'లో బిజెపి పాలిత రాష్ట్రాలలో అంత పెద్ద ఎత్తున హింస చెలరేగింది. అక్కడి రాష్ట్ర ప్రభుత్వ పోలీసు యంత్రాంగం ప్రజలను కాల్చి చంపింది.

దేశ వ్యాప్తంగా గణాంకాల ప్రకారం ఈ దేశంలో ప్రతి 15 నిమిషాలకు ఒక దళితుడిపై దాడి లేదా అత్యాచారం జరుగుతున్నది. ప్రతిరోజు ఆరుగురు దళిత మహిళలు అత్యాచారానికి గురవుతున్నారు. గత 10 ఏళ్లలో దళితులపై 66 శాతం దాడులు జరిగాయి. నమోదైన కేసులలో 78 శాతానికే చార్జిషీట్లు దాఖలు చేస్తున్నారు. మిగతా 22 శాతం కేసులు పోలీస్ స్టేషన్లకే పరిమితం అవుతున్నాయి. లేదా పోలీసులే రాజీలు చేసి పంపించి వేస్తున్నారు. ఈ విధమైన పరిస్థితులు ఉండగా ఎక్కడ, ఏ విధంగా దుర్వినియోగం జరుగుతున్నదో సుప్రీంకోర్టు న్యాయమూర్తులే చెప్పాలి.

బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత గత 4 సంవత్సరాలలో దళితులపై దాడులు పెరగడమే కాకుండా, కోర్టులలో శిక్షలు పడడం కూడా పూర్తిగా తగ్గిపోయింది. దేశానికి ఆదర్శవంతమైన పాలన గుజరాత్‌లో అందించానని చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్రమోడీ, ఆ రాష్ట్రంలో అన్ని రాష్ట్రాల కన్నా అత్యధికంగా జనాభా నిష్పత్తి మీద దాదాపు నూటికి డెబ్భై ఐదు శాతం అధికంగా దాడులు జరుగుతున్నాయి. కానీ అదే సమయంలో శిక్షలు పడే రేటు జాతీయ సగటు కన్నా ఆరు రెట్లు తక్కువగా ఉన్నది. ఉదాహరణకు 2014లో జాతీయ స్థాయిలో 28 శాతం కేసుల్లో శిక్షలు పడగా, గుజరాత్‌లో 3.4 శాతం మాత్రమే శిక్షలు పడ్డాయి. వాస్తవానికి ఈ కేసు జరుగుతున్నప్పుడు కూడా అటు మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం రెండూ కూడా బాధితుల పక్షం నిలబడకపోగా నిందితునికి సహకరించే విధంగా సుప్రీంకోర్టులో వ్యవహరించింది. దేశ వ్యాప్తంగా పెరిగిన దళిత ఉద్యమ శక్తులకు తలొగ్గి రివ్యూ పిటిషన్‌ను కేంద్ర ప్రభుత్వం వేసింది.

అంతే కాకుండా దళితులలో విద్యావంతులు పెరగడం, స్వంత కాళ్లమీద నిలబడి, ఎవరిపైనా ఆధారపడి జీవించకపోవడం చేత, గ్రామాలలోని అగ్రకుల భూస్వామ్య శక్తులకందరికీ కంటగింపుగా మారింది. దళితులు తమను లెక్కచేయడం లేదనే అక్కసు, ఆగ్రహం పెంచుకొని ఏ చిన్న అవకాశం వచ్చినా దళితులపై దాడులకు తెగబడుతున్నారు. అక్కడక్కడా దళితులు కూడా ప్రతిఘటించడం మొదలు పెట్టారు. ఇది దళితులలో పెరిగిన చైతన్యానికి నిదర్శనంగా భావించాలి. దీని తీవ్రతను బిజెపి పాలిత రాష్ట్రాలలోని అగ్రకుల భూస్వాములు సహించలేకపోతున్నారు. వాస్తవానికి తెలుగు రాష్ట్రాలలో కూడా అదే పరిస్థితి నెలకొని ఉంది. పోలీసుల ద్వారా దళిత ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తున్నారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో ఎస్‌సి, ఎస్‌టి పిఒఎ యాక్ట్ 1989ను చేర్చడం ద్వారా న్యాయస్థానాలకు సమీక్షించే అధికారం ఉండదు. కాబట్టి జరగబోయే దళిత ఉద్యమం మరింత శక్తివంతంగా, మరింత స్ఫూర్తితో, అన్ని శక్తులను కూడగట్టుకొని జరుగాలి. అందుకు అన్ని ప్రజాస్వామిక, విప్లవ శక్తులు ఏకమవ్వాలి.

*(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు)* వీ

# తెలంగాణ వలస కార్మికులపై నిర్బంధం

***కార్మికుల హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడుతున్న వలస కార్మికులు కోరెగావ్ సమావేశానికి వెళ్లారనే నెపంతో జైలు నిర్బంధానికి గురిచేయడాన్ని ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించాలని అంటున్నారు అక్కెనపెల్లి దుర్గేశ్***

డెబ్బై ఏండ్ల స్వాతంత్ర్యంలో ప్రజలను వంచించడం, భానిసత్వంలోకి నెట్టడం, పోరాటాలతో సాధించుకున్న హక్కులను కాలరాయడం తప్ప ఈ పాలకులు సాధించింది ఏమీ లేదు.

ప్రజాస్వామ్య ముసుగులో పాలకులు చేస్తున్న దోపిడీకి అంతం లేకుండా పోయింది. నూతన ప్రజాస్వామ్యం కోసం సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం పోరాడాల్సిన తక్షణ అవసరం ఆసన్నమైంది. కార్మికులు, రైతులు, కూలీలు, ఆదివాసులు, మహిళలను భానిసత్వపు సంకెళ్లతో బంధించి వెలుగు చూడని చీకటి ప్రపంచంలో ఉంచడమే ఈ పాలకుల ఎత్తుగడలు, ఆలోచనలు, ఆచరణలు.

రాజ్యాంగంపై ప్రమాణం చేసి రాజ్యాంగంలోని ప్రజలకు కల్పించిన హక్కులను తుంగలో తొక్కుతూ నాటి నుండి నేటి వరకు అణిచివేసే వారసత్వాన్ని కొనసాగిస్తున్న దళారీ భూస్వామ్య సామ్రాజ్యవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలిస్తేనే తప్ప పీడిత ప్రజలకు స్వేచ్ఛగా జీవించని పరిస్థితి దాపురించింది నేడు. దోచుకున్న వారు నేరస్తులు కాదు, గొంతు ఎత్తి ప్రశిస్తున్న వారిని ముఖ్యంగా ఆదివాసులను, దళితులను, అణగారిన వర్గాలను జైల్లో బంధించడం, హత్యలు చేయడం జరుగుతుంది.

భీమా కోరేగావ్ సందర్భంగా జరిగిన దళితులపై దాడులను ప్రభుత్వం కప్పి పుచ్చుకోవడానికి అసలు కారకులను వదిలిపెట్టి తెలంగాణ నుండి వలస వచ్చి కార్మికులుగా జీవిస్తున్న వారిపై ప్రభుత్వం ఎటిఎస్ షడయంత్రం చేసి ఎడుగురు కార్మికులకు నక్సలైట్స్ సంబంధాలు ఉన్నాయని, భీమా కోరేగావ్‌లో జరిగిన దాడుల్లో వీరి పాత్ర ఉందని, ఏ ఆధారాలు లేకుండా విచారణ పేరుతో అరెస్ట్ చేసి జనవరి 12న కస్టడికి తీసుకొని జైల్లో నిర్బంధించారు.

ఎటువంటి ఆధారాలు లేకుండా నిర్బంధించడమంటే రాజ్యహింస కాదా! గత 20 సంవత్సరాల క్రితమే బతుకుదెరువు కోసం ముంబైకి వలసలు వచ్చి ఈ ఏడు కుటుంబాలు స్థిరపడ్డాయి. దేశంలోనే పెద్ద పారిశ్రామికవేత్తలలో ఒకరైన అనిల్ అంబానీ కంపెనీ అయిన రిలయన్స్ ఎనర్జీ కంపెనీలో కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌గా పనిచేస్తున్నారు. వీరంతా 'ముంబై ఎలక్ట్రిక్ ఎంప్లాయిస్ యూనియన్'లో కార్మిక నాయకులుగా కంపెనీకి ఉన్న ఐదు జోన్‌లలో సెక్రటరీల బాధ్యతలో ఉన్నారు. కంపెనీ యాజమాన్యం తొత్తులుగా మారకుండా కార్మిక హక్కులే ధ్యేయంగా పోరాటాలు చేసి ఎన్నో హక్కులను సాధించినవారు. అనేక పోరాటాలు చేస్తున్న ఎంఇఇయు కార్యకర్తలను ఈస్ట్ డివిజన్ కార్యకర్తలను కక్షగట్టి యాజమాన్యం నలుగురు కార్మికులను జనవరి 4న సస్పెండ్ చేసింది.

భీమా కోరేగావ్ ఓ చారిత్రాత్మక స్థలం. పూణే పీష్వాల ఆగడాలపైన వారి 25 వేల సైన్యంపై మహర్ బెటాలియన్ 500 సైనికులు విరోచిత పోరాటం చేసి గెలిచిన సందర్భంగా నాటి బ్రిటిష్ పాలకులు అక్కడ దేశంలో ఎక్కడ లేనటువంటి విజయ స్థంభాన్ని అక్కడ వారి పోరాటాలకు చిహ్నంగా నిర్మించినారు. ఆ చారిత్రాత్మక విజయ స్థంభాన్ని దర్శించుకొని వారి పోరాటాలను స్మరించుకుంటారు. అక్కడికి మహారాష్ట్ర నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వేలాది మంది ఆ రోజు వస్తుంటారు. భీమా కోరేగావ్ ఈ సంవత్సరం రెండు వందల ఏళ్ల సందర్భంగా ఈ భీమా కోరేగావ్‌కు ముంబై నుండి వేలాది మంది దళితులు, కార్మికులు వెళ్లినారు. దీనిలో భాగంగానే తెలుగు కార్మికులు వెళ్లి అదే రోజు పూణే పీష్వాయి కోటలో ఎల్గార్ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన భహిరంగ సభకు హాజరై తిరిగి అదే రోజు రాత్రి ముంబై చేరుకోవడం జరిగింది.

దేశ సంపద దోచేవారికి, బ్యాంకులను లూటీ చేసేవారికి, హత్యలు చేసేవారికి ఈ పాలకులు కొమ్ముకాస్తుండడం ప్రజాస్వామ్యానికే విరుద్ధం. దేశంలో ఎక్కడైనా కార్మికులపైన యాజమాన్యం కాని, ప్రభుత్వాలు కాని హక్కులకు భంగం కలిగిస్తే తమ గలాలను వినిపించే ఈ కార్మికులు తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసులైన గుండే శంకర్, సింగపంగ సైదులు, బాబు శంకర్, కాంట్రాక్టర్ అయిన జె. నర్సింహా కాగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించిన మూరంపెల్లి రవి, కరెల సత్తన్న ఉన్నారు. వీరితో పాటే నల్లగొండ జిల్లాకు చెందిన గోండ్యాల రమేష్, సిరిసిల్లా జిల్లాకు చెందిన ప్రసిద్ధ రచయిత కవి ముంబై అంటే అందరికీ గుర్తుండే మచ్చ ప్రభాకర్‌లను అదే రోజు విచారణ పేరుమీద అరెస్ట్ చేసినారు.

అ.భా.తె.ర.వే ప్రధాన కార్యదర్శిగా బాధ్యత నిర్వహించిన మచ్చ ప్రభాకర్‌ను ఏ ఆధారాలు లేకుండా విచారణ పేరుతో స్టేషన్‌లో విచారించి వదిలిన మూడు రోజుల తర్వాత అతడు చనిపోయారు. దీనికి మహారాష్ట్ర ప్రభుత్వం, ఎటిఎస్ బాధ్యత వహించాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

ముంబైకి నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న డోంబివలిలో కారు డ్రైవర్ వృత్తి చేసుకుంటూ ముంబై, తెలంగాణ ఉద్యమంలో అలాగే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల పక్షాన శ్రమజీవి సంఘంతో అండగా నిలిచినవాడు, అన్యాయాలపై గలమెత్తే అతను పదాలకు పదును పెట్టి కవిగా కవితలను రాస్తున్నాడు. తన అగ్నిపథం కవితా సంపుటి పుస్తకం రాసిన రమేష్‌ను ఎటువంటి ఆధారాలు లేకుండా అరెస్ట్ చేసి జైల్లో నిర్బంధించడం జరిగింది. మచ్చ ప్రభాకర్‌తో సహా ఈ కార్మికులంతా తెలంగాణ ఉద్యమ సంఘీభావ వేదిక ద్వారా ముంబైలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు నడిపినారు.

భీమా కోరేగావ్ వెళ్లిన దళితులపైన దాడులకు పాల్పడిన ఎక్‌భోటా హిందూ ఫాసిస్టులను జైల్లో పెట్టకుండా కార్మికులను జైల్లో బంధించడం మహారాష్ట్ర ప్రభుత్వం తన తప్పులను కప్పి పుచ్చుకోవడానికేనని అర్థం అవుతుంది.

మహారాష్ట్రలో రైతుల, కార్మికుల, ప్రజల ఆగ్రహానికి గురవుతున్న

# మొలకెత్తుతున్న బిటి - 3 సమస్యలు

**ప్రైవేట్ సంస్థల నకిలీ విత్తనాలు రైతులను ఆర్థికంగా, శారీరకంగా దిగజారుస్తుంటే ప్రభుత్వం వాటిని నియంత్రించే బదులు, రైతులకు పెట్టుబడి సాయమంటూ డబ్బుల ఆశ చూపుతూ ప్రధాన సమస్యను పక్కదారి పట్టించిందని అంటున్నారు లక్ష్మణ్ గడ్డం**

ఏడవడం నేర్చుకున్నాక వ్యవసాయం చేయాలన్న దశ దాటి చావడం నేర్చుకున్నాక వ్యవసాయం చేయాలన్న దశకు రైతును ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతం నెట్టివేసింది. గద్వాల జిల్లా, మంగంపేట మండలం, మల్దకల్ గ్రామలంలో రైతు కిష్టన్న వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చి గడెం విడిచి ఎద్దులను కట్టేస్తుండగా భార్య 'మనం పండించిన పత్తి విత్తనాలు నకిలీవని తేలింది, రు. 6 లక్షల అప్పు ఎలా తీర్చాలని' చెప్పింది. కిష్టన్న గుండెపగిలి అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయాడు. ఇలాంటి దుర్ఘటనలు దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయి. వ్యవసాయం ప్రాణాంతకమైంది. తెలంగాణలో వ్యవసాయం అప్పులతో, ఏళ్లతరబడి నష్టాలతో స్థిరపడింది. నేషనల్ శాంపిల్ సర్వే నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 92.9 శాతం, తెలంగాణలో 89.1 శాతం రైతులు అప్పుల వలయంలో చిక్కుకున్నారు. జాతీయ నేర గణాంకాల నమోదు సంస్థ లెక్కల ప్రకారం 1995 - 98 నుండి ఇప్పటివరకు మూడు లక్షల ముప్పై వేల మందికి పైగా అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. రికార్డుల కెక్కని మరణాలు ఇంకా ఎన్ని ఉన్నాయో. కాని ఈ 27 ఏళ్ల నూతన ఆర్థిక విధానాల కాలంలో ఏ ఒక్క పారిశ్రామిక వేత్తలు ఆత్మహత్యలు చేసుకున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా పత్తి రైతులకు మాత్రం అక్రమంగా అమ్మే జన్యుమార్పిడి బిటి-3 పత్తి విత్తనాలతో ఈ పరిస్థితి ఎదురవుతుంది.

రాష్ట్రంలో గద్వాల తదితర ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం నిషేధించిన బిటి-3 పత్తి విత్తనం ఉత్పత్తి యథేచ్ఛగా జరుగుతున్నది. కేంద్ర వ్యవసాయ పరిశోధన సంస్థ కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. విత్తన సప్లయి సంస్థలు, దళారులు రైతుల కళ్లను రైతుల వేళ్లతోనే పొడుస్తున్నారు. రైతులకు తెలియకుండానే వారి పొలాల్లో వారి ఖర్చులతో, వారి శ్రమతో ఈ విత్తనం మొలకెత్తి ఫలిస్తుంది. పంట చేతికందిన తర్వాత అది నిషేదించబడిన బిటి-3 అని నిర్దారణ అయ్యాకనో లేదా అది నకిలీదని తేలాకనో రైతు గుండె పగిలి చస్తున్నాడు. ప్రభుత్వం వైపు నుంచి నాణ్యమైన విత్తన సరఫరా చేసే పటిష్టమైన యంత్రాంగం లేకపోవడం ఈ పరిస్థితికి ప్రధాన కారణం. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పత్తి సాగుచేసిన విస్తీర్ణంలో బిటి-3 పత్తి రకాన్ని 13 లక్షల ఎకరాల్లో సాగుచేశారని రికార్డులు వెల్లడిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2500 గ్రామాల్లో బిటి-3 పత్తి విత్తనోత్పత్తి జరుగుతుంది. గద్వాల జిల్లాలో 50 వేల ఎకరాల్లో పత్తి సాగవుతుంది.

పత్తి రైతులను రెండు రకాలుగా విభజించవచ్చు. మొదటి రకం పత్తి విత్తనోత్పత్తి దారులు. ఈ కోవకు చెందిన రైతులు ఆడ పత్తి విత్తనాలు, మొగ విత్తనాలు కొనుగోలు చేసి వేరు వేరుగా నాటుతారు. పూత దశకు చేరిన తర్వాత మొగ పువ్వులను ఆడ పువ్వులతో క్రాసింగ్ చేయిస్తారు. ఈ ప్రక్రియ కోసం ఎకరానికి 10 మంది లేబరును పనిలోకి తీసుకుంటారు. పంట చేతికి వచ్చిన తర్వాత జిన్నింగ్ అంటే పత్తిని, విత్తనాలను వేరుగా చేస్తారు. తర్వాత డీలెటింగ్ అంటే వేరుచేసిన విత్తనాలను రసాయనాలతో కడగడం చేస్తారు. ఈ రసాయనాలు పంట పొల్లాల్లోకి వెళ్లి పొలాలను నాశనం చేస్తాయి. తర్వాత మూడవ దశలో ప్రాసెసింగ్ అంటే తాలు విత్తనాలను వేరు చేస్తారు. చివరిగా నాలుగవ దశలో గ్రేడింగ్ అంటే అత్యంత మేలు రకం విత్తనాలు వేరుగా చేస్తారు. ఈ విత్తనాలను మాత్రమే ప్యాకేజింగ్ చేస్తారు. ఈ పనులకు గాను మహిళలను, పిల్లలను నియమిస్తారు. ఒక్కో ప్యాకెట్ ఒక్క కిలో చొప్పున ఉంటుంది. దీనికి కిలోకి రు. 420 చొప్పున లెక్కగట్టి మధ్య దళారులు రైతుకు ఇస్తారు. నాసిరకం విత్తనాలను, మిగతా అన్ని రకాల విత్తనాలను దళారులే తీసుకుంటారు. మళ్లీ తిరిగి రైతుకు అమ్మేటప్పుడు మాత్రం 450 గ్రాములతో ప్యాకెట్లు తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రు. 950 లకు మార్కెట్‌లో అదే రైతుకు అమ్ముతారు. అయితే విత్తనాలు నకిలీవి అయితే మాత్రం పంట చేతికిరాక రైతు నష్టాల పాలవుతాడు. రెండవ రకం రైతు కాటన్ రైతు. ఈ తరహా రైతులు కేవలం పత్తి మాత్రమే పండిస్తారు. ఈ పత్తిలో విత్తనం రాదు. ఈ రైతుకు ప్యాకెట్లలో నకిలీ విత్తనాలు కలిపితే ఆ మేరకు పత్తి పండక రైతు నష్టాల పాలవుతాడు.

విత్తనోత్పత్తిలో భాగమైన రైతు తనకు కావాల్సిన విత్తనాలను ప్రైవేట్ దళారులైన ఆర్గనైజర్ల దగ్గర కొంటారు. కావాల్సిన ఎరువులు, రసాయనాలు అన్నీ మధ్య దళారులే సమకూర్చుతారు. విత్తనాల ప్యాకెట్లను వివిధ కంపెనీలు దళారులకు అమ్ముతాయి. అనేక రకాల కంపెనీల పేర్లతో 450 గ్రాముల ప్యాకెట్లు దళారుల ద్వారా రైతులకు చేరుతాయి.

---

దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం సమయం వచ్చినప్పుడల్లా అసాంఘిక శక్తులంటూ నక్సలైట్స్ పేరుమీద తోయడం జరిగింది. భీమా కోరేగావ్‌కు సంబంధించిన ఎటువంటి ఘటనలో వీరు పాల్గొనలేదని ఏ ఆధారాలు లేకుండా అరెస్ట్ చేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు ట్రేడ్ యూనియన్స్ నాయకులు నివేదిక ఇచ్చి మూడు నెలలు దాటినా చార్జిషీట్ వేయకుండా బెయిల్ మంజూరు చేయడం లేదు. వలస వచ్చి బతుకుతున్న ఈ కుటుంబాలు గత మూడు నెలలుగా జైలు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజలపై, కార్మికులపై మహారాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ప్రజాస్వామిక వాదులు, కవులు, రచయితలు, కార్మిక సోదరులు, బుద్ధిజీవులు స్పందించాలని కోరుతున్నాం.

(రచయిత ముంబై కార్మికుడు)

వీ

ఆరుగాలం శ్రమించి చేతికొచ్చిన పంటను తిరిగి ఆర్గనైజర్లకు నవంబర్‌లో చేరవేస్తాడు. కాని ఆర్గనైజరు మాత్రం జూలైలో లెక్కలు చేస్తాడు. తనకు రావాల్సిన అప్పు, వడ్డీ తీసుకుని మిగిలిన డబ్బులు రైతుకు చెల్లిస్తాడు. కాని అన్నీపోను అప్పులుపడే రైతులే ఎక్కువగా ఉంటారు. అప్పుపడిన రైతు నుంచి వెంటనే ఖాళీ ప్రామిసరి నోటుపై సంతకాలు తీసుకుంటారు. వరుసగా రైతు అప్పులపాలైతే భూములను జప్తు చేసుకుంటారు. ఈ ప్రక్రియ తెలంగాణ పల్లెల్లో సర్వ సాధారణమైంది. అయితే రైతులే ఎందుకు అప్పుల పాలవుతున్నారు? ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

యథేచ్ఛగా కొనసాగుతున్న ఏజెంట్ల మోసాలను అరికట్టే చిత్తశుద్ధి ప్రభుత్వాలకు లేదు. నియంత్రించడానికి తగిన యంత్రాంగం లేదు. కఠినమైన చర్యలు లేవు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా 1966లో తెచ్చిన విత్తన చట్టం ఇప్పుడు ఘరానా మోసాల ముందు పనికిరాకుండా పోయింది. ఈ చట్టం ప్రకారం దోషులకు ఏడాది జైలు శిక్ష, రు. 500 జరిమానా పడుతుంది. నిందితులు జరిమానా చెల్లించి దర్జాగా బయటికి వస్తున్నారు. ఇప్పుడు మితిమీరిన మోసపూరిత చర్యలకు అనుగుణంగా, జన్యుమార్పిడి కాలానికి అనుగుణంగా సరిపడే పటిష్టమైన చట్టాన్ని తేవాలి. కాని దేశంలో పత్తి విత్తనాల ద్వారా రు. 4000 కోట్ల వ్యాపారం సాగుతోంది. కొన్ని చోట్ల పాలకులే ఈ వ్యాపారంలో ఉన్నారు. ఇక నియంత్రించే చట్టాలొస్తాయనుకోవడం దురాశే అవుతుంది. పైగా వ్యవస్థ ఎంత లోపభూయిష్టంగా ఉంటే, దాన్ని కాపాడుతున్న పాలక వర్గాలకు అంత ఎక్కువ పార్టీ ఫండు వస్తుంటదాయె.

దేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు కొదువలేదు, విత్తన పరిశోధన సంస్థలకు కొదువలేదు. వాటికి కేటాయిస్తున్న నిధులకు కొదువలేదు. మరి కొత్త వంగడాలు ఎందుకు వెలుగుచూడడం లేదు, అవి రైతులకు అందించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమవుతుంది. ఈ చట్రంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ విత్తనోత్పత్తి కంపెనీలు ఇబ్బడి ముబ్బడిగా నెలకొల్పి విత్తన వ్యాపారంలోకి వచ్చేస్తున్నాయి. ఈ ప్రైవేట్ సంస్థల శక్తి ఏమిటి అని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ పై వెచ్చిస్తున్న పెట్టుబడి ఎంత, వాటి సాంకేతిక పరిజ్ఞానం ఎంతటిది అనే సాంకేతిక అంశాలను ప్రభుత్వం పట్టించుకుంటుందా? ఈ కీలకమైన విషయాల జోలికి పోకుండా లైసెన్సులు మంజూరు అవుతున్నాయంటే మతలబున్నట్లే కదా!

జన్యుమార్పిడి విత్తనాభివృద్ధిలో మూడవ దశ కింద మోన్‌శాంటో కంపెనీ వెలుగులోకి తెచ్చిన ఈ బిటి-3 విత్తనాలు తెగుళ్లను ఎదుర్కొనే శక్తి ఉందని ప్రచారం జరిగింది. దిగుబడి కూడా అధికంగా ఉంటుందని రైతులను నమ్మించారు. ఆచరణలో ఈ రెండు జరగడం లేదు. ప్రపంచీకరణలో భాగంగా విదేశీ, ప్రైవేట్ సంస్థలకు గేట్లు తెరిచి విత్తనాలను అమ్ముకొమ్మంటున్నారు. వ్యవసాయ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు మోజు పడ్డందుకు జీవవైవిధ్యానికి ముప్పు ఏర్పడింది. రైతుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడింది. నిజానికి మోన్‌శాంటో కంపెనీకి బోల్‌గార్డ్-2 విత్తనాలను తయారు చేయడానికి లెసెన్సు ఉంది. కాని బోల్‌గార్డ్ విత్తనాన్ని తెగుళ్లను ఎదుర్కొనే శక్తి కలిగిన బెసిలస్ తురింగీన్సిస్ కలిపి వృద్ధి చేసి విత్తనాలను తయారు చేయడానికి 2009లో పేటెంట్ హక్కులను పొందింది. దీనినే బిటి - 3 పత్తి విత్తనాలంటారు. బిటి-3 పత్తి మొక్కలను చీడ పురుగుల నుండి కాపాడడానికి గ్లైఫోసేట్ రసాయనాలను వాడుతారు. కాని ఈ రసాయనాల వాడకం వలన మనుషులకు క్యాన్సర్ వ్యాధి సోకుతుంది. సాన్‌ఫ్రాన్సిస్కో పట్టణంలో మోన్‌శాంటో కంపెనీపై ఈ ఆరోపణ మీదనే 300 కేసులు కోర్టులో నడుస్తున్నాయి.

గద్వాల చుట్టుపక్కల రైతులు ఎన్నడూ ఎరగని వ్యాధులతో బాధపడుతున్నారు. చర్మ రోగాలు, గజ్జి తామర క్షయవ్యాధి, క్యాన్సర్ సోకుతుంది. సంతానోత్పత్తి సమస్యలు ఏదురవుతున్నాయి. చేతిగోర్లు ఊడిపోతున్నాయి. ఇనుపగోర్లు పెట్టుకుంటున్నారు. ఒక్కో గోరు రు. 50 కర్చవుతుంది. పక్షులు, పాములు, తేనెటీగలు మచ్చుకైనా కనబడవు. బిటి-3 విత్తనాలు నాటితే అర కిలోమీటరు వరకు భూసారాన్ని లాగుతుంది. ఒక్కసారి బిటి-3 విత్తితే ఆ పొలం ఇంకో పంటకు పనికిరాదు. మళ్లీ బిటి-3 వేయాల్సిందే. పంట పొలం సారవిహీనమవుతుంది. రైతులు ఘోరంగా మోసపోతున్నారు.


ఇంత జరుగుతున్నా ప్రభుత్వాలు ఏ విషయంలోనూ రైతులకు అండగా నిలబడి ఆదుకోవడం లేదు. నకిలీ, నాసిరకం, నిషేదించబడిన విత్తనాలను అమ్మిన కంపెనీలకు, ఏజెంట్లకు ఏ శిక్షలు లేవు. పటిష్టమైన చట్టాలను చేయడంలేదు. నియంత్రించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం లేదు. నకిలీ విత్తనాలను నాటడం వలన మొక్కలు చెయ్యెత్తు ఎదిగినా పూతపూయక, పూసిన పూతకు కాతరాక తీవ్రనష్టాల భారినపడుతున్నారు. రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడం లేదు. రైతు పంటకు సగటున రు. 48 వేల పెట్టుబడిని నష్టపోతున్నాడు.

తెలంగాణ రాష్ట్రాన్ని విత్తన భాండాగారంగా మారుస్తానన్నాడు ముఖ్యమంత్రి. నకిలీ విత్తనాలు కొని నష్టపోయిన వారికి కంపెనీల మెడలు వంచి నష్టపరిహారాన్ని ఇపించలేకపోతున్నారు. లేదా ప్రభుత్వమే నష్టపరిహారాన్ని చెల్లించి ఆత్మహత్యలను నివారించడానికి చేతులు రావడం లేదు. రాష్ట్రాన్ని సీడ్‌బౌల్‌గా మారుస్తానని, విత్తనోత్పత్తికి పాటుపడుతున్న రైతులు అష్ట కష్టాలు పడుతుంటే చూస్తూ మిన్నకుండడం న్యాయమేనా. పటిష్టమైన ప్రణాళికల ద్వారా కావాల్సిన సహాయాన్ని అందిస్తే విత్తన పంటలు సాగుచేసి దేశంలోని అన్నో రాష్ట్రాలకు విత్తనాలు అందించే సత్తాను తెలంగాణ రైతులు చాటుతారు గదా! వ్యవసాయ శాస్త్రవేత్తలను విత్తనోత్పత్తి రైతులను అనుసందానం చేస్తే అనుకున్న ఆశయం నెరవేరుతుంది గదా!

రైతులు సగటున రు. 48 వేల పెట్టుబడిని ఒకవైపు కోల్పోతుంటే ప్రభుత్వం ఇవ్వతలపెట్టిన వ్యవసాయ పెట్టుబడి రు. 4 వేలు ఏ మూలకు సరిపోతుంది. మూల కారణాలు తెలుసుకుని పరిష్కారం మార్గాలు కనుగొనాలి.

ఐదు దశాబ్దాల కింద తెచ్చిన విత్తన చట్టాన్ని నడుస్తున్న కాలానికనుగుణంగా సవరణలు చేయాలి లేదా నూతన చట్టాన్ని రూపొందించి పకడ్బందీగా అమలు పరచాలి. తద్వారా కంపెనీల, ఏజెంట్ల ఆగడాలను అరికట్టాలి. నాసిరకం విత్తనాలను కొని ఆర్థికంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి కాంపెన్సేషన్ చట్టాన్ని వెంటనే తీసుకురావాలి. అటు దిశగా మూడేళ్ల క్రితం ఆలోచించిన ప్రభుత్వం ఎందుకు తేలేకపోతుందో ప్రజలకు వివరించాలి. నిజానికి ఈ చట్టం ఉనికిలోకి వస్తే ఏజెంట్ల దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. ఈ చట్టం అమలులోకి వస్తే ఎక్కడ నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందోనని ప్రభుత్వం పై వత్తిడి తెస్తూ ఆ చట్టం రూపం దాల్చకుండా విత్తన కంపెనీలు అడ్డుకుంటున్నాయి. చచ్చు విత్తనాలను సప్లయి చేస్తున్న కంపెనీలు, వాటికి అండగా నిలబడ్డ ప్రభుత్వం రెండూ కలిసి రైతుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. రైతులు ప్రత్యక్ష ఆందోలనకు దిగి ఈ రెండింటిపై పోరాటం ప్రకటించడమే మిగిలిన మార్గం తప్ప ఆత్మహత్యలకు పాల్పడడం కాదు.

*(రచయిత అధ్యక్షుడు, పౌరహక్కుల సంఘం)* వీ



# కార్ల్ మార్క్స్ (1818-1883) ద్విశత జయంతి ప్రత్యేకం

*"ఆయుధం చేసే విమర్శ స్థానాన్ని చేపట్టడం విమర్శాయుధానికి సాధ్యం కాదు. భౌతిక శక్తిని భౌతిక శక్తితోనే కూలదోయవలసి ఉంటుంది. కాని ప్రజలను ఆకట్టుకున్న సిద్ధాంతం కూడ భౌతిక శక్తిగా మారుతుంది. విప్లవాత్మకంగా ఉన్నానని నిరూపించుకున్నప్పుడు సిద్ధాంతానికి ప్రజలను ఆకట్టుకునే శక్తి వస్తుంది. విప్లవాత్మకంగా ఉండడమంటే పరిశీలిస్తున్న విషయపు మూలాలను గ్రహించడమే" అంటూ జర్మన్ మేధో ప్రపంచంలోకి ప్రవేశించాడు ఒక ఇరవై ఐదేళ్ల నవయువకుడు. రచనా జీవితపు తొలిదశలో 1843లో ఈ మాటలు అన్ననాటి నుంచి జీవితాంతం, 1883లో చివరి శ్వాస విడిచేవరకూ, నలభై సంవత్సరాలు ఆయన చేసిన కృషి అంతా పరిశీలనాంశాల మూలాలను గ్రహించే విశ్లేషణే, వివరణే. ప్రజలను ఆకట్టుకునే విప్లవాత్మక సిద్ధాంతం తయారు చేయడమే. అలా తన సిద్ధాంతం ప్రజలను ఆకట్టుకుని భౌతిక శక్తిగా మారిందని, ఇంటర్నేషనల్‌గా, పారిస్ కమ్యూన్‌గా సాకారమైందని తన కళ్లముందరే చూడగలిగిన అద్భుత అవకాశమూ ఆయనకు దక్కింది. ఆ మహత్తర మేధావి కార్ల్ మార్క్స్ కళ్లు తెరిచి ఈ మే 5 కు రెండు వందల సంవత్సరాలు. ప్రపంచాన్ని మార్చే భౌతిక శక్తిగా రూపు దిద్దుకోగలిగిన విప్లవాత్మక సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయడానికే తన సమస్త శక్తులూ ధారపోసిన ఆ మహా మేధావి ద్విశత జయంతి సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా, ఆయన మేధోవిస్తృతిని, విశ్లేషణా శక్తిని, సామాజిక జీవిత ప్రభావాలను, ఇవాళ్టికీ ఆయన సిద్ధాంతాల ప్రాసంగికతను మరొకసారి మననం చేసుకోవాలని వీక్షణం తలపెట్టింది. ఈ అంశాల మీద వ్యాసాలు రాయవలసిందిగా దశాబ్దాలుగా ఈ రంగంలో కృషి చేస్తున్న అధ్యయనపరులను కోరాం. మాకు తెలియని అధ్యయనపరులు ఎవరైనా రాయవచ్చునని బహిరంగంగా విజ్ఞప్తి చేశాం. మా విజ్ఞప్తికి అనూహ్యమైన, అపారమైన స్పందన వచ్చింది. ఈ సంచికలో పదహారు పేజీలు కేటాయించాలనుకున్న ప్రణాళిక ఇరవై నాలుగు పేజీలు కేటాయించినా మిగిలిపోయిన వ్యాసాలు వచ్చాయి. స్థలాభావం వల్ల ఈ సంచికలో అచ్చువేయలేకపోయిన వ్యాసాలు: మార్క్స్ పరాయీకరణ సిద్ధాంతం – అరణ్య, మార్క్సిజం మానవాళి విముక్తి సిద్ధాంతం – చిమ్మె జాన్ బర్నబాస్, మార్క్సిజాన్ని నేర్చుకుందాం – వెంకటేశ్వర రావు, తత్వశాస్త్రానికి మార్క్స్ కానుకలు – ఎన్. వేణుగోపాల్. మిగతా వ్యాసాలు రానున్న సంచికల్లో వీలువెంబడి ప్రచురిస్తాం.*

---

# మార్క్స్ జీవితం, సిద్ధాంతం, పోరాటం

**- ఎం. గంగాధర్**

పెట్టుబడి ఒక దేశం నుండి, ఒక సమాజం నుండి అనేక దేశాలకు, అనేక సమాజాలకు ఎగబాకుతున్న కాలం అది. ఆక్రమణలు, దురాక్రమణలు, యుద్ధాలు చేస్తున్న కాలం అది. ఆ కాలంలోనే, ఆ పెట్టుబడి గర్భంలో నుండే ఒక మనిషి ఆవిర్భవించాడు. పెట్టుబడిని, దాని సకల రూపాలను, దాని సకల వేషాలను అత్యంత సన్నిహితంగా ఉండి పసిగట్టిన వాడు ఆ మనిషి. దాన్ని అధ్యయనం చేసి, దాన్ని విశ్లేషించి, దాని బలాన్ని, బలహీనతను కనిపెట్టిన వాడు ఆ మనిషి.

ఏ రైతాంగమూ, ఏ కార్మిక వర్గమూ తన పుట్టుకకు, మనుగడకు, అభివృద్ధికి కారణమో ఆ రైతాంగాన్ని, ఆ కార్మిక వర్గాన్ని తన బలంతో అమానుషంగా తొక్కిపెడుతున్న పెట్టుబడి బలహీనతలను చూపి, పెట్టుబడి మీద దండయాత్రకు వ్యూహాన్ని, ఎత్తుగడలను రచించినవాడు ఆ మనిషి. ఆ మనిషి పేరు మార్క్స్. ఆ వ్యూహమూ, ఎత్తుగడల సిద్ధాంతం పేరు మార్క్సిజం.

❖ ❖ ❖

మార్క్స్ తాను కోరుకొన్నట్లయితే పెట్టుబడి ఆధిపత్య ప్రపంచంలో సుఖవంతమైన జీవితాన్నే పొంది ఉండేవాడు. కాని ఆయన చైతన్యం ఆయనకు అటువంటి జీవితాన్ని ఇవ్వలేదు. ఆయన సంపన్న కుటుంబంలోనే జన్మించాడు. కాని తన జీవితాన్ని పీడిత ప్రజల జీవితాలతో, కష్టాలతో, కన్నీళ్లతో ముడివేసుకున్నాడు. మనిషి సామాజిక అస్తిత్వం అతని చైతన్యాన్ని నిర్ణయిస్తుందని ఆయనే చెప్పాడు. నిర్దిష్టమైన సామాజిక వర్గాలకు అన్వయించే ఈ సూత్రానికి భిన్నంగా సంపన్నుల్లో పీడిత వర్గ చైతన్యం, పీడితుల్లో పాలవర్గ చైతన్యం కలిగిన మనుషులు కనిపిస్తారు. సంపన్న కుటుంబాల్లోంచి పీడిత వర్గ చైతన్యాన్ని పొంది, జీవిత కాలమంతా పోరాటం చేసిన వాళ్లకు మార్క్స్, ఎంగెల్స్‌లే ఒక ఉదాహరణ.

మార్క్స్ కష్టతరమైన జీవితాన్ని ఎంచుకొన్నాడు. ఆయన గొప్ప రచయిత. కాని తన కలాన్ని పీడిత ప్రజల చేతుల్లో పెట్టినవాడు. ఆయన గొప్ప వక్త. కాని తన గొంతును కార్మికులను ఉత్తేజపరచడానికి ఉపయోగించినవాడు. ఆయన అధ్యయనపరుడు, పరిశోధకుడు.

జాతులను, దేశాలను, ప్రపంచాన్ని అధ్యయనం చేసినవాడు ఆయన. పెట్టుబడిని, శ్రమను పరిశోధించినవాడు ఆయన. ఆయన గొప్ప శాస్త్రవేత్త. పీడిత ప్రజల చేతికి మార్పుబీజాన్ని శాస్త్రంగా, శస్త్రంగా అందించినవాడు. ఆయన గొప్ప పోరాటయోధుడు. తన కాలపు పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నవాడు. ప్రత్యక్షంగా పాల్గొనలేకపోతే ఆ పోరాటాలతో నిత్యసంబంధాలను కలిగి ఉన్నవాడు. పోరాటాల వ్యూహాలను రచించి, ఎత్తుగడల ఆయుధాలను అందించినవాడు.

అధ్యయనం, రచనలు ఆయనకు ఉచ్ఛ్వాస నిశ్వాసలయ్యాయి. ఆయన ఎంచుకొన్న కష్టతరమైన జీవితం, ఆయన మీద మోపబడిన వలసజీవితం ఆయనను, ఆయన కుటుంబాన్ని అనారోగ్యాల పాలు చేసాయి. మార్క్స్ జెన్నీలు నలుగురు బిడ్డల్ని కోల్పోయారు. తామూ అనారోగ్యంతో అకాలంగానే మరణించారు.

జర్మనీలో ఒక మోస్తరు పాతకాలపు పట్టణమైన ట్రియర్‌లో 1818 మే 5వ తేదీన మార్క్స్ జన్మించాడు. రైన్ నదీ తీరంలో ఉన్న కొలోన్ వంటి ఇతర పట్టణాల కంటే ట్రియర్ చిన్నదే అయినప్పటికి అది జిల్లా కేంద్రం. జర్మనీలో తలెత్తిన సామాజికరాజకీయ ఉద్యమాల ప్రకంపనలు తాకే కేంద్రం కూడా అది.

మార్క్స్ పూర్తి పేరు కార్ల్ హెన్రిచ్ మార్క్స్. తల్లి హెన్రీ ప్రెస్‌బర్గ్. హాలండ్‌కు చెందిన వ్యక్తి. తండ్రి హెన్రీ మార్క్స్. ఆయన న్యాయవాదిగా పనిచేస్తుండేవాడు. నిజాయితీ పరుడు. చట్ట పరిజ్ఞానం బాగా ఉన్నవాడు. ఆలోచనా పరుడు. అధ్యయన పరుడు కూడా. పెట్టుబడిదారీ విధానపు ఉదారవాద తాత్వికతను మనం ఇప్పటికీ ఇష్టపడడానికి కారణమైన రూసో, వోల్టేర్‌ల రచనలు ఆయన గ్రంథాలయంలో ఉండేవి. థామస్‌పెయిన్ రచనలు ఉండేవి. మతం విధించే సంకుచితమైన కట్టుబాట్లకు లోబడని స్వేచ్ఛాయుతమైన ఆలోచనా విధానంతో ఆయన జీవించేవాడు. ఈ మాత్రం చాలు, ఆనాటి ప్రష్యన్ ప్రభుత్వం మనుషులను అనుమానపు చూపులతో చూడడానికి. హెన్రిచ్ మార్క్స్ ప్రష్యన్ అధికారుల నిఘా నేత్రాల పరిధిలో ఉన్న మనిషి. తండ్రి ప్రభావంతో కార్ల్‌మార్క్స్ ధిక్కార స్వభావాన్ని అలవరుచుకొని విప్లవకారు డయ్యాడో, లేక ఇద్దరిది ఒకే రకమైన స్వభావమోగాని, మార్క్స్‌కు తండ్రివద్ద ప్రేమ పూర్వకమైన సాన్నిహిత్యం ఉండేది.

తల్లి సాధారణ గృహిణి, సంకుచిత మత భావనలు కలిగిన వ్యక్తి. ఇంటిపని, పిల్లల పెంపకం ఆమె తన మీద వేసుకొన్నది. ఆ దంపతులకు 9 మంది సంతానం. అందులో ముగ్గురు సోదరులతో, అయిదుగురు సోదరీ మణులతో ఈ మార్క్స్ ఒకరు. చివరకు మార్క్స్ ఒక అన్నతో, ఇద్దరు చెల్లెళ్లతో మాత్రమే, నలుగురు సంతానంలో ఒకరుగా మిగిలిపోయాడు.

మార్క్స్ విద్యాభ్యాసం ట్రియర్ జిమ్నాసియంలో 1830లో ప్రారంభమయింది. ఒక రకంగా మార్క్స్ సాధారణ విద్యార్థి. బాగా మార్కులు సంపాదించి, అందరి కంటే పైన ఉన్నవాడేమీ కాదు. అయితే ఎక్కడ సృజనాత్మకత అవసరమో అక్కడ మార్క్స్ రాణించాడు. ఆయనకు గణితంలో మంచి పరిజ్ఞానం ఉండేది. ఆయనలోని సృజనాత్మతకత, గణిత పరిజ్ఞానం, ఒక విషయాన్ని లోతుగా ఆలోచించే స్వభావం ఆయన చేత మంచివ్యాసాలను రాయించాయి. ఈ విద్యాభ్యాస కాలంలోనే ఆయనలో ఒక భవిష్యత్తు రచయిత రూపొందుతూ వచ్చాడు.

మార్క్స్ భవిష్యత్ జీవితానికి ట్రియర్ జిమ్నాసియంలోనే బీజం పడినట్లుగా ఉంది. ఇద్దరు ఉపాధ్యాయులు ఆయనలోని ఆలోచనాపరున్ని తట్టిలేపి ఉంటారు. అందులో ఒకరు జోహన్ విటెన్‌బా. ఆయన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. చరిత్రను, తత్వశాస్త్రాన్ని చెప్పేవాడు. ఆయన జర్మనీలోనూ, ఫ్రాన్స్‌లోనూ తలెత్తిన పునరుజ్జీవన ఉద్యమాలతో ప్రభావితుడైనవాడు. ప్రష్యన్ నిరంకుశ రాచరికంలో ఉదారవాద పెట్టుబడి దారీ భావాలతో, ఉద్యమాలతో ప్రభావితుడు కావడం ప్రమాదకరం. పైగా ఆయన చరిత్రనూ, తత్వశాస్త్రాన్ని చెప్పేవాడు. మార్పును చూపి, మార్పు వైపు దారి చూపే పాఠాలు అవి. కాబట్టి ఆయన మీద పోలీసుల నిఘా ఉండేది. ఆ పాఠశాలలో మరొక ఉపాధ్యాయుడు జోహన్ స్టెయినింగర్. ఆయన భౌతిక వాది. భౌతికవాది ఎవరైనా సరే ప్రష్యన్ ప్రభుత్వానికి ప్రమాదకరమైనవారుగానే కనిపిస్తారు. కాబట్టి ఆయన దేశభక్తి మీద అనుమానంతో కూడిన నిఘా నీడలాగా వెన్నాడుతూ ఉండేది. ఆయన మార్క్స్‌కు గణితాన్ని, భౌతిక శాస్త్రాన్ని చెప్పాడు.

మార్క్స్‌ను చిన్నతనంలోనే ప్రష్యన్ ప్రభుత్వపు నిఘానీడలో ఉన్న ముగ్గురు ప్రమాదకరమైన వ్యక్తులు ప్రభావితం చేసారు. ఒకరు హెన్రిచ్ మార్క్స్, తండ్రి. మరొకరు జోహన్ విటెన్‌బా, ప్రధానోపాధ్యాయుడు. ఇంకొకరు జోహన్ స్టెయినింగర్, ఉపాధ్యాయుడు. మరి మార్క్స్ మొదట ప్రష్యన్ ప్రభుత్వానికి, ఆ తర్వాత క్రమంగా యూరప్‌లోని అన్ని రాచరిక, పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు ప్రమాదకరమైన వ్యక్తి కాకుండా ఎలా ఉంటాడు?

ఆ విధంగా మార్క్స్‌లోని ప్రమాదకరమైన వ్యక్తి ట్రియర్ జిమ్నాసియంలోనే రూపొందుతూ వచ్చాడు. ఇలాంటి ప్రమాదకరమైన వ్యక్తులు ఆ పాఠశాలలో ఇంకా ఉన్నారు, ఉపాధ్యాయుల్లోనే కాదు, విద్యార్థుల్లో కూడా. ఆ పాఠశాలలోని విద్యార్థులు బయటి ప్రపంచంతో సంబంధాలు పెట్టుకొన్నారు. తిరుగుబాటు భావజాలంతో సంబంధం పెట్టుకొన్నారు. ఆ విధంగా ప్రష్యన్ ప్రభుత్వాధికారులను విమర్శించిన సాహిత్యం 1833లో పాఠశాలలోకి వచ్చింది. నిషేధించిన సాహిత్యం వచ్చింది. చివరకు ఒక విద్యార్థిని అరెస్టు చేయడం వరకు వెళ్లింది.

ట్రియర్ జిమ్నాసియం విద్యాభ్యాసకాలం మార్క్స్‌లో మంచిని ప్రేమించి, చెడును ద్వేషించే మనస్తత్వం బలపడిన కాలం. తిరుగుబాటు భావాలు స్థిరపడిన కాలం. మనిషి మంచి మనిషిగానే కాదు, మొత్తం సమాజం కొరకు బతకాలనే సంకల్పం తిష్ఠ వేసిన కాలం. ఆ జిమ్నాసియంలోనే విటస్ లోయర్స్ అనే ఒక ఉపాధ్యాయుడు, అభివృద్ధి నిరోధక భావజాలం కలిగిన ఉపాధ్యాయుడు, ఉండేవాడు. పైగా అతడు విద్యార్థుల తిరుగుబాటు కార్యకలాపాల మీద రాజకీయ నిఘా వేసిన ఏజెంటు. జిమ్నాసియంలో తన చదువు పూర్తి అయిన తరువాత, 1835లో, ఆ నిఘాబంటుకు కనీసం వీడ్కోలు చెప్పడానికి కూడా మార్క్స్ నిరాకరించాడు.

ట్రియర్ జిమ్నాసియంలో మార్క్స్ ఆలోచనలు ఏ విధంగా రూపొందాయో తెలుసుకోవడానికి ఆయన రాసిన ఒక వ్యాసం బాగా పనికి వస్తుంది. 'Reflections of a young man on the choice a profession' అనే అంశం మీద 1835 ఆగస్టులో రాసిన వ్యాసం అది.

మార్క్స్ ఈ వ్యాసంలో ఒక వృత్తిని ఎంచుకోవడం కష్టమని చెపుతూనే, మానవజాతికి ఎక్కువసేవ చేసే వృత్తిని ఎంచుకోవాలని చెపుతాడు. సమాజంతో మన సంబంధాలు మనం నిర్ణయించుకోవడానికంటే ముందుగానే నిర్ధారింపబడి ఉంటాయని అంటూనే, సంకుచిత జీవితంతో ముడుచుకుపోవద్దని చెపుతాడు. ఎవరైనా తన కోసమే తాను పనిచేస్తే మంచి మనిషి కావచ్చుగాని, గొప్ప మనిషి కాలేడని చెపుతాడు. మానవ జాతికి సేవచేసే వృత్తిని ఎంచుకొంటే పొందే సంతోషం చిన్నదీ, స్వార్థ పూరితమైనదీ కాదని, అది లక్షలాది మందికి చెందిన సంతోషమని అంటాడు. మార్క్స్ రాసిన ఈ వ్యాసం మీద 18వ శతాబ్దపు యూరప్ పునరుజ్జీవనోద్యమ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఇది మొదలు మార్క్స్ తన జీవిత కాలమంతా తన చుట్టూ ఉన్న ప్రపంచం ఎదిగించిన మనిషిగా, మేధావిగా, శాస్త్రవేత్తగా, పోరాట యోధుడుగా ఎదిగాడు.

ఒకే జిమ్నాసియంలో పోలీసుల నిఘాకింద పనిచేసిన ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు, పోలీసుల నిఘా కొరకు పనిచేసిన ఒక ఉపాధ్యాయుడు కూడా ఉన్నట్లు, ఆనాడు మారుతున్న యూరప్‌లో పాలకవర్గాల మేధావిగా, శాస్త్రవేత్తగా కాకుండా మార్క్స్ ప్రజల మేధావిగా, శాస్త్రవేత్తగా ఎదిగాడు. జర్మన్ తత్వశాస్త్రం, ఫ్రెంచ్ సోషలిజం, బ్రిటిష్ పెట్టుబడిదారీ విధానం మార్క్స్‌ను ఎదిగించాయి. ఆ తత్వశాస్త్రంలో, ఆ సోషలిజంలో ఉన్న తప్పులను సరిచేసి, వాటిని మార్క్సిస్టు తత్వశాస్త్రంగా, శాస్త్రీయ సోషలిజంగా, కమ్యూనిజంగా ఎదిగించడం కొరకు ఎంగెల్స్‌తో కలిసి మార్క్స్ చేసిన కృషి అపారమైనది. జీవుల చెమటనూ, రక్తాన్నీ పీల్చుకొని కొండలా పెరుగుతున్న పెట్టుబడిదారీ విధానంతో వాళ్లు చేసిన పోరాటం అపూర్వమైనది.

ట్రియర్ జిమ్నాసియంను వదిలిపెట్టిన తరువాత ఉన్నత విద్యలో న్యాయశాస్త్రాన్ని అభ్యసించడం కొరకు మార్క్స్ 1835 అక్టోబరులో బాన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. కాని ఒక సంవత్సరం తరువాత, స్వయంగా న్యాయవాది అయిన తండ్రి సలహా మేరకు, 1836 అక్టోబరులో బెర్లిన్ విశ్వవిద్యాలయానికి మారాడు. బెర్లిన్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రాన్ని బోధించడానికి మంచి అధ్యాపకులు ఉంటారనేది తండ్రి సలహా.

బెర్లిన్ ప్రష్యన్ సామ్రాజ్యపు రాజధాని నగరం. రాచరికపు అధికారాలన్నింటిని హస్తగతం చేసుకొన్న మిడిసిపాటు ఒకవైపు, పెట్టుబడిదారుల మధ్య రాజకీయ విభేదాలు మరొక వైపు, ఈ ఇరువర్గాల కారణంగా పేదరికంలో మగ్గిపోతున్న అశేష ప్రజానీకం ఇంకొకవైపు – సమాజంలోని వైరుధ్యాలన్నింటిని మార్క్స్ అత్యంత సన్నిహితంగా పరిశీలించాడు.

మార్క్స్ చదివేది న్యాయశాస్త్రమే అయినా, ఆయన అభిరుచులు వైవిధ్యపూరితమైనవి. అనేక పుస్తకాలను కొనడం, చదవడం ప్రారంభించాడు. ముఖ్యంగా చరిత్ర పఠనం మీద ఆయనకు ఆసక్తి. గ్రీకు, రోమన్ పురాణాల మీద కూడా ఆసక్తి. ఆయనలో ప్రవేశించిన ఆధునిక, తిరుగుబాటు భావజాలం, ఆ భావజాలంతో ఒకవైపు చరిత్రను, మరొకవైపు పురాణాలను చదవడం ద్వారా ముప్పిరిగొన్న భావాలు, కంటి ముందు కనిపిస్తున్న బెర్లిన్ సమాజంలోని వైరుధ్యాలు – ఇవన్నీ కలిసి ఆయన చేత కవిత్వాన్ని పలికించాయి. ఈ కవిత్వంలో తిరుగుబాటు మనస్తత్వం కనిపించేది. విప్లవ కాల్పనికత కనిపించేది. అయినా ఆయనకు సంతృప్తి కలిగేది కాదు. సమాజంలోని పరిస్థితుల పట్ల అసంతృప్తి. ఆ పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలనే ఆరాటం. ఏం చేయాలో స్పష్టంగా తెలియని స్థితి. నలుగురు నడిచిన బాటలో నడవవద్దన్న ఒక పట్టుదల. ఉన్న జీవితంతో సంతృప్తి చెందని ఒక తపన. ఆదర్శాలను నింపుకొన్న ఒక యువకుని హృదయంలో ఘర్షణ పడుతున్న భావాలు ఇవి. ఈ ఘర్షణతోనే ఒక నాటకాన్ని రాయడానికి ప్రయత్నించాడు. అది అసంపూర్తిగా ఉండిపోయింది. ఒక నవలనూ రాయడానికి ప్రయత్నించాడు. అది కూడా అసంపూర్తిగానే మిగిలిపోయింది.

మతం మనిషికి నైతిక విలువలను ఇస్తుందా అనే ప్రశ్న మార్క్స్‌ను వేదించేది. జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు మతం యొక్క అవసరం ఏర్పడుతుందని తండ్రి చెప్పేవాడు. న్యూటన్‌ను, ఇతరులను ఉదహరించేవాడు. వీటిని మార్క్స్ అంగీకరించేవాడు కాదు.

ఇంత అసంతృప్తి మధ్య, ఇన్ని యవ్వనోద్రేక వ్యాపకాల మధ్య బెర్లిన్ విశ్వవిద్యాలయంలో మార్క్స్ చదువు సీరియస్‌గానే కొనసాగింది. ఆయన బెర్లిన్‌లో న్యాయశాస్త్రాన్నేకాదు, బెర్లిన్ సమాజాన్నే కాదు, యూరప్ చరిత్రనే కాదు, గ్రీకు రోమన్ పురాణాలనే కాదు, కళలనూ అధ్యయనం చేసాడు, విదేశీ భాషలను నేర్చుకున్నాడు. తత్వ శాస్త్రం మీద దృష్టి నిలిపాడు.

కాని ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఆయన చదివిన తత్వశాస్త్ర గ్రంథాలు ఆయనకు అస్పష్టమైన దారినే చూపాయి. ఆ తత్వశాస్త్ర గ్రంథాలు వాస్తవికతకు దూరంగా ఉన్నట్లు అనిపించేవి. వాటిపట్ల తరచుగా అసంతృప్తిని వ్యక్తం చేసేవాడు. తనదైన ఒక తాత్విక దృక్పథాన్ని ఏర్పరచుకోవడానికి ప్రయత్నించేవాడు. జీవితాన్ని, దానిలో కనిపిస్తున్న సంక్లిష్టతలతో సహా, అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేవాడు.

ఈ అన్వేషణ ఒక పట్టాన ముగిసేది కాదు. తన అన్వేషణ అలవోకగా ముందుకు సాగేది కాదు. అది సాధారణ అన్వేషణ కాదు. అది ఒక సైద్ధాంతిక అన్వేషణ. తన అన్వేషణకు, తన నిర్ధారణలకు మార్క్స్ ఉన్నత ప్రమాణాలను పెట్టుకొన్నాడు. ఒక సారి తాను చేసుకొన్న నిర్ధారణలనే తాను మళ్లీ విమర్శనాత్మక దృక్పథంతో పరిశీలించేవాడు. తన పరిశీలనకు నిలవని నిర్ధారణలను విడిచిపెట్టేవాడు. అదొక కఠోరమైన అన్వేషణ. అందుకోసం ఆయన కఠోరమైన శ్రమనే చేసాడు.

చివరకు ఈ అన్వేషణ ఒక ముగింపుకు వచ్చింది. ప్రపంచాన్ని చూడడానికి, వివరించడానికి భావవాదదృక్పథం పనికి రాదని ఆయన తేల్చుకున్నాడు. ప్రపంచాన్ని ఒక మొత్తంగా దాని అభివృద్ధి క్రమంలో భౌతికవాద దృక్పథంతో చూడాలని తేల్చుకున్నాడు.

బాన్ విశ్వవిద్యాలయం నండి బయటకు వచ్చి బెర్లిన్ విశ్వవిద్యాలయంలో చేరడానికి ముందు మార్క్స్ 1836 లో వేసవి సెలవుల్లో ట్రియర్‌లో ఇంటివద్ద కొద్ది రోజులు గడిపాడు. ఆ సమయంలోనే ఆయనకు జెన్నీతో పరిచయం ఏర్పడింది. అది క్రమంగా ఇరువురి మధ్య ప్రేమగా మారింది. ఆ ఇద్దరి కుటుంబాల మధ్య అప్పటికే సంబంధాలు కొనసాగుతున్నాయి. మార్క్స్ జెన్నీని బాగా ప్రేమించాడు. ఆయన బెర్లిన్‌లో ఉండగా రాసిన కవిత్వంలో ప్రేమ కవిత్వం కూడా ఉంది.

జెన్నీది కులీన కుటుంబం. మార్క్స్ కుటుంబంతో పోలిస్తే కొంత సంపన్న కుటుంబం కూడా. మార్క్స్‌లో ఒక ప్రత్యేక వక్తిత్వాన్ని, ఒక ప్రతిభను చూసిన జెన్నీ మార్క్స్ కొరకు తనకున్న అన్నింటిని వదులుకోవడానికి సిద్ధపడింది. అయితే వాళ్లిద్దరు తమ ప్రేమను రహస్యంగానే ఉంచారు, పెద్దవాళ్లు ఒప్పుకోరనే అనుమానంతో. తాను ప్రేమించిన మార్క్స్‌ను పెళ్లి చేసుకోవడానికి జెన్నీ తన బంధువులను ఒప్పించవలసి వచ్చింది. చివరకు ఏడేళ్ల తరువాత, 1843 జూన్ 19వ తేదీన, మార్క్స్ జెన్నీల వివాహం రిజిస్టరయింది. ప్రేమ నిండిన వారి దాంపత్యం పేదరికంలో కష్టాలతో, కన్నీళ్లతో గడిచింది. అయినా ఒకరి కోసం ఒకరు జీవిత కాలమంతా నిలబడ్డారు.

మార్క్స్ తన ఆలోచనలను జెన్నీతో పంచుకొనేవాడు. ఆయన రచనలకు ఆమె మొదటి పాఠకురాలు, మొదటి విమర్శకురాలు. సాహిత్యాభిరుచి కూడా ఉన్న ఆమె అభిప్రాయాలను మార్క్స్ గౌరవించేవాడు.

ప్రముఖ జర్మన్ భావవాద తత్వవేత్త హెగెల్ భావవాద గతితర్కాన్ని చెప్పాడని, ఆ భావవాద గతితర్కాన్ని భౌతిక వాద గతితర్కంగా మార్క్స్, తలకిందులుగా ఉన్న ఆ సిద్ధాంతాన్ని సరిచేసాడని మనం చెప్పుకొంటాం. బెర్లిన్ విశ్వవిద్యాలయంలో చదువుకొంటున్నప్పుడే హెగెల్ తత్వశాస్త్రాన్ని మార్క్స్ 1837లో శ్రద్ధగా అధ్యయనం చేసాడు. ఆ తరువాత 1839లో మొత్తం తత్వశాస్త్రం ఎదుగుతూ వచ్చిన క్రమాన్ని, దాని చరిత్రను, చదివాడు. ఏ విషయాన్ని అధ్యయనం చేసినా దాని మూలంలోకి, దాని చరిత్రలోకి వెళ్లడం మార్క్స్‌కు ఉన్న అలవాటు. ఈ తత్వశాస్త్ర అధ్యయనం ఆయన తన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్ని రాయడానికి పనికివచ్చింది. డెమోక్రిటస్, ఎపిక్యూరస్ ప్రకృతి తత్వశాస్త్ర సిద్ధాంతాల మధ్య విభేదం మీద ఆయన 1841లో తన సిద్ధాంత గ్రంథాన్ని రాసాడు. ఆ తదనంతర

కాలంలో మార్క్సిస్టు సిద్ధాంతం రూపొందడంలో ఈ పిఎచ్.డి. సిద్ధాంత గ్రంథం ఒక మెట్టులాంటిది.

మార్క్స్ జెన్నీల వివాహం జరిగిన తరువాత, 1843 అక్టోబరు నుండి వాళ్లిద్దరు పారిస్‌లో ఉండడం మొదలైన తరువాత, ఫ్రాన్స్‌లో జరిగిన బౌద్ధిక అభివృద్ధి, సాంస్కృతిక అభివృద్ధి ఆయనను బాగా ప్రభావితం చేసాయి. ఒక విప్లవోద్యమ కేంద్రంగా పారిస్ మార్క్స్‌ను విప్లవకమ్యూనిస్టుగా మార్చింది.

మార్క్స్ జీవితంలో ప్రతికారచన ఒక గుర్తించదగిన భాగం. మార్క్స్ తన జీవిత కాలంలో స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే ఉద్యోగం ఏదీ చేయలేదు. అందువలన పత్రికా రచన ఆయనకు ఒక ఆదాయ మార్గంగా ఉండిపోయింది. అయితే అది నిరంతరాయంగా మాత్రం కాదు. ఇప్పుడు కొంతకాలం, అప్పుడు కొంత కాలంగా మాత్రమే.

ఆయన తన పత్రికా రచనలో ఎప్పుడైనా సరే అభివృద్ధి నిరోధక భావజాలాన్ని ఖండించడం, విప్లవ భావజాలాన్ని ఎత్తిపట్టడం, పీడిత ప్రజల జీవన స్థితిగతులను వర్ణించడం, అందుకు కారణమైన పాలకుల, సంపన్నుల దోపిడీ అణచివేత విధానాలను ఎండగట్టడం ప్రధానంగా ఉండేవి. పత్రికా రచనలో ఆయన తన భావాలతో, అభిప్రాయాలతో ఎప్పుడూ రాజీపడలేదు. 1850లలో ఆయన న్యూయార్క్ డెయిలీ ట్రిబ్యూన్‌కు లండన్ కరస్పాండెంట్‌గా ఉన్నప్పుడు జర్మన్ తత్వశాస్త్రం మీద అమెరికన్ పాఠకుల మత భావాలను నొప్పించకుండా వ్యాసాలు రాయమని సంపాదకులు మార్క్స్‌ను అడిగితే ఆయన అందుకు అంగీకరించలేదు. ట్రిబ్యూన్ పత్రికలో మార్క్స్ వ్యాసాలకు మంచి ఆదరణ ఉండేది. ఆయన పత్రికలకు కూడా ఏ వ్యాసాన్నీ అలవోకగా రాయలేదు. తాను రాస్తున్న అంశం మీద పూర్తి సమాచారంతో మాత్రమే రాసేవాడు. ఒక్కొక్కసారి మార్క్స్ వ్యాసాలు సంపాదకులకు నచ్చేవి కావు. సంపాదకులు తమకు ఇష్టం లేకనో, పాఠకులు నచ్చరనో కొన్నివ్యాసాలను ప్రచురించేవారు కాదు.

ఈ రకమైన పత్రికారచన కత్తిమీద సామువంటిది. మార్క్స్ వ్యాసాల కారణంగా పత్రికల మీద పోలీసుల నిఘా పెరగడం, పత్రికలు నిషేధానికి గురికావడం, చివరకు తానే స్వయంగా బహిష్కరణకు గురికావడం జరిగేవి. మార్క్స్ వ్యాసాలను ప్రచురిస్తున్న ఒక జర్మన్ పత్రిక 1843లో ప్రష్యన్ ప్రభుత్వపు నిషేధానికి గురయింది. మార్క్స్ ఆ పత్రికలోని తన వ్యాసాల్లో జర్మనీలో ప్రజలను అణచివేస్తున్న సామాజిక రాజకీయ వ్యవస్థ మీద, ఆ వ్యవస్థను సమర్థిస్తున్న అభివృద్ధి నిరోధక తత్వవేత్తలమీద, చరిత్ర కారుల మీద విరుచుకుపడేవారు. మార్క్స్ పారిస్‌లో ఉండి ఒక పత్రికకు వ్యాసాలు రాస్తున్న క్రమంలో, ప్రష్యన్ ప్రభుత్వపు ఒత్తిడికి లొంగిపోయి, ఫ్రెంచ్ ప్రభుత్వం మార్క్స్‌ను, మరికొందరు పత్రికారచయితలను పారిస్‌నుండి బహిష్కరించింది. ఈ బహిష్కరణలకు వ్యతిరేకంగా వచ్చిన నిరసనలు, ఒత్తిడుల కారణంగా ఇతర పత్రికా రచయితలకు కొంత సడలింపును ఇచ్చిన ఫ్రెంచ్ ప్రభుత్వం మార్క్స్‌కు ఎలాంటి సడలింపును ఇవ్వలేదు. 1845 ఫిబ్రవరిలో మార్క్స్ పారిస్‌ను వదిలిపెట్టి బ్రసెల్స్‌కు పోవలసి వచ్చింది. బెర్లిన్‌లో ఉన్నప్పుడు తన విప్లవ భావాలను ప్రచారం చేయడం మీద ఆంక్షలు రావడాన్ని, పని చేయలేని స్థితిని చూచిన తరువాత మార్క్స్ తానే ప్రష్యాను వదిలిపెట్టాలని నిర్ణయించుకొని పారిస్‌కు వచ్చాడు. ప్రష్యన్ ప్రభుత్వపు ఒత్తిడితో పారిస్ నుండి బహిష్కరణకు గురయ్యాడు. అక్కడ నుండి బ్రసెల్స్ (బెల్జియం)కు వెళ్లి, ప్రవాసంలో ఉంటున్న మార్క్స్‌ను ప్రష్యన్ ప్రభుత్వం వేటాడుతూనే వచ్చింది. చివరకు ప్రష్యన్ ప్రభుత్వపు ఒత్తిడిని వదిలించుకోవడానికి ఆయన తన ప్రష్యన్ పౌరసత్వాన్ని 1845 డిసెంబరులో వదులుకొన్నాడు. చివరకు ఆయన 26.8.1849 నాడు ప్రవాస జీవితాన్ని గడపడానికి లండన్‌కు చేరుకున్నాడు. ఇక జీవితాంతం వరకు అక్కడే ఉండిపోయాడు.

మార్క్స్ ట్రిబ్యూన్‌కు వ్యాసాలు రాయడం 1851 ఆగస్టులో ప్రారంభించాడు. దాదాపు ఒక దశాబ్దం పాటు ఇది కొనసాగింది. ట్రిబ్యూన్ పత్రిక మంచి సర్క్యులేషన్ కలిగిన, పేరున్న పత్రిక కాబట్టి మార్క్స్ తన వ్యాసాలను తన భావజాల ప్రచారం కొరకు ఉద్దేశించాడు. ఈ కాలంలో ఆయన యూరోపియన్ దేశాల మీద, అమెరికా మీద మాత్రమే కాకుండా, అనేక ఆసియా దేశాల మీద కూడా వ్యాసాలు రాసాడు. భారతదేశంలో కొనసాగుతున్న బ్రిటిష్ వలసపాలన మీద, భారతదేశంలోని అంతర్గత పరిస్థితుల మీద, దేశంలో జరుగుతున్న పోరాటాల మీద వ్యాసాలు రాసాడు. వివిధ భాషలు, జాతులు, రాజ్యాలు, సంస్థానాల కింద విడిపోయి ఉన్న దేశంలో ఒక జాతీయ చైతన్యం రూపొందే క్రమాన్ని, అందుకుగల కారణాలను ఆయన విశ్లేషించాడు. 1857-1859 కాలంలో బ్రిటిష్ వలస పాలన మీద జరిగిన తిరుగుబాటును సిపాయిల తిరుగుబాటుగా పేర్కొని, ఆ పోరాటానికి ఉన్న ప్రాధాన్యాన్ని తగ్గించాలని వలస పాలకులు ప్రయత్నించినపుడు, అది ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం అని పేర్కొన్నది మార్క్స్.

మార్క్స్, ఎంగెల్స్‌ల స్నేహబంధం చాలా అపూర్వమైనది, విశిష్టమైనది. లోకకళ్యాణం కొరకు ఏర్పడిన స్నేహబంధంగా అది చరిత్రలో నిలిచిపోయింది.

ఎంగెల్స్ కూడా మార్క్స్ వలెనే ప్రష్యాలో రైన్ నదీ ప్రాంతంలో బార్మెన్‌లో 28.11.1820 నాడు జన్మించాడు. మార్క్స్ కంటే సుమారు రెండున్నర సంవత్సరాలు చిన్నవాడు. తండ్రి ఒక వస్త్ర పరిశ్రమ యజమాని. సంకుచిత భావాలు కలిగినవాడు. తన భావాలకు అనుగుణంగా తన పిల్లలను ఆయన కఠినమైన క్రమశిక్షణతోనే పెంచాడు. ఎంగెల్స్‌ను పాఠశాల విద్యను కూడా పూర్తి చేయనివ్వలేదు. తనతో పాటు వ్యాపారంలోకి దించాడు.

తండ్రి చెప్పిన విధంగా క్లర్క్‌గా పనిచేస్తూనే ఎంగెల్స్ చరిత్రను, తత్వశాస్త్రాన్ని, సాహిత్యాన్ని, భాషా శాస్త్రాన్ని, విదేశీ భాషలను అధ్యయనం చేసాడు. ఈ క్రమంలో తండ్రి నుండి సంక్రమించిన మత భావాలను విడిచిపెట్టాడు. 1841 సెప్టెంబర్ నుండి 1842 ఆగస్టు వరకు బెర్లిన్‌లో మిలటరీ సర్వీసు చేసి, తండ్రి భాగస్వామిగా ఉన్న ఒక కంపెనీలో పని చేయడానికి మాంచెస్టర్‌కు వెళ్లిన తరువాత ఎంగెల్స్ క్రమంగా ఒక గతితార్కిక భౌతిక వాదిగా, ఒక గొప్ప గతితార్కిక తత్వవేత్తగా రూపొందాడు.

ఎంగెల్స్ 1844 ఆగస్టులో ఇంగ్లాండు నుండి జర్మనీకి పోయేటపుడు పారిస్‌లో ఉన్న మార్క్స్ దగ్గరకు వచ్చాడు. మార్క్స్ ఎంగెల్స్‌లు పదిరోజులు కలిసి ఉన్నారు. తమ భావాలను, ఆలోచనలను పరస్పరం కలబోసుకున్నారు. ఇద్దరూ ఒకే రకంగా ఆలోచిస్తున్నట్లుగా అర్థం చేసుకున్నారు. కలిసి పని చేద్దామని నిర్ణయించుకున్నారు. ఇక అప్పటి నుండి వాళ్లిద్దరు ఒక వస్తువు కున్న రెండు పార్శ్వాలుగా మారిపోయారు. ఇద్దరి జీవితాలు అంతమయ్యేటంత వరకు ఈ స్నేహబంధం, ఈ భావ బంధం విడిపోలేదు. వాళ్లు కలిసి పత్రికా రచనలు చేసారు. కలిసి పుస్తకాలు రాసారు. ఒకరి రచనలను ఒకరు ఎడిట్ చేసారు. తత్వశాస్త్రంలో రాజకీయార్థశాస్త్రంలో కలిసి వాదసంవాదాలను కొనసాగించారు. కార్మికోద్యమాలకు, విప్లవ పోరాటాలకు కలిసి నాయత్వం వహించారు. మార్క్స్ తన ప్రవాస జీవితంతో, ఉద్యోగమే లేని అస్థిర సంపాదనతో, కుటుంబ పోషణే కష్టంగా మారిన కడు పేదరికంతో కష్టాల్లో, కన్నీళ్లలో ఉన్నపుడు ఎల్లవేళలా ఎంగెల్స్ ఆయనకు అండగా నిలబడ్డాడు. మార్క్స్ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని చేయడం కోసమేనా అన్నట్లుగా ఎంగెల్స్ ఉద్యోగం చేస్తూ వచ్చాడు.

ఎవరి విశిష్టత వారిదే. కాని ఇద్దరూ కలిసి మొదట యూరప్‌ను, తరువాత మొత్తం ప్రపంచాన్ని ఆవహించిన కమ్యూనిస్టు భూతమయ్యారు.

మార్క్స్ పారిస్‌లో ఉన్న కాలంలో రాజకీయార్థ శాస్త్రాన్ని, ఫ్రాన్స్ చరిత్రను, ఫ్రెంచ్ సోషలిజాన్ని అధ్యయనం చేసి, 1844 ఏప్రిల్–ఆగస్టు మధ్య కాలంలో 'ఎకనమిక్ అండ్ ఫిలసఫికల్ మాన్యుస్క్రిప్ట్స్' ను రాసాడు. గతితార్కిక చారిత్రక భౌతిక వాదానికి సంబంధించి మార్క్స్‌లో రూపొందుతున్న సైద్ధాంతిక భావనకు చెందిన ఒక దశను మనం ఈ రచనల్లో చూడవచ్చును. భౌతికవాద గతితర్క సిద్ధాంతానికి సంబంధించి కూడా ఆయన చేస్తున్న కృషిని మనం ఇందులో చూడవచ్చును.

హెగెల్ భావవాద గతితార్కాన్ని మోస్తున్న యంగ్ హెగెలియన్లను విమర్శించడం కొరకు మార్క్స్ 1845 ఫిబ్రవరిలో 'ది హెూలీ ఫ్యామిలీ'ని రాసాడు. వైరుధ్యాల ఐక్యతలోని గతితర్కాన్ని ఆయన ఇందులో వివరించారు. ప్రజలు చరిత్ర నిర్మాతలు అనే భావనను, ఆ చరిత్ర నిర్మాణంలో కార్మికవర్గం విప్లవకరపాత్రను పోషిస్తుందనే విషయాన్ని మార్క్స్ ఈ గ్రంథంలో చెప్పాడు.

పారిస్ నుండి బహిష్కరణకు గురైన తరువాత సుమారు మూడేళ్ల పాటు బ్రసెల్స్ (బెల్జియం)లో ప్రవాస జీవితాన్ని గడిపిన కాలంలో, 1845 ఫిబ్రవరి 1846 ఆగస్టు మధ్యకాలంలో, మార్క్స్ ఎంగెల్స్‌తో కలిసి 'థీసిస్ అన్ ఫ్యూయర్‌బా', 'ది జర్మన్ ఐడియాలజీ' అనే పుస్తకాలను రాసాడు.

పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థిస్తూ ప్రొధాన్ రాసిన 'ది ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ'ని ఖండించడం కొరకు మార్క్స్ 1847 ఏప్రిల్‌లో 'ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ'ని రాసాడు. ఈ రచనలో అదనపు విలువ సిద్ధాంతానికి సంబంధించి మార్క్స్ చేసిన తొలి ఆలోచనలు కనిపిస్తాయి.

ట్రియర్ జిమ్నాసియంలో ఉన్నప్పుడు రాసిన వ్యాసంలో మానవ జాతికి మేలుచేసే వృత్తిని ఎంచుకోవాలని మార్క్స్ పేర్కొన్నాడు. ఆయన తన జీవితకాలమంతా దీనికి కట్టుబడి ఉన్నాడు. పత్రికలకు రాసే వ్యాసాలకు వచ్చే పారితోషం, పుస్తకాలు అచ్చయితే పబ్లిషర్లు ఇచ్చే రాయల్టీ తప్ప మార్క్స్‌కు ఆదాయం లేదు. చాలా సందర్భాల్లో ఆ రాయల్టీ కూడ సరిగా వచ్చేది కాదు. దీని ఫలితంగా ఆయన జెన్నీ, వాళ్ల పిల్లలు చాలా పేదరికంలో జీవించవలసి వచ్చింది. మార్క్స్ కొరకు ఎంగెల్స్ ఉద్యోగం చేసి డబ్బు పంపిన కాలం ఉంది. మార్క్స్ కూతుళ్లు, పెద్దవాళ్లు అయిన తరువాత ఒక కూతురు జెన్నీ ప్రైవేటు క్లాసులు చెప్పి, మరో కూతురు ఎలియనార్ టీచర్‌గా పనిచేసి కుటుంబానికి ఆర్థికంగా సహాయపడ్డారు. ఇంకా ఎంతో మంది ఎన్నో సందర్భాల్లో ఆర్థికంగా సహాయపడ్డారు. అయినా అనేక క్లిష్టమైన పరిస్థితులను మార్క్స్ ఎదుర్కొన్నాడు.

మార్క్స్ పారిస్ నుండి మొదటిసారి బహిష్కరింపబడి బ్రసెల్స్‌కు పోయినప్పుడు తనతో పాటు తన భార్యను, కూతురును తీసుకొని పోవడానికి ప్రయాణ ఖర్చులకు అవసరమైన డబ్బు లేకపోతే ఇంట్లో ఉన్న ఫర్నీచర్‌ను అమ్మవలసి వచ్చింది. పారిస్ నుండి రెండవసారి బహిష్కరణకు గురై లండన్‌కు పోయినపుడు డబ్బులేని స్థితే. పైగా 24 గంటలలో మార్క్స్ జెన్నీలు పారిస్‌ను విడిచిపెట్టి పోవాలని పోలీసుల ఆదేశం. అప్పుడు జెన్నీ గర్భవతి. మార్క్స్ వెంటనే లండన్‌కు పోయాడు. మరికొద్ది రోజులు పారిస్‌లో ఉండడానికి జెన్నీ పోలీసుల అనుమతిని తీసుకున్నది. మార్క్స్ చాలా కష్టం మీద జెన్నీని, తమ ముగ్గురు కూతుళ్లను లండన్‌కు రప్పించుకున్నాడు. లండన్‌లో 1852 జనవరిలో మార్క్స్ అనారోగ్యంతో ఉన్నాడు. చేతిలో డబ్బు లేదు. చివరకు కోటుతో సహా తన దుస్తులను కూడా కుదువపెట్ట వలసి వచ్చింది. కోటు లేకపోవడంతో మార్క్స్ బ్రిటిష్ మ్యూజియం లైబ్రరీకి కూడా వెళ్ళలేకపోయాడు. చదవడానికి న్యూస్ పేపర్లు, రాసుకోవడానికి కాగితాలు, వేసుకోవడానికి మందులు కూడా లేని స్థితి. లండన్‌లో తాము ఉంటున్న ఇంటికి ఒకసారి కిరాయి కట్టలేకపోయాడు. ఇంటి యజమాని మనుషులు వచ్చి పడుకునే మంచాలను, కట్టుకునే బట్టలను, పిల్లలు ఊగే ఊయలను, ఆడుకునే ఆట వస్తువులను జప్తు చేసారు. మార్క్స్ తన స్నేహితుల వద్ద కొంత డబ్బు తెచ్చి కిరాయి కట్టాడు. కొన్ని వస్తువులను అమ్మి మందుల షాపులో, బేకరీలో బాకీలను కట్టాడు.

మార్క్స్ జెన్నీలకు ఏడుగురు సంతానం. కాని చివరకు ముగ్గురు కూతుళ్ళే మిగిలారు. ఒక సంవత్సరం వయసులో న్యూమోనియాతో ఒకరు చనిపోయారు. పద్దెనిమిది నెలల వయస్సులో మరొకరు చనిపోయారు. ఒకరు పుట్టీ పుట్టడంతోనే చనిపోయారు. ఇంట్లో అందరూ ప్రేమగా చూసుకొనే ఎనిమిదేళ్ళ కొడుకు ఎడ్గార్ చనిపోవడం పెద్ద దెబ్బే అయింది. అంత్యక్రియల ఖర్చులకు కూడా ఎవరో సహాయం చేయవలసి వచ్చింది.

అయితే ఈ పేదరికం, కష్టాళ్లూ, కన్నీళ్లూ ఏవీ మార్క్స్‌ను ఆయన ఎంచుకున్న మార్గం నుండి తప్పించలేకపోయాయి.

1847లో ఫ్రాన్స్, జర్మనీ, బెల్జియం, ఇంగ్లాండు, తదితర యూరోపియన్ దేశాల్లోనూ, అమెరికాలోనూ ఆర్థిక సంక్షోభం తలెత్తింది. పంటలు సరిగా పండకపోవడంతో ప్రజలు ఆకలిదాడులకు పూనుకొన్నారు. ప్రష్యాలో అధికారంలో ఉన్న రాచరిక వ్యవస్థకు, పెట్టుబడిదారీ శక్తులకు మధ్య ఘర్షణ జరిగింది. అనేక దేశాల్లో పెట్టుబడిదారీ భావజాల చైతన్యంతో జాతి విముక్తి పోరాటాలు ముందుకు వచ్చాయి. అనేక దేశాల్లో విప్లవాలు ఒకేసారి రావచ్చుననే ఉద్దేశంతో మార్క్స్ ఎంగెల్స్‌లు ఒక అంతర్జాతీయ కార్మికవర్గ పార్టీని స్థాపించడానికి ప్రయత్నించారు. కమ్యూనిస్టు భావజాల ప్రచారం కొరకు ఒక ప్రచార కమిటీ, బ్రసెల్స్ కమ్యూనిస్టు ప్రచార కమిటీ, ఏర్పడింది.

1848 ఫిబ్రవరిలో ఫ్రాన్స్ ప్రజలు తిరుగుబాటు చేసి, లూయి ఫిలిప్‌ను అధికారం నుండి తొలగించి, ఒక రిపబ్లిక్‌ను స్థాపించుకొన్నారు. మార్చిలో ఒకవైపు వియన్నా (ఆస్ట్రియా) లో, మరొకవైపు బెర్లిన్ (ప్రష్యా)లో తిరుగుబాట్లు వచ్చాయి. ఈ తిరుగుబాటును సంతృప్తి పరచడం కొరకు ఆస్ట్రియా రాజు ఒక రాజ్యాంగాన్ని వాగ్దానం చేసాడు. ప్రష్యాలో భూస్వామ్య రాచరిక ప్రభుత్వాన్ని తొలగించి ఒక బూర్జువా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ తిరుగుబాబాట్లు విజయవంతం కావడానికి మార్క్స్ తన మేధోశక్తిని, పోరాట శక్తిని ధారపోసాడు.

అయితే కొద్దికాలంలోనే ఈ విప్లవాలన్నీ అణచివేతకు గురయ్యాయి. అయితే ఇవి ఆయా దేశాల్లోని భూస్వామ్య రాచరిక పునాదులను కదిలించాయి. పెట్టుబడిదారీ శక్తులు అధికారంలోకి రావడానికి, అవి అధికారంలో నిలదొక్కుకోవడానికి పనికి వచ్చాయి. మరొక వైపు ఇవి కార్మికవర్గ చైతన్యాన్ని పెంచడానికి ఉపయోగపడ్డాయి.

1848 విప్లవాల కంటే ముందు కాలం నుండే మార్క్స్ ఎంగెల్స్‌లకు ఒక కార్మికవర్గ అంతర్జాతీయ పార్టీని ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉంది. 1846 చివరి నాటికి 'లీగ్ ఆఫ్ జస్ట్' అనే సంస్థ ఒకటి ఉండేది. పారిస్‌కు చెందిన, లండన్‌కు చెందిన కొంతమంది ఊహాజనిత సోషలిస్టులు ఏర్పాటుచేసిన సంస్థ అది. ఆనాటి కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలకు ఈ ఊహాజనిత సోషలిజం పరిష్కారాలను చూపలేకపోతున్నదనే విషయాన్ని లీగ్ ఆఫ్ జస్ట్ సభ్యులు గమనించిన తరువాత, అప్పటికే కార్మికవర్గ ఉద్యమాల్లో పాల్గొంటూ భావవాదులతో, అధి భౌతిక వాదులతో, ఊహాజనిత సోషలిస్టులతో తలపడుతున్న మార్క్స్ ఎంగెల్స్‌లను తమ సంస్థలో చేరమని ఆహ్వానించారు. మొదట అందుకు నిరాకరించిన మార్క్స్ ఎంగెల్స్‌లు సంస్థ యొక్క సైద్ధాంతిక అవగాహనను మార్చడానికి సభ్యులు అంగీకరించిన తరువాత మాత్రమే అందులో

చేరారు. తమ అనుయాయులను చేరమని అడిగారు. చురుకుగా పనిచేయమని చెప్పారు.

లీగ్ ఆఫ్ జస్ట్‌లో చేరిన మార్క్స్ ఆ సంస్థ యొక్క స్వరూప స్వభావాలను మార్చి వేసాడు. 1847 జూన్ 2వ తేదీ నుండి 9వ తేదీ వరకు ఆ సంస్థ మహాసభలు లండన్‌లో జరిగాయి. ఆ మహాసభలకు మార్క్స్ వెళ్ళలేకపోయాడు. కాని ఆ మహాసభల నిర్వహణకు మార్గదర్శకత్వం వహించాడు. ఎంగెల్స్ పాల్గొన్న ఆ మహాసభల్లో 'లీగ్ ఆఫ్ జస్ట్' 'కమ్యూనిస్టు లీగ్' గా మారిపోయింది. 'మనుషులందరు సోదరులు' అనే నినాదం 'అన్ని దేశాల కార్మికులారా ఏకం కండి' అని మారింది. ఆ విధంగా మార్క్స్ కృషి ఫలితంగా కార్మికవర్గానికి మొదటిసారిగా ఒక అంతర్జాతీయ సంస్థ ఏర్పడింది. శాస్త్రీయ కమ్యూనిజాన్ని సాధించడం తన లక్ష్యమని ప్రకటించింది. 1848 విప్లవాల్లో కమ్యూనిస్టు లీగ్ చురుకైన పాత్రను పోషించింది. అయితే వివిధ దేశాల్లో విప్లవాలను అణచివేసిన పాలకవర్గాలు ఎంతో మంది చురుకైన కార్యకర్తలను అరెస్టు చేసి, కొలోన్ కుట్ర కేసు వంటి కేసులను పెట్టాయి. లీగ్ కార్యకలాపాలు మందగించాయి. ఇక కమ్యూనిస్టు లీగ్ యొక్క అవసరం ఇప్పుడు లేదని భావించి, దాని లండన్ యూనిట్‌ను 17.11.1852లో రద్దుచేసారు.

1847 జూన్‌లో కమ్యూనిస్టు లీగ్ ఏర్పడిన తరువాత మార్క్స్ ఎంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళికను రచించే పనిలో పడ్డారు. అంతకు ముందు ఎంగెల్స్ రాసిన 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ కమ్యూనిజం' 'కమ్యూనిస్టు ప్రణాళిక'ను రచించడానికి కొంత ఆధారమయింది.'కమ్యూనిస్టు ప్రణాళిక' మార్క్స్ ఎంగెల్స్‌ల సంయుక్త రచనే అయినప్పటికి, దాన్ని మెరుగుపరచడంలో, దానికి తుది రూపాన్ని ఇవ్వడంలో, అందులో చెప్పబడిన విషయాలకు సాహిత్య శైలిని సమకూర్చడంలో మార్క్స్ పాత్ర ఉంది. 'యూరప్‌ను ఒక భూతం ఆవహించింది, కమ్యూనిస్టు భూతం' అని ప్రారంభమైన ఆ రచన 'సకల దేశ శ్రామికులారా ఏకం కండు' అనే నినాదాన్ని ఇస్తూ, 'కమ్యూనిస్టు విప్లవమంటే పాలకవర్గాలు భయంతో గజగజ వణకనీ. శ్రామికులకు పోయేదేమీ లేదు, వాళ్ళ సంకెళ్ళు తప్ప. వాళ్ళు గెలుచుకోవడానికి మొత్తం ప్రపంచమే ఉంది' అని ముగుస్తుంది.

'కమ్యూనిస్టు ప్రణాళిక' లో మార్క్సిజం మౌలిక సూత్రాలు అన్నీ ఉన్నాయి. పెట్టుబడిదారీ విధానం పుట్టి పెరిగిన తీరు, కార్మికవర్గం చరిత్రలో నిర్వహించవలసిన పాత్ర, కార్మికవర్గ నియంతృత్వం, కార్మికవర్గ పార్టీ ఆవశ్యకత, కార్మికవర్గ అంతర్జాతీయత మొదలైన వాటిగురించి ప్రణాళిక చెప్పింది.

1848 యూరప్ విప్లవాలతో కలిసి 'కమ్యూనిస్టు ప్రణాళిక' మొదటి ప్రచురణ జర్మన్ భాషలో 1848 ఫిబ్రవరిలో వెలువడింది. 1850 నవంబర్‌లో దాని ఇంగ్లిషు అనువాదం వచ్చింది. ఆ తరువాత మరెన్నో భాషల్లో వెలువడింది.

'కమ్యూనిస్టు ప్రణాళిక' ను చదవడం మీద ఆనాటి ప్రభుత్వాలు నిర్బంధం విదించాయి. కాబట్టి దాన్ని చట్టవ్యతిరేకమైన పద్ధతుల్లోనే పంపిణీ చేయవలసి వచ్చింది.

మార్క్స్ జీవితంలో అధ్యయనం నిరంతరాయంగా జరిగే పని. అధ్యయనం లేకుండా, పరిశీలన లేకుండా ఆయన ఏ ఒక్క రచన కూడా చేసి ఉండడు. ఆయన లండన్‌లో స్థిరపడిన తరువాత 1850ల ప్రారంభం నుండి జీవితాంతం వరకు బ్రిటిష్ మ్యూజియం లైబ్రరీ ఆయన అధ్యయనానికి పట్టుగొమ్మ. ఈ లైబ్రరీని 1753లో, మార్క్స్ దాన్ని విస్తృతంగా ఉపయోగించుకోవడానికి వంద సంవత్సరాల ముందు, స్థాపించారు. ఈ లైబ్రరీలో చాలా పుస్తకాలు ఉండడం మాత్రమే కాకుండా, చాలా అరుదైన పుస్తకాలు, ఇంకెక్కడా దొరకని పుస్తకాలు ఉండేవి. కార్మికవర్గ ఉద్యమాల్లో ముమ్మరంగా, ప్రత్యక్షంగా పాల్గొన్న సమయంలో తప్పితే మార్క్స్‌కు మిగిలిన కాలమంతా అధ్యయనం,రచన, ఎంగెల్స్‌కు, ఇతర మిత్రులకు ఉత్తరాలు రాయడమే పని. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు లైబ్రరీలోని రీడింగ్ రూంలో ఆయన అధ్యయనం జరుగుతుంది. తాను చదివిన ప్రతి విషయం మీద వివరమైన నోట్స్‌ను రాసుకోవడం ఆయనకు అలవాటు. ఆయన రాసిన పుస్తకాలన్నీ, చేసిన సిద్ధాంతాలన్నీ ఆధారాలు లేకుండా ఉన్నవి కావు. తత్వశాస్త్రం, రాజకీయార్థ శాస్త్రం, ప్రకృతి శాస్త్రాలు, జీవ శాస్త్రాలు, గణితం, ఇంజనీరింగ్, సామాజిక శాస్త్రాలు, సాహిత్యం, వ్యవసాయం, చరిత్ర – ఇలా ఆయన చదవని విషయాలు లేవు. డార్విన్ పరిణామ సిద్ధాంతం కావచ్చు – మోర్గాన్ పురాతన సమాజం కావచ్చు– ఒక పరిశోధనాత్మకమైన కొత్త పుస్తకం వచ్చిందంటే – అది ఏ రంగానికి చెందిన పుస్తకమైనా కావచ్చు – మార్క్స్ దాన్ని చదవవలసిందే. తాను రూపొందిస్తున్న మార్క్సిస్టు సిద్ధాంతానికి అన్వయించవలసిందే. ఆయన అభిప్రాయాలు రాజీపడనివి. కాని ఆయన ఎప్పుడూ పిడివాది కాదు. కొత్త సమాచారం తన ముందుకు వచ్చినపుడు, కొత్త ఆవిష్కరణ తన ముందుకు వచ్చినపుడు, వాటి వెలుగులో తాను అప్పటి వరకు ఏర్పరచుకున్న ఏవైనా నిర్ధారణలను మార్చుకోవలసి వస్తే, నిస్సంకోచంగా మార్చుకొనేవాడు.

మార్క్స్ తాను చదవదలుచుకొన్న పుస్తకాలను మూల భాషల్లోకి వెళ్ళి చదవడానికి ఇష్టపడేవాడు. ఒక్కొక్కప్పుడు తనకు తెలిసిన భాషల్లో తాను చదవదలుచుకొన్న పుస్తకం ఉండకపోచ్చును. అందుకోసం ఆయన అనేక భాషలను నేర్చుకొన్నాడు. జర్మన్, ఫ్రెంచ్, ఇంగ్లిషు భాషల్లో మాట్లాడడం, రాయడం ఆయనకు సులువైన విషయం. గ్రీకు, లాటిన్ భాషల్లో ఆయనకు మంచి పరిజ్ఞానం ఉంది. ఇటాలియన్, స్పానిష్ భాషలను నేర్చుకొన్నాడు. తన జీవితపు చివరి దశలో రష్యన్ సమాజాన్ని గురించి తెలుసుకోవడానికి రష్యన్ భాషను కూడా నేర్చుకున్నాడు.

ఆయన అధ్యయనం చేసిన దేశాలు యూరప్, ఆసియా, అమెరికా, ఆఫ్రికా ఖండాలను విస్తరించి ఉన్నాయి. బ్రిటన్, జర్మనీ, ప్రష్యా, ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇండియా, చైనా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, దక్షిణాఫ్రికా, పోలండ్, బెల్జియం, హాలండ్, పోర్చుగల్, స్పెయిన్ ఇటలీ, రష్యా మొదలైన దేశాలన్నింటిని ఆయన అధ్యయనం చేశాడు. ఆయన ఒక దేశాన్ని అధ్యయనం చేయడమంటే ఆ దేశంలోని ఆర్థిక వ్యవస్థను, రాజకీయ వ్యవస్థను, పెట్టుబడిదారీ సంబంధాలను, దేశీయ విధానాన్ని, విదేశాంగ విధానాన్ని, ప్రబలమైన భావజాలాన్ని అధ్యయనం చేయడం అని అర్థం. ఆయన ఒకదేశ చరిత్రను అధ్యయనం చేయడమంటే ఆ దేశంలోని ప్రాచీన చరిత్రను, మధ్య యుగాల చరిత్రను, భూస్వామ్యయుగ చరిత్రను మొదలైన వాటి నన్నింటిని అధ్యయనం చేయడమని అర్థం. ఇంత మౌలికమైన, ఇంత విస్తారమైన అధ్యయనమే ఆయన చేత అంత శాస్త్రీయమైన సిద్ధాంతాన్ని తయారుచేయించింది. మార్క్సిజం అలవోకగా రూపొందిన సిద్ధాంతం కాదు. ప్రపంచ చరిత్ర మూలాల్లోకి వెళ్ళి, ఆ చరిత్ర గుండా నడిచివచ్చిన మానవ సమాజపు చరిత్రనంతా విశ్లేషించి, సకల శాస్త్రాల నూతన ఆవిష్కరణలన్నింటిని అన్వయించి, ఒక విషయాన్ని దాని మొత్తంలో, దాని చలనంలో తరచి తరచి చూసి, అందులో నుండి సాధారణ సూత్రీకరణలను రాబట్టి, వాటి ఆధారంగా తయారు చేయబడింది మార్క్సిజం.

ఆనాటికి లండన్ పెట్టుబడిదారీ ప్రపంచపు కేంద్ర స్థానం. లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియం లైబ్రరీ ప్రపంచ చరిత్ర నంతటిని పుస్తకాల రూపంలో ఒడిసి పట్టుకొన్న స్థానం. మార్క్స్ అద్భుతమైన మేధో సంపత్తి కలిగిన వ్యక్తి. ఈ మూడు అంశాలు ఒకచోట కలిసాయి. ఒక వస్తుగతమైన ప్రపంచ చరిత్ర నుండి, విభిన్నమైన మౌలికమైన

శాస్త్రాల్లో వచ్చిన ముఖ్యమైన కొత్త ఆవిష్కరణలన్నింటిని వస్తుగతంగా అన్వయించడం నుండి, సమాజాన్ని దాని మొత్తంలో నుండి దాని చలనంలో నుండి పరిశీలించడం ద్వారా మార్క్సిజం ఆవిర్భవించి, అభివృద్ధి చెందింది. అది మానవ సమాజం ఎదిగివచ్చిన క్రమానికి చెందిన సారభూతమైన సిద్ధాంతం. మానవ సమాజం లేకపోతే మార్క్సిజం లేదు. మానవ సమాజం ఉంటే మార్క్సిజం ఉంటుంది.

ట్రియర్ జిమ్నాసియంలో ఉన్నప్పుడు రాసిన వ్యాసంలో మానవ జాతికి సేవ చేసే వృత్తిని ఎంచుకోవాలని మార్క్స్ అన్నప్పుడే ఆయనకు శ్రమజీవుల ప్రపంచం కుటుంబంగా మారింది. ఆ శ్రమ జీవుల ప్రపంచం కోసమే ఆయన బతికాడు, చనిపోయాడు. అప్పటికి ఆయన కింకా పెట్టుబడిదారీ వ్యవస్థ ఇచ్చే వ్యక్తిగత కుటుంబం (తండ్రి కుటుంబం ఉంది కాని) లేదు.

1836లో మార్క్స్ జెన్నీలకు పరస్పరం పరిచయం ఏర్పడే నాటికి, ఆ పరిచయం ప్రేమగా మారే నాటికి మార్క్స్‌లో మానవజాతికి సేవచేసే వ్యక్తి రూపొందుతున్నాడు. జెన్నీ దాన్ని అప్పుడే పసిగట్టింది. 1843లో వాళ్ళొక కుటుంబంగా మారినప్పుడు వాళ్ళ కుటుంబం శ్రమ జీవుల ప్రపంచంలో ఒక కుటుంబంగా మారింది. మార్క్స్ శ్రమ జీవులకు చెందిన ఒక వసుధైక కుటుంబాన్ని నిర్మించాలని కలగన్నాడు. పోరాటం చేసాడు. తన సర్వస్వాన్ని అందుకోసం త్యాగం చేసాడు. ఈ పోరాట జీవనయానంలో మార్క్స్‌కు జెన్నీ ఒక సహ పథికురాలు, ఒక సహ యోధురాలు. ఈ పోరాటపథంలో ఎదురైన ముళ్లను, రాళ్లను, కష్టాలను, కడగండ్లను ఏ మాత్రమూ చలించకుండా, ఏనాడూ మరో ఆలోచనకు తావు ఇవ్వకుండా ఎదుర్కొన్నది జెన్నీ. తిండి కోసం, ఇంటి కోసం కటకటపడవలసి వచ్చినా భరించింది. అనారోగ్యంతో నెట్టుకు వచ్చింది. తల్లిగా నలుగురు పిల్లలను చిన్న వయస్సులో కోల్పోయింది. పాలకవర్గ ప్రభుత్వాలు మార్క్స్‌ను ఒక దేశం నుండి మరొక దేశానికి తరుముతుంటే వెంట నడిచింది. మార్క్స్ జెన్నీలది జీవన సాహచర్యం, భావ సాహచర్యం, సైద్ధాంతిక సాహచర్యం.

జెన్నీ మీద మార్క్స్‌ది తిరుగులేని ప్రేమ. 1836లో జెన్నీ పరిచయమై, మనస్సులో ప్రేమాంకురం మొలిచినప్పటి నుండి ఆ ప్రేమ జీవితకాలమంతా చెక్కు చెదరకుండా ఉన్నది. 1856లో మార్క్స్ జెన్నీకి ఒక ఉత్తరం రాస్తూ 'ప్రపంచంలో చాలామంది స్త్రీలు ఉన్నారు. అందగత్తెలు ఉన్నారు. కానీ నీలాంటి ముఖ వర్చస్సును నేను ఎవరిలోనూ చూడలేదు. అది నా జీవితంలోని తియ్యని జ్ఞాపకాలను గుర్తు చేస్తుంది. నీ మధురమైన ముఖం మీద ముద్దుపెట్టుకుంటే నా బాధలన్నీ పారిపోతాయి.' అని రాసాడు. అది యవ్వనంలోని ప్రేమ కాదు, జీవన సాహచర్యంలోని మాధుర్యం.

మార్క్స్ తమ పిల్లలను కూడా బాగా ప్రేమించే వాడు. తాను రాసుకునేటపుడు గాని, విశ్రాంతి తీసుకునేటప్పుడు గాని పిల్లలు వస్తే ఆయన ఎప్పుడూ చికాకు పడలేదు. పైగా వాళ్ళ మధ్య ఉండి తన మానసికమైన ఒత్తిడిల నుండి బయట పడేవాడు. వాళ్ళతో ఆడుకునేవాడు. ఆదివారాలు వాళ్లతో కలిసి బయటకు వెళ్లేవాడు. పిల్లలకు చెస్ట్ నట్స్ కొరకు చెట్లను రాళ్ళతో కొట్టేవాడు. పిల్లలు కొంచెం పెద్ద పెరిగిన తరువాత వాళ్ళతో చెస్ ఆడేవాడు. కథలుచెప్పడం, సాహస గాథలను వినిపించడం, పుస్తకాలను చదివి వినిపించడం చేసేవాడు. హోమర్, బాల్జాక్, షేక్స్‌పియర్ వంటి గొప్ప రచయితల రచనలను పిల్లలకు తల్లిదండ్రులిద్దరూ పరిచయం చేసేవారు. అంత పేదరికంలోనూ, అన్ని కష్టాల్లోనూ మార్క్స్ పిల్లల కోరికలను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. మార్క్స్ పిల్లల మీద తండ్రి పెత్తనాన్ని చూపుతాడని అనుకోలేం. వాళ్లకు ఆయన ఒక స్నేహితుడుగా, ఒక సలహాదారుడుగా ఉండేవాడు. పిల్లలు కూడ తండ్రి పట్ల ఎంతో వినయంగా ఉండేవారు. ఆ తరువాతి కాలంలో మనుమలు, మనుమరాళ్ళతో  కూడా మార్క్స్ వ్యవహరించిన తీరు ఇలాగే ఉండేది.

పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో కూడ మార్క్స్ శ్రద్ధ చూపాడు. వాళ్లు నిజం చెప్పడాన్ని నేర్పించాడు. వంచనను అసహ్యించుకోవడాన్ని నేర్పించాడు. పోరాటకారులను ప్రేమించడాన్ని నేర్పించాడు.

పెద్దవారైన జెన్నీ, లారాలు 1860లలో, చిన్నదైన ఎలియనార్ 1870లలో పార్టీకి చెందిన పనులను చేయడంలో, తండ్రి చేస్తున్న శాస్త్ర పరిశోధనలో, తండ్రికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలను రాయడంలో సహాయపడ్డారు. వాళ్లకు కార్మికవర్గ ఉద్యమం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడింది. కార్మిక వర్గ ఉద్యమంలో ఉన్నవాళ్లనే వాళ్లు పెళ్లి చేసుకున్నారు.

మార్క్స్‌కు ఎంగెల్స్ కుటుంబం బయట ఉన్న కుటుంబ సభ్యుడు. మార్క్స్ కుటుంబం అవసరాలన్నింటిని ఎంగెల్స్ జాగ్రత్తగా గమనించి, తనకు చేతనయినంతగా వాటిని తీర్చేవాడు. ఎంగెల్స్ మార్క్స్‌కు ఎక్కువ డబ్బు పంపడం కొరకు తన ఉద్యోగంలో ఎక్కువ సమయం పనిచేసి ఒకసారి అనారోగ్యానికి గురయ్యాడు. తన అధ్యయనాన్నికూడా పక్కన పెట్టేవాడు. ఎంగెల్స్‌కు అధ్యయనంలో, రచనలో అవసరమైన సమాచారాన్ని సేకరించి పెట్టడంలో, ఒక పుస్తకంలోని ఒక ఉటంకింపును సేకరించి పెట్టడంలో, ఒక అరుదైన పుస్తకాన్ని సంపాదించి పెట్టడంలో మార్క్స్ సహాయ పడేవాడు. వాళ్లిద్దరు ఒకరికొకరు, చిన్న విషయంలోనైనా, పెద్ద విషయంలోనైనా, నిజాలను మాత్రమే చెప్పుకునే వారు. ఏ విషయంలో నైనా ఎవరిదైనా తప్పని తేలితే దాన్ని అంగీకరించేవారు. గొప్ప విలువల మీద ఆధారపడిన స్నేహం వాళ్లది.

1852లో కమ్యూనిస్టు లీగ్ రద్దయిన తరువాత మార్క్స్ నాయకత్వంలో 1864లో ఏర్పడిన మొదటి ఇంటర్నేషనల్ తొమ్మిదేళ్ల పాటు ముమ్మరంగా పనిచేసి, కార్మికవర్గ ఉద్యమాన్ని అంతర్జాతీయ స్థాయికి విస్తరింపజేసింది. 1864 సెప్టెంబర్ 28న లండన్‌లో ఏర్పడిన ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్‌యే మొదటి ఇంటర్నేషనల్.

యూరప్‌లోనూ, అమెరికాలోనూ తలెత్తిన కార్మికవర్గ ఉద్యమ సమస్యలను, జాతుల సమస్యలను మొదటి ఇంటర్నేషనల్ సరియైన దృక్పథంతో పరిష్కరించింది, పరిష్కరించడానికి ప్రయత్నం చేసింది. ఒక అంతర్జాతీయ కార్మికవర్గ పార్టీగా వివిధ దేశాల్లో కార్మికవర్గ పార్టీలను, పార్టీ శక్తులను నిర్మించడానికి, ఎదిగించడానికి ప్రయత్నించింది. 1871లో పారిస్‌లో కార్మికులు విప్లవించి, ప్రభుత్వాన్ని అధికారంలో నుండి తొలగించి, పారిస్ కమ్యూన్‌ను నిర్మించి, 72 రోజుల పాటే నిలబడినప్పటికి, కార్మికవర్గ ప్రభుత్వం ఎలా ఉంటుందో ప్రపంచానికి చాటి చెప్పిన విప్లవం జరగడానికి అవసరమైన దోహదాన్ని అంతా మొదటి ఇంటర్నేషనల్ ఇచ్చింది. అది పతనమైన తరువాత అందులోనుండి నేర్చుకోవలసిన గుణపాఠాలను మార్క్స్ వెల్లడి చేసాడు.

అయితే పారిస్ కమ్యూన్ పతనం అయిన తరువాత నెలకొన్న పరిస్థితులలో మొదటి ఇంటర్నేషనల్‌ను కొనసాగించడం ఇంక అవసరం లేదన్న అభిప్రాయానికి మార్క్స్, ఎంగెల్స్‌లు వచ్చారు. మొదటి ఇంటర్నేషనల్‌ను సాంకేతికంగా 1876 జూలై 15న రద్దు చేసినా 1873 చివరి నుండే దాని కార్యకలాపాలు నిలిచిపోయాయి.

1864 నుండి 1873 వరకు మొదటి ఇంటర్నేషనల్ కొరకు మార్క్స్ అమితంగా శ్రమ కోర్చాడు. మొదటి ఇంటర్నేషనల్ కొరకు పనిచేయడంలో మార్క్స్ తన ఆరోగ్యాన్ని కోల్పోయాడు. తన శాస్త్ర పరిశోధనను నిలిపివేశాడు. అయితే మొదటి ఇంటర్నేషనల్ మార్క్స్ రాజకీయ కార్యకలాపాల జీవితంలో కలికితురాయి వంటిది.

మొదటి ఇంటర్నేషనల్ వలన యూరప్‌లో కార్మికవర్గ విప్లవం ఒక ముందంజ వేసింది. యూరప్‌లోనూ, అమెరికాలోనూ లక్షలాదిమంది కార్మికులు కార్మికవర్గ అంతర్జాతీయ ప్రభావంలోకి వచ్చారు. శాస్త్రీయ కమ్యూనిజం భావజాల ప్రచారం జరిగింది.

మొదటి ఇంటర్నేషనల్ కార్యకలాపాల్లో భాగంగా ఎక్కడ నిప్పురవ్వ కనిపించినా దాన్ని విప్లవ జ్వాలగా ఎగసనదోస్తున్న మార్క్స్ ఎంగెల్స్‌లు 1866లో ప్రష్యాకు ఆస్ట్రియాకు మధ్య జరిగిన యుద్ధాన్ని ఆశావహ దృష్టితోనే చూసారు. యుద్ధంలో ప్రష్యా ఓడిపోతుందని, ఫలితంగా ప్రష్యాలో ఒక ప్రజాస్వామ్య విప్లవం జరుగుతుందని అనుకున్నారు. కాని యుద్ధంలో ప్రష్యా గెలిచింది.

మార్క్స్ ఎంగెల్స్‌ల ఆశ 1871లో ఫ్రాన్స్‌లో ఫలించింది. 1870, 1871 లలో ప్రష్యాకు ఫ్రాన్స్‌కు మధ్య జరిగిన యుద్ధంలో ఫ్రాన్స్ ఓడిపోయింది. ఇది పారిస్‌లో కార్మికుల తిరుగుబాటుకు దారితీసింది. 18.3.1871 నాడు జరిగిన ఈ తిరుగుబాటు పారిస్ కమ్యూన్‌గా చరిత్రలో నిలిచిపోయింది. ఇది ప్రజాస్వామ్య విప్లవం కాదు, సోషలిస్టు విప్లవం. ఈ విప్లవాన్ని నడిపించిన కమ్యూనార్డులకు మార్క్స్ సలహాలు ఇస్తూ వచ్చాడు. అధికారంలోకి వచ్చిన కమ్యూనార్డులు బూర్జువా రాజ్యాంగయంత్రాన్ని ధ్వంసం చేసారు. పాత పాలనావ్యవస్థను, న్యాయవ్యవస్థను ధ్వంసం చేసారు. సైన్యాన్ని, పోలీసు వ్యవస్థను రద్దు చేసారు.

పారిస్ కమ్యూన్ 72 రోజుల పాటే బతికినా, ఆ విప్లవం భవిష్యత్ సోషలిస్టు వ్యవస్థ ఎలా ఉంటుందో బీజరూపంలో చూపింది. విప్లవాన్ని నడిపించడం మాత్రమే కాకుండా, విప్లవం విజయవంతం అయిన తరువాత కార్మికవర్గ నియంతృత్వాన్ని అమలు చేయడం కొరకు ఒక కార్మికవర్గ పార్టీ లేకపోవడం పారిస్ కమ్యూన్ పతనానికి కారణమని మార్క్స్ పారిస్ కమ్యూన్ నుండి ఒక గుణపాఠాన్ని తీసి, పార్టీ అవసరాన్ని గుర్తింపజేసాడు.

మార్క్స్ తన జీవిత కాలంలో చేసిన సైద్ధాంతిక రచనలన్నింటిలోకి కాపిటల్ రచన అతి ముఖ్యమైనది. కాపిటల్ మూడు భాగాలుగా అచ్చయింది. ఇందులో మొదటి భాగాన్ని మార్క్స్ 1861-1865 మధ్య కాలంలో రాసాడు. 1864లో మొదటి ఇంటర్నేషనల్ ఏర్పడింది. ఈ ఇంటర్నేషనల్ కార్యకలాపాల్లో తల మునకలుగా ఉంటూనే కాపిటల్ రెండవ, మూడవ భాగాలను రాసాడు.

కాపిటల్ రచన ఒక పదేళ్ల కృషిగా కనబడుతుంది గాని, దాన్ని మార్క్స్ జీవితకాలపు కృషిగా చెప్పవచ్చును. ది ఎకనమిక్ అండ్ ఫిలసఫికల్ మాన్యుస్క్రిప్ట్స్ ఆఫ్ 1844 రాసినప్పటి నుండి కాపిటల్ రచనా క్రమం మొదలయిందని చెప్పవచ్చును.

కాపిటల్ మొదటి భాగం మార్క్స్ జీవించి ఉన్నప్పుడే, 1867లో అచ్చయింది. కాని రెండవ భాగం మార్క్స్ చనిపోయిన తరువాత ఎంగెల్స్ పూనికతో 1885లో, మూడవ భాగం 1894లో అచ్చయ్యాయి. నిజానికి మార్క్స్ రాసిన రెండవ భాగాన్ని ఎంగెల్స్ రెండవ, మూడవ భాగాలుగా విభజించాడు. రెండవ, మూడవ భాగాలను ఎడిట్ చేయడం మాత్రమే కాకుండా, ఎంగెల్స్ మూడవ భాగంలో ఉన్న కొన్ని ఖాళీలను పూరించాడు. నాలుగవ చాప్టరును మళ్లీ రాసాడు. ఫుట్‌నోట్స్‌ను, అనుబంధాన్ని సమకూర్చాడు. ముందుమాట రాసాడు. ఒక విధంగా రెండవ, మూడవ భాగాల రచనలో ఇద్దరి భాగస్వామ్యం ఉందని చెప్పవచ్చును. కాపిటల్ నాలుగవ భాగాన్ని థియరీస్ ఆఫ్ సర్‌ప్లస్ వాల్యూగా రాయలని ఎంగెల్స్ అనుకొన్నాడు. కాని రాయలేకపోయాడు.

మార్క్స్ కాపిటల్ మొదటి భాగంలో పెట్టుబడి పోగుపడే ప్రక్రియను, ఒక పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధంగా పెట్టుబడి వేతన శ్రమను దోపిడీ చేసే విధానాన్ని వివరించాడు. పెట్టుబడిదారీ సంపద ప్రాథమిక కేంద్రమైన సరుకును విశ్లేషించాడు. ఇంగ్లాండులోని పెట్టుబడిదారీ విధానాన్ని విశ్లేషిస్తూ, కమ్యూనిస్టు సమాజపు స్వరూపాన్ని గురించి చెప్పాడు. కాపిటల్ రెండవ, మూడవ భాగాల్లో రష్యా, అమెరికాలలోని ఆర్థికాభివృద్ధిని గురించి, రష్యాలోని వ్యవసాయ సంబంధాలను గురించి చెప్పాడు. మూడవ భాగంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ గురించి చెప్పాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థ గర్భంలో నుండి కార్మికవర్గం పుట్టినట్లుగానే మార్క్సిజం కూడా పుట్టింది. మార్క్స్ ఎంగెల్స్‌లు మార్క్సిజాన్ని పెంచి పోషించి, దానికి స్పష్టమైన, దృఢమైన రూపాన్ని ఇచ్చారు. పెట్టుబడిదారీ వ్యవస్థను అంతమొందించే చారిత్రక పాత్రను కార్మికవర్గం నిర్వర్తించడం కొరకు మార్క్సిజం అనే శాస్త్రాన్ని, శస్త్రాన్ని కార్మిక వర్గం చేతికి అందించిన వారు మార్క్స్ ఎంగెల్స్‌లు. ఇందులో మార్క్స్ కృషి నిరుపమానమైనది. ఇందుకోసం ఆయన తన జీవితాన్ని, ఆరోగ్యాన్ని త్యాగంచేసాడు. మార్క్స్‌కు నిరంతరాయమూ తోడుగా ఉండి జెన్నీ ఈ కృషిలో పాలుపంచుకొన్నది. మానవసమాజానికి మేలుచేసే ఒక గొప్పకర్తవ్యాన్ని నిర్వర్తించడంలో ఆమెకూడా వ్యక్తిగత సౌకర్యాన్ని, సుఖాన్ని, ఆరోగ్యాన్ని లెక్కచేయలేదు.

కాని 1880 వేసవిలో జెన్నీకి వచ్చిన కాలేయ వ్యాధి ప్రాణాంతకమైంది. ఆమె ఆ వ్యాధితో తీవ్రంగా బాధపడింది. అక్టోబరు నాటికి అది కేన్సర్‌గా బయటపడింది. 1881 వసంతం నాటికి జెన్నీ పక్కమీది నుండి లేవలేకుండా అయిపోయింది. అదే సమయంలో మార్క్స్ కూడా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పక్క గదిలోనే చావుబతుకుల్లో ఉన్న జెన్నీని తలచుకొనే సరికి ఆయన బాధ రెట్టింపయింది. చివరకు 2.12.1881 నాడు జెన్నీ చనిపోయింది.

జెన్నీ మరణంతో కుంగిపోయిన మార్క్స్ వాతావరణంలో మార్పు కొరకు కొంత కాలం అల్జీరియాలో ఉన్నాడు. 1883 జనవరిలో పెద్ద కూతురు జెన్నీ కూడా తీవ్రంగా అనారోగ్యం బారినపడి, 38 ఏళ్ల వయస్సులో, అయిదుగురు పిల్లల తల్లిగా, 11.1.1883 నాడు చనిపోయింది. ఈ వార్త మార్క్స్‌ను మరింత కుంగదీసింది.

బ్రాంకైటిస్, న్యూమోనియా వ్యాధులతో బాధపడుతున్న మార్క్స్ కూడా బ్రాంకైటిస్ వ్యాధి ముదిరినందువలన చావుబతుకుల స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆయనను ఆ వ్యాధి నుండి కాపాడడానికి డాక్టర్ ప్రయత్నించాడు. ఎంగెల్స్, చిన్న కూతురు ఎలియనార్ ఆయన వెన్నంటే ఉన్నారు. 1883 మార్చి మొదటి వారంలో మార్క్స్ కొంత కోలుకొన్నాడు. కాని 14.3.1883 నాడు మధ్యాహ్నం 2.30గం.ల ప్రాంతంలో మెదడులో రక్తస్రావం జరిగి చనిపోయాడు.

మార్క్స్ భౌతిక దేహాన్ని 17.3.1883 నాడు లండన్‌లోని హైగేట్ సెమిట్రీలో ఖననం చేసారు. ఆ సెమిట్రీలో అధికార సమాజం చేత, చర్చ్ చేత నిరాకరింపబడిన వారిని ఖననం చేసే భాగం వేరే ఉంది. ఆ భాగంలో ఆయన సమాధి జెన్నీ సమాధి పక్కనే ఉంది. ఆయన తన మరణంలో కూడా భూస్వామ్య రాచరిక ప్రభుత్వాలకు , పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు, సంపన్నులకు, అధికారులకు బహిష్కృతుడు గానే ఉన్నాడు. కార్మికుల శ్రమశక్తిని కొల్లగొట్టి సంపదలను కూడ బెట్టుకొన్న పెట్టుబడిదారీ వర్గం, భూస్వామ్య వర్గం, ఈ వర్గాల తరపున పాలన కొనసాగిస్తున్న ప్రభుత్వాలు కార్మిక వర్గాన్ని, రైతాంగాన్ని, అశేషపీడిత ప్రజలను సంపదల నుండి, సమానత్వం నుండి, సుఖవంతమైన, గౌరవనీయమైన జీవితం నుండి వెలివేసినట్లుగానే, జీవితమంతా ఈ ప్రజల వెంటనే ఉన్న మార్క్స్‌ను కూడా వెలివేసాయి. ఎన్ని కష్టాలు పడినా, ఎన్ని బాధలను అనుభవించినా, ఆయన జీవితానికి సుదీర్ఘ విరామం లభించిన తరువాత కూడా, భావనాత్మకంగా ఆ పీడిత ప్రజల మధ్యనే విశ్రాంతి తీసుకొంటున్నాడు.

*(రచయిత ఉపాధ్యాయుడు, డిటిఎఫ్ నాయకుడు)* వీ

# మార్క్స్ స్మృతిలో ఎంగెల్స్ మాటలు

***లండన్‌లోని హైగేట్ సిమెటరీలో కార్ల్ మార్క్స్ మృతదేహాన్ని ఖననం చేశాక 1883 మార్చ్ 17న ఫ్రెడరిక్ ఎంగెల్స్ చేసిన ఉపన్యాసం***

మార్చ్ 14 మధ్యాహ్నం పావు తక్కువ మూడుగంటలకు, అత్యుత్తమ సజీవ ఆలోచనాపరుడు ఆలోచించడం మానేశాడు. ఆయనను ఒంటరిగా వదిలి రెండు నిమిషాలు కూడ కాలేదు, మేం తిరిగి వెళ్లి చూసేసరికి, తన వాలుకుర్చీలో ఆయన ప్రశాంతంగా నిద్ర పోతున్నాడు – శాశ్వతనిద్ర.

ఆయన మృతిలో చెప్పరానంత నష్టానికి గురయింది కేవలం యూరప్, అమెరికాలకు చెందిన సమరశీల కార్మికవర్గం మాత్రమే కాదు, చరిత్ర శాస్త్రం కూడ. ఈ మహత్తర స్ఫూర్తి వెళిపోవడంతో ఏర్పడిన శూన్యం త్వరలోనే మనందరికీ తేటతెల్లమవుతుంది.

డార్విన్ సేంద్రియ ప్రకృతి అభివృద్ధి నియమాన్ని కనిపెట్టినట్టుగానే, మార్క్స్ మానవ చరిత్ర అభివృద్ధి నియమాన్ని కనిపెట్టాడు. భావజాలం మితిమీరి పెరిగినందువల్ల ఇంతకాలమూ మరుగున పడిన ఒక సాధారణ వాస్తవాన్ని ఆయన బైటపెట్టాడు. రాజకీయాలనో, విజ్ఞానశాస్త్రాలనో, కళలనో, మతాన్నో, వగైరా వగైరా దేన్నయినా చేపట్టడానికి ముందు మానవజాతి మొట్టమొదట తినవలసి, తాగవలసి, గూడూ గుడ్డా ఏర్పరచుకోవలసి ఉంటుందనేదే ఆ వాస్తవం. అంటే తక్షణ భౌతిక సాధనాల ఉత్పత్తే, తత్ఫలితంగా ఒక నిర్దిష్ట ప్రజానీకం లేదా ఒక నిర్దిష్ట కాలంలో సాధించిన ఆర్థికాభివృద్ధి స్థాయే పునాది అవుతుందనీ, ఆ పునాది మీదనే ఆ ప్రజలకు చెందిన రాజ్య వ్యవస్థలు, న్యాయ భావనలు, కళ, చివరికి మతం గురించిన భావనలు తలెత్తుతాయని, వాటిని ఆ పునాది వెలుగులోనే వివరించవలసి ఉంటుందనేదే ఆ వాస్తవం. ఇంతకాలమూ అందుకు తలకిందులుగా జరగగా, ఇప్పుడు ఆ పునాది మీద జరగాలి.

అంతమాత్రమే కాదు. ప్రస్తుతకాలపు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని, ఆ ఉత్పత్తి విధానం సృష్టించిన బూర్జువా సమాజాన్ని నిర్దేశించే ప్రత్యేక చలన సూత్రాన్ని కూడ మార్క్స్ కనిపెట్టాడు. అదనపు విలువ అనే భావనను కనిపెట్టడం హఠాత్తుగా మొత్తం సమస్య మీద వెలుగు ప్రసరించింది. ఆ సమస్యను పరిష్కరించే ఉద్దేశంతో అటు బూర్జువా ఆర్థిక వేత్తలూ, ఇటు సోషలిస్టు విమర్శకులూ చేసిన అంతకుముందరి పరిశోధనలన్నీ చీకట్లో దేవులాడుతూ ఉండగా, ఈ భావన వెలుగు ప్రసరించింది.

ఇటువంటి రెండు ఆవిష్కరణలు సాగించడమే ఒక జీవిత కాలానికి సరిపోతుంది. అసలు అటువంటి ఆవిష్కరణ ఒక్కటి చేసినా ఆ వ్యక్తి సంతోషపడవచ్చు. కాని మార్క్స్ పరిశోధించిన ప్రతి ఒక్క రంగంలోనూ – నిజం చెప్పాలంటే ఆయన ఎన్నో రంగాలలో పరిశోధించాడు, ఏ ఒక్క రంగంలోనూ పైపైన కూడ కాదు – ప్రతి ఒక్క రంగంలోనూ, చివరికి గణితశాస్త్రంలో కూడ ఆయన స్వతంత్ర ఆవిష్కరణలు చేశాడు.

అటువంటి విజ్ఞానశాస్త్ర ఖని ఆయన. కాని ఆయన వ్యక్తిత్వంలో ఇది సగం కూడ కాదు. మార్క్స్ దృష్టిలో శాస్త్రం అంటే చారిత్రకంగా చలనశీలమైన, విప్లవ శక్తి. సైద్ధాంతిక విజ్ఞాన శాస్త్రంలో ఒక కొత్త ఆవిష్కరణ జరిగినప్పుడు ఆ ఆవిష్కరణకు ఉండగల ఆచరణాత్మక అన్వయం ఏమిటో ఊహించడం అసాధ్యమైనప్పటికీ ఆయన గొప్ప ఆనందం పొందేవాడు. ఆ ఆవిష్కరణ పారిశ్రామిక రంగంలో, మొత్తంగా చారిత్రక అభివృద్ధిలో తక్షణ విప్లవాత్మక మార్పులకు దారి తీస్తుందన్నప్పుడు మరింత ఆనందం పొందేవాడు. ఉదాహరణకు, విద్యుచ్ఛక్తి శాస్త్ర రంగంలో జరుగుతున్న ఆవిష్కరణల అభివృద్ధిని, ఇటీవలి కాలంలో మార్సెల్ డెప్రెజ్ ఆవిష్కరణలను ఆయన సన్నిహితంగా పరిశీలించాడు.

ఎందుకంటే అన్నిటికన్న ముందు మార్క్స్ ఒక విప్లవవాది. పెట్టుబడిదారీ సమాజాన్ని, అది ఉనికిలోకి తీసుకు వచ్చిన రాజ్య నిర్మాణాలను కూలదోయడానికి ఏదో ఒకరకంగా సహకరించడమే, ఆధునిక కార్మికవర్గ విముక్తికి దోహదం చేయడమే ఆయన జీవిత లక్ష్యం. ఆధునిక కార్మికవర్గ స్థితి గురించీ, దాని అవసరాల గురించీ, దాని విముక్తి గురించీ దానికి చైతన్యం కలిగించిన తొలి వ్యక్తి ఆయన. పోరాటమే ఆయన జీవనసూత్రం. పోరాడడంలో ఆయన చూపిన ఉద్వేగం, పట్టుదల, సాధించిన విజయం అతి తక్కువమందిలో చూస్తాం. మొదటి రైనిష్ జీటుంగ్ (1842), పారిస్ లో వోర్ వార్ట్స్ (1844), డాయిష్ బ్రస్సెలర్ జీటుంగ్ (1847), న్యూ రైనిష్ జీటుంగ్ (1848–49), న్యూయార్క్ ట్రిబ్యూన్ (1852–61) పత్రికలలో ఆయన కృషి, వాటికి తోడుగా ఎన్నెన్నో సమరశీల కరపత్రాలు, పారిస్, బ్రస్సెల్స్, లండన్ లలో సంస్థా నిర్మాణ కృషి, చివరికి వీటన్నిటికీ శిఖరాయమానంగా మహత్తరమైన ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ స్థాపన. ఇంకేమీ చేయకపోయినా ఈ ఒక్క సంస్థ స్థాపనలో సాధించిన విజయమే ఆ స్థాపకుడికి గర్వకారణమైనది.

అంతేకాదు, వీటన్నిటి ఫలితంగా, మార్క్స్ తనకాలంలో అందరికంటె ఎక్కువగా ద్వేషానికీ, నిందకూ గురైన వ్యక్తి అయ్యాడు. అటు నిరంకుశ రాచరిక ప్రభుత్వాలూ, ఇటు గణతంత్రాలమని చెప్పుకున్న ప్రభుత్వాలూ ఆయనను తమ పాలనా ప్రాంతాల నుంచి బహిష్కరించాయి. మితవాదులైనా, అతి తీవ్రవాదులైనా బూర్జువాలందరూ ఆయన మీద నిందలు గుప్పించడానికి ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. ఇదంతా తన దారిలోని సాలెగూడు లాగ ఆయన చేత్తో పక్కకి జరిపేశాడు. దాన్ని విస్మరించాడు. అత్యంత ఆవశ్యకమైన అనివార్యత తోసినప్పుడు మాత్రమే జవాబు ఇచ్చాడు. చివరికి సైబీరియా నుంచి కాలిఫోర్నియా వరకూ గనుల నుంచి, యూరప్ అమెరికాలలోని సకల ప్రాంతాల నుంచి లక్షలాది మంది సహకార్మికుల ప్రేమనూ గౌరవాన్నీ చూరగొని ఆయన మరణించాడు. లక్షలాది మంది ఆయన కోసం సంతాపం ప్రకటిస్తున్నారు. అంతేకాదు, ఆయనకు ఎందరో ప్రత్యర్థులున్నప్పటికీ ఒక్కరంటే ఒక్కరైనా వ్యక్తిగత శత్రువు లేరని చెప్పడానికి కూడ నేను సాహసిస్తున్నాను.

యుగయుగాల వరకు ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. ఆయన కృషి కూడ. వీ

# కార్ల్ మార్క్స్ మృతి

## ఇంటర్నేషనల్ అసోసియేషన్ స్థాపకుడి కృషీ, రచనలూ

## ది న్యూయార్క్ టైమ్స్ దినపత్రికలో 1883 మార్చ్ 17న అచ్చయిన వార్త

*THE DEATH OF KARL MARX.*

CAREER AND WRITINGS OF THE FOUNDER OF THE INTERNATIONAL ASSOCIATION.

LONDON, March 16.—Dr. Friederich Engel, an intimate friend of Karl Marx, says Herr Marx died in London, near Regent's Park. Dr. Engel was present at the time of his death, which was caused by bronchitis, abscess of the lungs, and internal bleeding. He died without pain. In respect to the wishes of Herr Marx, who always avoided a demonstration, his family have decided that the funeral shall be private. About 18 persons will be present, including a few friends who are coming from the Continent. The place of interment has not been announced. Dr. Engel will probably speak at the grave. There will be no religious ceremony. At the time of his death the third edition of Herr Marx's book, "Das Kapital," first published in 1864, was in preparation for the press.

PARIS, March 16.—*La Justice*, of which M. Longuet, son-in-law of Karl Marx, is one of the staff, says Herr Marx spent part of last Summer at Argenteuil, but returned to London in October.

---

Karl Marx, the German Socialist and founder of the International Association, was born in Cologne in 1818, and after studying philosophy and the law at the Universities of Bonn and Berlin became the editor of the *Rhenish Gazette*, in 1842. The opinions which he published were of so radical a character that the paper was suppressed the following year. He then went to France, where he devoted himself to the study of political economy and social questions, and published in the *Franco-German Year Book*, in 1844. "A Critical Review of Hegel's Philosophy" and "The Holy Family against Bruno and His Consorts," a satire on German idealism. Expelled from France on the demand of the Prussian Government, he went to Belgium. He afterward took part in the Working Men's Congress in London in 1847, and was one of the authors of the manifesto of the Communists. He was in Paris during the revolution of February, 1848, and then returned to Cologne, where he founded a paper called the *New Rhenish Gazette*. After the dissolution of the Prussian Chambers, Marx advised the people to organize and resist the collection of the imposts, and for this his journal was a second time suppressed. He continued the agitation against the tax, and was arrested several times, but always acquitted by the jury on trial. He was finally banished from Germany, and returned to Paris, where he took part in the stormy scenes of the June disturbanees, for which he was imprisoned, but managed to escape to London, where he established himself permanently. There, in 1864, he founded the Association of Working Men, since known as the "International." Herr Marx was the leading spirit of the first Central Council of that organization, which framed the laws which were adopted at the Geneva congress in 1866. He became the Corresponding Secretary for Germany and Russia, and from that time was the real Director of the International. In 1871 he was attacked by the English section of the association and pronounced an unfit man to be a leader of the working classes. The schism was broadened in 1872, at the congress held at The Hague, when the Central Council at London was repudiated and Marx was deposed from his office as Secretary. The Internationals then divided into two factions—the Centralists, with Marx at their head, who transferred the headquarters of the Central Council to this City, and the Federalists, who had thrown Marx overboard. Marx continued to reside in London, where he was for many years a correspondent of a New-York paper. Among the works published by him are "A Treatise on Free Exchange." "The Misery of Philosophy," which is an answer to Proudhon's "Philosophy of Misery," and "Capital: a Criticism of Political Economy," which is a complete exposition of the author's doctrines.

The New York Times
Published: March 17, 1883


***లండన్, మార్చ్ 16:*** హెర్ మార్క్స్ లండన్‌లోని రిజెంట్ పార్క్ సమీపంలో మరణించారని కార్ల్ మార్క్స్ సన్నిహిత స్నేహితుడు డా. ఫ్రెడరిక్ ఎంగెల్స్ చెప్పారు. ఆయన మరణించిన సమయంలో తాను అక్కడే ఉన్నానని, బ్రాంకైటిస్ వల్ల, ఊపిరితిత్తులలో పుండు వల్ల, అంతర్గత రక్తస్రావం వల్ల మరణం సంభవించిందని, ఆయన ఎటువంటి బాధా అనుభవించకుండా సునాయాసంగా మరణించారని డా. ఎంగెల్స్ అన్నారు. ఎప్పుడూ ఆడంబరాన్ని అంగీకరించని హెర్ మార్క్స్ కోరికకు అనుగుణంగా, అంత్యక్రియలను వ్యక్తిగత స్థాయిలోనే జరపాలని ఆయన కుటుంబం నిర్ణయించింది. యూరప్‌లోని ఇతర దేశాల నుంచి వచ్చే కొద్దిమంది స్నేహితులతో సహా దాదాపు 18 మంది వ్యక్తులు మాత్రమే అంత్యక్రియలలో పాల్గొంటారు. ఖనన స్థలం ఎక్కడో ప్రకటించలేదు. బహుశా సమాధి దగ్గర డా. ఎంగెల్ ప్రసంగిస్తారు. మతాచారాల తంతు ఏమీ ఉండదు. మరణించే సమయానికి హెర్ మార్క్స్ రచన 'దాస్ కాపిటల్' మూడో కూర్పు అచ్చుకు వెళ్లడానికి సిద్ధంగా ఉంది. ఈ పుస్తకం మొదట 1864లో వెలువడింది.

***పారిస్, మార్చ్ 16:*** కార్ల్ మార్క్స్ అల్లుడు ఎం. లాంగె పనిచేస్తున్న లా జస్టిస్ పత్రిక ప్రకారం హెర్ మార్క్స్ గత వేసవిలో కొన్ని రోజులు అర్జెంటెవిల్‌లో గడిపి అక్టోబర్‌లో లండన్ తిరిగి వెళ్లారు.

❖ ❖ ❖

జర్మన్ సోషలిస్టు, ఇంటర్నేషనల్ అసోసియేషన్ స్థాపకుడు కార్ల్ మార్క్స్ కోలోన్‌లో 1818లో జన్మించారు. బాన్, బెర్లిన్ విశ్వవిద్యాలయా లలో తత్వశాస్త్రం, న్యాయశాస్త్రం అధ్యయనం చేసి, 1842లో రైనిష్ గజెట్ పత్రికకు సంపాదకులయ్యారు. ఆయన ప్రచురించిన అభిప్రాయాలు ఎంత తీవ్రమైన స్వభావం కలిగినవంటే, ఆ తర్వాతి సంవత్సరమే (ప్రభుత్వం) ఆ పత్రికను మూసివేయించింది. ఆ తర్వాత ఆయన ఫ్రాన్స్ వెళ్లారు. అక్కడ ఆయన పూర్తిగా రాజకీయార్థశాస్త్రాన్ని, సామాజిక సమస్యలను అధ్యయనం చేయడానికి పూనుకున్నారు. 1844లో 'ఫ్రాంకో జర్మన్ ఇయర్ బుక్', 'ఎ క్రిటికల్ రివ్యూ ఆఫ్ హెగెల్స్ ఫిలాసఫీ', 'ది హోలీ ఫామిలీ అగెనెస్ట్ బ్రూనో అండ్ హిజ్ కన్సార్ట్స్', జర్మన్ భావవాదం మీద వ్యంగ్య విమర్శ ప్రచురించారు. ప్రష్యన్ ప్రభుత్వ కోరికపై ఫ్రాన్స్ కూడ బహిష్కరించగా, బెల్జియం వెళ్లారు. ఆ తర్వాత లండన్‌లో 1847లో జరిగిన వర్కింగ్ మెన్స్ కాంగ్రెస్‌లో భాగం పంచుకుని, కమ్యూనిస్టుల ప్రణాళిక రచయితలలో ఒకరుగా ఉన్నారు. 1848 ఫిబ్రవరి విప్లవ సందర్భంగా పారిస్‌లో ఉండి, తర్వాత కోలోన్ తిరిగి వచ్చి న్యూ రైనిష్ గజెట్ అనే పత్రికను స్థాపించారు. ప్రష్యన్ శాసనసభలను రద్దు చేసిన తర్వాత, ప్రజలు సంఘటితం కావాలనీ, పన్ను వసూళ్లను ప్రతిఘటించాలనీ మార్క్స్ ప్రబోధించారు. అందువల్ల ఆయన పత్రికను రెండోసారి కూడ అణచివేశారు. పన్నులకు వ్యతిరేకంగా ఆయన తన ఆందోళన కొనసాగిస్తుండడంతో, ఆయనను ఎన్నోసార్లు నిర్బంధించారు. అయితే ప్రతిసారీ విచారణలో న్యాయమూర్తులు ఆయనను నేరారోపణలనుంచి నిర్దోషిగా వదిలేశారు. చివరికి ఆయనను జర్మనీ నుంచి బహిష్కరించారు. ఆయన అక్కడి నుంచి పారిస్ చేరి అక్కడ జరిగిన జూన్ ఆందోళనల్లో ఉద్రిక్త సందర్భాల్లో పాల్గొన్నారు. దానితో ఆయనను జైలులో నిర్బంధించారు. ఆయన అక్కడినుంచి తప్పించుకుని లండన్ చేరి, శాశ్వతంగా అక్కడే స్థిరపడ్డారు. అక్కడే ఆయన 1864లో అసోసియేషన్ ఆఫ్ వర్కింగ్ మెన్ స్థాపించారు. దాన్నే ఇంటర్నేషనల్ అని కూడ పిలుస్తారు. ఆ సంస్థకు చెందిన మొదటి సెంట్రల్ కౌన్సిల్‌కు మార్గదర్శక శక్తిగా ఆయన పనిచేశారు. దానికోసం ఆయన తయారుచేసిన నియమావళిని 1866లో జెనీవా కాంగ్రెస్‌లో ఆమోదించారు. ఆయన జర్మనీ, రష్యాలకు కరెస్పాండింగ్ కార్యదర్శి అయ్యారు. అప్పటి నుంచీ ఇంటర్నేషనల్‌కు నిజమైన డైరెక్టర్‌గా పనిచేశారు. 1871లో అసోసియేషన్‌లోని ఇంగ్లిష్ శాఖ ఆయన మీద విమర్శలు గుప్పించి, కార్మికవర్గాలకు నాయకుడుగా ఉండడానికి అర్హత లేని వ్యక్తిగా ప్రకటించింది. ఈ చీలిక 1872లో హేగ్‌లో జరిగిన కాంగ్రెస్‌లో మరింత పెద్దదై, లండన్‌లోని సెంట్రల్ కౌన్సిల్‌ను రద్దు చేశారు. మార్క్స్‌ను కార్యదర్శి పదవి నుంచి తొలగించారు. ఆ తర్వాత ఇంటర్నేషనల్ రెండు విభాగాలుగా చీలిపోయింది. మార్క్స్ నాయకత్వంలోని సెంట్రలిస్టులు తమ కేంద్ర కార్యాలయాన్ని ఈ నగరానికి మార్చుకున్నారు. ఫెడరలిస్టులు మార్క్స్‌ను పూర్తిగా తొలగించారు. మార్క్స్ లండన్‌లోనే నివసించడం కొనసాగించారు. న్యూయార్క్‌కు చెందిన ఒక పత్రికకు విలేఖరిగా చాల సంవత్సరాలు పనిచేశారు. ఆయన ప్రచురించిన పుస్తకాలలో కొన్ని 'ఎ ట్రెటైస్ ఆన్ ఫ్రీ ఎక్స్ చేంజి', ప్రొధాన్ రాసిన 'ఫిలాసఫీ ఆఫ్ మిసరీ'కి జవాబుగా రాసిన 'ది మిసరీ ఆఫ్ ఫిలాసఫీ', రచయిత సిద్ధాంతాలకు సంపూర్ణ వ్యక్తీకరణ అయిన 'కాపిటల్ – ఎ క్రిటిసిజం ఆఫ్ పొలిటికల్ ఎకానమీ'.

*(ఈ వార్తలో కొన్ని పొరపాట్లు ఉన్నప్పటికీ, ఇది ఒక చారిత్రక పత్రం గనుక యథాతథంగా అనువదించడం జరిగింది)* వీ

# చరిత్రాత్మక కమ్యూనిస్టు ప్రణాళిక

**- ఎ. నర్సింహారెడ్డి**

మార్క్స్, ఎంగెల్స్‌ల కమ్యూనిస్టు ప్రణాళికను 1948 ఫిబ్రవరిలో ప్రపంచానికి అందజేశారు. ఇది ప్రపంచ చరిత్రలో మహత్తర రచన. కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ రచించిన కమ్యూనిస్టు ప్రణాళికయే శాస్త్రీయ కమ్యూనిజపు మొట్టమొదటి కార్యక్రమం. ప్రణాళిక వెలువడి 170 సంవత్సరాలు కావస్తున్నా అది ఒక మేరు పర్వతంలా నిలిచి ఉంది. మార్క్సిజంలోని మూడు అంతర్భాగాలైన 'తత్వశాస్త్రం, అర్థికశాస్త్రం, శాస్త్రీయ సోషలిజం' అందులో వివరించారు. ప్రపంచ చరిత్రలో సమాజ గమనానికి ఒక సజీవ రూపం. మానవ చరిత్ర గమనాన్ని దీనంతగా ప్రభావితం చేసిన మరో రచన లేదు. విప్లవ పురోగమనానికి బాటలు వేసింది. ఆలోచనలో స్పష్టత, స్పటిక స్వచ్ఛమైన దాని భవిష్యద్దర్శనం విముక్తిదాయకమూ, సృజనశీలమూ.

గత చరిత్రను ప్రకృతి, సమాజాల అభివృద్ధి నియమాలకు అనుగుణంగా విశ్లేషించింది. వివిధ సామాజిక వ్యవస్థలను, అంతర్జాతీయ వైరుధ్యాలను లోతుగా అధ్యయనం చేసి పెట్టుబడిదారీ సమాజంలో కార్మికవర్గాన్ని విప్లవకర వర్గంగా మార్క్స్ ఎంగెల్స్ గుర్తించారు. ప్రణాళిక వెలుబడిన నాటి నుండి పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాద దశలోకి ప్రవేశించి రెండు ప్రపంచ యుద్ధాలకు కారణమైంది. రష్యా, చైనా, వియత్నాంలో విప్లవాలు, ఇంకా ఎన్నో దేశాల్లో జాతీయ విముక్తి ఉద్యమాలు జరిగాయి. ఇవ్వాల్టికీ ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్న ప్రజాపోరాట రూపాలను ప్రణాళిక తీర్చిదిద్దింది. మనిషిని మనిషీ, జాతిని జాతీ దోచుకోని సామాజిక వ్యవస్థ కోసం పోరాడే శ్రామిక జనావళిని ఉత్తేజపరుస్తూనే ఉన్నది. 1971 నాటి పారిస్ కమ్యూన్‌తో మొదలిడి ఇవాల్టికి అనేక మహోజ్వల పోరాటాలకు ప్రణాళిక స్ఫూర్తినిస్తూనే ఉన్నది.

ప్రపంచ తత్వశాస్త్ర, విజ్ఞాన శాస్త్రాల చరిత్రల్లో గతితార్కిక చైతన్యాన్ని పొందడానికి మూడు వేల సంవత్సరాలు పట్టింది. మానవాళి ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి సుదీర్ఘకాలం ప్రయత్నించి ప్రపంచాన్ని మార్చడానికి చైతన్యవంతంగా పూనుకోవడంలో గతితర్కం ప్రభవించింది. ప్రపంచాన్ని వ్యాఖ్యానించడం ప్రపంచాన్ని మార్చడం వేరువేరుగా ఉన్నంతకాలం సమస్యల మీద ఇనుప తెరలు కప్పబడతాయి. ఈ రెండింటి కలయికే కమ్యూనిస్టు ప్రణాళిక. ప్రణాళిక అవిభాజ్యమైన అనేక అంశాలతో కూడిన సమగ్రరూపం. ఇది ఏదో ఒక సామాజిక జీవిత క్షేత్రానికి పరిమితమైంది కాదు. సమాజాన్ని దాని చలనంలో మార్పులో ప్రతి అంశాన్ని ప్రణాళిక ప్రతిబింబించింది. ప్రణాళిక వాక్యాల పొందికలో చరిత్ర జీవించింది. ప్రణాళిక సామాజిక ఘర్షణ చరిత్రని తవ్వుతుంది. సత్యాన్ని వెలికితీస్తుంది. గమనాన్ని నిర్దేశిస్తుంది. గందరగోళ సిద్ధాంతాన్ని పూర్వపక్షం చేస్తుంది. నవ ప్రపంచ కవాటాన్ని తెరుస్తుంది. 'మేధోవంతమైన స్పష్టత, నిశిత దృష్టితో కూడిన ఈ రచన, నూతన ప్రాపంచిక దృక్పథాన్ని, నికరమైన భౌతికవాదాన్ని చిత్రీకరిస్తుంది. అభివృద్ధి క్రమానికి సంబంధించిన అత్యంత సమగ్రమైన, లోతైన సిద్ధాంతంగా గతితర్కాన్ని గూర్చి సాంఘిక జీవన సారాంశాన్ని గూర్చి పేర్కొంటుంది. వర్గ పోరాట సిద్ధాంతాన్ని గూర్చి, నూతన కమ్యూనిస్టు సమాజ సృష్టికర్తయగు కార్మిక వర్గం యొక్క ప్రపంచ-చారిత్రక విప్లవ కర్తవ్యాన్ని గూర్చి సృష్టీకరిస్తుంది' అని కమ్యూనిస్టు ప్రణాళికను గూర్చి లెనిన్ పేర్కొన్నాడు.

1947 ప్రారంభంలో లీగ్ ఆఫ్ జస్ట్ నాయకత్వం మార్క్స్, ఎంగెల్స్‌లను తమ సంస్థలో చేరాలని ఆహ్వానించింది. మార్క్స్, ఏంగెల్సు తమకు దొరికిన చారిత్రక అవకాశంగా భావించి అందులో సభ్యులుగా ఉంటూ1847లో లండన్ లీగ్ ఆఫ్ ది జస్టని కమ్యూనిస్టు లీగ్‌గా మార్చగలిగారు. లీగ్ ఆఫ్ జస్ట్‌కి 'మానవులందరూ సోదరులు' అనేది లక్ష్యంగా ఉండేది. ఇది పెటీ బూర్జువా నినాదం, వర్గదృక్పథం లేని అదిభౌతిక పాత నినాదాన్ని మార్క్స్, ఏంగెల్సులు "అన్ని దేశాల కార్మికులారా ఏకం కండి" గా మార్చారు. ఈ చారిత్రక లక్ష్య నిర్దేశంలోనే మార్క్స్, ఏంగెల్సుల కృషి ప్రతిబింబిస్తోంది. జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి దేశాల్లోని కార్మికవర్గ సంస్థల్ని ఈ వేదికలోకి తీసుకురావడానికి ప్రయత్నం చేశారు. ఈ అంతర్జాతీయ సంస్థకి ఎంగెల్స్ "కమ్యూనిస్టు కన్ఫెషన్ ఆఫ్ ఫేత్" అనే ముసాయిదా రాసాడు. ఇది ప్రశ్నలూ సమాధానాల రూపంలో ఉంది. ఈ ముసాయిదా 1847 జూన్ 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ లండన్‌లో జరిగిన కమ్యూనిస్టు లీగ్ మొదటి సమావేశంలో చర్చించిన కార్యక్రమ పత్రం. ఇలాంటి ముసాయిదాని ఎంగెల్స్ రాసాడనీ దానిమీద చర్చ జరిగిందనీ 1971 వరకూ తెలియదు.

1847 నవంబరు 29 నుంచి డిశంబర్ 6 వరకు లీగ్ రెండో మహాసభ లండన్‌లో జరిగింది. దీనికి మార్క్స్ హాజరయ్యాడు. ట్రూ సోషలిస్టు ఎమ్.ఎస్. ప్రవేశపెట్టిన ముసాయిదా మీద చర్చలు జరిగాయి. దీనిపై ఎంగెల్స్ విమర్శ పెట్టాడు. చివరికి ముసాయిదా రాసే బాధ్యతని లీగ్ నాయకులు మార్క్స్‌కి అప్ప చెప్పారు. ఎంగెల్స్ రాసిన రెండు ముసాయిదాల్నీ, ఇతర డాక్యుమెంట్లనీ ప్రణాళికను రాసేటప్పుడు మార్క్స్ పరిశీలించాడనేది స్పష్టం. ఎంగెల్స్ రాసిన 'ప్రిన్స్‌పుల్స్ ఆఫ్ కమ్యూనిజం'లోని అభిప్రాయాలకీ ప్రణాళికలోని అభిప్రాయాలకీ పోలికలున్నాయి. కానీ రచనలోకానీ, ప్రతిపాదనా పద్ధతిలో కానీ, విషయ విశ్లేషణలో కానీ ప్రణాళిక నూతనత్వం సంతరించుకుంది. ప్రపంచ మానవాళి మీద ఈ ప్రణాళిక చేసినంత ప్రభావం మరేదీ చెయ్యలేదు. ఎంతో విపులమైన విషయాన్ని, ఎన్నో పార్శ్వాలు గల విషయాన్ని ఒకమాటలో, ఒక వాక్యంతో చెప్పగలగడం ప్రపంచ సాహిత్యంలో ఒక్క ప్రణాళికలోనే చూడగలం.

మార్క్స్, ఎంగెల్స్ రెండు నెలల్లో 23 పేజీల కమ్యూనిస్టు మానిఫెస్టో ముసాయిదాను తయారుచేశారు. 1948 ఫిబ్రవరిలో లండన్‌లో ప్రచురించబడింది. అది వారి బుర్రల నుంచి ఆకస్మాత్తుగా ఊడిపడింది కాదు. అది విభిన్న సామాజిక మూలాల నుంచి ప్రవహించిన అనేకభావ, భౌతిక వాస్తవికతల సంగమం. పెట్టుబడిదారీ వ్యవస్థలోని అమానుషత్వం, కార్మిక వర్గ పోరాటాలూ, సామాజిక సమస్యల పరిష్కారానికి అనేకమంది మేధావుల సిద్ధాంతాలు కమ్యూనిస్టు ప్రణాళిక ఆవిర్భవించడానికి

హేతువులు. కమ్యూనిస్టు ప్రణాళిక కేవలం శుష్క సిద్ధాంత పత్రం కాదు. విప్లవ సిద్ధాంత విప్లవ ఆచరణల సామాజిక కార్యక్రమం. ఆర్థిక రాజకీయ సామాజిక తాత్విక నైతిక సాంస్కృతిక అంశాల అన్యోన్య సంబంధాల మొత్తం. కార్మికవర్గాన్ని పీడించే బూర్జువా వర్గంపై పోరాడడానికి కావల్సిన వ్యూహాన్ని, ఎత్తుగడల్ని సమకూర్చడానికే ప్రణాళిక ఉద్దేశించబడింది. శతృత్వంతో కూడిన వర్గాల మధ్య సామరస్యం ఏర్పడడం అసాధ్యమని నిరూపించారు. విప్లవం అనివార్యమని, కార్మికవర్గ విజయం అనివార్యమని తేల్చారు. పెట్టుబడిదారీ వ్యవస్థను రూపుమాపి, నవ సమాజాన్ని నిర్మించడం చారిత్రక కర్తవ్యంగా గలిగిన అగ్రగామి వర్గమైన కార్మిక వర్గపోరాటానికి మార్గదర్శిగా ఉపకరించగలదనీ మార్క్స్, ఎంగెల్స్ భావించారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు సమాజ క్రమాన్ని అవగాహన చేసుకొని, సిద్ధాంతీకరించే అపారమైన కృషి ప్రణాళికలో పరిపక్వమయింది. పశ్చిమ యూరప్ దేశాల్లోని వర్గపోరాటాల నుంచే కమ్యూనిస్టు ప్రణాళిక ఆవిర్భవించింది. మార్క్స్, ఎంగెల్స్‌లు ఒక రోజులోనే మార్క్సిస్టులు కాలేదు. 19వ శతాబ్దంలోని శ్రామికవర్గ పోరాటాల్నీ సిద్ధాంతాల్నీ అధ్యయనం చేస్తూ తత్వశాస్త్రం, రాజకీయార్ధశాస్త్రం, వర్గ పోరాట సిద్ధాంతాలను ఒక క్రమంలో ఐక్యంచేసి నూతన ప్రాపంచిక దృక్పథానికి రూపకల్పన చేశారు. జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లోని తాత్విక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు మార్క్సిజానికి మూడు మూలాధారాలు మూడు అవిభాజ్య భాగాలు. వలస దేశాలు సామ్రాజ్యవాదులకి వ్యతిరేకంగా పోరాడు తున్నాయి. భూస్వామ్య వ్యవస్థ మీద బూర్జువా వర్గం పోరాడుతున్నది. బూర్జువావర్గం మీద కార్మికవర్గం పోరాడుతోంది. చరిత్ర పూర్వదశని అంతం చేసే కార్మికవర్గ పోరాటం పశ్చిమ దేశాల్లో జరుగుతోంది.

చార్టిస్టు ఉద్యమం, సైలీషియన్ కార్మికుల పోరాటం వంటివి పాలక వర్గాన్ని వణుకు పుట్టిస్తున్నాయి. పాత ప్రపంచానికి సంబంధించిన పాత భావాలకి వ్యతిరేకంగా అనేక కొత్తభావాలు పుడుతున్నాయి. తరతరాలుగా వస్తున్న సకల సామాజిక సంస్థల్నీ, భావవ్యవస్థల్నీ ప్రశ్నించడం ప్రారంభమైంది. దోపిడి వర్గాలకి వ్యతిరేకంగా అనేక రహస్య సంఘాలు పనిచేస్తున్నాయి. మార్క్స్, ఏంగెల్సులు భౌతిక గతితర్క ప్రాపంచిక దృక్పథం నుంచి కార్మికవర్గం విప్లవకర వర్గమనీ, భౌతికశక్తిని భౌతికశక్తే కూలతోయగలదనీ ఆవిష్కరించిన తర్వాత ప్రపంచ కార్మికుల్ని ఐక్యం చేయడానికి కృషి ప్రారంభించారు. సోషలిస్టుల పేరుతో, కమ్యూనిస్టుల పేరుతో ఉన్న అనేక మందిని కలిసి చర్చించారు. అనేక సంస్థలతో సంబంధాలు పెట్టుకున్నారు. ఒక పక్క వర్గపోరాటాలు, మరొకపక్క సిద్ధాంత ఘర్షణలనుంచి ప్రణాళిక రూపుదిద్దుకుంది. అందుకనే ఇందులో ప్రతి వాక్యం సంఘర్షణ నుంచి ప్రసవించినట్టు స్పష్టంగా కనిపిస్తుంది.

కమ్యూనిస్టు ప్రణాళిక తనని తాను పరిచయం చేసుకోవడంతో ప్రారంభం అవుతుంది. యూరప్ ఖండంలోని మతగురువులూ, మహారాజులూ, మహాసంపన్నులూ గజగజ వణికి పోతున్నారు. ఎందుకు? ఖండం అంతటా వ్యాపించిన కమ్యూనిస్టు భూతం గురించి, అందుకని కమ్యూనిస్టులు తమ ఆశయాల్ని స్పష్టంగా ప్రజలకి చాటిచెప్పవలసిన సమయం పరిపక్వం అయింది. అందుకే కమ్యూనిస్టు ప్రణాళిక వర్గ పోరాటాల, దోపిడీ పీడనల చరిత్రను ప్రకటించింది. "కమ్యూనిస్టులు తమ అభిప్రాయాలనూ, తమ లక్ష్యాలనూ, తమ ధోరణులనూ, బాహాటంగా, యావత్ ప్రపంచం ఎదుటా ప్రకటించి, కమ్యూనిస్టు భూతమనే ఈ కట్టు కథను తమ పార్టీ ప్రణాళికతోనే ఎదుర్కోవలసిన సమయం ఆసన్నమైంది". ఇదీ ప్రణాళికా రచనకి భౌతిక గతితర్క కారణం. చరిత్రలో ఒక సమయం ఆసన్నమైనప్పుడు దాన్ని తక్షణం ఎదుర్కోవడం కమ్యూనిస్టుల కర్తవ్యం. లేకపోతే చరిత్ర గమనానికి అగ్రగామి దళంగా పనిచేయలేరు. ఈ ఎదుర్కునే లక్ష్యాన్ని నెరవేర్చడానికి ప్రణాళికారచన చేయబడింది. ఈ లక్ష్యమే ప్రణాళికలోని ప్రతి వాక్యానికీ ఉత్తేజం.

కమ్యూనిస్టు ప్రణాళికలో 1. బూర్జువాలూ - కార్మికులూ 2. కార్మికులూ - కమ్యూనిస్టులూ 3. సోషలిస్టు-కమ్యూనిస్టు సాహిత్యం 4. ఈనాటి వివిధ ప్రతిపక్ష పార్టీల మీద కమ్యూనిస్టుల వైఖరి, అనే నాలుగు భాగాలు ఉన్నాయి. వీటికి అంతర గతితర్కం ఉంది.

**బూర్జువాలు - కార్మికులు**

ప్రణాళికలో మొదటి భాగం బూర్జువాలూ-కార్మికులూ అనే దాంట్లో ఇంతవరకు మానవ సమాజ చరిత్ర అంతా (ఆదిమ సమాజం తప్ప) వర్గపోరాటాల చరిత్రే అన్న వాక్యంతో ప్రారంభమవుతుంది. మార్క్స్ సమాజ వర్గ స్వభావమూ, వర్గాల పూర్వచరిత్ర సూచించి ఆధునిక బూర్జువా వర్గం పుట్టుకనీ, అభివృద్ధినీ గత తార్కికంగా ప్రతిపాదించి బూర్జువా వర్గంతో పాటు అవిభాజ్యంగా ఆవిర్భవించే కార్మిక వర్గాన్ని గురించి వివరించి "బూర్జువావర్గ పతనమూ అనివార్యమని, కార్మికవర్గ విజయమూ తథ్యమని" నిరూపించాడు. ఇది మొత్తం మానవజాతి చరిత్రని గతతార్కిక సిద్ధాంతంతో సాధించిన విజయం. ఇక్కడ చరిత్ర అంటే మానవ అస్తిత్వాన్ని సామాజిక అభివృద్ధికి సంబంధించిన క్రమంగా అవగాహన చేసుకోవాలి. ఆదిమ కమ్యూనిస్టు సమాజంలో వర్గపోరాటం ప్రకృతికి సమాజానికి మధ్య వైరుధ్య రూపంలో ఉంటుంది. ప్రకృతి నుంచీ ఉత్పత్తి సాధనాల్ని ఉత్పత్తిచేసే క్రమంలోనూ, సమిష్టి సమాజ నిర్మాణ శ్రమ విభజనలోనూ క్రమంగా ఆదిమ కమ్యూనిస్టు సమాజం విచ్ఛిన్నమై పోయింది.

మార్క్స్ సమాజ ప్రధాన స్వరూపాన్ని సామాజిక-ఆర్థిక నిర్మాణపరంగా నిర్వచించి పూర్వవ్యవస్థల్ని ప్రస్తావనా పూర్వకంగా నిరూపించి బూర్జువా వ్యవస్థని గూర్చి విపులంగా చర్చించాడు. ఆర్థికంగా రాజకీయంగా భావజాలపరంగా బూర్జువా వ్యవస్థ చరిత్రని పరిమాణం నుండి గుణాత్మక మార్పు, ఐక్యత-ఘర్షణ, అభావం అభావం చెందడాలు అనే మూడు మౌలిక సూత్రాల్ని ఒక మొత్తంగా గ్రహించి చిత్రించాడు. మధ్యయుగాల్లో స్వతంత్ర పౌరులుగా ప్రారంభమై వృత్తి సంఘాలనుంచి కార్ఖానా పరిశ్రమలకీ, పారిశ్రామిక మధ్యతరగతి నుంచి పారిశ్రామిక అధిపతులుగా ఎదిగారు. అంటే, ఆధునిక బూర్జువాలుగా అవతరించారు. ఆనాటి ఐరోపా రాజకీయ పరిస్థితి పరిశీలిస్తే పలు దేశాలలో బూర్జువావర్గం తన స్థానాన్ని పటిష్ట పరచుకొంటోంది. అప్పటికి ఆధిక్యత సంపాదించు కోని ఇంకా అనేక దేశాలలో అందుకోసం పెనుగులాడు తోంది. ఫ్యూడలిజం ప్రతినిధులతో పోరాడటంలో అప్పటివరకు మెరుపు దళాలుగా పనిచేసిన కార్మికవర్గం తోటి ఘర్షణలు కూడా అప్పుడే జరిగాయి.

ఇంగ్లండ్‌లో కార్మిక వర్గపు అండదండలతో బూర్జువా వర్గం 1832లో అధికారం సాధించింది. ఫ్రాన్స్‌లో కూడా కార్మికుల తోడ్పాటుతో పదవ చార్లెస్ రాజు ఓడించబడ్డాడు.జారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడు

తున్న పోలెండ్‌కు సహకరిస్తూ జాతీయ స్వాతంత్ర్యం కొరకు సాగుతున్న పోరాటాలకు సహకరించింది. 19వ శతాబ్దం మధ్య నాటికి వస్తువుల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల సాధ్యమయింది. పరిశ్రమలు వాణిజ్యం బాగా పెంపొందాయి. ఈ క్రమంతో పాటు అమెరికా ఖండాన్ని ఆవిష్కరించడం, సముద్రమార్గాల్ని కనిపెట్టడం, మార్కెట్లు ఏర్పడడం, వలసదేశాల్లో వర్తకం, సరుకుల ఉత్పత్తి పెరగడంతో, వాణిజ్యానికీ, సముద్ర యానానికీ పరిశ్రమలకీ మంచి ఊపువచ్చింది. ఆవిరి ఇంజన్లూ, యంత్రాలూ అభివృద్ధి పొందడంతో పరిశ్రమలు ఇంకా అభివృద్ధి అయ్యాయి.

"ఈ విధంగా పరిశ్రమలూ, వాణిజ్యమూ, సముద్రయానమూ, రైల్వేలూ విస్తరించేకొద్దీ, అదే దామాషాలో బూర్జువా వర్గమూ అభివృద్ధి చెందింది. దాని పెట్టుబడి పెరిగింది. మధ్యయుగాల నుండి వచ్చిన ప్రతివర్గమూ వెనక్కి నెట్టివేయబడింది". కాబట్టి ఆధునిక బూర్జువా వర్గమనేదే దీర్ఘకాలిక ఫలితంగా ఏర్పడిందనీ, ఉత్పత్తి విధానాల్లోనూ మారకపు విధానాల్లోనూ జరిగిన అనేక విప్లవాల పర్యవసానమనీ మనకి అర్థమవుతున్నది. బూర్జువా వర్గానికి ఆర్థికవ్యవస్థ మీద అధికారం రాగానే 'తదనుగుణంగా అది అడుగడుగునా రాజకీయంగా కూడా పురోగమించింది'. కాబట్టి ఆధునిక రాజ్యంలో ప్రభుత్వం అనేది మొత్తం బూర్జువా వర్గపు సమిష్టి వ్యవహారాలు చక్కబెట్టే కమిటీ మాత్రమే". ఇలా బూర్జువా వర్గం ఆర్థిక, రాజకీయాధిపత్యాన్ని సంపాదించుకుంది. సమాజం అంటే ఆర్థిక రాజకీయమే కాదు. మత నైతిక కళాసాహిత్య న్యాయశాస్త్రం వంటి ఉపరితల అంశాలు చాలా ముఖ్యమైనవి.

బూర్జువా వర్గం మొత్తంగా ఫ్యూడల్ సంకెళ్లను బద్దలుకొట్టి వాటి స్థానే స్వేచ్ఛాయుత పోటీ పద్ధతిని ప్రవేశపెట్టింది. దాని కనుగుణంగానే సామాజిక వ్యవస్థ, రాజ్యాంగ నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకుంది. మానవ సంబంధాలన్నిటినీ ఆర్థిక సంబంధాలుగా మార్చి వేసింది. పూర్వ సామాజిక రూపాల్లో ఉండిన అన్ని ముసుగుల్నీ చించిపారవేసింది. జీవితంలో మార్పుల్ని వేగవంతం చేసింది. "భౌతిక వస్తువుల ఉత్పత్తిలో ఉన్న పరిస్థితే బౌద్ధిక ఉత్పత్తికి కూడా వర్తిస్తుంది". కాబట్టి బూర్జువాలు సమాజ పునాదిని, ఉపరితలాంశాల్ని మార్చి వేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే "బూర్జువావర్గం తన్నుపోలిన ప్రపంచాన్ని సృష్టిస్తుంది". అందుకనే వర్గం అంటే ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక అంగాలతో కూడిన వర్గం. బూర్జువా ఉత్పత్తి విధానంలో ఆర్థిక పునాదిని ఉపరితల అంశం నుంచి విభజించడానికి వీల్లేదు. ఒక నిర్దిష్ట కాలంలో, ప్రజలు సాధించిన ఆర్థికాభివృద్ధి పునాదిగా ఉంటుంది. అయితే రాజకీయ సంస్థలు, న్యాయపరమైన భావాలు, కళలు, మతం వంటి భావాలు ఉపరితలంలో నెలకొంటాయి.

పెట్టుబడిదారీ సమాజంలో బూర్జువావర్గం ఒకపక్కా కార్మిక వర్గం మరొక పక్కా శత్రు శిబిరాలుగా నిలుస్తాయి. అంటే పెట్టుబడిదారీ సాంఘిక-ఆర్థిక నిర్మాణంలో కార్మికవర్గం లేకుండా బూర్జువావర్గం, బూర్జువా వర్గం లేకుండా కార్మికవర్గం సాధ్యం కాదు. ఈ రెండు వర్గాలకీ మధ్య వైరుధ్యమే బూర్జువా వ్యవస్థ ప్రధాన వైరుధ్యం. కార్మిక బూర్జువా వర్గాలు కలిసి ఒక వ్యవస్థగా ఉండటమే ఐక్యత. రెండు వర్గాలకీ నిరంతర పోరాటమే సంఘర్షణ. ఫ్యూడల్ వ్యవస్థకి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కార్మికవర్గం బూర్జువా వర్గాన్ని సమర్థించింది. బూర్జువాలు అధికారంలోకి రాగానే బూర్జువా, కార్మికవర్గ పోరాటం ఉధృతం అవుతుంది. బూర్జువావర్గం తననే నాశనం చేయగల మనుషులను కూడా అది సృష్టించింది. ఆ మనుషులే కార్మికవర్గం. పెట్టుబడిదారీవర్గం ఏ ఆయుధాలతో ఫ్యూడల్ శక్తుల్ని నాశనం చేసిందో, అదే ఆయుధాలు పెట్టుబడిదారీ వర్గానికి ఎదురు తిరుగుతాయి. అంటే బూర్జువావర్గం తననే అభావం చేసే కార్మికవర్గాన్ని సృష్టించుకుంది.

బూర్జువావర్గ దోపిడీ విధానం వల్ల, ఉత్పత్తి శక్తుల నిరంతర విప్లవీకరణం వల్ల శ్రమశక్తిని మాత్రమే అమ్ముకొని జీవించే కార్మికవర్గం పరిస్థితి హృదయ విదారకంగా మారిపోతుంది. శ్రమశక్తి సరుకుగా మారి శ్రామికుడు పరాయీకరణం పొందుతాడు. మధ్యవర్గాలు అనేకం బూర్జువావర్గంతో పోటీకి నిలవలేక కార్మికవర్గంలోకి చేరిపోతుంటారు. కార్మికుడు బహుముఖ దోపిడీకి గురవుతాడు. ఆధునిక సమాజంలో శ్రామిక వర్గమే అందరికంటే అట్టడుగు వర్గం. ఇప్పటి వరకు సమాజ చరిత్రలో జరిగిన ఉద్యమాలన్నీ అల్ప సంఖ్యాకుల ఉద్యమాలు, కార్మికుల ఉద్యమం అలాంటిదికాదు. అది స్వచైతన్యంతో స్వతంత్రంగా కొనసాగే అధిక సంఖ్యాకుల ఉద్యమం. 'ప్రతి వర్గపోరాటమూ ఒక రాజకీయ పోరాటమే'. 'పెట్టుబడిదారీ వర్గం నాశనం కావడం, కార్మికవర్గం జయించడం తప్పదు' అన్న హెచ్చరికతో మొదటిభాగం ముగుస్తుంది.

ఈ విధంగా 'బూర్జువాలూ-కార్మికులూ' అనే ప్రణాళిక మొదటి భాగంలో మొత్తం వర్గ సమాజ చరిత్ర, బూర్జువా కార్మికవర్గాల ఆవిర్భావం, వాటి మధ్య వైరుధ్యం తీవ్రతరం కావడం, అంతిమంగా బూర్జువావర్గం పరాజయాన్ని పొందడాన్ని, కార్మికవర్గం విజయాన్ని పొందడాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు గతితర్క వస్తుగత సూత్రాలతో నిరూపించారు. పునాదినీ ఉపరితల అంశాల్ని ఒక వ్యవస్థగా ఒక మహత్తర చారిత్రక సందర్భాన్ని ప్రపంచ ప్రజల ముందు నిలిపారు.

**కార్మికులు - కమ్యూనిస్టులు**

కార్మికోద్యమం పట్ల కమ్యూనిస్టులు అనుసరించాల్సిన వ్యూహం, ఎత్తుగడలను గూర్చి ప్రణాళిక రెండవ భాగం వివరిస్తుంది. కార్మిక ఉద్యమాన్ని జయప్రదం చేసే, బూర్జువా వర్గాన్ని కూలదోసే, కార్మికవర్గ రాజ్యాన్ని నెలకొల్పే ప్రతిపాదనల నుంచి జనించే ప్రశ్నలకి సమాధానాలు కనిపిస్తాయి. కార్మికులకీ కమ్యూనిస్టులకీ గాఢానుబంధం లేకపోతే బూర్జువావర్గం పతనంకాదు. సిద్ధాంతరీత్యా కార్మికులు కమ్యూనిస్టులు కాకపోతే బూర్జువావర్గం మీద విజయాన్ని సాధించలేరు. కమ్యూనిస్టులు అంటే కార్మికవర్గాన్ని చైతన్యవంతం చేసే అగ్రగామి దళం. కమ్యూనిస్టులకు కార్మికవర్గ ప్రయోజనాలకి భిన్నమైన, విడిగా ఉండే ప్రయోజనాలు ఏమీ ఉండవు. కార్మికులు ఒకవర్గంగా రూపొందడం, బూర్జువాల ఆధిపత్యాన్ని కూలదోయడం, కార్మికవర్గం రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకోవడం కమ్యూనిస్టుల కర్తవ్యంగా చెప్పబడింది.

కమ్యూనిస్టుల మీద బూర్జువావర్గం చేసే తప్పుడు ఆరోపణల్ని మార్క్స్ ఎంగెల్స్ ఈ భాగంలో ఖండించారు. కమ్యూనిస్టుల వైఖరిని స్పష్టం చేశారు. కమ్యూనిస్టుల ఆశయాల్ని చెపుతూనే బూర్జువాలూ ఇతర పాలక వర్గాలూ చేసే తప్పుడు ప్రచారాన్ని ఖండించారు. సొంత ఆస్తిని రద్దు చేయడం కమ్యూనిస్టుల కేంద్ర లక్ష్యం. మానవులు స్వయంకృషితో సొంతానికి ఆస్తి సంపాదించుకునే హక్కుని కమ్యూనిస్టులు రద్దు చేస్తారనీ దాంతో మానవుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అన్నీ పోతాయని బూర్జువాలు

ఆరోపిస్తారు. నిజానికి బూర్జువా వ్యవస్థలో అనేక మందికి సొంత ఆస్తి లేదు. బూర్జువాల పెట్టుబడి పెరగడానికి కారణం అవుతున్న అసంఖ్యాక కార్మికవర్గానికి సొంత ఆస్తి లేదు. బూర్జువాలకున్న సొంత ఆస్తి వాళ్ళ శ్రమపడి సంపాదించింది కాదు. శ్రామికుల అదనపు శ్రమనే పెట్టుబడిగా, బూర్జువా ఆస్తిగా మారుతోంది.

బూర్జువా సమాజం దృష్టిలో తన సంస్కృతి అంతరించడమంటే యావత్తు సంస్కృతి అంతరించి పోతుందని వాపోతారు. బూర్జువా సొంత ఆస్తిని రద్దు చేయడం అంటే బూర్జువా వ్యక్తిత్వాన్ని, బూర్జువా స్వాతంత్ర్యాన్ని, బూర్జువా స్వేచ్ఛని రద్దు చేయడమే. బూర్జువా వ్యవస్థలో స్వేచ్ఛ అంటే వ్యాపార స్వేచ్ఛ. క్రయవిక్రయాల స్వేచ్ఛ. దీన్ని కమ్యూనిస్టులు రద్దు చేస్తారు. సామాజిక స్వభావం గల ఉత్పత్తి కొద్ది మంది పెట్టుబడిదారుల అధికారంలో ఉండే విధానాన్ని తొలగిస్తుంది తప్ప కమ్యూనిజం అసలు ఆస్తినే రద్దు చేయదు. సొంత ఆస్తిని రద్దు చేస్తే కష్టపడి పనిచేయడం ఆగిపోతుందనీ, ప్రపంచం అంతా సోమరితనం అలముకుంటుందనీ బూర్జువావర్గం ఆరోపిస్తుంది. "ఈ వాదం నిజమే అయితే సోమరితనంతో బూర్జువా సమాజం, ఎప్పుడో నాశనం అయిపోయేది. ఈ సమాజంలో పనిచేసేవాళ్ళు ఏమీ సంపాదించుకో లేకపోవడమూ, పని చేయనివాళ్లు సంపాదించుకోవడం మనకి తెలిసిన విషయమే".

భౌతిక ఉత్పత్తిని గురించిన కమ్యూనిస్టుల ఆశయాల మీద చేస్తున్న ఆరోపణలే బూర్జువాలు బౌద్ధిక ఉత్పాదితాల మీద కూడా చేస్తున్నారు. వర్గ ఆస్తి అదృశ్యం కావడాన్ని అసలు ఉత్పత్తే అదృశ్యం కావడంగా బూర్జువాలు ఎలా భావిస్తున్నారో, వర్గ సంస్కృతి అదృశ్యం కావడాన్ని మొత్తం సంస్కృతి అంతా అదృశ్యం కావడంగా భావిస్తారు. "ఏ సంస్కృతి పోతుందని బూర్జువా విలపిస్తున్నాడో ఆ సంస్కృతి సమాజంలో అధికాధిక సంఖ్యాకులకు యంత్రం లాగా పనిచేసే గుదిబండ మాత్రమే". బూర్జువా సమాజంలో సంస్కృతి అంతా అధిక సంఖ్యాకులైన కార్మికవర్గాన్ని ప్రత్యక్షంగా పరోక్షంగా బూర్జువావర్గ ప్రయోజనాలకి విధేయం చేస్తూ యంత్రాల్లాగా పని చేయించడానికి ఉద్దేశింపబడిందే. స్వేచ్ఛ, సంస్కృతి, న్యాయశాస్త్రం వంటివి బూర్జువా ఉత్పత్తి విధానం నుంచి పుట్టినవే. బూర్జువావర్గ ఆర్థిక పునాది పోతే బూర్జువా వ్యవస్థ ఉపరితల అంశాలూ అంతరిస్తాయి.

కమ్యూనిస్టులు కుటుంబాన్ని రద్దుచేస్తారనీ, విద్యని సమాజపరం చేస్తారనీ, తల్లిదండ్రులకీ పిల్లలకీ అనుబంధాల్ని తెంచివేస్తారనీ బూర్జువాల ఆరోపణ. బూర్జువా కుటుంబం పెట్టుబడి మీద, వ్యక్తిగత లాభం మీద ఆధారపడి ఉంది. తండ్రులు తమ పిల్లల మీద సాగించే దోపిడీని కమ్యూనిస్టులు అంతం చేయాలనుకుంటున్నది నిజమే. విద్యలో సామాజిక జోక్యం యొక్క స్వభావం మార్చాలనీ పాలకవర్గ ప్రభావంలో చిక్కుకున్న విద్యను రక్షించాలన్నది కమ్యూనిస్టుల ఆశయం. ఇక స్త్రీలను గురించిన కమ్యూనిస్టుల వైఖరిని బూర్జువాలు అసహ్యంగా వక్రీకరిస్తారు. ఉత్పత్తి సాధనాలను సమిష్టిగా ఉపయోగించుకుంటారని అనగానే స్త్రీలకు కూడా అదే గతి సంభవిస్తుందని బూర్జువాలు ఆరోపిస్తారు. అది వాళ్ళ వర్గ కుటిలత్వం. తాను సృష్టించిన కుటుంబ వ్యవస్థ మినహా మరెలాంటి కుటుంబ వ్యవస్థ ఉనికిని బూర్జువా వర్గం ఊహించజాలదు. అందువల్ల బూర్జువా కుటుంబ వ్యవస్థను రద్దు చేస్తామని ప్రకటించడంతో, కమ్యూనిజం ఏ తరహా కుటుంబమూ లేకుండా చేస్తానంటున్నదని గగ్గోలు చేస్తారు. కమ్యూనిస్టు పునాదికి అనుగుణ్యంగా కుటుంబం కూడా మారిపోతుంది. నిజానికి స్త్రీలను సమిష్టి ఆస్తిగా చేయడానికో మరొకటి చేయడానికో వాళ్ళు ఏమీ వస్తువులు కాదు. బూర్జువా వ్యవస్థని శ్రామిక స్త్రీ పురుషులు కలిసే సమాధి చేస్తారు. మత నైతిక తాత్త్విక రంగాలకి సంబంధించిన "శాశ్వత విలువల్ని" కమ్యూనిస్టులు నాశనం చేస్తారని బూర్జువా వర్గం భారీ ఎత్తున ప్రచారం చేస్తుంది. "ఒక విషయం మాత్రం గతించిన యుగాలన్నిటికీ సమాన లక్షణంగా ఉంది. అది ఏమిటంటే సమాజంలో పురుషులు, స్త్రీలపై ఆధిపత్యం చలాయిస్తారు. కాబట్టి గత చరిత్రలో సామాజిక చైతన్య రూపాల్లో ఎంత వైవిధ్యం కనిపించినా సారాంశంలో పోలికలే ఎక్కువ ఉంటాయి. "కమ్యూనిస్టు విప్లవం అనేది సాంప్రదాయిక ఆస్తి సంబంధాలతో అత్యంత మౌలికంగా తెగతెంపులు చేసుకోవడం కనుక కమ్యూనిస్టు విప్లవం యొక్క అభివృద్ధిలో సాంప్రదాయిక భావాలతో అత్యంత మౌలికంగా తెగతెంపులు చేసుకోవడం ఇమిడి ఉంది".

కాబట్టి కమ్యూనిస్టు విప్లవం పెట్టుబడిదారీ ఆర్థిక పునాదినీ ఆ పునాదితో బాటు దాని ఉపరితల అంశాలనూ కూడా నిర్మూలిస్తుంది. ఇదే కార్మికుల కమ్యూనిస్టుల మహత్తర ఆశయం. ఈ ఆశయాన్ని కార్మికవర్గం రాజ్యాధికారాన్ని పొందడం ద్వారానే క్రమగతిలో సాధించగలుగుతారు. "వర్గాలూ, వర్గ విభేధాలూ గల పాత బూర్జువా సమాజానికి బదులు మనకొక నూతన సమాజం లభిస్తుంది. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందినప్పుడే అందరూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందగల సమాజం ఏర్పడుతుంది". కార్మికులూ-కమ్యూనిస్టులూ అనే రెండవ భాగం వర్గరహిత సమాజ స్థాపన లక్ష్య ప్రకటనతో ముగిసింది. సిద్ధాంత ఆచరణ కార్యక్రమాలు గతితార్కికంగా కలిసిపోయిన సమాజ ప్రస్థాన గీతంలా ప్రణాళిక కార్మికవర్గాన్నీ, కమ్యూనిస్టుల్నీ పోరాటంలో ఉత్తేజ పరిచింది.

**సోషలిస్టు కమ్యూనిస్టు సాహిత్యం**

ప్రణాళిక మూడవభాగం 'సోషలిస్టు కమ్యూనిస్టు సాహిత్యం' లో మార్క్స్, ఎంగెల్స్‌లు తమ కాలం నాటి తమకు పూర్వకాలం నాటి సోషలిస్టు, కమ్యూనిస్టు సిద్ధాంతాల్ని శాస్త్రీయంగా విమర్శించి ఖండించారు. వాటికీ తమ సిద్ధాంతానికీ విబేధాల్ని స్పష్టంగా విశ్లేషించారు. కార్మికుల సంఖ్య పెరిగేకొద్దీ వారికి ఉత్పత్తిలోనున్న కీలక స్థానాన్ని గుర్తించేకొద్దీ, తమకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా కార్మికులు సంఘటితమై పోరాడే కొద్దీ, సామాజిక న్యాయం జరగాలనే శక్తులు, కొంత మంది వారి స్వప్రయోజనాల దృష్ట్యానూ, మరికొంత మంది ఉదారబుద్ధితోనూ కార్మికుల్ని బలపరుస్తూ, తామూ సోషలిస్టులమని చెప్పుకొంటూ ముందుకు వస్తారు. అలాంటి వివిధ రకాల సోషలిస్టు అభిప్రాయాలు గలవారినీ, వారి అభిప్రాయాలనూ శాస్త్రీయ దృష్టితో విమర్శిస్తూ ప్రణాళికలోని మూడవ భాగంలో మార్క్స్-ఎంగెల్స్ తమ అభిప్రాయాలను స్పష్టం చేశారు.

బాబేఫ్, సెయింట్ సైమన్, ఓవెన్, ఫోరియర్, ప్రూడన్ వంటి సోషలిస్టుల సిద్ధాంతాల్నీ ఇంకా అనేక ఇతర సిద్ధాంతాల్నీ వర్గ పోరాట సిద్ధాంతం నుంచి విశ్లేషించారు. ఫ్రాన్స్, ఇంగ్లాండ్ దేశాలలో ప్యూడల్ జమీందారీ వర్గాలు ఆధునిక పెట్టుబడిదారీ వర్గాన్ని ఖండిస్తూ అనేక రచనలు చేశారు. వారు పెట్టుబడిదారీ వర్గాన్ని విమర్శించడానికి కారణం శ్రామికవర్గం విప్లవకరవర్గం అన్న భయం. క్రైస్తవ మతం బానిస విధానాన్ని, భూస్వామ్యాన్ని సమర్థించింది. ప్రణాళిక పెటీ బూర్జువా

సోషలిజం, బూర్జువా సోషలిజం, ఉహాజనిత సోషలిజం వంటి సిద్ధాంతాలను విమర్శ ద్వారా పూర్వపక్షం చేసింది. ఈ సిద్ధాంతాలు చాలావరకూ అభావం అయిపోయినప్పటికీ ఇప్పటికీ సోషలిజం పేరుతో అనేక సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. అశాస్త్రీయ సిద్ధాంతాల్ని వర్గదృష్టి నుంచి పరిశీలించి నిరాకరించే పద్ధతిని ఈనాటికీ ప్రమాణంగా స్వీకరించాలి.

**ప్రతిపక్ష పార్టీల పట్ల కమ్యూనిస్టుల వైఖరి**

ప్రణాళికలో నాలుగవభాగం ప్రతిపక్ష పార్టీల పట్ల కమ్యూనిస్టుల వైఖరి అనేది కార్మికవర్గ విప్లవ ఎత్తుగడలకి సంబంధించింది. కార్మిక వర్గానికి వ్యతిరేకంగా, కమ్యూనిస్టులు పార్టీ పెట్టరు. కమ్యూనిస్టు పార్టీయేకాక ఇంకా ఇతర పార్టీలు ఉన్నప్పుడు వాటి పట్ల ఎలాంటి వైఖరి ఉండాలి. కార్మికవర్గ అంతిమ లక్ష్యం వెలుగులో కార్మికుల తక్షణ ప్రయోజనాల కోసం కమ్యూనిస్టులు ఇతర పార్టీలతో కలిసి పని చేస్తారు. ఆనాటి సాంఘిక, రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే ప్రతి విప్లవోద్యమాన్ని కమ్యూనిస్టులు బలపరుస్తారు. సకల దేశాల ప్రజాతంత్ర పార్టీల మధ్య ఐక్యతని సాధించడానికి కమ్యూనిస్టులు కృషి చేస్తారు. ప్రతి దేశంలోని విప్లవోద్యమానికీ తోడ్పడుతారు.

బూర్జువా సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా ఏ దేశంలో విప్లవోద్యమం కొనసాగినా దానిని కమ్యూనిస్టులు బలపరుస్తారు. అన్ని దేశాల్లో కమ్యూనిస్టులు ప్రజాతంత్ర పార్టీలతో కలసి పనిచేస్తారు. వాటితో ఒడంబడికలు చేసుకుంటారు. పెట్టుబడిదారీ విధానం గుత్తపెట్టుబడిగా మారి ద్రవ్య పెట్టుబడిగా దోపిడి చేస్తున్న క్రమంలో దేశ, విదేశ పార్టీలతో సంబంధం పెట్టుకున్నప్పుడు, ఉద్యమాల్ని బలపరుస్తున్నప్పుడు కమ్యూనిస్టులు తమ అభిప్రాయాల్ని దాచుకోరు. ప్రపంచ దేశాల్లోని ప్రజావ్యతిరేక ప్రభుత్వాల "సమస్త వర్తమాన సాంఘిక పరిస్థితులనూ బలవంతంగా కూలదోయడం ద్వారానే తమ లక్ష్యాలు సిద్ధించగలవని వాళ్ళు బహిరంగంగానే ప్రకటిస్తారు.

కమ్యూనిస్టులు తమ అభిప్రాయాలనూ, ఆశయాలనూ కప్పిపుచ్చు కోరు. ప్రస్తుత సామాజిక వ్యవస్థను నాశనం చేస్తేగాని తమ ఆశయాలు సిద్ధించవని ప్రకటిస్తారు. విప్లవమంటే పాలకవర్గాలు గజగజ వణుకుతాయి. కమ్యూనిస్టు విప్లవమంటే కార్మికులు పోగొట్టుకునేది ఏమీ లేదు. తమ శృంఖలాలు తప్ప. వాళ్ళు పొందవలసింది ఎంతైనా ఉంది. ఇతర పార్టీల పట్ల ఉద్యమాల పట్ల కమ్యూనిస్టుల వైఖరి మీద ప్రణాళికలో చెప్పినది ఈనాటికి అన్వయిస్తుంది. 'యూరప్‌ను ఒక భూతం అవహించింది. కమ్యూనిజం అనే భూతం' అనే వాక్యంతో ప్రారంభమైన ప్రణాళిక 'సకల దేశాల కార్మికులారా ఏకం కండి' కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించండి అనే పిలుపుతో పూర్తి చేయబడింది. చారిత్రకంగా ఈ ప్రణాళిక దేశదేశాల కమ్యూనిస్టులకు మార్గదర్శకంగా ఈ నాటికీ ఉపయోగపడుతోంది. కానీ ఇది కేవలం ఒకదేశంలోని ఒక సమయంలోని కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక కాదు. అన్ని దేశాల కమ్యూనిస్టు పార్టీలకు రాజకీయ, ఆర్థిక, తాత్విక ఆదర్శ పత్రం.

**ముగింపు**

దోపిడీని తీవ్రతరం చేయడం ద్వారా తృతీయ ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసేందుకై రూపొందించిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల పేరుతో సామ్రాజ్యవాదం సాగిస్తున్న కొత్తదాడులు పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అన్యాయపూరిత, అమానుష స్వభావాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. వర్ధమాన ప్రపంచంలోని కోట్లాది మందిని చుట్టుముట్టిన ఆకలి, కడగండ్లు, రోగాలు, నిరక్షరాస్యతలతో కూడిన భయానక దుస్థితికి దురాశతో అది చేస్తున్న దోపిడీయే కారణం. చివరకు అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ప్రపంచంలో సైతం శ్రామిక ప్రజల కష్టార్జితమైన హక్కులను ఈ దాడి కుదించి వేస్తున్నది. మానవాళి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించలేని అసమర్థ వ్యవస్థగా పెట్టుబడిదారీ వ్యవస్థ గతంలోకన్నా ఎక్కువగా ఈనాడు తనకుతానే రుజువు చేసుకుంటున్నది.

ప్రణాళిక ప్రచురితమైన నాటి నుండి ప్రపంచంలో చెప్పుకోదగిన మార్పులు అనేకం సంభవించాయి. అయినప్పటికీ మారుతున్న చారిత్రక పరిస్థితులకు సంబంధమున్న పలు ఘటనలను అవగాహన చేసుకోవడానికీ, విశ్లేషించడానికీ ఈ ప్రణాళిక మనకు సాధన సంపత్తిని సమకూరుస్తున్నది. సృజనాత్మకమైన శాస్త్రంగా మార్క్సిజం మానవాభివృద్ధిలోని ధోరణులను, దిశలను గుర్తిస్తున్నది. ఇలా చేయడం ద్వారా దోపిడీ రహిత సమాజ స్థాపనలో భాగస్వాములయ్యే అవకాశాన్ని ప్రజానీకానికి కల్పిస్తున్నది. వర్గ పోరాటాన్ని, నూతన సమాజానికి దిక్సూచి అయిన కార్మికవర్గం నిర్వహించాల్సిన చారిత్రక విప్లవ కర్తవ్యాన్ని గురించి వివరించింది. ప్రపంచానికి భాష్యం చెప్పటమే కాదు, దానిని మార్చటానికి కావలసిన చైతన్యాన్ని అందిస్తుంది.

"ఈ చిన్న పుస్తకం ఎన్నో సంపుటాల కంటే విలువైంది. ఈనాటికీ నాగరిక ప్రపంచంలో పోరాటం చేస్తున్న కార్మిక వర్గానికి మార్గదర్శకంగా ఉంది". పెట్టుబడిదారీ వ్యవస్థలోని కార్మికవర్గ ఉద్యమాన్ని ప్రతిబింబించిన ఈ ప్రణాళికని సామ్రాజ్యవాద యుగంలో ఏ మార్పులూ, చేర్పులు లేకుండా స్వీకరించడం సాధ్యం కాదు. లెనిన్ సామ్రాజ్యవాద యుగంలో కమ్యూనిస్టు పార్టీ వ్యూహాన్నీ ఎత్తుగడల్ని కార్యక్రమాన్ని రూపొందించి విప్లవాన్ని విజయవంతం చేశాడు. 1928లో సామ్రాజ్యవాద యుగప్రత్యేక లక్షణాల్ని వివరిస్తూ ప్రోగ్రాం ఆఫ్ ద కమ్యూనిస్టు ఇంటర్‌నేషనల్ అనే పేరుతో స్టాలిన్ నాయకత్వాన కంపానియన్ వాల్యూం ఆఫ్ ద మానిఫెస్టోని రూపొందించడం జరిగింది. చైనా విప్లవానుభవాన్ని సిద్ధాంతీకరిస్తూ మావో రాసిన న్యూ డెమోక్రటిక్ రివల్యూషన్ వ్యాసాల్ని కూడా మానిఫెస్టోకి అనుబంధంగా అధ్యయనం చేయాలి.

చారిత్రక భౌతికవాదం, గతితార్కిక భౌతికవాదం, వర్గపోరాట సిద్ధాంతం, కార్మికవర్గ విప్లవకర పాత్రల విషయంలో ఒక మహత్తర ప్రమాణ పత్రంగా ప్రణాళికకు మార్క్సిస్టు సాహిత్యంలో తిరుగులేని స్థానం ఉన్నప్పటికీ కార్యక్రమ సూచికగా గ్రహించాలంటే లెనినిజం. మావో ఆలోచనా విధానం వెలుగు నుంచీ అదనపు సమాచారాన్ని అనుబంధం చేసుకోవాల్సి ఉంటుంది. చారిత్రక పరిణామాల కనుగుణంగా ఈ సృజనాత్మక కార్మికవర్గ అస్త్రాన్ని సుసంపన్నం చేసుకోవడంలో అరకొరలు, వైఫల్యాలు అనేవి, దాని సారాంశంలో గతితర్క భౌతికవాద పద్ధతి లేకపోవడంవల్ల సంభవించలేదు. ఈ తాత్విక భౌతిక గతితర్క దృక్పథాన్ని స్వీకరించిన వారిలో శాస్త్రీయత కొరబడడం వల్లనే. అందువల్ల ఈ సృజనాత్మక ప్రణాళికను సుసంపన్నం చేసుకోవడంలో అరకొరలు, వైఫల్యాలు అధిగమించాల్సిన బాధ్యత కార్మికవర్గ అగ్రగామి పార్టీపై ఉంది.

*(రచయిత రాజనీతిశాస్త్ర విద్యార్థి, ఉపాధ్యాయ నాయకులు)* వీ

# కమ్యూనిస్టు ప్రణాళికా - పెట్టుబడీ

- బ్రహ్మచారి

కమ్యూనిస్టులకి ముఖ్యమైన పుస్తకాలు రెండు : ప్రణాళిక, కాపిటల్. ప్రణాళిక మార్క్సు ఎంగెల్స్ ఇద్దరూ కలిసి రాసింది. 1848లో విడుదలైంది. 'నేడు యూరప్ ఖండాన్ని కమ్యూనిజం అనే బ్రహ్మరాక్షసి ఆవహించింది. దాన్ని భూస్థాపితం చేయడానికి పాత యూరప్ లోని పాలకవర్గాలన్నీ పోప్ మఠాధిపతీ, జార్జ్ చక్రవర్తీ, మెటర్నిక్, గ్యూజో, ఫ్రెంచ్ రాడికల్స్, జర్మన్ సి.ఐ.డి లు కలిసిపవిత్ర కూటమిగా ఏర్పడ్డారు' అని పుస్తకం మొదలవుతుంది.

ప్రభుత్వంలో అధికారం చేస్తున్న ప్రతిపార్టీ తన్ను వ్యతిరేకించే ఇతర పార్టీ లన్నిటినీ కమ్యూనిస్ట్ పార్టీలనేవారు. బ్రహ్మరాక్షసిగా చిత్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం ముమ్మరంగా చేసేవారు. అందువల్ల "కమ్యూనిస్టులు బహిరంగంగా తమ అభిప్రాయాలను, ఆశయాలను, పోకడలను ప్రకటించ వలసిన సమయం ఏనాడో వచ్చింది. కమ్యూనిజాన్ని బ్రహ్మరాక్షసిగా చిత్రించే వారి పుక్కిటి పురాణాన్ని పటాపంచలు చేయడానికి పార్టీ తరపున ఒక ప్రణాళికను ప్రచురించ వలసిన అవసరమేర్పడింది."

కమ్యూనిస్ట్ లీగ్ (అంతర్జాతీయ కార్మికసంఘం) ఆ పనికి పూనుకుంది.

లీగ్ లక్ష్యం: బూర్జువాలను కూలదొయ్యడం, కార్మికవర్గ పాలన, వర్గవైషమ్యాల మీద నిలబడ్డ పాత బూర్జువా సమాజాన్ని రద్దుచేయ్యడం, వర్గాలు లేని, ప్రైవేటు ఆస్తి లేని సమాజాన్ని నెలకొల్పడం.

ఈ లక్ష్య సాధనకు 'సకల దేశాల కార్మికులారా ఏకం కండి' అని ప్రణాళిక పిలుపు నిస్తుంది. ఐక్యమై ఏం చెయ్యాలో స్థూలంగా చెబుతుంది.

కాపిటల్ మార్క్సు ఒక్కడే రాసింది. అది 1867 లో విడుదలైంది. లక్ష్యం: ఆధునిక సమాజ చలనం ఆర్థిక నియమాన్ని ఆవిష్కరించడం. "అదనపు విలువ ఉత్పత్తి పెట్టుబడి దారీ ఉత్పత్తి విధానపు పరమ నియమం."

ఆ నియమాన్ని ఆవిష్కరించడం మార్క్సు లక్ష్యం. దోపిడీకి ఆధారం అయిన అదనపు విలువ నియమాన్ని కనిపెట్టడమే ఆయన ఆవిష్కరణ. అదనపు విలువ సిద్ధాంతమే ఆయన ఆర్థిక సిద్ధాంతానికి మూల స్తంభం. లెనిన్ అన్నట్లు పెట్టుబడిదారీ సమాజం సోషలిస్టు సమాజంగా పరివర్తన చెందే అనివార్యతని ఈ నియమం నుంచే లాగుతాడు.

కాపిటల్ పెట్టుబడిదారీ విధానం ఎలా ఆవిర్భవించి, అభివృద్ధిచెంది, అంతరిస్తుందో వివరంగా చెబుతుంది. అందులో కార్మికులు ఎలా దోచుకోబడతారో, పెట్టుబడి దారుడు శ్రామికుల శ్రమశక్తి నుండి వీలైనంత ఎలా దోచుకుంటాడో మార్క్సు చూపుతాడు. దోపిడీని పెంచేందుకు, పెట్టుబడిదారులు అవలంబించే పద్ధతుల్ని వివరిస్తాడు.

పెట్టుబడిదారీ వర్గం అభివృద్ధి గురించి ప్రణాళిక ఇలా చెబుతుంది– మార్కెట్లు విస్తరించేకొద్దీ గిల్డు విధానం పోయి, కార్ఖానా ఉత్పత్తి విధానం ప్రవేశించింది. అయితే మార్కెట్లు ఇంకా విస్తరించాయి. కార్ఖానా ఉత్పత్తి విధానం సరిపోలేదు. యంత్ర పరిశ్రమలు వచ్చాయి. వీటి అధిపతులే ఆధునిక పెట్టుబడిదారీ వర్గం (బూర్జువా వర్గం)

ఆధునిక యంత్ర పరిశ్రమల వల్ల సరుకుల మార్కెట్ ప్రపంచాని కంతకూ విస్తరించింది. విదేశీవ్యాపారానికీ, రహదారులకూ ఎంతో ప్రోత్సాహమిచ్చింది. ఇవన్నీ తిరిగి పరిశ్రమల విస్తరణకు కారణ మయ్యాయి. పరిశ్రమలూ, వ్యాపారమూ, నౌకాయానమూ, రైల్వేలూ అభివృద్ధి చెందేకొద్దీ పెట్టుబడిదారీ వర్గం కూడా అభివృద్ధి చెందింది – అని ప్రణాళిక చెబుతుంది. అయితే గిల్డు విధానం గురించీ, కార్ఖానా ఉత్పత్తి గురించీ, యంత్రాల గురించీ, యంత్ర పరిశ్రమ గురించీ కాపిటల్‌లో ఎంతో వివరంగా ఉంటుంది.

ఇంతవరకూ నడిచిన సమాజపు చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే– అని ప్రణాళిక తొలివాక్యం. అయితే ఆపోరాటం ఎందుకు ఎలా ఏర్పడి అభివృద్ధి అయిందో తెలుసుకోవాలంటే కాపిటల్ చదవాల్సిందే.

**అదనపు విలువ, శ్రమ శక్తి**

అదనపు విలువ, శ్రమ శక్తి – ఈరెండు మాటలూ ప్రణాళికలో ఉండవు. కాపిటల్‌లో వీటిగురించి అధ్యాయాలకధ్యాయాలే ఉన్నాయి. అదనపు విలువ సిద్ధాంతాలు 3 సంపుటాల బృహద్గ్రంథం. దోపిడీ అనే మాట ప్రణాళికలో వస్తుంది. అయితే అందుకు నిర్వచనం కావాలంటే కాపిటల్ చూడాల్సిందే. అదెలా జరుగుతుందో కాపిటల్ చర్చిస్తుంది.

**ప్రణాళికలో ప్రత్యేకంగా ఉన్నవి**

వివిధ ప్రతిపక్ష పార్టీల పట్ల కమ్యూనిస్టులు వ్యవహరించాల్సిన తీరు వివరిస్తుంది. ఇది కాపిటల్ లో ఉండదు. కార్మికులు ఐక్యమయ్యాక ఏం చెయ్యాలని మార్క్సు అనుకున్నాడో తెలుసుకోవాలంటే ప్రణాళిక చూడాల్సిందే.

కార్మిక వర్గ విప్లవంలో మొదటి మెట్టు కార్మికవర్గం పాలక వర్గం కావడం. రాజ్యాధికారం చేపట్టాక శ్రామిక వర్గ కర్తవ్యాలు

– పెట్టుబడిదారీ వర్గం నుంచి సమస్త పెట్టుబడినీ క్రమక్రమంగా గుంజుకోవడం.

– ఉత్పత్తి సాధనాలన్నిటినీ ప్రభుత్వమే,అనగా పాలక వర్గంగా సంఘటితపడ్డ శ్రామిక వర్గ ప్రభుత్వమే తన చేతుల్లోకి తీసుకోవడం

– ఉత్పత్తి శక్తుల్ని సాధ్యమైనంత వేగంగా అభివృద్ధి చేయడం.

ఇందుకు కొన్ని సాధారణ చర్యలు అవసరం. అయితే ఈ చర్యలు భిన్నదేశాల్లో భిన్నభిన్నంగా ఉండటం సహజమే. అయినప్పటికీ, అత్యంత పురోగామి దేశాలకు ఈ క్రింది చర్యలు వర్తిస్తాయి.

1. భూమిని వ్యక్తుల సొంత ఆస్తిగా ఉంచుకునే పద్ధతిని రద్దు చేయాలి. భూమినించి వసూలయ్యే శిస్తులను ప్రజా సౌకర్యాలకు వినియోగించాలి.

2. ఆదాయపు పన్నును వృద్ధిక్రమానుసారంగా విధించాలి. ఆదాయం హెచ్చేకొద్దీ పన్ను రేట్లను కూడా ఎక్కువ చేయాలి.

3. వారసత్వపు హక్కును రద్దు చేయాలి.

4. అప్పులిచ్చే హక్కు జాతీయ బాంకుకు తప్ప మరెవరికీ ఉండకూడదు.

5. రాకపోక మార్గాలనూ, తంతి, తపాలా, టెలిఫోన్లు వగైరాలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని నిర్వహించాలి.

6. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఫ్యాక్టరీలనూ, ఉత్పత్తి సాధనాలనూ కొత్త ప్రాంతాలకు విస్తరింప చేయాలి.

7. బంజరు భూములన్నిటినీ సేద్యంలోకి తీసుకురావాలి.

8. ప్రజలందరూ తప్పనిసరిగా పనిచేసి తీరాలి.

9. వ్యవసాయానికీ పరిశ్రమలకూ మధ్య సమన్వయం ఉండేటట్లు చూడాలి.

10. దేశజనాభాను సక్రమ పద్ధతిన పంపకం చేయడం ద్వారా పల్లెలకూ పట్టణాలకూ మధ్య గల వ్యత్యాసాన్ని క్రమంగా రద్దు చేయాలి.

11. బాల బాలికలందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా చదువు నేర్పాలి. బాల బాలికలు ఇప్పటివలె ఫ్యాక్టరీలలో పనిచేసే పద్ధతిని నిర్మూలించాలి. విద్యవిధానానికీ, పారిశ్రామికోత్పత్తికీ, అవినాభావ సంబంధం ఉండేట్లు చూడాలి.

ఇలాంటివే మరికొన్ని చర్యలు కూడా తీసుకోవటం అవసరం కావచ్చు.

**కాపిటల్ అంత తేలికగా అర్థం కాదు**

ప్రణాళిక ఒక రాజకీయ పార్టీ సమావేశంలో సమర్పించిన రాజకీయ పత్రం. సాధారణ పాఠకులకు సైతం సులభంగా అర్థమవుతుంది. ప్రణాళిక చిన్న పుస్తకం. గంటలో చదవచ్చు. కాపిటల్ 3 సంపుటాల పెద్ద పుస్తకం. సిద్ధాంత గ్రంథం. చదవడానికి చాలా సమయం పడుతుంది. పైగా ఎంతో కష్టపడిచదివే వాళ్లకు మాత్రమే అర్థమవుతుంది.

"పాఠకుడు కొత్తవిషయాన్ని నేర్చుకోడానికి సిద్ధపడిఉన్నవాడుగా స్వతస్సిద్ధంగా ఆలోచించే వాడుగా ఉండాలి" అన్నాడు మార్క్స్ కాపిటల్ తొలి జర్మన్ ఎడిషన్‌కి ముందు మాటలో. ఎందుకు కష్టమో ఫ్రెంచ్ ఎడిషన్ ముందుమాటలో స్థూలంగా చెప్పాడు. "ఏ సైన్స్‌లోనైనా ప్రారంభం ఎప్పుడూ కష్టంగా ఉంటుంది. అందువల్ల, తొలి విభాగం (సెక్షన్) అందునా, సరుకుల విశ్లేషణ ఉన్న భాగం అర్థం కావడం అత్యంత కష్టంగా ఉంటుంది."

**కష్టంగా ఉండడానికి కారణాలు**

"నేను వాడిన విశ్లేషణా విధానం గతంలో అర్థశాస్త్రానికి వాడలేదు. దాని (విశ్లేషణా విధానం) వల్ల తొలి చాప్టర్లు అర్థమవడం కష్టంగా/ జటిలంగా/ కఠినంగా ఉంటుంది." ఆయన పాటించిన విశ్లేషణా విధానాన్ని తెలుసుకొని చదివితే అర్థం చేసుకోవచ్చు. అందుకు కొంత శ్రమపడి అవసరమైన విషయాలు నేర్చుకోవడం అవసరం. పాఠకుడు అటువంటి వాడై ఉండాలి అంటాడు.

కాపిటల్‌లో ఒకే సైన్స్‌కి లాజిక్‌నీ, గతితర్కాన్నీ, భౌతికవాద జ్ఞానసిద్ధాంతాన్నీ వర్తింపచేశాడు– అన్నాడు లెనిన్.

తనది గతితార్కిక పద్ధతి కాక మరేమిటి? అని ప్రశ్నించాడు మార్క్స్.

**గతితర్కం : వైరుధ్యాలు**

సరుకు ఉపయోగపు విలువ, విలువల సమ్మేళనం. అవిరెండూ విరుద్ధాంశాలు. కలిసున్నంతవరకే సరుకు. విడిపోతే విలువ ఒకచోటికీ, ఉపయోగపు విలువ మరోకచోటికీ చేరతాయి. అలా చేరకపోతే సరుకులు మేటలు వేస్తాయి. మరీ ఎక్కువయితే సంక్షోభం వస్తుంది. పెట్టుబడి సాధారణ సూత్రంలోని వైరుధ్యాలు అనే ముఖ్యమైన అధ్యాయం ఉంది.

ప్రస్తుతం పరిశోధిస్తున్న ప్రక్రియ 'డబ్బు మరింత డబ్బు అవడం' అనేది. ఈపరిశోధన రెండు షరతులు నెరవేర్చాలి.

1. మిత్రుడు 'డబ్బు సంచీ' ఇప్పటికి లార్వా రూపంలోనే ఉన్న పెట్టుబడిదారుడు. అతను సరుకుల్ని వాటి విలువలకే కొనాలి, వాటి విలువలకే అమ్మాలి. అయినా గాని ప్రక్రియ చివరలో చలామణీలో మొదటపెట్టిన విలువ కంటే ఎక్కువ విలువని చలామణీ నుండి రాబట్టాలి.

2. అతను సీతాకోక చిలుకగా, అంటే సంపూర్ణ పెట్టుబడి దారుడుగా, వృద్ధి అవడం, చలామణీ రంగంలోనూ జరగాలి, చలామణీ రంగంలో జరగనూ కూడదు.

మార్క్స్ ముందుగా సరుకుల మారకాన్ని విశ్లేషిస్తాడు. అందులో ఆధునిక సమాజంలోని అన్ని వైరుధ్యాల్నీవిశ్లేషణ వెల్లడిస్తుంది అన్నాడు లెనిన్.

**పరిమాణాత్మక మార్పులు గుణాత్మక మార్పుకి దారితీయడం**

మధ్యయుగాల్లో పెట్టిన గరిష్టమొత్తం కంటే చాలా ఎక్కువ పెట్టగలిగిన సందర్భాలలోనే, డబ్బున్నవాడు పెట్టుబడిదారుడిగా అవగలడు. ఇతను అడ్వాన్స్ చేసే కనిష్ఠ మొత్తం వృత్తియజమాని పెట్టే గరిష్టమొత్తం కంటే ఎంతో ఎక్కువ వుంటుంది. కేవలం పరిమాణాత్మక తేడాలు ఒకస్థాయి దాటితే గుణాత్మక మార్పులు అవుతాయని హెగెల్ చెప్పిన నియమం ఇక్కడ రుజువైంది అంటాడు మార్క్స్.

**అభావం అభావం చెందడం**

ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణా, శ్రమ సామాజికీకరణా అంతిమంగా ఒక స్థాయికి చేరుకుంటాయి. ఆ స్థాయివద్ద వాటికీ, వాటి పెట్టుబడిదారీ పై పెంకుకీ పొసగదు, పొత్తు కుదరదు. ఆ పెంకు బద్దలవుతుంది. పెట్టుబడిదారీ ప్రైవేటు ఆస్తికి మరణ గంట మోగుతుంది. ఆస్తి హర్తల ఆస్తి హరించబడుతుంది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి ఫలితం అయిన పెట్టుబడిదారీ స్వాయత్త విధానం పెట్టుబడిదారీ ప్రైవేట్ ఆస్తిని ఏర్పరుస్తుంది. ఉత్పత్తిదారుని సొంత శ్రమమీద ఆధారపడ్డ వ్యష్టి ప్రైవేట్ ఆస్తికి ఇది మొదటి అభావం. అయితే, పెట్టుబడిదారీ ఉత్పత్తి తన సొంత అభావాన్ని అనివార్యంగా తెచ్చుకుంటుంది. ఇది అభావం యొక్క అభావం. ఇది ఉత్పాదకుని ప్రైవేట్ ఆస్తిని మళ్లీ స్థాపించదు. కాని, పెట్టుబడిదారీ యుగం ఆర్జన మీద– అంటే, సహకారం మీదా, ఉమ్మడి దైన భూమిమీదా ,ఉత్పత్తి సాధనాల మీదా– ఆధారపడ్డ వ్యక్తిగత ఆస్తినిస్తుంది.

**కాపిటల్‌లో తేల్చిన విషయాలు**

మార్క్స్ పూర్వులకు విలువకీ, మారకం విలువకీ తేడాలేదు. శ్రమకీ శ్రమ శక్తికీ తేడా లేదు. మారకం విలువకీ, విలువకీ ఉన్న తేడాని, శ్రమకీ శ్రమ శక్తికీ ఉన్న తేడా మార్క్స్ విశ్లేషించి కాపిటల్‌లో తేల్చాడు.

అప్పటికి శ్రమశక్తి అనే కాటగరీ లేదు. దాని ద్వారా కాపిటల్‌లో తేల్చింది ఏమిటి? దోపిడీ ఉన్నదని కాదు. ఆవిషయం అంతకు ముందు వాళ్లకూ తెలుసు. అందుకు కారణం అసమానమారకం అని రికార్డియన్ సోషలిస్టులు భావించారు. ఉత్పత్తయినదంతా శ్రామికులకి చెందాలి అన్నారు. అయితే మారకం అనేది సమాన విలువల మధ్యే అనేది మారక నియమం. మారక నియమానికీ, వాస్తవానికీ పొత్తుకుదరడం లేదు.

**సమాన మారకం జరుగుతూనే లాభం రావాలి. ఎలా?**

పెట్టుబడిదారుడు కార్మికుని నుంచి కొంటున్నది శ్రమని కాదు, శ్రమశక్తిని అని తేల్చాడు. సమానమారకం జరుగుతూనే అదనపు విలువ ఎలా వస్తుందో రుజువు చేశాడు. అదనపు విలువ సిద్ధాంతాలు మూడు భాగాలలో అదనపు విలువ గురించి సమగ్రంగా చర్చించాడు. ఆతర్వాత కాపిటల్ రాశాడు. కాపిటల్ చదివితే, మార్క్స్ సిద్ధాంతం మీద పట్టు చిక్కుతుంది.

సరుకు ద్వంద్వ స్వభావి. ఉపయోగపు విలువ, మారకం విలువ

అనే విరుద్ధాంశాల సమ్మేళనం. తదుపరి విశ్లేషణ ద్వారా మారకం విలువ వెనక ఉన్న విలువని చూపుతాడు. విలువ వేరు, మారకం విలువ వేరు అని తేలుస్తాడు. సరుకు కచ్చితంగా చెప్పాలంటే, ఉపయోగపు విలువా, విలువా అంటాడు. మొదట చెప్పింది తప్పు అంటాడు. మారకంవిలువ అనేది విలువ రూపం అని స్పష్టం చేస్తాడు. విలువ రూపం అభివృద్ధిని వివరిస్తాడు.

విలువ డబ్బు రూపం తీసుకునేదాకా మధ్యంతర రూపాల్ని పరిశీలిస్తాడు. డబ్బు పెట్టుబడిగా మారడం, శ్రమశక్తి కొనుగోలూ అమ్మకమూ, అదనపు విలువ ఉత్పత్తీ,సాపేక్ష అదనపు విలువ ఉత్పత్తీ, కార్ఖానా ఉత్పత్తీ, యంత్రాలూ ఆధునిక పరిశ్రమలూ–వీటి గురించి వివరిస్తాడు. పనిదినం పొడిగింపు, పిల్లల్ని పనికి పెట్టుకోవడం – వంటి అదనపు విలువని పెంచుకునే అంశాలను దీర్ఘంగా చర్చిస్తాడు.

పెట్టుబడి పోగుబడి,లాభం రేటు తగ్గే ధోరణి, కార్మిక వర్గం మీద పెట్టుబడి పోగుబడి ప్రభావం– పారిశ్రామిక రిజర్వ్ సైన్యం ఏర్పడడమూ, సంక్షోభాలూ రావడమూ – వగైరాల గురించి క్షుణ్ణంగా వివరిస్తాడు.

**సంక్షోభాలు**

పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభాలు అనివార్యంగా వస్తుంటాయి. "అవి వచ్చినప్పుడల్లా అంతకంతకూ మరింత ప్రమాదకరంగా, మొత్తం బూర్జువా సమాజానికే చావు బతుకుల సమస్య తెచ్చి పెడుతున్నాయి. ఈ సంక్షోభాలు వచ్చినప్పుడల్లా, ఉత్పత్తి అయిన సరుకుల్లోనే గాక, గతంలో సృష్టించబడిన ఉత్పాదక శక్తులలో కూడా పెద్ద భాగం నాశనం చేయబడుతుంది. గత యుగాల్లో అసంభవంగా కనిపించే ఒక అంటురోగం ఈ సంక్షోభ సమయాల్లో చెలరేగుతుంది. మితిమీరిన ఉత్పత్తి అనే అంటురోగం.." అన్నాడు ప్రణాళికలో.

అమితోత్పత్తి ఎందుకు, ఎలా ఏర్పడుతుందో కాపిటల్ లో ఉంటుంది. సరుకు అమ్మకానికీ, కొనుగోలుకీ మధ్య విరామం మరీ ఎక్కువయితే, వాటి మధ్య ఉండే సన్నిహిత సంబంధం, వాటి ఏకత్వం సంక్షోభాన్ని ఏర్పరచడం ద్వారా నిరూపించుకుంటుంది అంటుంది కాపిటల్.

సంక్షోభంలో సరుకులకీ వాటి విలువ రూపమయిన డబ్బుకీ మధ్య వైరుధ్యం పరమ వైరుధ్యంగా పరిణమిస్తుంది అంటుంది.

"లాభాల రేటుకు పడిపోయే పోకడ ఉంటుంది. పెట్టుబడి దారులు లాభాల మొత్తంపెంచడం ద్వారా దాన్ని భర్తీ చేయడానికి ప్రయత్నిస్తారు. దీనిని సాధించడానికి వాళ్లు మార్కెట్ పరిమాణాన్ని లెక్కలోకి తీసుకోకుండా ఉత్పత్తిని విస్తృత పరుస్తారు. అమితోత్పత్తి సంక్షోభాలు తీవ్రమయ్యే అవకాశం దీనిద్వారా ఏర్పడుతుంది.

లాభం రేటు పడిపోయే ధోరణీ, దానికి విరుగుడుగా పనిచేసే ధోరణీ పెట్టుబడిదారీ విధానం లోని అంతర్వైరుధ్యాలను తీవ్ర పరుస్తాయని మార్క్స్ నిర్ధారిస్తాడు. సంక్షోభాలు మళ్లీ మళ్లీ వస్తాయి. అంతకంతకూ తీవ్రమవుతాయి. చివరకి అవి పెట్టుబడిదారీ ఉత్పత్తి బలవంతపు పతనానికి దారితీస్తాయి. దాన్ని పతనంచేసే కర్త ఎవరు? కార్మిక వర్గం.

ఈ అంటురోగం వల్ల 'హఠాత్తుగా మానవ సమాజం తాత్కాలిక ఆటవిక దశలో ప్రవేశించినట్లుంటుంది; కాటకమో సర్వ విధ్వంసక యుద్ధమో వచ్చి సకల ప్రాణాధార వస్తువుల సరఫరానూ భగ్నం చేసినట్లుంటుంది. పరిశ్రమలూ వాణిజ్యమూ ధ్వంసమైనట్లు ఉంటుంది.'

ఆ సంక్షోభాల్ని పెట్టుబడిదారీ వర్గం ఎలా అధిగమిస్తుంది?

– ఉత్పాదక శక్తుల్లో కొంతభాగాన్ని విధిలేక ధ్వంసం చెయ్యడం ద్వారా.

– కొత్త మార్కెట్లను జయించడం ద్వారా.

– పాత మార్కెట్లను మరింత కట్టుదిట్టంగా దోచుకోవడం ద్వారా.

అంటే మరింత విస్తృతమైన, మరింత విధ్వంసకమైన సంక్షోభాలకు బాటవేయడం ద్వారా అన్న మాట. అంటుంది ప్రణాళిక.

సంక్షోభాల గురించి కాపిటల్ 4వ భాగం అనుకునే అదనపు విలువ సిద్ధాంతాలలో ఎన్నోచోట్ల ఉంటుంది. అవి పెట్టుబడిదారీ విధానం లోని ఏ వైరుధ్యాల మూలంగా వస్తాయో, ఎలా సాగుతాయో, కార్మికుల మీద వాటి ప్రభావం ఏమిటో ఎంతో వివరంగా కాపిటల్‌లో ఉంటుంది.

కార్మికుడు యంత్రానికి తోక అవుతాడు అంటుంది ప్రణాళిక. ఎందుకో పెట్టుబడిలో వివరిస్తాడు. కార్మికుడు యంత్రానికి తోకయ్యాడు.

మొదట, సరుకు తయారీకి అవసరమైన ఉత్పత్తి సాధనాలు లేక పోవడం వల్ల, తన శ్రమ శక్తిని పెట్టుబడికి అమ్ముతాడు. ఇప్పుడు అదే శ్రమశక్తి పెట్టుబడికి అమ్ముడవకపోతే, అది అతనికి ఉపయోగపడదు. అమ్ముడయిన తర్వాత కార్ఖానాలో మాత్రమే పనులు చెయ్యగలుగుతాడు. స్వతంత్రంగా ఏదీ చెయ్యలేడు. కనుక కార్ఖానా కార్మికుడు పెట్టుబడిదారుడి వర్క్ షాప్ కి తోకగా మాత్రమే తన ఉత్పాదక శక్తిని పెంచుకోగలడు.

"అతడొక యంత్రానికి తోక ఐనాడు. అతనికి ఉండవలసినదల్లా పనిలో చాకచక్యం మాత్రమే – గానుగెద్దు పనిలాగా అత్యంత విసుగు పుట్టించేదీ, అత్యంత సులభంగా అలవడేదీ ఐన చాకచక్యం మాత్రమే. అతడు చేయవలసిన పని బహు సులభం. దాన్ని సునాయాసంగా నేర్చుకోవచ్చు."

**నిరుద్యోగ సైన్యం**

"ఆధునిక పరిశ్రమలు అభివృద్ధి అయ్యేకొద్దీ కార్మికుని నైపుణ్యానికీ, శరీర బలానికీ ప్రాముఖ్యం తగ్గుతుంది.... యజమానులు పురుషులను తొలగించి స్త్రీలను పనిలో పెట్టుకుంటారు."

"మధ్య తరగతిలోని కింది శ్రేణి వాళ్లు – చిన్నచిన్న వ్యాపారస్తులూ, దుకాణదారులూ, రిటైరైన వర్తకులూ, చేతిపనివాళ్లూ, రైతులూ – వీళ్లందరూ క్రమక్రమంగా కార్మిక వర్గంలోకి దిగజారిపోతారు."

ఆధునిక కార్మికుడు పరిశ్రమలు అభివృద్ధి అయ్యేకొద్దీ పైకి రాకుండా ఇంకా కిందికి పోతున్నాడు; కార్మిక జీవన విధానానికి కూడా అంటిపెట్టు కోకుండా దినదినానికీ ఇంకా అడుక్కు, ఇంకా లోతుకు పోతున్నాడు.

దారిద్ర్యం, పీడన, బానిసత్వం, దోపిడీల పరిమాణం పెరుగుతుంది. దాంతోపాటు కార్మికవర్గ నిరసన కూడా పెరుగుతుంది. వర్గ పోరాటం మొనదేలుతుంది. కార్మిక వర్గం ఆధునిక పరిశ్రమల అతిముఖ్య సృష్టి.

బూర్జువా వర్గం ఉత్పత్తి చేసే వాటిలోకెల్లా ముఖ్యమైనదేమంటే తనకే మారకులైన వాళ్లు. బూర్జువావర్గ పతనమూ అనివార్యమే, కార్మికవర్గ విజయమూ అనివార్యమే అంటుంది ప్రణాళిక. కాపిటల్‌లో పెట్టుబడిదారీ ఉత్పత్తి పతనంకావడం ఎందుకు అనివార్యమో సిద్ధాంతపరంగా రుజువు చేస్తాడు. కమ్యూనిస్టులు రెండూ చదవాలి. పెట్టుబడి అందరూ చదవడం కుదరదు. ఏ పార్టీకైనా ప్రణాళిక ప్రధానమైంది. కమ్యూనిస్టులకూ అంతే. కమ్యూనిస్టుల కర్తవ్యాలేమిటో అందులో ఉంటాయి. కనక ప్రతి కమ్యూనిస్ట్ చదవాల్సి ఉంటుంది. దానికి ప్రత్యామ్నాయం లేదు.

పెట్టుబడి అర్థం చేసుకోవడం అంత సులభం కాదని చూశాం. పెట్టుబడి చదవ(లే)క పోయినా, అందులో విషయాన్ని తెలియజెప్పే పుస్తకాలు చాలా ఉన్నాయి. వాటిలో మార్క్స్ చెప్పింది చెప్పినట్లు రాసి ఉంటుంది. వాటిని కొంచెం తేలికగా చదువుకోవచ్చు. లియాన్‌టీవ్ రాసిన 'పొలిటికల్ ఎకానమీ – ఎ బిగినర్స్ కోర్స్' అనే పుస్తకానికి నందూరి ప్రసాదరావు అనువాదం 'రాజకీయ అర్థశాస్త్రం 'పేరుతో' 1947లో ప్రజాశక్తి ప్రచురణాలయం అచ్చువేసింది.

# మార్క్సిజం విశ్వజనీన సత్యం

- డా. నళిని

మార్క్సిజం అంటే ఒక శాస్త్రీయ దృక్పథం. సమాజాన్ని, దాని చలనాన్ని, దాన్ని నడిపే ఆర్థిక రాజకీయ సూత్రాలను అధ్యయనం చేసే ఒక సాధనం. 'నేను సోషలిస్టు విధానాన్ని నిర్మించలేదు' అన్నారు మార్క్స్. మరి ఆయన దృక్పథం ఏమిటి? ఆయన ఏమి బోధించారు? ప్రపంచం ఎలా అభివృద్ధి చెందుతుందో అర్థం చేసుకునే దృష్టి కోణాన్ని ఆయన మనకి అందించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సంబంధాల అనుసంధానాన్ని వివరించాడు. సిద్ధాంతానికి, ఆచరణకి మధ్య ఒక బలమైన అనుబంధాన్ని ఏర్పరిచే సూత్రాన్ని రూపొందించారు.

ఒక వ్యక్తి స్వేచ్ఛాయుతంగా అభివృద్ధి చెందాలంటే సమూహం కూడా స్వేచ్ఛాయుతంగా అభివృద్ధి చెందేలాంటి వ్యవస్థని నిర్మించాలనే 'కమ్యూనిస్ట్ ప్రకాళిక' లోని మాటలు చూస్తే, ఆ లక్ష్యాన్ని సాధించడం కోసం మార్క్సిజం కొన్ని ప్రధానమైన సూత్రాల మీద ఆధారపడిందని తెలుస్తుంది.

అసమానతలు పీడిస్తున్న ఆర్థిక విధానంలో, మెజారిటీ శ్రామికవర్గం దోపిడీకి గురవుతుంటే, అందరి అవసరాలు తీరడానికి బదులు కొందరు మాత్రమే లాభాలు గడిస్తుంటే – అలాంటి సమాజంలో సమూలమైన మార్పుని తెచ్చేదే కార్మికవర్గ విప్లవం. పరస్పర సహకారంతో, సంపదని సమానంగా పంచుకుంటూ సేవలను అందించే సమాజం కావాలి.

కార్మికవర్గం విముక్తి చెందాలంటే, కార్మికవర్గం రాజ్యాధికారాన్ని చేపట్టాలి. వివిధ దోపిడీ పీడనల సంకెళ్లని తెంచుకుని ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడం వారి చేతిలోనే ఉంది.

ప్రపంచ కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించుకునే దిశగా కార్మికుల ఉమ్మడి లక్ష్యాలను గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా పోరాడాలి.

చరిత్రని గతితార్కిక భౌతికవాద దృష్టితో విశ్లేషించాలి.

సమాజంలో ఘోరమైన అసమానతలు ఉన్నాయని, పాలకులకి పీడుతులకి మధ్య వర్గ పోరాటం తప్పదనే సత్యాన్ని గుర్తించాలి. సమానత్వాన్ని సాధించే దిశగా, మార్క్సిస్టులు కార్మికులతో చేతులు కలిపి, సమాజాన్ని పునర్నిర్మించే విధంగా అడుగులు వేస్తారు.

మనం విమర్శనా దృష్టిని అలవరచుకోవాలి. 'అన్నిటినీ శాస్త్రీయ దృష్టితో చూడ'మన్నాడు మార్క్స్. అప్పుడే నిజాన్ని అర్థం చేసుకుని, దాన్ని మార్చే ప్రయత్నం చేయగలుగుతాం.

ఈ సూత్రాలని స్థూలంగా అంగీకరిస్తూ, మార్క్స్ బోధనలని పరిశీలిద్దాం. 19వ దశకం నాటికి జర్మన్ తత్వశాస్త్రం, ఇంగ్లాండ్ రాజకీయ అర్థశాస్త్రం, ఫ్రెంచి సోషలిజం మనుగడలో ఉన్నాయి. వీటిని అవపోసన పట్టిన మార్క్స్ ప్రతిపాదించిన మార్క్సిజం గతితార్కిక భౌతికవాదాన్ని, ఆధునిక శాస్త్రీయ సోషలిజాన్ని కార్మికవర్గ పోరాటానికి సిద్ధాంతంగా, కార్యక్రమంగా రూపొందించింది.

మార్క్స్ తాత్విక భౌతికవాదంలో 'భౌతిక ప్రపంచమే మనిషి మెదడుని ప్రభావితం చేసి ఆలోచనల రూపంలో ప్రతిబింబిస్తుంది' అన్నారు. అలానే, 'అవసరాన్ని గుర్తించడాన్నే స్వేచ్ఛ అంటారు. అవసరం స్వేచ్ఛగా మారడం, వస్తువు వస్తువుగా కాక 'మన' వస్తువుగా మారడమే భౌతికవాదం' అన్నారు.

గతితార్కికత గురించి చెప్పాలంటే, ప్రకృతే గతితర్కానికి నిదర్శనం. 'బాహ్య ప్రపంచలోను, మనిషి ఆలోచనలోను గోచరించే చలన సూత్రాల శాస్త్రాన్నే గతితర్కం అంటారు.' అభివృద్ధిని గతితర్క సూత్రాలకి అన్వయిస్తే, అభివృద్ధి గీతలుగానో, వలయాలుగానో కాక, నడి లేదా స్పైరల్‌గా ఉంటుంది. అంటే, ఎదుగుదల ఉంటుంది. అది గంతులుగా, ఉపద్రవాలుగా, విప్లవాలుగా ఉంటుంది. పరిమాణాత్మక పదార్థం గుణాత్మక మార్పు చెందుతుంది. వివిధ శక్తుల మధ్య వైరుధ్యాలుగా, ఘర్షణలుగా అభివృద్ధి సాగుతుంది. ఏ దృగ్గోచర విషయంలోనైనా, దాని అన్ని కోణాలు అంతస్సూత్రంగా లంకెలో ఉండి, పరస్పరం ఒకదానిపై మరొకటి ఆదారపడి ఉంటాయి.

చారిత్రక భౌతికవాదాన్ని అధ్యయనం చేస్తే, 'భౌతిక ప్రపంచంలో ఉత్పత్తి విధానం సమాజాన్ని, రాజకీయాలని, వ్యక్తుల జీవితాన్ని ప్రభావితం చేస్తుంది.' అని అర్థమవుతుంది. మనిషి చైతన్యం అతని ఉనికిని నిర్ణయించదు. అతని ఉనికే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది.

అభివృద్ధిలో ఒక దశకు చేరుకునే సరికి, సమాజంలోని భౌతిక ఉత్పత్తి శక్తులకి, ఉనికిలో ఉన్న ఉత్పత్తి సంబంధాలకి మధ్య ఘర్షణ మొదలవుతుంది. ఆ సంబంధాలు అభివృద్ధి సాధించడానికి బదులు అభివృద్ధిని నిరోధించే దశ వస్తుంది. అప్పుడు సామాజిక విప్లవం తప్పదు. అప్పుడు ఆర్థిక పునాది మారగానే యావత్తు ఉపరితలం మార్పు చెందుతుంది. పునాది, ఉపరితలాలు పరస్పరం ప్రభావితమౌతుంటాయి.

ప్రజలే చరిత్ర నిర్మాతలు. కానీ ప్రజల ఆకాంక్షలని నిర్ణయించేది ఏమిటి? ప్రజా సమూహాల సమాజాల్లో ఈ ఘర్షణ ఫలితం ఏమిటి? మానవ చరిత్రలో అతని కార్యాచరణని నిర్దేశించే అంతర్జాతీయ ఉత్పత్తి విధానాలు ఏమిటి?

'మానవ సమాజ చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే' అన్నాడు మార్క్స్. కార్మిక వర్గమే నిజమైన వప్లవకర వర్గం. దిగువ మధ్య తరగతి వారు, చిన్న వ్యాపారులు, చేతి వృత్తులవారు, రైతాంగం కూడా మధ్య తరగతి వర్గంగా బూర్జవాజీకి వ్యతిరేకంగా పోరాడుతారు. 'ప్రతి వర్గ పోరాటం రాజకీయ పోరాటమే' అని మనం అర్థం చేసుకోవాలి.

సోషలిజాన్ని ఊహాజనితమైనదిగా కాక ఒక శాస్త్రంగా గుర్తించింది మార్క్సిజం. అది ఆధునిక పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలోని దోపిడీని

---

'పొలిటికల్ ఎకానమీ – ఎ కండెన్స్‌డ్ కోర్స్'ని రా.రా. అనువాదం 'అర్థశాస్త్రం – సంక్షిప్త పాఠం' పేరుతో 1978లో వచ్చింది. ప్రగతి ప్రచురణాలయం విడుదల చేసింది.

నికిటిన్ రాసిన 'ఫండమెంటల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' తెలుగు అనువాదం 1967లో వచ్చింది. అఫనాసియే తదితరులు 1974లో రాసిన 'ది పొలిటికల్ ఎకానమీ ఆఫ్ కాపిటలిజం' 'పెట్టుబడిదారీ అర్థశాస్త్రం' పేరుతో రా.రా. అనువాదం 1978లో వచ్చింది.

తర్వాత మరికొన్ని పుస్తకాలొచ్చాయి. కాపిటల్ చదవడం కుదరని కమ్యూనిస్ట్ కార్యకర్తలూ, నాయకులూ వీటిని చదివి కాపిటల్ సారాన్ని గ్రహించవచ్చు. చదవగలిగినవారు కచ్చితంగా కష్టపడి అయినా కాపిటల్ చదవాలి.

*(రచయిత రిటైర్డ్ లెక్చరర్)*

వీ

బట్టబయలు చేసింది. పెట్టుబడిదారీ విధానం కింద ఏకైక ప్రపంచ మార్కెట్ ఏర్పడుతుందని 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో'లో మార్క్స్ ఎంగెల్స్‌లు ముందుగానే ఊహించారు. అసమానతలు పెరిగి, అధికోత్పత్తి సంక్షోభం ఏర్పడి, చివరికి కార్మికులు యంత్రానికి ఉపాంగాలుగా మారే దుస్థితి కలుగుతుందన్నారు.

మార్క్సిజాన్ని వ్యతిరేకించేవారు ఇటీవల మార్క్స్ మీద అపవాదులు రువ్వుతున్నారు. మరోవైపు మళ్లీ 'దాస్ కాపిటల్' విరివిగా అమ్ముడు పోవడం కూడా చూస్తున్నాం. ఈ నేపథ్యంలో ఒక పాశ్చాత్య రచయిత టెర్రీ ఈగల్‌టన్ రాసిన ఒక పుస్తకంలో మార్క్సిజంపై వచ్చిన నిందారోపణలను తిప్పికొట్టి మార్క్సిజాన్ని ఎలుగెత్తి చాటారు. కొందరు మార్క్సిజానికి కాలం చెల్లిపోయిందంటున్నారు. కానీ మార్క్స్ మన రోజువారీ జీవితాన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. పెట్టుబడిదారీ విధానం ఎలా తలెత్తిందో, దాన్ని ఏ నియమాలు నడుపుతున్నాయో, దాన్ని ఎలా అంతమొందించవచ్చో మొట్ట మొదటగా చెప్పింది మార్క్స్. పెట్టుబడి తన వికృత రూపంలో విచ్చలవిడిగా పెచ్చరిల్లుతుంటే, ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులు మరింత సంపన్నులుగా ఆకాశానికి తాకుతుంటే, వారి గుప్పెట్లో సంపదంతా పోగవుతుంటే, పెరుగుతున్న కార్మికవర్గం మురికివాడల్లో మగ్గుతున్నారు. కనాకష్ట జీవితాలు వెళ్లబోస్తున్నారు. అలాంటప్పుడు మార్క్సిజం ఎలా అంతరిస్తుంది? తమ భూముల నుంచి వెళ్లగొట్టబడిన రైతాంగం పట్టణాలను ముంచెత్తి, కార్మికవర్గ శ్రేణులతో మమేకమవుతుంటే, పేదవారు మరింత పేదవారవుతుంటే మార్క్సిజం ఎలా అంతరిస్తుంది?

మార్క్సిజం సిద్ధాంతంగా బాగుంటుందేమో గాని, ఆచరణలో అది ఉపద్రవాలని తెచ్చిపెడుతుందని కొందరంటారు. సోషలిజం స్వేచ్ఛని హరిస్తుందని, వాణిజ్యాన్ని రద్దు చేయడం వల్ల వినిమయ సరుకులు మాయమవుతున్నాయని కూడా వారంటారు. మధ్యతరగతి వారు స్వేచ్ఛని, ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కుల్ని వాగ్దానం చేస్తే, సోషలిజం ఫాసిజాన్ని ఎదిరించింది. రష్యాలో చౌకగా ఇళ్లు, ఇంధనం, వాహనాలు అందించారు. మెరుగైన సంస్కృతిని రూపొందించారు. ఉద్యోగాలు కల్పించారు. సామాజిక సేవలు అందించారు.

మార్క్స్ పిడివాదాన్ని ఖండించారు. వాక్ స్వాతంత్ర్యాన్ని, పౌరహక్కుల్ని గౌరవించారు. నిరంకుశ సైన్యాధికారాన్ని, రాజకీయ అణచివేతని, తనకి తానుగా ఊడిపడే రాజ్యాధికారాన్ని నిరసించారు. మార్క్సిజం రాజకీయ నిర్ణయాధికారాన్ని మనపై రుద్దుతుందని మరో వాదన. మనుషుల స్వేచ్ఛని, వ్యక్తిత్వాన్ని అది హరిస్తుందంటారు. అయితే, సామాజిక జీవితంలో ఆర్థిక విధానాలు ప్రధానమైన పాత్ర నిర్వర్తిస్తాయి. మానవ చరిత్రను ఉత్పత్తి విధానం నిర్దేశిస్తుంది. వర్గ పోరాటం ఆ చరిత్రని లిఖిస్తుంది. అందుకే 'గత సమాజాల చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్రే' అని మార్క్స్ కమ్యూనిస్ట్ ప్రణాళికలో నొక్కి చెప్పారు. మార్క్స్ ఉద్దేశంలో 'చరిత్ర' అంటే అర్థం ప్రాముఖ్యత గత పరిణామాల దశ అని. చరిత్ర క్రమంలో ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందుతాయి. ఉత్పత్తి ఎవరి చేతిలో కేంద్రీకృతమై ఉంటుందో, ఆ సామాజిక వర్గం అభివృద్ధిని నిర్దేశిస్తుంది. అయితే ఉత్పత్తి శక్తుల ఎదుగుదలని ఉత్పత్తి సంబంధాలు ఆటంకపరిచినప్పుడు వైరుధ్యం నెలకొంటుంది. రాజకీయ విప్లవం సంభవిస్తుంది, వర్గ పోరాటం పదునెక్కుతుంది. ఉత్పత్తి శక్తుల్ని ముందుకు తీసుకుపోగల వర్గం ఆధిపత్యంలోకి వస్తుంది.

'హోలీ ఫామిలీ'లో మార్క్స్ ఇలా అంటారు. 'చరిత్ర ఏమీ చేయదు. దానికి అమితమైన సంపదలేదు, అది యుద్ధాలు చేయదు. మనిషి, సజీవమైన మనిషి ఆ పని చేస్తాడు. అతను సంపద కలిగి ఉంటాడు. యుద్ధాలు చేస్తాడు. మనిషి తన లక్ష్యాలని చేరుకోవడానికి చేసే కార్యాచరణే చరిత్ర. భానిసత్వం, భూస్వామ్య విధానం, పెట్టుబడిదారీ విధానం – వీటిన్నింటికీ వాటివాటి అభివృద్ధి నియమాలు ఉంటాయి. భౌతికవాద పద్ధతిని పరిశోధనకి ఉపయోగపడే ఒక దిక్సూచిగా కాక, చరిత్ర వాస్తవాలను తనకి సరిపోయేలా రూపుదిద్దుకునే ఒక రెడీమేడ్ పద్ధతిగా దాన్ని చూస్తే, ఫలితం తారుమారవుతుంది'.

మార్క్సిజం కేవలం ఊహాజనితమైన కల అనేది మరో ఆరోపణ. కమ్యూనిజం ఒక ఆదర్శమని, వాస్తవికత దానికి కట్టుబడి ఉండాలని మార్క్స్ ఎన్నడూ చెప్పలేదు. అమల్లో ఉన్న పరిస్థితుల్ని నిర్మూలించే వాస్తవమైన ఉద్యమంగా ఆయన కమ్యూనిజాన్ని చూస్తాడు. భవిష్యత్తు గురించి కేవలం ఆదర్శవంతంగా కలలుగనడం కాక, వర్తమాన వ్యవస్థలో ఉన్న వైరుధ్యాలను, మంచి భవిష్యత్‌కి అవరోధంగా ఉన్న వైరుధ్యాలను పరిష్కరించాలి.

'గోదా కార్యక్రమం ఒక విమర్శ'లో మార్క్స్ ఈ మాటని బలంగా చెప్పారు. 'పాత సమాజపు గర్భంలోంచి ఆవిర్భవించేప్పుడు నూతన సమాజం ఆ పాత సమాజపు గుర్తులను కూడా మోసుకొస్తుంది'. కాని అతివాద ధోరణి ఈ వాస్తవాన్ని గుర్తించకుండా, సామాజిక సంస్కరణలని, ట్రేడ్ యూనియన్లని, రాజకీయ పార్టీలని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తిరస్కరిస్తుంది.

మార్క్సిజం వ్యక్తిని తక్కువ చేసి సమూహాలకే ప్రాధాన్యత ఇస్తుందనే అపవాదుకి జవాబు 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో'లోనే ఉంది. 'ప్రతి ఒక్కరి స్వేచ్ఛాయుత అభివృద్ధే అందరి స్వేచ్ఛాయుత అభివృద్ధికి ఒక షరతు అవుతుంది'. అలా నువ్వు ఎదుగుతూ, పది మందినీ ఎదిగేలా చేయడమే అభివృద్ధి. మార్క్సిజం మనిషిని ఏ మచ్చలేని వాడిగా తయారు చేస్తుందనో, అతి కష్టమైన శ్రమని హఠాత్తుగా రద్దు చేస్తుందనో చెప్పలేం. కానీ చరిత్రలో స్వేచ్ఛని, వైవిధ్యాన్ని అవరోధించే అన్ని వైరుధ్యాలని పరిష్కరించే ప్రయత్నం మార్క్సిజం చేస్తుందని చెప్పవచ్చు. అలా సుందరమైన భవిష్యత్తుని, పీడనలేని సమాజాన్ని ఆవిష్కరించవచ్చని మార్క్సిజం చెప్తుంది.

మార్క్సిజం ఆర్థిక విధానాలకి మాత్రమే ప్రాధాన్యత ఇస్తుందనే అపవాదు మరొకటి ఉంది. 'మన భౌతిక అవసరాలని తీర్చే ఉత్పత్తి సాధానాలని తయారు చేసుకోవడమే మొదటి చారిత్రక చర్య' అని 'జర్మన్ ఐడియాలజీ'లో మార్క్స్ చెప్పారు. భౌతిక అవసరాలు తీరనిదే ఏ పనీ సార్థకం కాదు. సంస్కృతి అభివృద్ధి చెందాలన్నా అది శ్రమ ద్వారానే సాధ్యం. భౌతిక ఉత్పత్తి లేకుండా నాగరికతలు ఉండవు. 'కార్మికులు ఒక దగ్గర చేరినప్పుడు వారికి కేవలం బోధన, ప్రచారం చాలదు. వారికి ఒక కొత్త అవసరం తలెత్తుతుంది – సమాజం అనే అవసరం. సాధనం అనుకున్నది పరిష్కారంగా మారిపోతుంది. కలిసి తినడం, తాగడం వంటివి కాదు వారి మధ్య బంధాలు పెంచేవి. సాంగత్యం, కలిసిమెలిసి ఉండడం, సంభాషణ, వీటన్నిటి లక్ష్యంగా సమాజం అనేది వారికి సరిపోతుంది. మనుషుల సౌభ్రాతృత్వం అనేది ఓటిమాట కాదు. కాయకష్టం చేసినవారి శరీరాలలోంచి గొప్పతనం, సౌజన్యత మెరుస్తాయి' – 'ఆర్థిక, తాత్విక రాత ప్రతుల నుంచి.

మార్క్స్ భౌతికవాది మాత్రమే అంటే చాలదు. ఆయన ఒక కాల్పనికుడు. ఒక ఆలోచనాపరుడు. రూపంలేని అమూర్తత్వాన్ని ఆయన అనుమానంగా చూశాడు. వాస్తవికతని ఆరాదించాడు. ఎప్పుడో సాధించబోయే కల గురించి కాక ప్రస్తుతం ఉన్న భౌతిక పరిస్థితుల మీద, మానవుల మీద అవి చూపే ప్రభావం మీద కేంద్రీకరించడమే మార్క్స్ చెప్పే భౌతికవాదం. వ్యక్తిగత గుర్తింపు అనేది సమాజం నుంచే

ప్రతిఫలిస్తుంది. ఒకే ఒక్క సంఖ్య లేనట్టే, ఒకే ఒక్క మనిషి ఉండడు. చరిత్రని మనమే సృష్టిస్తాము. మన చర్యలు లేకుండా అది సహజంగా, స్వతంత్రంగా రూపొందదు. మానవ ఇంద్రియాలకి, వాస్తవ దృష్టితో కార్యాచరణ సాగించడానికి మధ్య అనుబంధాన్ని మార్క్స్ చూస్తాడు. మన హేతుబద్ధతికి, జీవన విధానానికి మధ్య కూడా దగ్గర సంబంధం ఉంటుంది. మన జీవితావసరాలు చరిత్రకి పునాదులు. 'పంచేంద్రియాల ఎదుగుదలని గత చరిత్ర సాధ్యం చేసింది' అని ఆర్థిక, తాత్విక రాత ప్రతులలో మార్క్స్ వివరించారు. జంతువుల్లో అవసరాలు తీర్చుకునే కోరిక, క్లిష్టమైన శ్రమ, విస్తారమైన సందేశాలు ఉండవు. వాటి జీవితం ప్రాకృతిక చక్రంగా ఉండి, పునరావృతమవుతూ ఉంటుంది. వాటికి అవి 'స్వేచ్ఛ' అనే వృత్తాంతాన్ని రచించుకోవు. కాకపోతే దురదృష్టం ఏమిటంటే, స్వయం నిర్ణయాధికారం మానవుల సారాంశం అయినా గాని, ఆ అధికారాన్ని పొందడంలో చరిత్రలో ఎన్నో అవరోధాలు కనిపిస్తాయి. సంపూర్ణమైన మానవులుగా మనగలగడానికి వీలులేని విధంగా విచారకరమైన వర్గ సమాజపు చక్ర వ్యూహాలు అడ్డుపడుతుంటాయి.

మనం అవసరాల రాజ్యం నుంచి స్వేచ్ఛ అనే ప్రపంచాన్నిఎలా చేరుకోవాలో మార్క్స్ రచనలు వివరిస్తాయి. 'మానవ చైతన్యాన్ని చదవగల తెరిచిన పుస్తకమే మానవ శ్రమ. అది వివేకవంతమైన విధానాలతో మానవ నైజాన్ని, మనస్తత్వాన్ని సూచిస్తుంది.' మానవులు ఉత్పత్తి చేయగలరు కాబట్టి చరిత్రని నిర్మించగలరు. అవసరం వల్ల వారికి చరిత్ర ఉంటుంది. కొరత కాలంలో సైతం వారు ఉత్పత్తి, పునరుత్పత్తి చేస్తూనే ఉండాలి. అందుకే, ఆ నిరంతర చలనం. సహజ సిద్ధమైన అవసరాలని తీర్చుకోవాలంటే సామాజిక సాధనాల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. మన ఉత్పత్తి సాధనాలను ఉమ్మడిగా తయారు చేసుకోవడం ద్వారానే అది సాధ్యమవుతుంది. ఈ క్రమంలో జీవ ప్రక్రియలకి, సమాజానికి మధ్య సంబంధం ఆర్థిక విధానాలే.

మార్క్స్ తన 'లూయీ బోనాపార్ట్ 18వ బ్రూమేర్'లో రాజకీయాలని సామాజిక ప్రయోజనాల నేపథ్యంలో చర్చిస్తాడు. 'మన పాత జ్ఞాపకాలు, వ్యక్తిగత శత్రుత్వాలు భయాలు, ఆశలు, పక్షపాతాలు, భ్రమలు, సానుభూతులు, అయిష్టాలు, దృఢ విశ్వాసాలు, నీతి నియమాలు – అన్నింటినీ రాజకీయం వ్యక్తపరుస్తుంది'. అలానే, భాష గురించి చెపుతూ, 'జర్మన్ ఐడియాలజీ'లో ఇలా అంటారు. 'భాష మన చైతన్యమంత ప్రాచీనమైనది. భాష ఆచరణాత్మకమైనది. అది ఇతరులకి ఉండే చైతన్యం కాబట్టి నాకు కూడా ఉంటుంది. అది కూడా చైతన్యం రాగానే అవసరం నుంచి, ఇతరులతో మెసలడమనే అవసరం నుంచి ఉద్భవిస్తుంది. చైతన్యం సామాజికమైనది, ఆచరణాత్మకమైనది. అందుకే భాష దాని పరాకాష్ట అవుతుంది'. భావాలు, భాష తమంత తాము మనలేవని, అవి నిజజీవిత ప్రతిఫలనాలేనని ఆయన అంటారు.

మార్క్సిజం కేవలం ప్రపంచాన్ని విశ్లేషించి ఊరుకోదు. అది దాన్ని మార్చే సాధనం కూడా. హేతువుకి, జ్ఞానానికి, స్వేచ్ఛకి మధ్య దగ్గర సంబంధం ఉంది. 'తాత్వికులు కేవలం ప్రపంచాన్ని వ్యాఖ్యానించారు. కానీ దాన్ని మార్చడం మన ప్రధాన లక్ష్యం' అన్నారు మార్క్స్. మన సామాజిక ఉనికే చైతన్యాన్ని నిర్దేశిస్తుందని చూశా. మొదటగా, మన భౌతిక అవసరాలు మన ఆలోచనా విధానాన్ని నియంత్రిస్తాయి. తర్వాత దశలో ఆలోచనలు ఈ అవసరాల నుంచి స్వతంత్రం కావడంతో సంస్కృతి అభివృద్ధి చెందుతుంది. పునాది, ఉపరితలం గురించి అప్పుడు స్పష్టత అవసరం. పునాది ఉపరితలాన్ని నిర్మిస్తుంది. కాని పునాది బలంగా ఉండాలంటే ఉపరితలం కూడా దోహదపడాలి.

మార్క్సిజానికి అసమగ్రమైన వర్గ దృష్టి మాత్రమే ఉంటుందని కొందరు వాదిస్తారు. మనం ఏమి ఆలోచిస్తున్నామని కాక, మనం ఏమి చేస్తున్నామనేది చెపుతుంది మార్క్సిజం. ఆయా ప్రత్యేక ఉత్పత్తి విధానాల్లో నీ స్థానం ఏమిటి? బానిసవా, స్వతంత్ర ప్రతిపత్తి గల రైతువా, కౌలుదారుడివా, పెట్టుబడిదారుడివా, రుణాలిచ్చేవాడివా, నీ శ్రమశక్తిని అమ్ముకునేవాడివా, చిన్న వ్యాపారివా, ఎవరివి అని చూడాలి. ఈ వర్గ దృక్పథంతో మార్క్సిజం సాధించిన విజయాలు ఏమిటంటే, రాజకీయ దాష్టీకాన్ని దృఢంగా ఎదిరించడం, వ్యక్తి గౌరవాన్ని ఎత్తిపట్టడం, పౌరహక్కుల కోసం, ప్రజాస్వామిక హక్కుల కోసం నిలబడడం, అంతర్జాతీయతని సాధించడం.

వర్గం అనేది ఊహాజనిత యాజమాన్యం కాదని, అది ఇతరుల మీద ఆధిపత్యం చెలాయించి, తన ప్రయోజనాలు నెరవేర్చుకుంటుంది అంటారు మార్క్స్. మరి కార్మిక వర్గం అంటే ఏవరు? తమ శ్రమశక్తిని పెట్టుబడికి అమ్ముకోక తప్పని వారందరూ, పెట్టుబడి సృష్టించే పీడన కింద నలిగిపోయే వారందరూ, తమ శ్రమశక్తి పరిస్థితుల మీద తమ నియంత్రణ లేని వారందరూ కార్మికవర్గమే అంటారాయన.

మార్క్సిజాన్ని నమ్మేవారు హింసాత్మకమైన రాజకీయ చర్యలని నమ్ముతారనే ఆరోపణ ఉంది. విప్లవం హింసాత్మకమని, సామాజిక సంస్కరణలు శాంతియుతంగా జరుగుతాయని వారంటారు. కాని చాలా సంస్కరణలు కూడా హింసాత్మకంగా సాగక తప్పలేదు. ఉదాహరణకి అమెరికాలో పౌరహక్కుల ఉద్యమం, యుద్ధ వ్యతిరేక ప్రతిఘటన, లాటిన్ అమెరికాలో ఉదార సంస్కరణలు. అలానే కొన్ని విప్లవాలు శాంతియుతంగా జరిగాయి. ఉదాహరణకి 1916 నాటి డబ్లిన్ తిరుగుబాటు, 1917 నాటి బోల్షివిక్ విప్లవం. పెట్టుబడిదారీ విధానం సాగించిన హింసని వీరెందుకు మరుస్తారు? ప్రపంచ యుద్ధాలు, వలసవాదుల దోపిడీ, జాతుల విధ్వంసం వారే చేతులారా కల్పించిన క్షామాలు, రసాయన యుద్ధాలు – ఇవి హింస కాదా? హింసని హింసతో ఎదుర్కోవలసి వస్తే ఎందుకు ఆక్షేపణ, ఆరోపణ? పెట్టుబడిదారీ విధానానికి సంబంధించిన తీవ్ర నిరంకుశరూపమే ఫాసిజం అవుతుంది. ప్రస్తుతం అన్ని చోట్లా నియంతృత్వం కోరలు చాస్తోంది. దాన్ని ఎదుర్కోవాలంటే హింస తప్పకపోవచ్చు. ఈ ప్రతిహింస శాంతికి కాంక్షిస్తుంది. అందుకే శాంతిని సాధించే ఉద్యమాలన్నింటిలో సోషలిస్టులు పాలు పంచుకుంటారు. మరోపక్క అనవసరపు అతివాదాన్ని, సాహసకృత్యాలను, ఒంటెద్దు పోకడలను వారు వ్యతిరేకిస్తారు. బలమైన అభిలాష, విపరీతమైన సాహసం ఉంటే చాలదు. పాలకవర్గం బలహీనంగా ఉండి, సోషలిస్టు శక్తులు బలం పుంజుకున్నప్పుడు ప్రజలది పైచేయి అవుతుంది. కానీ పాలకులు బలంగా ఉండి, దాని వ్యతిరేక శక్తులు ముక్కలు చెక్కలుగా, బలహీనంగా, పిరికిగా ఉన్నప్పుడు ఇలాంటి దుస్సాహసిక చర్యలు నష్టం చేస్తాయి. అందుకే ఆనాటి సమాజంలో ప్రబలి ఉన్న భౌతిక శక్తులని విశ్లేషించుకుంటూ కార్యాచరణని రూపొందించుకోవాల్సిన అవసరాన్ని మార్క్స్ నొక్కి చెప్పారు.

ఒక సామాజిక వర్గం మరో ఆధిపత్య వర్గాన్ని కూలదోసి, తన అధికారాన్ని నెలకొల్పుతుంది. సొంత ఆస్తి కలిగిన వర్గాలు ఎలాంటి ప్రతిఘటన లేకుండా తాము పొందిన సౌలభ్యాలను వదులుకోవు. తనలో ఇమిడి ఉన్న వైరుధ్యాల వల్ల పెట్టుబడిదారీ విధానం కూలిపోయే దశ ఏర్పడుతుంది. కానీ ఆ దశని తీసుకురావడానికి తగిన శక్తులు కూడుకోవాలి. సంఘటితమైన రాజకీయ శక్తి తగిన ప్రత్యామ్నాయాన్ని కల్పించలేకపోతే సోషలిజానికి బదులు పాశవికత్వం రాజ్యమేలుతుంది.

మార్క్సిజం రాజ్యాధిపత్యాన్ని ఎక్కువ చేసి మాట్లాడుతుందనే అపవాదు

# కార్మికుల అధ్యయనానికి మార్క్స్ ప్రశ్నావళి

కార్మికులకు సంబంధించిన స్థితిగతులను తెలుసుకోవడానికి మార్క్స్ తయారుచేసిన ప్రశ్నావళి నేటికీ ఎంతో ప్రాసంగికతను కలిగి ఉంది. తాను చనిపోయే రెండేండ్లకు ముందు (1880) అంటే సుమారు 140 ఏండ్ల కిందట ఫ్రెంచ్ వర్కర్స్ పార్టీ కోసం తయారు చేసిన ఈ ప్రశ్నావళిని బెనోట్ మలాన్స్ 'రివ్యూ సోషలిస్టు' అనే పత్రికలో 1880 ఏప్రిల్ 20న ప్రచురించారు.

"ఇంతవరకు ఏ ఒక్క ప్రభుత్వం – రాజరిక వ్యవస్థ గాని, బూర్జువా వ్యవస్థ గాని ఫ్రెంచి కార్మికుల స్థితిగతులు తెలుసుకోవడానికి ఏమాత్రం సాహసించలేదు. కాని ఆర్థిక, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య, రాజకీయ రంగాల్లో సంక్షోభాలను గూర్చి ఎన్నో పరిశోధనలు జరిగాయి!

ఇంగ్లిష్ ప్రభుత్వ పరిశోధన వల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ దుర్మార్గాలు బయటపడి పనిదినం కేవలం 10 గంటలకే (బాల, మహిళలకు సంబంధించి కూడా) ఖరారు చేయబడడం వల్ల గత్యంతరం లేని ఫ్రెంచి బూర్జువా ప్రభుత్వం రాబోయే ప్రమాదం గురించి వణకడం మొదలైంది. ఇంగ్లాండ్ లాంటి నియంతృత్వ తరహా ప్రభుత్వం బదులు గణతంత్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే ఆశకు ఇది దోహదపడ్డది. అంతేగాక పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ విధానాలు, నేరాలను తెలుసుకునే ఒక మహాశోధనను నిర్వహించడం – అందుబాటులో ఉన్న వనరులతోనే అవసరం. వీటన్నింటినీ – సామాజిక రుగ్మతలకు బలైన కార్మికవర్గమే ఈ అన్నిరకాల ఈతి బాధలు, దురదృష్ట సంఘటనలు మొదలైన అన్నింటినీ తమ అవగాహనతో వివరించగలరు. రాష్ట్రం పంపే రక్షకులు కాకుండా శక్తివంతంగా ఆ బాధలకు స్వస్థత కూర్చే మార్గాలను చూపిస్తారు.

సామాజిక మార్పు కాంక్షించే అన్ని రకాల సోషలిస్టులపై ఆధార పడుతూ వాళ్లు కచ్చితమైన, అనుకూల అవగాహనతో ఉజ్వల భవిష్యత్తున్న కార్మికవర్గ సంక్షేమం గూర్చే తపనపడతారని భావిస్తాం. సామాజిక పునర్జన్మకు ప్రయత్నించే వ్యవస్థకు ఈ కార్మికవర్గ కష్టం, దుఃఖాలే సోపానం

ఈ కింది వంద ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి. జవాబుల్లో సంబంధిత ప్రశ్న సంఖ్యను ఇవ్వాలి. అన్నింటికీ జవాబులు తప్పనిసరి కాదు. కాని మన సిఫారసులేమిటంటే ఇచ్చే జవాబులు మాత్రం వివరంగా, అర్థవంతంగా ఉండాలి. ప్రశ్నలకు జవాబులిచ్చే మహిళ గాని పురుష కార్మికుడు గాని తప్పక పేరు, చిరునామా ఇవ్వాలి. వారి పేర్లు ప్రత్యేక అనుమతితోనే ప్రచురించబడతాయి. చిరునామా అవసరమైతే ఉత్తర ప్రత్యుత్తరానికి దోహదపడుతుంది.

అధ్యయనం కోసం దోహదపడేట్లు వర్గీకరించి రివ్యూలో ప్రచురిస్తారు. ఆ పిదప ప్రత్యేక సంపుటిగా ముద్రిస్తాం.

---

కూడా ఉంది. విప్లవ శక్తుల కార్యచరణలో రాజ్యం హరించిపోతుంది. కమ్యూనిజంలో రాజ్యం దాని రాజకీయ లక్ష్యాన్ని కోల్పోతుందని మార్క్సిజం చెపుతుంది. రాజ్యం సౌభ్రాతృత్వానికి చిహ్నం అని, అది అన్ని వర్గాల వారిని శాంతియుతంగా కలిపి ఉంచుతుందని చెప్పే అభూత కల్పనలని మార్క్స్ తిరస్కరించాడు. రాజ్యం విభజించి పాలించడానికి తప్ప ఐకమత్యానికి ప్రతీక కాదు. అది పాలకుల ప్రయోజనాలను కాపాడే విధంగా సమాజాన్ని నిలిపి ఉంచాలని చూస్తుంది. రాజ్యం నిరుపేదలకి సంకెళ్లు బిగించి, ధనికులకి రాయితీలు కల్పించి, వారికి కొత్త బలాన్ని ఇస్తుంది. ఆస్తిని, అసమానతలను పరిరక్షించే విధంగా నియమాలను, చట్టాలను రచిస్తుంది. కొందరు ఆశపోతుల కోసం అశేష మానవాళిని శ్రమకి, బానిసత్వానికి, యాతనకి, అధోగతికి గురిచేస్తుంది. వివిధ సామాజిక దశల్లో దాని రూపు మారవచ్చు కాని రాజ్యం స్వభావం మారదు.

మార్క్స్ ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధాన్ని విశ్లేషిస్తూ రాజ్య స్వభావాన్ని చక్కగా వివరించారు. రాజ్యం సృష్టించుకున్న యంత్రాంగాన్ని కార్మికవర్గం యథావిధిగా స్వీకరించి, తన అవసరాలకి వాడుకోవడం అసాధ్యం. ఎందుకంటే, ఆ యంత్రాంగం విద్వేషపూరితమైనది. అది ప్రజాస్వామ్య వ్యతిరేక లక్ష్యాలను మాత్రమే నెరవేర్చగలదు. ఆయన 1871 నాటి పారిస్ కమ్యూన్‌ని ప్రజల స్వయం పరిపాలన నమూనాగా పేర్కొన్నారు. కార్మికవర్గ నియంతృత్వాన్ని కోరారు.

మార్క్సిజానికి సంబంధం లేకుండా గత నాలుగు దశాబ్దాలుగా ఫెమినిజం, పర్యావరణ ఉద్యమం, శాంతి ఉద్యమం, జంతువుల పరిరక్షణ, జాతుల పోరాటాలు జరుగుతున్నాయని కొందరంటారు. వర్గ పోరాటానికి విరుద్ధంగా రాజకీయ కార్యాచరణ కొత్త రూపాలు ఎంచుకుందంటారు. కానీ, పితృస్వామ్యం, వర్గ సమాజం రెండూ విడదీయరాని భాగాలు. ఒకటి పోకుండా రెండోది నిర్మూలించబడదని చరిత్ర చెప్తోంది. ఉత్పత్తి, పునరుత్పత్తుల్లో ఏది ఆగిపోయినా మానవ చరిత్ర నిలిచిపోవడం ఖాయం.

వలసవాదానికి వ్యతిరేకంగా, స్త్రీ విముక్తిని సమర్థిస్తూ, ఫాసిజాన్ని వ్యతిరేకిస్తూ మూడు గొప్ప రాజకీయ పోరాటాలని సాగిస్తున్న వారు మార్క్స్ అనుచరులు. వర్గం, జెండర్, కులం, వలసవాదం వంటి వివిధ రకాల ఆధిపత్యాన్ని, దోపిడీని గుర్తించి, రాజకీయ కార్యాచరణని రూపొందించగలిగింది మార్క్సిజం ఒక్కటే అనేది అడుగడుగునా నిరూపితమవుతున్న సత్యం.

చివరగా, కార్మిక వర్గానికి ఒక విలువైన ఆయుధాన్ని అందించిన మార్క్స్‌ని విశ్వేషించుకుందాం. ఆయనకి వ్యక్తిమీద ఎనలేని నమ్మకం. ఊహజనితమైన పిడివాదానికి ఆయన వ్యతిరేకం. వైవిధ్యాన్ని, బహుముఖత్వాన్ని ఆయన ఆహ్వానించారు. ఆయన సోషలిజాన్ని ప్రజాస్వామ్యానికి శత్రువుగా కాక, ప్రజాస్వామ్యాన్ని మరింతగా పెంపొందించే సాధనంగా చూశారు. కళాత్మకమైన వ్యక్తీకరణని ఆయన మంచి జీవితంగా భావించారు. కొన్ని విప్లవాలు శాంతియుతంగా కూడా సాధ్యమేనని నమ్మారు. సాంఘిక సంస్కరణలని ఆయన వ్యతిరేకించలేదు. ఆర్థిక ఆధిపత్యాన్ని వ్యతిరేకించారు. భౌతికవాదిగా నైతికతని సమర్థించారు.

మొత్తంగా ఒక శాస్త్రీయమైన ప్రాపంచిక దృక్పథాన్ని పీడుతులకి అందించిన మేధావి మార్క్స్. పోరాడితే సంకెళ్ల తప్ప పోయేవేమీ లేవని కార్మిక వర్గానికి పిలుపునిచ్చిన ధీశాలి. తత్వశాస్త్రాన్ని, రాజకీయ అర్థ శాస్త్రాన్ని, చారిత్రక భౌతికవాదాన్ని బోధించి, వర్గపోరాట ఆవశ్యకతని, అనివార్యతని మానవాళికి విప్పి చెప్పిన మహోపాధ్యాయుడు!

*(రచయిత పిల్లల వైద్యురాలు)* వీ

1. మీ (వృత్తి) వ్యాపారం ఏమిటి?

2. మీరు పనిచేసే దుకాణం పెట్టుబడిదారునిదా లేక లిమిటెడ్ కంపెనీదా? పెట్టుబడిదారుల పేర్లు లేదా కంపెనీ డైరెక్టర్ల పేర్లు తెలపండి.

3. ఎంత మంది ఉద్యోగులున్నారు?

4. వారివారి వయస్సు ఏమిటి? స్త్రీ/పు తెలపండి.

5. ఉద్యోగంలోకి తీసుకునే బాల, బాలికల కనిష్ఠ వయసెంత?

6. జాబితాలో లెక్కించని పర్యవేక్షకులు, ఇతర ఉద్యోగులెందరు?

7. అప్రెంటిస్టులున్నారా? ఉంటే ఎంత మంది?

8. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అప్పుడప్పుడు వచ్చే వారున్నారా?

9. మీ యజమాని ఉత్పత్తి స్థానిక అవసరాల కోసమా? లేక దూర ప్రాంతాల ఎగుమతి కోసమా?

10. దుకాణం గ్రామంలో ఉందా? పట్టణంలో ఉందా? దాని స్థానం తెలుపండి?

11. ఒకవేళ మీ దుకాణం గ్రామీణ ప్రాంతంలో ఉంటే మీకు తగినంత పని ఉంటుందా? లేక వ్యవసాయ కార్మికులతో కలిసి చేయాల్సిన అవసరముందా?

12. చేతులతో పనిచేస్తావా? యంత్రాలతో పనిచేస్తావా?

13. మీ కర్మాగారంలో శ్రమ విభజన గూర్చి తెలపండి?

14. చలన శక్తి కోసం ఆవిరి వాడుతారా?

15. వివిధ విభాగాల పనులు జరిగే గదులెన్ని? మీరు పనిచేసే ప్రత్యేకతలేమిటో తెలపండి. పనివారల ఆరోగ్యం మీద ప్రభావం చూపే యాంత్రిక విభాగమే గాక, కావలసిన కండర, నరాల ఒత్తిళ్ల గూర్చి తెలపండి.

16. పరిసరాల పరిశుభ్రత గూర్చి, గదుల కొలతలు ప్రతి కార్మికునికి ఎంత స్థలం అందుబాటులో ఉంది? గాలి, వెలుతురు గూర్చి, ఉష్ణోగ్రత, ప్లాస్టరింగ్, మరుగుదొడ్లు, సాధారణ పరిశుభ్రత, యంత్రాల శబ్దాలు, లోహపు చూరు, తడి మొదలగు.

17. పని ప్రదేశాల్లో మున్సిపల్ గాని, ప్రభుత్వ అజమాయిషీ గాని ఉన్నదా?

18. మీ ఆరోగ్యానికి హాని చేసే లేదా కార్మికుల ఏదేని ప్రత్యేక జబ్బుకు కారణమయ్యే విషవాయువు మీ కర్మాగారంలో ఉన్నదా?

19. యంత్రాలతో పనిస్థలం ఇరుకుగా ఉందా?

20. యంత్రాలు, ట్రాన్స్ మిషన్ వల్ల జరిగే ప్రమాదాల నివారణ జాగ్రత్తలున్నాయా?

21. మీకు తెలిసినంత వరకు ప్రమాదాలేవైనా జరిగాయా?

22. ఒకవేళ మీరు ఏదేని గనిలో పనిచేస్తుంటే మీ యజమాని కల్పించిన వెలుతురు, ప్రమాద నివారణా చర్యలేమిటి?

23. ఒకవేళ మీరు మందుల ఫ్యాక్టరీలో గాని, లోహ పరిశ్రమలో గాని, లోహ ఉత్పత్తులు చేసే కర్మాగారంలో గాని లేదా ప్రమాదాలు కలిగించే కర్మాగారంలో పనిచేస్తుంటే ప్రమాద నివారణ కోసం మీ యజమాని తీసుకున్న చర్యలేమిటి?

24. మీ వర్క్‌షాప్ దేనితో వెలుగుతుంది? (గ్యాస్, నూనె మొదలగు).

25. అగ్ని ప్రమాదాల నివారణ కోసం తగు పరికరాలున్నాయా?

26. ప్రమాదం జరిగితే కార్మికునికి గాని, అతని/ఆమె కుటుంబానికి గాని నష్టపరిహారం చెల్లించే పద్ధతి మీ యజమాని ఏమైనా చేశాడా?

27. అలాగాక పని స్థలాల్లో గతంలో ప్రమాదాలు జరిగితే యజమాని పరిహారం చెల్లించాడా?

28. ప్రథమ చికిత్స అందుబాటులో ఉందా?

29. మీరు ఇంటివద్దే పనిచేస్తుంటే ఆ గది గూర్చి వివరించండి. మీరు చిన్న పనిముట్లు వాడుతారా? యంత్ర సహాయంతో పనిచేస్తారా? మీ పిల్లలు గాని, ఇతరుల సహాయం తీసుకునే అవకాశముందా? ప్రైవేట్ వ్యక్తులకు పనిచేస్తారా? లేక ఏదేని యజమాని కోసం చేస్తారా? వారితో ముఖాముఖి సంప్రదిస్తారా? ఏజెంటును సంప్రదిస్తారా?

30. ప్రతిరోజు ఎన్ని పనిగంటలు, వారంలో ఎన్ని రోజులు పనిచేస్తారో తెలపండి?

31. ఒక ఏడాదిలో పొందే సెలవులెన్ని?

32. పనిచేసే సయమంలో ఎలాంటి విరామాలున్నాయి?

33. క్రమపద్ధతిలో భోంచేస్తారా? ఇష్టమున్న విధంగా భోంచేస్తారా? పనిచేసే చోట తింటారా? బయట తింటారా?

34. భోంచేసే సమయంలో పని నడుస్తుందా?

35. ఒకవేళ ఆవిరి వాడబడితే, ఎప్పుడు ఆపేస్తారు? ఎప్పుడు ప్రారంభిస్తారు?

36. రాత్రిపూట పని నడుస్తుందా?

37. పిల్లలు, 16 ఏండ్లలోపు వాళ్లు ప్రతిరోజు ఎన్ని గంటలు పనిచేస్తారు?

38. చిన్నవాళ్లు మారుతున్నప్పుడు పనిగంటల్లో ఏమైనా షిఫ్టులు గాని, ప్రత్యామ్నాయాలు గాని ఉంటాయా?

39. బాల కార్మికులకు సంబంధించి మున్సిపాలిటీ గాని ప్రభుత్వం గాని చట్టాలు ఏమైనా ఉన్నాయా? యజమాన్యం ఈ చట్టాలకు లోబడి ఉంటుందా?

40. మీ (వృత్తి) వ్యాపారంలో పనిచేసే పిల్లలు, యువకుల కోసం ఏవేని పాఠశాలలున్నాయా? ఒకవేళ ఉంటే ఎప్పుడు పాఠాలు బోధిస్తారు? పాఠశాలలు ఎవరు నిర్వహిస్తారు? అక్కడ ఏం బోధిస్తారు?

41. రాత్రింబవళ్లు పని జరిగితే షిఫ్టుల విధానమేమిటి?

42. మంచిగా (పని) వ్యాపారం జరుగుతున్న రోజుల్లో పనిదినం ఎంతవరకు సాగుతుంది?

43. యంత్రాలను వాటిపై పనిచేసే వారే శుభ్రపరుస్తారా? లేక దాని కోసం ఇతరులను వినియోగిస్తారా?

44. ఆలస్యంగా వచ్చేవారిపై నిబంధనలు, శిక్షలేముంటాయి? పనిదినం ఎప్పుడు మొదలవుతుంది? మధ్యాహ్న భోజనం తరువాత పని ఎప్పుడు మొదలవుతుంది?

45. పని స్థలానికి వచ్చి, పోవడానికి ఎంత సమయం పడుతుంది?

46. మీ యజమానితో చేసుకున్న ఒప్పందమేమిటి? రోజువారిగానా, వారం కొరకా లేక నెలకోసం మొదలైనవి.

47. ఉద్యోగం నుంచి వెళ్లిపోవడానికి లేదా తొలగించడానికి ఉన్న నియమ నిబంధనలేమిటి?

48. ఒప్పందాన్ని ఉల్లంఘించే యాజమాన్యంపై తీసుకునే చర్యలేమిటి?

49. ఒప్పందాన్ని ఉల్లంఘించే కార్మికునిపై తీసుకునే చర్యలేమిటి?

50. అప్రెంటిస్‌లంటే ఒప్పంద నియమాలేమిటి?

51. మీ పని శాశ్వతమైనదా? తాత్కాలికమా? (క్యాజువల్).

52. మీ పని ఏడాదంతా సాగేదా లేక అప్పుడప్పుడు కొనసాగేదా? ఒకవేళ కొన్ని సీజన్లకే మీ పని పరిమితమైతే విరామ సమయాల్లో మీ బతుకుదెరువేమిటి?

53. మీకు జీతాలిచ్చేది సమయం లెక్కనా లేక 'పీస్' లెక్కనా?

54. సమయం లెక్కిస్తే గంటకా లేక రోజుకా?

55. 'ఓవర్ టైం'కు అధిక డబ్బులిస్తారా? ఇస్తే ఎంత?

56. మీకు 'పీస్' లెక్కన ఇస్తే వాటినెలా లెక్కిస్తారు? మీరు కర్మాగారాల్లో పనిచేస్తే పరిమాణంలో గాని, తూకంలో గాని మోసం చేసి మీకు వచ్చే జీతంలో దగా చేస్తారా?

57. 'పీస్‌రేట్'కు పనిచేస్తే నాణ్యత పేరున మీ ఉత్పత్తికి తక్కువ చెల్లించే అవకాశముందా?

58. మీకు ఇచ్చే జీతం కోసం ఎంతకాలం ఎదురుచూడాలి? వారం లేదా నెల లేదా అంతకు పైనా ఉంటుందా?

59. మీ జీతభత్యాల్లో జరిగే ఆలస్యం వల్ల అధిక వడ్డీలు కట్టే బ్రోకర్లు, తనఖాదారుల వద్దకు వెళ్లి బాధలు పడుతూ మీ సౌకర్యాలు పోగొట్టుకుంటారా? అప్పుల పాలై బాధలు పడతారా? దివాళా తీయడంవల్ల గాని, కర్మాగారం మూసివేయడంవల్ల గాని జీతాలు నష్టపోయిన వారెవరన్నా ఉన్నారా?

60. మీ జీతాలు యజమాని చెల్లిస్తాడా లేక ఏజెంటు గాని, కాంట్రాక్టర్ గాని చెల్లిస్తాడా?

61. కంట్రాక్టర్లు గాని, ఇతర మధ్యవర్తులు గాని మీకు జీతాలు చెల్లిస్తే పాటించే నియమాలేమిటి?

62. రోజుకు/వారానికి మీకిచ్చే జీతం మొత్తం ఎంత?

63. మీ సంస్థలో పనిచేసే మహిళల, పిల్లల జీతాల మొత్తమెంత?

64. గత నెలలో పొందిన దినసరి గరిష్ట నెల జీతమెంత?

65. గత నెలలో పొందిన పీస్‌రేట్ గరిష్ట నెల జీతమెంత?

66. అదే సమయంలో మీ జీతమెంత? ఒకవేళ మీ భార్య పిల్లలు మీతో పనిచేసి ఉంటే వారి జీతాలెంత?

67. జీతాలు డబ్బు రూపంలోనా లేక మరేదైన రూపమా?

68. యాజమాన్యం మీకు వసతి కల్పిస్తే ఏ నియమాలు? దానికి సంబంధించి జీతంలో ఏమైనా కోత ఉంటుందా?

69. నిత్యావసర సరకుల ధరలెలా ఉంటాయి? ఉదాహరణకు. ఎ) మీ వసతికి కిరాయి, గదుల సంఖ్య, వ్యక్తుల సంఖ్య, రిపేరింగ్, హీటింగ్, ఇన్సూరెన్స్, ఫర్నీచర్ కొనడం, బాగుచేయడం, లైటింగ్, నీటి సరఫరా మొదలగు. బి) ఆహారం – రొట్టె, మాంసం, కూరగాయలు, ఆలుగడ్డలు మొదలగు పాల ఉత్పత్తులు, గుడ్డు, చేపలు, వెన్న, నూనె, పందికొవ్వు, చక్కెర, ఉప్పు, కిరాణా, కాఫీ, చికోరి, బీర్, వైన్, తంబాకు మొదలగు. సి) బట్టలు తల్లిదండ్రులకు, పిల్లలకు, లాండ్రి, శుభ్రం చేయడం, స్నానం సబ్బులు మొదలగునవి. డి) ఇతర ఖర్చులు – ఉత్తర ప్రత్యుత్తరాలు, అప్పులు, తనఖాదారులకు చెల్లింపులు, పిల్లల స్కూల్ ఫీజులు, న్యూస్ పేపర్లు, పుస్తకాలు, మిత్రులకు ఇతర సమాజాలకు, సమ్మెలు, యూనియన్లు, ప్రతిఘటనా సంస్థలు మొదలగునవి. ఇ) అత్యవసరంగా వచ్చిపడే ఖర్చులు. ఎఫ్) పన్నులు.

70. వ్యక్తిగత, కుటుంబ ఖర్చులపై వార/వార్షిక ఆదాయ వ్యయాల పట్టిక తయారు చేయండి.

71. మీ జీతాల పెరుగుదల కంటే ఆహారం, కిరాయి మొదలగు వాటిపై పెరిగిన ధరల ప్రభావమేమిటి?

72. మీకు తెలిసిన జీతాల వ్యత్యాసాల గూర్చి తెలపండి.

73. 'అభివృద్ధి దశ' అని చెప్పే రోజుల్లో మీ జీతాల పెరుగుదలేమిటి?

74. ఫాషన్లు, ఇతరేతర సంక్షోభాల వల్ల వచ్చిన ఆటంకాల గూర్చి తెలపండి. విశ్రాంతి సమయాల్లో నీ స్వంత అనుభవాన్ని తెలపండి.

75. మీరు ఉత్పత్తి చేసిన వాటి ధరలు మీ శ్రమకొచ్చే సొమ్మును పోల్చి చెప్పండి.

76. కొత్త విధానాలు, యంత్రాలవల్ల ఉపాధి కోల్పోయినవారి గూర్చి తెలపండి.

77. కొత్త యంత్రాలు, ఉత్పత్తి విధానం, శ్రమ తీవ్రత పెరిగిందా? తగ్గిందా?

78. ఉత్పత్తి పెరగడం వల్ల జీతాల పెరుగుదల జరిగినదా?

79. యాభై ఏండ్లకే రిటైర్ అయిన వ్యక్తి తనకు వచ్చిన సొమ్ముపై ఇతర వేతన జీవుల్లాగా బతుకుతున్నాడా?

80. సాధారణ ఆరోగ్యంతో ఎన్నేండ్లు ఒక కార్మికుడు పనిచేస్తాడు?

81. మీ సంస్థల్లో ప్రతిఘటనా సంస్థలున్నాయా? వాటి నాయకత్వమేమిటి? వాటి నియమ నిబంధనలేమిటి?

82. మీకు తెలిసినంత వరకు మీ సంస్థలో ఎన్ని సమ్మెలు జరిగాయి.

83. ఈ సమ్మెలు ఎంతకాలం సాగాయి?

84. అవి సాధారణ సమ్మెలా? పాక్షిక సమ్మెలా?

85. ఆ సమ్మెలు జీతాలు పెంపుదల కోసమా? జీతాలు తగ్గిస్తే ప్రతిఘటించడానికా? పనివేళ తగ్గింపు కోసమా లేక ఇతర కారణమా?

86. వాటి ఫలితాలేమిటి?

87. కోర్టుల జోక్యం గూర్చి తెలపండి.

88. మీ సమ్మెలకు ఇతర సంస్థల వాళ్లు మద్దతిచ్చారా?

89. మీ యజమాన్యం నియమించుకునే కిరాయి కార్మికులకు సంబంధించి నియమాలు, జరిమానాలేమిటి?

90. జీతాలు తగ్గించడం, పనిగంటలు పెంచడం, సమ్మెలు విచ్ఛిన్నం చేయడం, వాళ్ల ఇష్టారీతిన నడిచే విధంగా యాజమాన్య సంఘాలేమైనా ఉన్నాయా?

91. వేతన కార్మికులకు వ్యతిరేకంగా యాజమాన్యానికి మద్దతుగా ప్రభుత్వం తన సాయుధ బలగాలను ఉపయోగించిందా?

92. యజమాన్య చట్ట వ్యతిరేక సంఘాలు గాని, యజమాన్యం గాని కార్మికుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తే ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలబడ్డ సందర్భాలున్నాయా?

93. ప్రస్తుత నియమ నిబంధనల కనుగుణంగా ఫ్యాక్టరీ నడిచేట్లు ప్రభుత్వ కృషి ఉందా? ప్రభుత్వ ఇన్స్‌పెక్టర్లు వాళ్ల విధులు సక్రమంగా నిర్వహించారా?

94. ప్రమాదాలు జరిగినప్పుడు అవసరాల కోసం, ఎవరన్నా చనిపోతే, అంగవైకల్యం సంభవిస్తే, వయోవృద్ధులను ఆదుకునే 'మిత్ర సంస్థ'లేమైనా ఉన్నాయా? వాటికి సంబంధించిన నియమ నిబంధనలను తెలపండి?

95. ఈ సంస్థల సభ్యత్వం తప్పనిసరా? ఐచ్ఛికమా? వాళ్ల విధులు కేవలం పనివారలే నియంత్రిస్తారా?

96. ఒకవేళ సభ్యత్వం తప్పనిసరి అయి, అవి యజమానుల అజమాషీలో ఉంటే పనివారల జీతాల నుండి సభ్యత్వం మినహాయింపు చేస్తారా? అలా మినహాయించిన సొమ్ము కార్మికుడు సంస్థ నుండి వెళ్లిపోయినా లేక తీసివేయబడినా అతనికి చెల్లిస్తారా? అలా పనివారల జీతాల నుండి ముందే యజమానులు మినహాయించుకున్న సొమ్మును పనివారలకు పెన్షన్ లాగా ఇచ్చిన ఉదంతాలు తెలుసా?

97. మీ సంస్థల్లో సహకార సంఘాలున్నాయా? అవి ఎలా నియంత్రించబడతాయి? పెట్టుబడిదారుల వలే వీటి నిర్వహణ కోసం పనివాళ్లను కిరాయికి తెస్తారా? వాటి నియమ నిబంధనలు తెలపండి.

98. మీ సంస్థల్లో జీతాలు పూర్తిగా చెల్లిస్తారా? లేక కొంత భాగం లాభాల వాటా రూపంలో ఇస్తారా? ఆ వాటా ద్వారా పొందిన జీతాలు, పూర్తిగా పొందిన జీతాలను పోల్చి చూడండి. వీటి మధ్య ఉన్న పనివారల బాధ్యతలు తెలపండి. సమ్మెలో కార్మికులు పాల్గొంటే యాజమాన్యం కేవలం నమ్మకస్థులనే మళ్లీ పనిచేయడానికి అనుమతిస్తుందా? లేక అందరికీ అనుమతిస్తుందా?

99. మీ సంస్థలో ఉద్యోగం చేస్తున్న పురుషుల, మహిళల సాధారణ భౌతిక, బౌద్ధిక, నైతిక పరిస్థితులేమిటి?

100. ఇంకా సాధారణ విషయాలు ఏవైనా ఉన్నాయా?

*(తెలుగు అనువాదం: ఎనిశెట్టి శంకర్, రిటైర్డ్ హెడ్‌మాస్టర్)* వీ

# మెకనాస్ గోల్డ్ కోసం మనుషుల వేట

***ఖనిజ సంపదను బహుళజాతి కంపెనీలకు అప్పజెప్పడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులపై దారుణ మారణకాండకు పాల్పడున్నాయనీ, ఇందులో వందలాది మంది ఆదివాసులు ప్రాణాలు, జీవితం కోల్పోతున్నారనీ అంటున్నారు*** **వరవరరావు**

ఈసారి ఎండలు శివరాత్రి దాకా కూడా ఎదురు చూడలేదు. ఉగాది వసంతం కన్నా ముందే ఉగ్రగ్రీష్మం అడవిలో నిప్పులవాన కురిసింది. అది దక్కన్ పీఠభూమి నదుల్లోకి నీళ్లు తెచ్చేది కాదు. కన్నీళ్లు తెచ్చేది. నెత్తుర్లు పారించేది. నెత్తుర్లను సలసల రగిలించేది. గుండెలవిసి పోయే సంఘటనలు. గుండెలు ఇంద్రావతి, శబరి, గోదావరి పరీవాహ ప్రాంతంలో నెర్రెలు వారిన రేగడి నేలల్లో వెయ్యి ముక్కలై పరచుకొని వేనోళ్ల నినదించిన కాలం.

మార్చ్ 2 తెలంగాణ ఛత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లో చర్ల-బీజాపూర్‌లో పదిమంది అమరులయ్యారు. వాళ్లలో స్వామి (ప్రభాకర్ - వరంగల్) తప్ప అందరూ ఆదివాసులు. ఏడుగురు మహిళలు. ఏభై వసంతాలు పూర్తి చేసుకున్న నక్సల్బరీ నేపథ్యంలో, చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం ఇచ్చిన స్ఫూర్తితో మహత్తర చర్చ (గ్రేట్ డిబేట్) ముగిసి మెన్షివిజాన్ని మట్టికరిపించిన బోల్షివిక్ పార్టీ నిర్మాత లెనిన్ నూరేళ్ల పుట్టినరోజు (ఏప్రిల్ 22న) ఎనభై దేశాల్లో ఏర్పడిన సిపిఐ (ఎంఎల్) ఏభయ్యవ ఆవిర్భావ దినం ప్రారంభమైన రోజు గడ్చిరోలి జిల్లా బోరియా అటవీ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగి ఇప్పటికే 16 మంది మావోయిస్టులు చనిపోయారు. ఈ సంఖ్య ఇంకా పెరుగొచ్చని, మావోయిస్టులు ప్రతిదాడులకు పాల్పడే అవకాశం ఉన్నందున గాలింపు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అంటే ఇది ఏకపక్ష దాడి అని. భామ్రాగడ్ తాలూకాలోని తాడ్‌గడ్‌కు సమీపంలోని అడవుల్లో పెరిమిలి దళం సమావేశం అయిందనే పక్కా సమాచారంతో మహారాష్ట్ర నక్సల్స్ కార్యకలాపాల వ్యతిరేక పోలీసు బృందం సి-60 కమాండోలు ఈ దాడి చేశారు. ఈ సమాచారం ద్రోహి ఇచ్చిందే కావచ్చు. మీడియాలో వస్తున్నట్లు సెటిలైట్ సహాయంతో మావోయిస్టుల కదలికలను కనిపెట్టినందు వల్ల కావచ్చు.

ఇప్పటికే కేంద్ర అర్ధసైనిక బలగాలు (సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్ మొదలైనవి) ఆయా రాష్ట్రాలు ఏర్పాటు చేసిన సి-60, గ్రేహౌండ్స్ వంటివి మానవరహిత ఇజ్రాయిల్ యుద్ధ విమానాలను, హెలికాప్టర్లను, డ్రోన్ కెమెరాలను, జార్ఖండ్ వంటి అటవీ ప్రాంతంలో కార్గిల్ యుద్ధంలో వాడిన రాకెట్ లాంచర్‌లను కూడా మావోయిస్టుల పేరుతో మావోయిస్టులనే కాదు ఆదివాసులను కూడా వందల సంఖ్యలో గాలింపు చర్యలు, ఎన్‌కౌంటర్‌ల పేరుతో చంపడానికి ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు తాజాగా శాటిలైట్ (ఉపగ్రహం) తీసిన ఫొటోల సహాయంతో ఇంద్రావతి నది ఒడ్డున మావోయిస్టుల కదలికలను పోల్చుకొని మరి రెండు సి-60 బలగాలను రప్పించుకొని దాడిచేశారని మీడియా కథనాలు. గతంలో నల్లమల అడవుల్లో అప్పటి అవిభక్త ఎపి కమిటీ కార్యదర్శి మాధవ్, అతని ఎనిమిది మంది సహచరులను కూడా నిమ్మిచెట్టు లోయలో నడుస్తుండగా ఇట్లాగే శాటిలైట్ ఫొటోలతో కనిపెట్టి చంపారని వార్తలు వచ్చాయి. అయితే ఇటువంటి ప్రచారాలు - ద్రోహులు, కోవర్టులు ఇచ్చిన సమాచారంతో కాదని చెప్పడానికి - మంద్రస్థాయి యుద్ధంలో భాగంగా చేసే అవకాశం ఉంది. ఎందుకంటే ఇది ఏకకాలంలో భౌతిక స్థాయిలోనే కాకుండా మానసిక స్థాయిలో కూడా నిర్వహించే సైకలాజికల్ వార్.

అంతకన్నా ముఖ్యంగా ఈ మూడు నదుల పరీవాహ ప్రాంతంలోనే కాదు, తూర్పు, మధ్య భారతాల్లో - ముఖ్యంగా జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఎఒబి, తెలంగాణ, ఆంధ్రల అటవీ సరిహద్దుల్లో జరుగుతున్న అన్ని ఎన్‌కౌంటర్లలో కూడా నూటికి తొంబై మంది ఆదివాసులే. వాళ్లు మావోయిస్టు పార్టీ సభ్యులు, దళ సభ్యులు, మిలిషియా, గ్రామ రక్షక దళాలు, దండకారణ్య ఆదివాసీ క్రాంతికారీ మహిళా సంఘటన్‌కు చెందిన వాళ్లు కావచ్చు. జనతన సర్కార్ ఏరియాలలో నివసించే ఆదివాసులు కావచ్చు. బహుళజాతి కంపెనీలు భారీ ఎత్తున తలపెట్టిన మైనింగ్, రైల్వే లైన్లు, భారీ నీటి ప్రాజెక్టులు, ఉక్కు ఫ్యాక్టరీల నిర్మాణాలు, బేస్ క్యాంపులు, అడుగడుగునా ఉన్న పోలీసు క్యాంపుల దగ్గర నివసించే సాధారణ ఆదివాసులు కావచ్చు. కనుకనే మనకు చాలా సందర్భాల్లో డివిజన్ స్థాయి నుంచి జిల్లా పైస్థాయి నాయకుల పేర్లు, అందులోనూ ఆదివాసేతరుల పేర్లే తప్ప ఆదివాసుల పేర్లు కూడా పూజారి కాంకేడ్ ఎన్‌కౌంటర్ సంఘటనలో వలె మావోయిస్టు పార్టీ ప్రకటిస్తే తప్ప తెలియవు. మావోయిస్టు పార్టీ స్థానిక ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి పెడితే తప్ప, స్థానిక ఆదివాసీ ప్రజలు వందల సంఖ్యలో పోలీసు స్టేషన్ల ముందు ధర్నాలు చేస్తే తప్ప వాళ్ల మృతదేహాలు కూడా అప్పగించరు.

పూజారి కాంకేడ్ ఎన్‌కౌంటర్‌లో స్వామి (ప్రభాకర్) మృతదేహాన్ని ప్రజాసంఘాల, అమరుల బంధుమిత్రుల సంఘం సహాయంతో ఆయన కుటుంబ సభ్యులు తెచ్చుకున్నా భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి శవాగారంలో మిగిలిన ఆదివాసుల మృతదేహాలను బీజాపూర్, సుకుమా జిల్లాలలో ఆ అమరుల గ్రామాల ప్రజల ఆందోళన వల్లనే చర్లకు అటు ఇటు ఉండే ప్రజాప్రతినిధులు కదిలి వాళ్ల కుటుంబ సభ్యులకు అప్పగించక తప్పలేదు. అవన్నీ జనతన సర్కార్ గ్రామాలు కావడం వల్ల అమరుల ప్రతి గ్రామంలో అంతిమ యాత్రలు సంస్మరణ సభలు జరిగాయి.

కాని ప్రకృతి సంపదను బహుళజాతి కంపెనీలకు దోచిపెట్టడానికే దళారీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, భీకరమైన ఆయుధాలతో, విస్తృతమైన సమాచార నెట్‌వర్క్‌తోనైనా సరే చేస్తున్న నిర్విచక్ష దాడుల్లో అమరులవుతున్న ఆదివాసుల పేరు, ఊరు తెలియడం కూడా కష్టం. ఈ ఎండలకు అడవిలో అమానుష నిర్లక్ష్యానికి గురయిన మృతదేహాలు కూడా మాంసపు ముద్దలుగా చూసినపుడు కన్నపేగులయినా, కట్టుకున్న వారయినా, కన్నబిడ్డలైనా పోల్చుకోవడం కష్టం.

భామ్రాగడ్‌లో గాలింపు చర్యలకు పొరుగున ఉన్న తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసు బలగాలను రప్పించినట్లు, ఎన్‌కౌంటర్ కూడా కొనసాగుతున్నట్లు, మృతుల సంఖ్య 25కు పెరుగవచ్చునని కూడా మహారాష్ట్ర పోలీసు అధికారి చెప్పాడు.

23వ తేదీ సోమవారం మధ్యాహ్నం గడ్చిరోలీ చేరుకున్న ఒక ఛానెల్ రిపోర్టర్‌ను తాజా సమాచారం కోసం అడిగితే పదహారు మృతదేహాలను మండుతున్న ఎండల్లో మీడియా ప్రతినిధులు చూడడానికి పడేసారని, అందులో ఇప్పటికైతే చల్లగరిగె విజేందర్‌ను మాత్రమే పోల్చుకున్నారని చెప్పాడు. అతని మృతదేహాన్ని రక్తబంధువులకు, స్థానిక ప్రజలకు అప్పగిస్తే ఈ సాయంత్రానికే వాళ్లు తిరిగి రావచ్చు. పోలీసులు ఇచ్చే సమాచారం ప్రకారమే మిగతా పదిహేను మందిలో ముగ్గురు మహిళలతో సహా అందరూ ఆదివాసులే. వారిలో సాయినాథ్ (34) అనే ఆదివాసీ కూడా డివిజన్ స్థాయికి ఎదిగిన వాడని కూడా పోలీసులే చెప్పారు. మరొక ఆదివాసీ మావోయిస్టు రాజేశ్‌ను కూడా గుర్తించినట్లు చెప్పారు.

సంఘటనా స్థలంలో మూడు ఎకె-47లు, భారీ ఎత్తున పేలుడు సామగ్రి, విప్లవ సాహిత్యం పోలీసులకు దొరికిందన్న దానిని బట్టే అక్కడ నాయకత్వ స్థాయి వాళ్లు ఉన్నారని చెప్పడం తప్ప పోలీసులు రెండు రోజులు గడిచినా వారి పేరు, ఊరు వంటి గుర్తింపులే ప్రకటించలేక పోతున్నారు. ఇది ఉద్దేశపూర్వకమూ కావచ్చు. లేదా ఇద్దరు డివిజన్ స్థాయి నాయకులు, మరొకరు మినహా మిగిలిన వారంతా పార్టీ పిలుపుపై గానీ, పార్టీని కలవడానికి గానీ వచ్చిన సాధారణ ప్రజలు కావచ్చు. సి-60 కమాండోలు అక్కడ సంచరిస్తున్న సాధారణ ప్రజలపై అనుమానంతో కాల్పులు జరిపి ఎన్‌కౌంటర్ ప్రకటించడమూ కావచ్చు.

ఎన్‌కౌంటర్ ప్రకటించిన రెండవ రోజు ఏప్రిల్ 23న కూడా మృతదేహాలను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు ఇంకా జరుగుతున్నాయని, భారీ వర్షాలు వాటికి అడ్డంకిగా ఉన్నాయంటున్నారు. అడవిలో వర్షాలు - బయట బండలు పగిలే ఎండలు!

ఏభై రోజుల్లో రెండో అతిపెద్ద ఎన్‌కౌంటర్ గురించి ప్రజలు ఆందోళన చెందుతూ వివరాల కోసం, గుర్తింపు కోసం, మృతదేహాలను రక్త బంధువులకు అప్పగించడం కోసం తీవ్ర ఆందోళనకు, నిరీక్షణకు గురవుతుండగానే గడ్చిరోలి జిల్లాలోనే రాజారాం ఖాండ్లా అడవిలోని జిమాల్ గుట్ట ప్రాంతంలో సోమవారం ఏప్రిల్ 23న మరో ఎన్‌కౌంటర్ జరిగినట్లు, అందులో ఎంత మంది మరణించారో కచ్చితంగా చెప్పలేకపోయినా కనీసం నలుగురు మరణించారని ఐజి చెప్పాడు.

ఛత్తీస్‌ఘడ్ సుకుమా జిల్లాలో పూస్‌పాల్ సమీపంలో ఏప్రిల్ 22 ఆదివారం రాత్రి మరో ఎన్‌కౌంటర్ జరిగిందని అందులో ఐదుగురు మావోయిస్టులు మరణించారని మరో వార్త.

ఎన్‌కౌంటర్లు ఎన్నయినవి? ఆది, సోమవారాల్లో, ఏప్రిల్ 22, 23 తేదీల్లోనే ఒకటి, రెండు, మూడు.

ఎందరు మరణించారు? 16+4+5=25

ఎందర్ని గుర్తించారు? పోలీసులైతే ముగ్గుర్ని - మృతుల కుటుంబాలలో ఒక్క విజేందర్ కుటుంబం మాత్రమే అతని మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడానికి వెళ్లగలిగింది.

విజేందర్ పేద దళిత కుటుంబం నుంచి ఆర్‌వైఎల్‌లోకి వచ్చి గాజర్ల సోదరుల ప్రభావంతో విప్లవోద్యమంలోకి ఇరవై ఏళ్ల క్రితం వెళ్లి డివిజన్ స్థాయి నాయకుడయ్యాడు. రెండో డివిజన్ కమిటీ నాయకుడు సాయినాథ్ ఆదివాసీ. అతనితోపాటు రాజేశ్ పేరు మాత్రమే పోలీసులు ప్రకటించారు. మిగతా ఇరవై ముగ్గురు ఆదివాసులు కేవలం సంఖ్య. ఊరు, పేరు ఇప్పటికైతే తెలియదు. మనుషులకు, ఆదివాసీ మానవులకు ఎంత గుర్తింపు? బహుశా వీళ్లు ఓటర్ల జాబితాలో కూడా ఉండరు. ఆధార్ కార్డులూ ఉండవు.

కశ్మీర్‌లో ఇటువంటి స్థితినే అభివర్ణిస్తూ ఇన్షా మాలిక్ అనే కవయిత్రి 'బాధితులు' అనే గుర్తింపు సభ్య సమాజం నుంచి నిరాకరిస్తూ ఒక కఠోర వాస్తవాన్ని కవితా రూపంలో వ్యక్తపరుస్తుంది. కశ్మీరులో అనునిత్యం, ప్రతిక్షణం అమలవుతూ అతి సాధారణమని భావించబడుతున్న హింస గురించి టివి స్టూడియోలో విశ్లేషణలు, రాజ్య ఆమోదిత చర్చలు, నిషేధిత ప్రసంగాలు ఏవీ ప్రజల నైసర్గిక హృదయ స్పందనలను, ఆక్రోశ, ఆగ్రహాలను పట్టుకోలేక పోతున్నాయని, భావోద్వేగ వాహిక అయిన కవిత్వమైనా పట్టుకోగలదేమో ప్రయత్నించాలి అంటుంది.

(నాట్యానికి) ఇద్దరు చాలా ఇద్దరు చాలా?
త్వరలో నువ్వు గ్రహిస్తావు ముగ్గురు కావాలని
కనురెప్పలు కొట్టే ఇంతలోనే
అది నెత్తురోడుతున్న
బీభత్స శరీరాల గుట్ట అవుతుంది
వర్తులాకారంగా తిరుగుతున్న
కెమెరాల ముందు
పూర్తి నగ్నంగా
మామూలు కన్ను చూడలేనంతగా
ప్రపంచం
రాజ్యానంద నృత్యాలకు
మౌనసాక్షిగా మిగులుతుంది
ఇక్కడ, ఇక్కడే
జాతి
తన నిధులను వెతుక్కోవడానికి
వస్తుంది

ఈ కవితకు ఒక తాజా కలం ఉంది. 'ఖాజీ గుండ్ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మరణించారు అని విన్నప్పుడు మృతుల సంఖ్య 46. ముగ్గురని విన్నప్పుడు...

ఇది బుర్హాన్ వనీని ఎన్‌కౌంటర్ పేరుతో భారత సైన్యం కాల్చినప్పుడు రాసిన కవిత. ఇక్కడి నుంచీ వరుసగా ఆమె 'మృత్యువు గురించి ఒక కవిత' అని రాస్తూ అన్నిటికీ తాజాకాలం రాస్తూ వచ్చింది. ఎందుకంటే కవిత తడి ఆరక ముందే భారత మీడియాలో సైన్యం కాలుస్తున్న కశ్మీరీల మరణాల వార్తలు - హృదయం లేని వార్తలు తాజాకలాలను కూడా కాలం చెల్లినవిగా మార్చినవి.

నేనూ ఈ కథనాన్ని ఈ కశ్మీరీ కవితతో ముగించాలనుకుంటున్నాను. ముగించాను కూడా.

కశ్మీరయినా, దండకారణ్యమైనా రాజ్య మృత్యుహేల ఇంతే. మృత్యు పదఘట్టనల కింద ప్రాణాలు కోల్పోయే మనుషుల సంఖ్య పెరుగుతూ పోవడం తప్ప మార్పేమి ఉంటుంది... అని.

ఎన్‌డిటివి నుంచి ఫోన్ - మృతుల సంఖ్య 33 అని. మూడు చోట్ల ఎన్‌కౌంటర్ల మృతుల సంఖ్య కలసినా - అంత కాదు. ఉదయమే ఫోన్‌లో అమెరికా నుంచి ఒక మిత్రుడు అంతే ఆవేదనతో ఈ మూడు ఎన్‌కౌంటర్ల గురించి తాను అన్ని తెలుగు పత్రికలు చదివి కలిపి లెక్కేసి చెప్పిన

# ప్రజల్ని ఏమారుస్తున్న సామాజిక మాధ్యమ వేదికలు

*సాంకేతిక పరిజ్ఞానం కార్పొరేట్ సంస్థలకు మార్కెట్‌గా, పాలకులకు అధికారంగా ఉపయోగపడ్డంతగా ప్రజల సమస్యల పరిష్కారానికి ఉపయోగపడడంలేదని దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు* **బైరెడ్డి సతీష్**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మనిషి జీవితాన్ని ఎంత సౌకర్యవంతం చేసిందని అనుకుంటున్నామో అంతకంటే ఎక్కువగా అంగట్లో నిలబెట్టింది. తన అంతరంగాన్నంత అంతర్జాలానికప్పగించి వ్యక్తిగత వివరాలన్నీ అత్యంత గోప్యంగా ఉంచబడ్డాయని భ్రమిస్తున్నాడు మనిషి. అడిగిందల్లా అందిస్తూ తన ప్రపంచం మరెవరకీ తెలియదనే మాయలో మునిగిపోయాడు. నిజానికీ అంతర్జాల ప్రపంచంలో సామాజిక మాధ్యమాల మత్తులో విహరిస్తున్న ఏ మనిషికి ప్రైవసీ అనేదీ వట్టిమాటే! అందరి గుట్టంతా అందనిది కాదని ఒక 'క్లిక్' దూరంలోనే నీ రహస్యాలన్నీ కంప్యూటర్ తెరలమీద పొరలు పోరలుగా దర్శనమిస్తాయని తేలిపోయింది.

ఒకప్పుడు రాజ్యం పౌరుల కదలికల్ని భౌతికంగా నీడలా నడిచొచ్చి పసిగట్టేది. ఇవాల ప్రపంచంలో ఏ మూలన ఉన్న, ఏ గాజు మేడలోంచైనా అరచేతిలో అద్దంలో చూచినట్టు ప్రతి వారి నడకను, నడతను పసిగట్టుతున్నది. యూరప్, పాశ్చాత్య దేశాలు వైయక్తికతకు ప్రాధాన్యతనిచ్చే దేశాలుగా పేరు ఉన్నది, ప్రైవసీ ప్రాథమిక హక్కులో భాగమని భారత సుప్రీంకోర్టు ఇటీవలే తీర్పునిచ్చింది. మరోవైపు ఎవరు తమకంటూ వ్యక్తిగత జీవితాన్ని కలిగి ఉండే అవకాశంలేని అనివార్య పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా పౌరులపై రుద్దబడుతున్నాయి. ప్రపంచం కుదించబడి కుగ్రామం కావడమంటే ఇదేనేమో!

అతిపెద్ద సామాజిక మాధ్యమమైన ఫేస్‌బుక్ నుండి బ్రిటన్‌కు చెందిన కేంబ్రిడ్జ్ అనలిటికా అనే రాజకీయ వ్యవహారాల సంప్రదింపుల సంస్థ (కన్సల్‌టెన్సీ) లక్షలాది అమెరికన్‌ల వ్యక్తిగత వివరాలను రాబట్టి 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఫలితాలను తారుమారు చేసిందనే అంశం అంతర్జాల ప్రపంచంలో భాగస్వాములైన వారందరినీ కుదిపివేసింది. అతి తక్కువ కాలంలో ఫేస్‌బుక్ నిర్వహణ ద్వారా అత్యంత సంపన్నుడైన దాని కార్యనిర్వాహణాధికారియైన జుకర్‌బర్గ్ అమెరికా శాసన సభ విచారణా కమిటీల ముందు సమాచారం ఎలా లీకయిందనే అంశంపై సమాధానం చెప్పి ఫేస్‌బుక్ వినియోగదారుల క్షమాపణలను కోరాల్సి వచ్చింది.

87 మిలియన్ల జన సమూహపు వ్యక్తిగత సమాచార వివరాలు ప్రధానంగా అమెరికా పౌరుల వివరాలు కేంబ్రిడ్జ్ అనలిటికాకి ఎలా అందివ్వబడ్డాయనేది ప్రధానాంశంగా చేయబడ్డది. అలెగ్జాండర్ కోగన్ అనే సైకాలజీ ఫ్రొపెసర్ గ్లోబల్ సైన్స్ రీసర్చ్ పేరిట విద్యావిషయక ప్రయోజనాలు, వ్యక్తిత్వాల సర్వే పేరున ఫేస్‌బుక్ నుండి లక్షలాది అమెరికన్‌ల వ్యక్తిగత వివరాలను సేకరించాడు. నిజానికి ఇలాంటి వివరాలను ఫేస్‌బుక్ మార్కెట్ శక్తులతో పంచుకోవడం, వారివారి వ్యాపార ప్రయోజనాల కోసం వ్యాపార ప్రకటలను గుప్పించడం ప్రజల్ని వినియోగదారి ప్రపంచంలోకి బలవంతంగా నెట్టివేయడమేమి కొత్తకాదు! 'దిస్ ఈజ్ యువర్ డిజిటల్ లైఫ్' పేరుతో ఒక క్విజ్ యాప్‌ను రూపొందించిన కోగన్ ఫేస్‌బుక్ వినియోగదారుల పూర్తి వివరాలతో పాటు వారి స్నేహితుల వివరాలను సహితం సేకరించాడు. ఈ ప్రక్రియ అసాంతం హార్వార్డ్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మైకెల్ కొసిన్‌స్కీ కేంబ్రిడ్జిలో పిహెచ్‌డి పరిశోధక విద్యార్థిగా ఉన్నప్పుడు రూపొందించబడిన విధానం ఆధారంగా ఒక ఫేస్‌బుక్ వినియోగదారుడు ఏఏ అంశాలను ఇష్టపడుతున్నాడు (లైక్స్), వేటిని అయిష్టపడుతున్నాడు (డిస్‌లైక్స్), ఒక వ్యక్తి అంతర్ముఖుడా, బహిర్ముఖుడా, అందోళనపడే అంశాలు ఏమిటి, వేటిని అంగీకరిస్తాడు, ఎంత ఓపెన్ ఉంటాడు అనే ఐదు లక్షణాలు ఆధారంగా ఒక 'మనో స్వరూపాన్ని' రూపొందించారు.

వీటిని సరిపోల్చడానికి ఒక సైకాలజీ క్విజ్‌ను కూడా ఫేస్‌బుక్ వినియోగదారులకు పంపించారు. ఎలాంటి పరిస్థితులకు ఎలా స్పందిస్తారు, వేటికి త్వరగా ప్రభావితమవుతారు, ఏ అంశాలను ఇతరులకు వెంటనే ఇచ్చిపుచ్చుకుంటారు, ఎపుడు భావోద్వేగాలకు గురవుతారు, ఏ ఏ సందర్భాల్లో వారి ప్రవర్తనా రీతులు ఏమిటి అనే పక్కా డేటాను రూపొందించి కేంబ్రిడ్జ్ అనలిటికాకు కోగన్ అప్పగించాడు. ఇక్కడ అసలైన రాజకీయ కార్యాచరణకు పదును పెట్టింది కేంబ్రిడ్జ్ అనలిటికా. ఈ మొత్తం వ్యూహానికి రూపకర్త అయిన రైట్‌వింగ్ మీడియా గురు గా పేరొందిన స్టీవ్‌బ్యానన్ ట్రంప్ విజయానికి అనుకూలంగా ఈ డేటాను వినియోగించాడు. లక్షలాది మంది మానసిక స్థితిపై ఒక అంచనాకు వచ్చిన సంస్థ తమకు అనుకూలమైన రాజకీయాలవైపు వారిని ఎలా మళ్లించాలన్న పక్కా ప్రణాళికతో రాజకీయ లక్ష్యాత్మక ప్రకటనలను వారు సేకరించిన వారిపై గుప్పించడం ద్వారా (వారి బలాలు బలహీనతలు ముందే తెలుసు కాబట్టి) ఓటరుగా వారికుండే 'ఛాయిస్'ను ప్రభావితం చేశారు.

---

సంఖ్య కన్నా ఇది ఎక్కువ. అది 25, అంటే ఇంకా ఎనిమిది ఎక్కువ. ఆ సంఖ్య అక్కడ కూడా ఆగలేదు. మధ్యాహ్నం 3.30 గంటలకు అది నలభై (40)కి చేరుకున్నది. గాలింపు చర్యలు, ఎన్‌కౌంటర్లు కొనసాగుతూ ఉన్నాయి గనుక పెరుగనూవచ్చు.

ఎంతయితే ఏమిటి? సంఖ్యనే కదా. మావోయిస్టులైనా ఆదివాసులే కదా. ఆదివాసులైనా మావోయిస్టులే కదా. అడవి మనుషులకు, దేశద్రోహులకు దేశపటంలో చోటుందా? దేశభక్తుల పటంలో చోటుందా?

విలువయిన ప్రకృతి సంపదకు తప్ప, విలువలేని మానవ శ్రమకు తప్ప పాలకులకు, రాజ్యానికి, కంపెనీలకు మనుషుల, ఆదివాసీ మనుషుల ప్రాణాల పట్ల విలువ ఉందా? జాతి ఇక్కడికి మెకనాస్ గోల్డ్ అన్వేషణలో వస్తుంది. మనుషుల్ని చంపి అయినా అడ్డు తొలగించుకోవడానికి.

*(రచయిత విరసం వ్యవస్థాపక సభ్యులు)* వీ

నిరంతరం ఖాతాదారుల ప్రవర్తన, మానసిక స్థితిని మార్చే క్రమంలో వారి చేతుల్లోని డేటాను ఒక మనోయుద్ధ ఉపకరణంగా వాడుకున్నారు. వ్యక్తులుగా వారిని ఎలా ప్రభావితం చెయ్యాలి, సమూహాలుగా ఎలా ఏమార్చాలి అనే కార్యాచరణను పెద్దమొత్తంలో చేపట్టి విజయం సాధించ గలిగారు. వారిని ఆకర్షించే నినాదాలు, పంచ్‌లైన్‌లు, కొటేషన్‌లు, ఆసక్తులకు దగ్గరగా ఉండే అంశాలు, ఒక్కోసారి వారిలో కనీస విచక్షణను పాటించే మానసిక సమతుల్యం లేకుండా నిరంతరం ఉక్కిరిబిక్కిరి చేయడంతో రాజకీయంగా ట్రంప్ లాభపడ్డాడు. ప్రపంచంలో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ట్రంప్ గెలవడంలో ఆనాడు ఎవరి విశ్లేషణలకూ అందని ఈ అంతర్జాల సామాజిక మాధ్యమాల మాయాజాలం ఇంత ఉందనేది ఇపుడిపుడే ప్రపంచం అవాక్కై అవగాహన చేసుకుంటున్నది. ఇప్పటికీ అమెరికాలో ట్రంప్ గెలవడానికి రష్యన్‌ల పాత్ర ఉందనే వారి సంఖ్య తక్కువేమీకాదు. తిలా పాపం తలా పిడికెడు అన్నట్టు అందరి పాత్రలూ ఉన్నాయి. ఇంకా అదృశ్య హస్తాలెన్ని ఉన్నాయో?

కేంబ్రిడ్జ్ అనలిటికాలోనే ఉద్యోగిగా పనిచేసిన క్రిష్టఫర్ వీలీ ఈ మొత్తం ఉదంతాన్ని బట్టబయలు చేశాడు. అత్యంత నేరపూరితమైన వారి కార్యాచరణ ప్రభావం ఒక్క అమెరికా రాజకీయాల్లోనే కాదు మొత్తం ప్రపంచమంతా పాకిపోయినట్టు అర్థమయిపోతుంది. ఏ గెలుపు వెనుక ఎన్ని శక్తులో, ఎన్ని రహస్యాలుంటాయో ఇవాల ప్రపంచానికి మరింత బోధపడుతున్నది. ప్రధాన స్రవంతి మీడియానే పక్షపాతంగా వ్యవహరిస్తూ రాజకీయాలను ప్రభావితం చెయ్యగలుగుతున్నాయనుకుంటే అందరికీ వేదిక అయ్యే సామాజిక మాధ్యమాలు సహితం అభిప్రాయాలను మలిచేందుకు, వ్యక్తిగత సమాచారమే వ్యక్తులను మార్చేందుకు ప్రపంచ గమనాన్నే మలుపు తిప్పేందుకు కారణభూతమవుతున్నాయి.

ఫేస్‌బుక్, గూగుల్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ లోపల ఏదైనా ఒక్కసారి పేరు, ఊరు, లింగం, వయస్సు, ఇష్టా ఇష్టాలు, ఎం తింటాం, ఎక్కడ తిరుగుతాం అనే వివరాలు నమోదు అయ్యాయంటే ప్రపంచానికి నీ వివరాలన్నీ తెలిసినట్టే! ఇంతెందుకు నీ చేతిలో మొబైల్ ఉందంటే చాలు నువ్వెక్కడున్నావనేది గోప్యమైనది అసలే కాదు. రాజ్యం నమోదు చేసే పౌరుల వివరాలన్నీ ఇవాల ప్రైవేట్ సంస్థలు రకరకాల రూపాల్లో సేకరించి డేటాను భద్రంగా రాజ్యానికి అప్పగిస్తున్నాయి. సేకరించిన డేటా అంతా ప్రజాభివృద్ధికి ఉపయోగపడుతుందని అనుకోవడమూ అంత పరిపక్వత అనిపించుకోదు. పౌరుల జీవితాలను నియంత్రించే పనే ఎక్కువగా జరుగుతున్నది తప్ప ప్రగతిదాయమైనదేమిలేదు. 6 కిలోల బియ్యం కోసం ప్రజాబాహుళ్యం తమ గోప్యతను సంతోషంగా సమర్పించుకోవాల్సిన పరిస్థితి.

అసలిక్కడ ఫేస్‌బుక్ నుండి కేంబ్రిడ్జ్ అనలిటికా మొత్తం డేటా ఎలా తస్కరించిందన్నది విషయం కానేకాదు! అసలు తస్కరణకు అవకాశం లేకుండానే మార్కెట్ శక్తులకే మన వివరాలను అందజేసి సొమ్ము చేసుకోవడమే వారి పనికదా. మనం ఎవరో తెలియని వాళ్ళు, మనకు ఎవరో తెలియని వాళ్ల ఫోన్లలో, సామాజిక మాధ్యమాలు వేదికగా వ్యాపార ప్రకటనలను గుప్పిస్తూనే ఉంటారు. వికీలీక్స్ జూలియన్ అసాంజ్ 2011లోనే ఫేస్‌బుక్ అనేది అత్యంత ప్రమాదకరమైన గూఢాచార యంత్రం అని పేర్కొన్నాడు. ఇవాల చర్చంతా డేటా ఎలా లీకయింది, దాని వెనుకాల ఎవరున్నారు, అది జరిగిన విధానంపైననే కేంద్రీకరించి జరుగుతున్నది. నిజానికి ఇదంతా వొట్టి డ్రామా మాత్రమే! అంతర్జాలాన్ని శాసిస్తున్న సామ్రాజ్యవాద దేశాలకు తెలియకుండా ఏ కంపెనీ 'సీక్రసీ'ని నిర్వహించగల సత్తాను కలిగిలేదు. గోప్యత అనేది అంతా అయా మాధ్యమాల వినియోగదారుల నమ్మకమే తప్ప నిజం కాదని అనుమానానికి తావులేకుండా రుజువయింది. ప్రపంచ దేశాలన్నిటిలో ఏదో ఒక రూపంలో పౌరుల వ్యక్తిగత వివరాలన్నీ నిక్షిప్తం చేయబడతాయి. భారతదేశంలో అయితే ఆధార్‌ను అధికారికంగానే ప్రవేశపెట్టారు. అనేక రకాల గుర్తింపు కార్డులను పౌరులపైన రుద్దుతున్న ప్రభుత్వం ఆయా రకాల కార్డుల వల్ల కలిగే ప్రయోజనం కంటే వాటి కొరకు ప్రజలు పడే ఇక్కట్లే ఎక్కువున్నాయి. పేరుకు 'సార్వభౌమాధికార' దేశాలైనా సామ్రాజ్యవాద దేశాల, బహుళజాతి గుత్త పెట్టుబడి సంస్థల ఆధీనానికి లోబడకుండా, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలపై పెత్తనం వారికివ్వకుండా ఏ ప్రభుత్వమూ వ్యవహరించలేదు. పైగా వారికెంత పెత్తనాన్ని, స్వేచ్ఛను ఇస్తే అవి అంత మంచి ప్రభుత్వాలనిపించుకుంటాయి!

రకరకాల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ముసుగు ధరించిన కార్పొరేట్ సంస్థలు వాటి ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించే రాజకీయ పక్షాలవైపు నిలబడి ప్రజల్ని మోసం చేస్తున్నాయి. 2012 నుండే భారత దేశంలో పెద్ద ఎత్తున మతం-మార్కెట్ కలగలసిన నరేంద్రమోడీ అభివృద్ధి నమూనా గొప్పదని ప్రచారం చేయడంలో ఈ సంస్థలు పోషించిన పాత్ర అంతా ఇంతా కాదు. మొత్తం దేశ ప్రజల్నే ఉక్కిరిబిక్కిరి చేసి ఏదో అద్భుతం జరగబోతున్నట్టు నమ్మబలుకుతూ మభ్య పెట్టే రాజకీయాలను మరింతగా ముందుకు తీసుకొచ్చారు. సోషల్ మీడియా పేరిట ఇంటర్నెట్‌లోని అనేక వెబ్‌సైట్స్ మోడీ విజయానికి ఏడు లక్షల గ్రామాల్లో, 600 జిల్లాల్లో విదేశాలకు చెందిన వెబ్ మాధ్యమాలు సమాచారాన్ని విరివిగా సేకరించాయి. అనేక కార్పొరేట్ సంస్థలు సామాజిక మాధ్యమాల వేదిక పేరుతోనో మరో పేరుతోనో ప్రజల మస్తిష్కాల్లో తిష్టవేసి అస్తిత్వాలపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. క్రిస్టఫర్ వీలీ అన్నట్టు నయా వలస విధానాన్ని ఏర్పర్చుతున్నాయి. రాజకీయ అధికారం వీళ్లకి, వనరులు చేజిక్కించుకోవడం, మార్కెట్ విస్తరించడం కార్పొరేట్స్‌కి కావాలి. ఇంకేముంది సునాయసంగా ప్రజల్ని వినిమయ ప్రపంచంలోకి నెట్టివేసి వాటి పని అవి చేసుకుంటున్నాయి.

ఒక్క ఫేస్‌బుక్ ఏంటీ అమెరికా నిఘా సంస్థల చేతుల్లోకి ఎంతటి డేటా అయినా వచ్చి పడాల్సిందే. ఇంతకు ఆరడుగుల మందపు గోడల వెనుకాల దాచిపెట్టామని చెపుతున్న ఆధార్ డేటా భద్రమని ఏ భారత పాలకుడు చెప్పగలడు? దేశంలో క్యాబినెట్‌లో ఏ మంత్రి ఉండాలో, ఏ విధానం రావాలో నిర్ధేశించే అగ్ర దేశాలకు ఆధార్‌ను అందుకోవడం ఓ లెక్కా? కేంబ్రిడ్జ్ అనలిటికా భారత దేశంలో తన శాఖను తెరిచింది. మీరంటే మీరు రాజకీయ ప్రయోజనం పొందారని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలు దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. అవి రెండూ ప్రజలను మభ్యపెట్టి మాయచేసే రాజకీయాల్లో ఆరితేరినవే.

ఇన్ని రోజులు ఓటింగ్ మెషన్‌లే మ్యానిపులేషన్‌కు గురవుతున్నాయన్న వారు అసలు పోలింగ్ బూత్‌కు రావడంకంటే ముందే ప్రజల మస్తిష్కాలను మ్యానిపులేట్ చేసే మాయా క్రీడల గురించి మాట్లాడడం లేదు. ఏ పార్టీ ఈ మాయా రాజకీయాల్లో ఆరితేరితే ఆ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజల్ని వారి ఆకాంక్షల్ని అణిచివేసి పెట్టుబడికి ఊడిగం చేసే పనిలో బిజీ అయిపోతాయి. దాంట్లో భాగమే దేశంలో ఉన్న 29 రాష్ట్రాలు తిరగడం కంటే ముందే ప్రపంచంలో యాభైకి పైగా దేశాలను చుట్టి వచ్చాడు నరేంద్రమోడీ. ఆధార్‌కార్డును ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన బిజెపి అధికారంలోకి రాగానే అదే ఆధార్ ప్రైవసీ హక్కుకు భంగం కలిగిస్తున్నదని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే ఆ సవాల్‌ను

వ్యతిరేకిస్తూ ఆధార్‌ను మరింతగా అమలుపరుస్తామని మాట్లాడుతున్నది. ఏ ఆధారంలేని వాళ్లపైన కంటే ఆధార్ కార్డుపైనే ప్రభుత్వం మరింత శ్రద్ధను కనపరుస్తున్నది. సామ్రాజ్యవాద దేశాల కనుసన్నల్లో పౌరులను ప్రభుత్వాలు మరింతగా గుప్పిట్లో పెట్టుకునేలా విధానాలను రూపొందించమని సెప్టెంబర్ 11, 2001 దాడుల తర్వాత ఆయా దేశాలను పురమాయిస్తున్నది అమెరికా. అయితే అనేక ప్రభుత్వాలు చేయాల్సిన పనిని ఫేస్‌బుక్, గూగుల్ లాంటి సంస్థలే డేటాను సేకరించి పెడుతున్నాయి. ప్రభుత్వాలేమో శాంతిభద్రల పేరిట నిరంతరం నిఘాను కొనసాగిస్తున్నాయి. పౌరుల భద్రత, అభివృద్ధికంటే ప్రజా ఉద్యమాల అణిచివేతనే ఈ నిఘా పాలనకు లక్ష్యంగా ఉంటున్నది. ఇవాల ఒక్క హైదరాబాద్‌లో పది లక్షల సిసి కెమెరాలు అమర్చబడి ఉన్నాయి. నగరాలు, పట్టణాలు దాటి పల్లెల్లోకి కూడా ప్రవేశించాయి సిసి కెమెరాలు. ఇంతెందుకు అడవుల్లో కూడా చెట్లకు సిసి కెమెరాలు వేళ్లాడుతున్నాయి. పులుల కదలికల్ని చూడాలికదా!!

ప్రభుత్వాలు ప్రజాస్వామిక విలువలతోని, పారదర్శంగా పనిచేయవు కాని ప్రజలు మాత్రం ప్రతిది బహిరంగ పరచాలి. ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాలరాస్తూ ప్రభుత్వాలు నిర్బంధకాండను కొనసాగిస్తున్నాయి. ఆధునిక సాంకేతిక వ్యవస్థ, కంప్యూటర్ పరిజ్ఞానం ప్రజల జీవితాలను సౌకర్యవంతం చేస్తున్నట్లు పైకి కనిపించినా అది మరింతగా వారి స్వేచ్ఛలను కాలరాసేందుకే ఉపయోగపడుతూ ప్రభుత్వాలకు, కార్పొరేట్లకే మరింత ప్రయోజనకారిగా ఉంటుంది. మనల్ని మన సమస్త ఆలోచనల్ని కలుషితపరిచే విధంగా, పరాయీకరించేలా ఆధిపత్య వర్గాలకు, పెట్టుబడి బడా సంస్థలకు మరింత ఊడిగం చేసేలా ఉంటూ ప్రజల మధ్య సంబంధాలను విచ్ఛిన్నం చేసేలా పరివర్తన చెందుతున్న సోషల్ మీడియా అయినా మరో ఇతర సాంకేతిక వ్యవస్థ పట్ల అయినా నిరంతరం అప్రమత్తంగా, చైతన్యవంతంగా ఉండాల్సిన అవసరాన్ని ఫేస్‌బుక్ కేంబ్రిడ్జ్ అనలిటికా ఉదంతం తెలియపరుస్తున్నది.

*(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు)* వీ

---

*(... 4వ పేజీ తరువాయి)*

*ధర్మాల్లాగా అనుకోకుండా ఉండాలి. కార్మికులు తమ సమస్యల్ని ప్రజలకి కూడా తెలుపుకునే అవకాశాల్ని వీలైతే కరపత్రాల ద్వారానూ, ఇతరత్రానూ తెలుపుకోవాలి. అలా చేస్తే కార్మికుల ప్రయత్నాలకి ఇంకా బలం చేకూరుతుంది. నాసిక్ ముంబై లాంగ్‌మార్చ్ ముందు కూడా ప్రజల్ని ఇంకా కలుపుకోవాల్సింది. సంపాదకీయంలో, ముంబై ప్రజల సహాయాన్ని చెప్పడం మరిచిపోయింది.*

**– భూషణ్**

హోసూరు, తమిళనాడు

*వీక్షణం ఏప్రిల్ సంచిక ఎంతో మంచి వ్యాసాలతో ఉంది. 'జిగ్నేష్ మేవాని కొత్త దళిత రాజకీయాలు' – ఓ కొత్త చర్చని మన ముందు ఉంచింది. పార్లమెంటరీ రాజకీయాల్లో పాత దళిత రాజకీయ నాయకుల ఆలోచనల నుండి కొత్తతరం రాజకీయ నాయకుడు జిగ్నేష్ మెవాని వరకు వివరంగా వివరించిన వ్యాసం ఎంతో బాగుంది. అయితే పార్లమెంటరీ రాజకీయాల్లో ఈ తరం కొత్త నాయకులు కూడా దళితుల అధికారాన్ని ఉత్పత్తి సాధనాల మీద అధికారం రావడం అనే దీర్ఘకాల సుస్థిర పరిష్కార మార్గంలో చివరి వరకూ తమ డిమాండ్‌లు నిలబెడతాయా లేక మళ్లీ రాజకీయ నాయకులుగా చలామణి అవుతారా అనేది ఈ రెండు సంవత్సరాలలో కొత్తతరం నాయకుల్లో ఎన్నో మార్పులు చూస్తున్నాం. ఆ విషయం మీద ఇంకా కొంత సమాచారం అందించవలసిన అవసరం ఈ వ్యాసానికి ఉందని అనిపించింది. పీడిత వర్గంలో పుట్టిన ఓ వ్యక్తిని యథాతథంగా ఉంచడానికీ వ్యవస్థని బలోపేతం చేయడానికీ పాత రాజకీయ నాయకులు తోడ్పడ్డారనే మాటలు బాగున్నాయి.*

*'అమెరికాలో బతుకు భయం భయం' రాజేంద్రబాబు వ్యాసం కూడా బాగుంది. ఆయుధ వ్యాపారులు ఎంతటి నీచానికైనా దిగుతారు. వాళ్లకి కావలసింది ప్రజల్ని ఉన్నతీకరించడం కాదు. తమ వ్యాపార లాభాల వేటలో ఎంతమంది ఏమైనా వారికి అనవసరం. అమెరికా అంటే ఎంతో గొప్పగా చెప్పుకునే వాళ్ల గురించి అక్కడి సంస్కృతి పరిస్థితులు వివరంగా అందించిన రాజేంద్రబాబు గారికి ధన్యవాదాలు.*

*నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో ప్రభుత్వరంగ సంస్థలను బలహీన పరిచి ప్రజల్లో చులకన భావం ఏర్పడడానికి పనిచేస్తున్న ప్రభుత్వాల అసలు ఉద్దేశం మరో పేరు నీరవ్‌మోడీ అని చెప్పింది బ్యాంకు కుంభకోణాలు – ప్రైవేటీకరణ వ్యాసం. రెండు సామ్రాజ్యవాద దేశాల మధ్య నలిగిపోతున్న సామాన్య ప్రజలు/స్త్రీలు, పిల్లలు సిరియాలో ఏ విధంగా జీవితం గడుపుతున్నారో చెప్పిన రామకృష్ణ వ్యాసం 'సిరియాలో మరో మానవ విషాదం' బాగుంది. చివరి పేజీ అసహజ మరణాల సూచి సంకలనం ఎస్. వెంకటేష్ ఎంతో శ్రమతో తయారైన పట్టిక. ఎంతో విషాద సూచికైనా ఆలోచించేదిగా ఉంది.*

**– ప్రకాశ్**

*టిటాగర్ (కోల్‌కత్తా)*

'జిగ్నేష్ మేవాని – కొత్త దళిత రాజకీయాలు' వ్యాసంపై
వీక్షణం ఫేస్‌బుక్ మీద వచ్చిన వ్యాఖ్యలు:

*"నిజానికి ఈ లాల్ నీల్ ఐక్యత అనేది పార్లమెంటరీ పార్టీల అవకాశవాద నినాదమే తప్ప నిజమైన దళితుల విముక్తి మార్గమేమీ కాదు." అష్టాంగ మార్గాలు , సంస్కరణ తాయిలాలు, ఓట్ల రాజకీయాలు వ్యవస్థను యధాతధంగా వుంచడానికి తోడ్పడతాయి గాని మార్చలేవు*

**– ప్రతిగుడుపు జయప్రకాశ్ రాజు**

*ఎక్కడో రంగనాయకమ్మగారి "దళిత సమస్య పరిష్కారానికి ...... " పుస్తకంలోని భావాల్నే అటునుంచి తిప్పి చెప్పినట్లుగా అనిపిస్తున్నాయి.*

**– మంజరి లక్ష్మి**

*ఆసక్తికరమైన వ్యాసం. కాకపోతే చదవడానికి నాకు చాల సమయం పట్టింది. నా అభిప్రాయాలివి: 1. చివరి పేరాగ్రాఫుల వరకూ వ్యాసం చాల అమూర్తంగా సాగింది. దళితులు కోరుకోవలసిందేమిటి అనే సమస్యను సరిగ్గా చర్చించలేదనిపించింది.*

*2. ఆ సమస్య చర్చించడానికి వచ్చినప్పుడు, కోరుకోవలసింది భూమి – ఉత్పత్తి సాధనాలు అని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ భాగం సేవారంగం వైపు వెళుతున్నప్పుడు భూమి అడగడం నీళ్లు నమలడమే. అందుకు భిన్నంగా, భూమి నుంచి దూరమైన సమూహాలు, పరిశ్రమలోకీ, సేవా ఆర్థిక వ్యవస్థలోకీ వెళ్లిన సమూహాలు ఎంత అభివృద్ధి సాధించాయో చూడండి.*

*3. దళితులు తమను తాము ఎలా సంఘటితం చేసుకోవాలనే మౌలిక సమస్య మీద వ్యాసం కేంద్రీకరణ సరిగ్గా ఉంది. ఆ అంశం మీద మరింత సమాచారం కోసం చూస్తున్నాను. నిజానికి, కులాన్ని నిర్మూలించాలని కోరుకునేవారు కులం పునాది మీద సంఘటితం కాగూడదనుకోవడం తప్పు. అందుకు భిన్నంగా, వారు తమను తాము సంఘటితం చేసుకుంటే తప్ప తామున్న అననుకూల స్థితినుంచి బైటపడలేరు.*

*దళితులకు ఎటువంటి డిమాండ్లు సరైనవో చర్చించడం ఆసక్తికరంగా ఉంటుంది. వారు ఏదైనా కోరవచ్చు – కాని వారి డిమాండ్లను కనీస స్థాయికి పరిమితం చేయాలంటే, వ్యూహాత్మకంగా ఏ డిమాండ్లు పెట్టడం సరైనది? బోహ్రా సమూహాన్ని, నాడార్ సమూహాన్ని, హార్లెమ్ పునరుజ్జీవన సందర్భంలో ఆఫ్రికన్ అమెరికన్ సమూహాన్ని అధ్యయనం చేసిన తర్వాత నాకు కొన్ని అభిప్రాయాలు ఏర్పడ్డాయి.*

**– రామారావు కన్నెగంటి**

# చరిత్రాత్మక 'మహా రైతు' లాంగ్‌మార్చ్

*'రైతు యాత్ర' నెర్రెలు బారిన రక్తపు పాదముద్రలతో రహదారులను ఎరుపెక్కించి దేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్యని సమాజం ముందుంచిందనీ, ఇక రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజానిదేననీ అంటున్నారు* **సంతోష్**

మహారాష్ట్రలోని నాసిక్ చుట్టుపక్కల గల 4 జిల్లాల పరిధిలో తీవ్ర వ్యవసాయ సంక్షోభం కొనసాగుతోంది. గతేడాది 2414 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి తోడు లాల్యా-ఖుర్కట్ లాంటి వ్యాధుల వల్ల వేలాది పశువులు మరణించాయి. ఈ నేపథ్యంలో నాసిక్, థానే జిల్లాల్లోని 135 గ్రామాలకు చెందిన మహారాష్ట్ర రైతులు నాసిక్ నుంచి ముంబయికి సుమారు 180 కిలోమీటర్లు సాగించిన మహాపాదయాత్ర భారత రైతాంగ ఉద్యమ చరిత్రలో అపూర్వం. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని, రైతు రుణాలను రద్దు చేయాలని, ఆదివాసుల భూములకు పట్టాలివ్వాలని డిమాండు చేస్తూ 2017 జూన్ 1న రైతులు ఆకస్మికంగా సమ్మె చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ రుణాలు రద్దు చేస్తానని హామీ ఇచ్చాడు కాని అమలు చేయలేదు. ఈ నేపథ్యంలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్) ఫిబ్రవరి 15న జరిగిన సమావేశంలో మహా పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించింది. ఈసారి గత సంవత్సరపు డిమాండ్లకు అదనంగా అకాల వర్షాలు పింక్ బాల్‌వార్మ్ కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, సూపర్ హైవేలు బుల్లెట్ రైళ్ల పేరుతో బలవంతంగా పంట భూముల్ని లాక్కోవడాన్ని ఆపాలని, నాసిక్, థానే, పాల్‌ఘడ్ ప్రాంతాలను కలుపుతూ ప్రతిపాదించిన నదుల అనుసంధానం కారణంగా ఆదివాసీ గ్రామాలు ముంపుకు గురవుతున్నాయి. అందువల్ల ప్రాజెక్ట్ రూట్‌మ్యాప్ మార్చాలన్న నాలుగు డిమాండ్లు అదనంగా కలిసాయి.

కిసాన్ సభ నిర్ణయానుసారం మార్చి 6న నాసిక్ నుంచి 15 వేల మందితో ప్రారంభమైన రైతుల 'లాంగ్‌మార్చ్' మార్చి 11 రాత్రికి వాణిజ్య రాజధాని ముంబయి శివారుకు చేరింది. మార్చి 12న శాసనసభ ముట్టడి లక్ష్యంగా మొక్కవోని దీక్షతో సాగిన యాత్రలో దారిపొడవునా వివిధ ప్రాంతాల నుంచి రైతులు చేరడంతో అంతిమంగా 50 వేలకు చేరింది. వ్యవసాయరంగం సంక్షోభంపట్ల పాలకపార్టీలు తగినంత దృష్టి సారించకపోవటంవల్ల ఇటీవలి కాలంలో పలు రాష్ట్రాల్లో రైతులు స్వచ్ఛందంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తుతున్నారు. మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం రైతు ఆందోళనకారులపై కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొనటం గుర్తుచేసుకోదగింది. అలాగే దేశ రాజధాని ఢిల్లీలో చేపట్టిన తమిళనాడు రైతుల నిరసన ఆందోళన మరువలేనిది. ఖమ్మం, గుంటూరు మార్కెట్లో మిర్చికి కనీస ధర కొరకు పోరాటాలు జరిగాయి.

అఖిలభారత కిసాన్‌సభ నాయకత్వంలో క్రమశిక్షణాయుతంగా నిర్వహించబడిన కార్యక్రమం. నడినెత్తిన సూరీడు నకనకలాడుతున్నా, కింద తారురోడ్డు సలసలకాలుతున్నా లెక్క చేయకుండా యాత్ర సాగించారు. రాత్రిపగళ్లు, ఆకలి దప్పులు ఎంతమాత్రం అడ్డంకి అనిపించలేదు. రోడ్ల పైనే తిన్నారు, అక్కడే నిద్రపోయారు. లాంగ్‌మార్చ్‌లో కాళ్లు బొబ్బలెక్కినా, నడుములు కుంగినా, పంటిబిగువున సత్తువ కూడగట్టి ఒక చేత్తో ఎర్రజెండా, మరోచేత్తో ముల్లుగర్ర పట్టి వృద్ధ రైతులు చకచకా నడుస్తుంటే... నారీమణులు కొంగుబిగించి కదం తొక్కుతుంటే... యువ రక్తం ఉత్తేజంతో ఉరకలేస్తుంటే మహారాష్ట్ర రైతన్నలు వజ్ర సంకల్పులై ఈ యాత్రలో పాల్గొన్న స్త్రీ పురుష రైతులందరూ అభినందనీయులు. తమ ఈతిబాధలపై ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవాలన్న ఏకైక లక్ష్యమే అంతమందిని ఏకం చేసింది. సుదీర్ఘ పాదయాత్రలో అలుపు సలుపు లేకుండా నడిపించింది.

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు చాన్నాళ్లనుంచి రైతు శ్రేయస్సుకు పాటుపడుతున్నట్లు ప్రచార ఆర్భాటాలలో పోటీపడుతున్నాయి. రైతు ఆదాయాన్ని పెంచుతామని, పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పిస్తామని, రైతులకు రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం ఒక రివాజుగా మారింది. అధికార పీఠం ఎక్కాక కార్పొరేటు అనుకూల రైతు వ్యతిరేక విధానాలను రూపొందించి అమలుచేయడం, రైతులను సతాయించడం, అనేక కొర్రీలు పెట్టడం రివాజుగా జరుగుతున్నదే. కానీ ఇప్పుడు రోజులు మారాయి. పాలకులు చేసిన వాగ్దానాలకూ, ఆచరణకు పొంతన లేకపోవడాన్ని గమనించి, ఆగ్రహించిన రైతులు పలు రాష్ట్రాలలో పలు రూపాల్లో తమ ఆందోళనను నిరసనలుగా వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజులు సాగిన మహా రైతుయాత్ర చరిత్రలో కనీవినీ ఎరగని ఆకలి ప్రస్థానం. నేతల గుండెల్లో కనపడని గుబులుగా మిగిలిపోయే మట్టి మనుషుల మరో ప్రస్థానం.వేలాదిగా పోగైన రైతుల చరిత్రాత్మక ప్రస్థానం. దాదాపు 180 కి.మీ. సాగిసాగి నడిచి నడిచి పగిలిన పాదాలు ముంబై చేరితే అజాద్ మైదానం పులకించిపోయింది. రైతులది ఒకటే డిమాండ్. మా అప్పులు మాఫీ చేయండి. మా భూములు లాక్కోకండి. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయండి. జీవితాలను చెమట చుక్కలుగా దారపోసి పండించిన పంటకు కనీస మద్దతు ధర ప్రకటించండి. అయ్యా మీ సింహాసనాలు మీ దగ్గరే ఉంచుకోండి. మీ చలువ పందిళ్లలాంటి సభల్లో మీరే కూర్చోండి. మీ స్టార్ హోటళ్లలో మీరే తినండి. మా బతుక్కు, మా భూమికి, మా పంటకు ఒక వెల కట్టండి. అన్నదాతల మొదటి మాటా చివరి మాట ఇదే. గత మూడేండ్లుగా ఎన్నోసార్లు ఎన్నో వాగ్దానాలు... ఎన్నో వంచనలు చూశాకనే కడసారి తాడో పేడో తేల్చుకుందామనే ముంబైకి వచ్చామని రైతు సంఘం (ఏఐకెఎస్) తేల్చి చెప్పింది.

ఇదొక రాజకీయ యాత్ర అని స్వార్థపూరిత యాత్ర అని వాచాలత్వంతో కొట్టిపారేయాలనుకున్నారు అధికార కాషాయ ప్రభువులు. ఎవరో ఎర్ర జెండాల వారు ఎగదోస్తే మండిన మంటగా వాపోయారు. గతంలో మాదిరిగానే ఆదిలోనే అడ్డుకోవాలని పాలకులు విశ్వయత్నాలు

సాగించారు. మీ డిమాండ్లు నెరవేరుస్తామన్నారు. మీ కలలు పండిస్తామన్నారు. మీ రుణాలు మాఫీ చేస్తామన్నారు. మీ కడగండ్లు తీరుస్తామన్నారు. అడుగులు ముందుకు కదపొద్దని వారించారు. అయినా, ఆకాశం ఒక్కసారిగా ఊడిపడి భగ్గుమన్నట్టు రైతన్నలు ఆగ్రహోదగ్రులై ముందుకే కదిలారు. ఈ యాత్రలో పాల్గొన్నవారు నాసిక్, థానే, పాల్ఘర్, అహ్మద్‌నగర్ జిల్లాల్లోని ఆదివాసులు కావడం విశేషం. ముంబై చేరాక పాలక బిజెపి మినహా ప్రభుత్వ భాగస్వామి అయిన శివసేన సహా రాష్ట్రంలోని సర్వ రాజకీయ పక్షాలు సంఘీభావం తెలపటం విశేషం.

రాష్ట్ర అధికార పీఠం కొలువుదీరిన 'మంత్రలాయ'ను మార్చి 12న దిగ్బంధించడానికి సంసిద్ధులయ్యారు. ముంబై నడివీధుల్లో ఎర్ర సముద్రం కెరటాల్లా ఎగిసిపడింది. రైతన్న సృష్టించిన ఈ సునామీకి మహారాష్ట్ర ప్రభుత్వం తల్లడిల్లిపోయింది. విలవిల్లాడింది. అన్నదాతల ఆగ్రహాన్ని తట్టుకోలేక... అన్ని డిమాండ్‌లను నెరవేర్చుతామని, చర్చలకు సిద్ధమని సీఎం ఫడ్నవీస్ శాసనసభ సాక్షిగా హామీ ఇవ్వగా... ఇక విధాన సభను ముట్టడించాల్సిన పని లేదని అధికారులు రైతుల చేతులు పట్టుకున్నారు. ప్రభుత్వం ఎలాంటి ప్రతిష్టకూ పోకుండా, రైతులను రెచ్చగొట్టకుండా వారడిగిన డిమాండ్లలో పదింటిని నెరవేర్చడానికి లిఖితపూర్వకంగా ఒప్పుకుని సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించింది. పర్యవసానంగా రైతులు ఆ మహానగరం నుంచి ప్రశాంతంగా తమ తమ ప్రాంతాలకు నిష్క్రమించారు.

పాలకులు చెప్పినవి చేయకపోవడం, పైగా అన్నీ చేశామని దబాయించడం అలవాటుగా మార్చుకున్న ఈ రోజుల్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ఇలాంటి లిఖితపూర్వక ఒప్పందాన్ని ఎంతవరకూ ఖాతరు చేస్తారని సంశయిస్తున్నవారు లేకపోలేదు. గతంలో హామీలను ఉల్లంఘించిన సంఘటనలు లేకపోలేదు. అలా జరిగినా ఆశ్చర్యం లేదు కూడా. కానీ ప్రశ్నించడాన్నయినా, నిరసనలనైనా అంగీకరించలేని మనస్తత్వం పాలకుల్లో పెరిగిపోతున్న వర్తమానంలో ఫడ్నవీస్ అందుకు భిన్నంగా వ్యవహరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు లాగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ రైతుల నిరసన గళం ముంబై వీధుల్లో వినబడనీయకూడదన్న పట్టుదలకు పోలేదు. ఎక్కడికక్కడ పోలీసుల్ని పెట్టి మార్గమధ్యంలో అరెస్టులు చేయించలేదు. ఒప్పందం అమలు చేయనట్టయితే రైతులకు వారి పంథా వారికుంటుంది.

దేశ వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు, ప్రత్యేకించి ఆదివాసీలను అడవి నుంచి దూరం చేసే నిర్వాసిత సమస్య వారిలో ఆగ్రహాన్ని తెప్పించాయి. రెక్కలు ముక్కలు చేసుకొనే శారీరక శ్రమపై ఆధారపడి, నేలనే నమ్ముకున్న ఆదివాసీల భూమి సమస్య ఈ యాత్రలో ప్రముఖంగా నిలిచింది. ఈ పాదయాత్ర ప్రధానంగా పది డిమాండ్లను ప్రభుత్వాల చెవిని సోకేలా నినదించింది. అసలు ఇంత ఉవ్వెత్తున రైతాంగం ఉప్పెనలా కదలడానికి తక్షణ కారణం అభివృద్ధి పేరిట వారి భూములను కొల్లగొడుతున్న వ్యవహారం. ముఖ్యంగా బుల్లెట్ ట్రైన్ కోసం, నదుల అనుసంధానం పేరుతో భూమిని స్వాధీనం చేసుకోవడంతో నాసిక్, థానే జిల్లాల రైతులు వేలాది ఎకరాల భూమిని కోల్పోయారు. తమ రక్తాన్ని చెమటగా మార్చడం తప్ప మరో లోకం లేని శ్రమజీవులకు మట్టితో ఉన్న అనుబంధం కడుపు రగిలేలా చేసింది. దీనితో పాటు వ్యవసాయం పూర్తిగా దెబ్బతిని నిస్సహాయ స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతోన్న రైతాంగాన్ని భారత కిసాన్ సభ ఉద్యమ బాటలో నడిపించింది.

ఈ 'లాంగ్ మార్చ్'లో యువ రైతులు మొదలుకొని వృద్ధుల వరకూ ఉన్నారు. ఈ రైతుల్లో అత్యధికులు ఆదివాసీలు. కొందరు తల్లులు తమ పిల్లల్ని కూడా తీసుకొచ్చారు. కాళ్లకు చెప్పుల్లేనివారూ, అనారోగ్యం బారినపడినవారూ, కట్టుకోవడానికి సరైన బట్టల్లేనివారూ ఈ 50,000 మందిలో ఉన్నారు. వీరంతా ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్నామంటున్న రుణాలను పొందలేక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక మొత్తాల్లో అప్పులు చేసి సేద్యం సాగించారు. విత్తనాలు మొదలుకొని ఎరువులు, పురుగుమందుల వరకూ అన్నిటి ధరలూ పెరిగిన కారణంగా ఖర్చు తడిసిమోపెడై ఊపిరాడని స్థితికి చేరుకున్నారు. ఈ కష్టాలన్నిటికీ ప్రకృతి వైపరీత్యాలు తోడై చివరకు దిగుబడి సమయానికి పంటలకు గిట్టుబాటు ధర రాక చితికిపోతున్నారు. ప్రభుత్వాలు అమలు చేసే రకరకాల ప్రాజెక్టుల కారణంగా కొంపా గోడూ పోగొట్టుకుంటూ నిరాశ్రయులవుతున్నారు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.

అందువల్లే ఈ రైతులు కేవలం రుణ మాఫీని మాత్రమే డిమాండ్ చేయలేదు. అటవీ హక్కుల పరిరక్షణ చట్టం కింద తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా పంటలకు గిట్టుబాటు ధరలు నిర్ణయించాలని, వృద్ధాప్య ఫించన్లు 60 సంవత్సరాలు పైబడిన రైతులకు మంజూరు చేయాలని కోరారు. అకాల వర్షాల వల్ల, చీడపీడల వల్ల నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లాగే మహారాష్ట్ర రైతులు కూడా వరస కరువుల్ని ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలోని కోటి 37 లక్షల మంది రైతుల్లో 78 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు. ప్రభుత్వం అమలు చేశామంటున్న రుణమాఫీతో సహా ఏదీ సక్రమంగా ఈ రైతులకు దక్కలేదు. అందుకే రైతుల్లో ఇంతగా అసంతృప్తి.

రైతుల ఆగ్రహం ఇంతగా కట్టలు తెంచుకోవడానికి గత నాలుగేళ్ల కేంద్ర-రాష్ట్ర బిజెపి ప్రభుత్వాల విధానాలే ప్రధాన కారణం. రాష్ట్రంలోని మరఠ్వాడా, నాసిక్, థానే, నాగపూర్, విదర్భ ప్రాంతాల్లో వ్యవసాయం సంక్షోభంలో పడింది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ వ్యవసాయ వ్యతిరేక విధానాల మూలంగా రైతులు తాము చేసిన అప్పులను తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సంవత్సరం కావస్తున్న ఫడ్నవీస్ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. ఇదిలా ఉండగానే ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానలు లక్షలాది ఎకరాల్లో పంటలను సర్వనాశనం చేశాయి. పత్తికి గులాబీ తెగులు ఆశించి భారీగా నష్టపరిచింది. విపత్తులు, ధరలేమితో దయనీయ స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఈ దుష్పరిణామాలు ప్రభుత్వంతో అమీ తుమీ తేల్చుకునేందుకు రైతులను లాంగ్‌మార్చ్ వైపునకు పురిగొల్పాయి.

మరోవైపు భూతాపం పెరుగుతుండడంతో భూగోళంపై, అనూహ్య రీతిలో ఆకస్మిక వాతావరణ మార్పులు సంభవిస్తుండడం రుతుపవనాలు దారితప్పడంతో దేశంలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఏకకాలంలో భరించగలిగిన రైతాంగం అంతకంటే ముఖ్యంగా పెరుగుతున్న ఉత్పాదక ఖర్చుల దెబ్బకు విలవిల్లాడుతూ, గిట్టుబాటు ధరలేక అప్పుల విషవలయంలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేశంలో వ్యవసాయ సంక్షోభం భరించలేని స్థాయికి చేరుకుంది. ఉత్పాదక ఖర్చులు, పంటల ధరలు రైతాంగానికి వ్యతిరేకంగానూ, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉన్నాయి. 'హరిత విప్లవం' ప్రయోగం

ప్రారంభంలో దేశంలో తిండి గింజలు కొరత తీర్చినప్పటికీ, ఆ తర్వాత క్రమంగా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు వంటి ఖర్చులు పెరిగిపోయి, గిట్టుబాటు ధరలు లేకపోవడమే కాకుండా, భూసారం దెబ్బతిని వ్యవసాయ దిగుబడులు గణనీయంగా దెబ్బతిన్నాయి. వ్యవసాయరంగ సంక్షోభానికి పరిష్కారంగా రెండవ హరిత విప్లవం తీసుకురావాలని పాలకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ విధానంతో దేశం పునరుద్ధరించడానికి వీలులేని ఆర్థిక, పర్యావరణ, సామాజిక సంక్షోభాల్లోకి కూరుకుపోయే ప్రమాదం ఉందని మేధావులు హెచ్చరిస్తున్నారు.

సంక్షోభంలోకి కూరుకుపోయిన వ్యవసాయ రంగాన్ని పునర్జీవింపచేయడానికి బదులుగా, ఆ రంగంపై ఆధారపడుతున్న ప్రజలను ఇతర రంగాలలో అనుబంధ, నైపుణ్యరహిత కార్మికులుగా మళ్లే విధంగా ప్రభుత్వాలు వలసలను ప్రోత్సహిస్తున్నాయి. పేదరిక నిర్మూలనంటే పేదలను నిర్మూలించినట్లుగా, వ్యవసాయ రంగ పరిష్కారానికి వ్యవసాయదారుల జనాభాను పారిశ్రామిక రంగ అనుబంధ నైపుణ్యరహిత శ్రమశక్తిగా మార్చే ప్రభుత్వ విధానాల వల్ల రైతాంగ ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. అందులో భాగంగా వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పేరు మీద వ్యవసాయయోగ్యమైన భూమిని ప్రభుత్వం కారుచౌకగా సేకరించి పారిశ్రామిక వర్గాలకు ధారాదత్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో పంట భూములను బలవంతంగా తీసుకోవద్దని రైతాంగం ఈ యాత్ర సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో భాగంగా వ్యవసాయ మౌలిక సదుపాయాలు, ఉత్పాదకాల కోసం ప్రణాళికబద్ధంగా తగు పరిమాణంలో ప్రభుత్వం మదుపులు పెట్టకపోతే... మద్దతు ధరలు, ధర పరిహార చెల్లింపులు, రుణ పరిమాణాన్ని పెంచడం వంటి చర్యలు రైతు కన్నీటిని తుడవలేవు.

కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామంటుండగా ఆయన పార్టీ ఏలుబడిలోని రాష్ట్రాల్లో అన్నదాతల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లుంది. మధ్యప్రదేశ్‌లో రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్‌గడ్, జార్ఖండ్‌కు రైతు ఉద్యమాలు విస్తరించాయి. అక్కడి బిజెపి ప్రభుత్వాలు ఏవో కాయకల్ప వాగ్దానాలు చేసి, వాటిని తుంగలో తొక్కడంతో ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోనూ రైతు ఉద్యమాలు కొనసాగుతున్నాయి. మోడీ సర్కారు చేపట్టిన విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కొన్ని వందల సంఘాల కలయికతో రైతు రక్షణ యాత్ర వంటివి పురుడు పోసుకున్నాయి. ఈ రైతు యాత్రను 'లాంగ్ మార్చ్'గా పిలవడం వల్లనో, ఎర్రజెండాలు దండిగా కనిపించడం వల్లనో, ఆదివాసీలు అధికసంఖ్యలో ఉన్నందువల్లనో 'గుమ్మడికాయల దొంగ అంటే బుజాలు తడుముకున్నట్లు' బిజెపి ఎంపి పూనమ్ మహాజన్‌కు ఇది 'మావోయిస్టుల' యాత్రగా, అందులోని వారు పట్టణ మావోయిస్టులుగా కనబడ్డారు.

ముఖ్యమైనదేమంటే ఈ యాత్రకు పట్టణ, నగర ప్రాంతాల పౌరుల నుంచి వచ్చిన స్పందన, యాత్ర ప్రారంభమైన నాసిక్‌లోగానీ, ఆ తర్వాత థానేలోగానీ, ముంబైలోగానీ ఆ రైతులకు పౌరులు ఘన స్వాగతం పలికిన తీరు అమోఘం. తండోపతండాలుగా వస్తున్న రైతులకు నీళ్ల బాటిళ్లు, బిస్కట్ ప్యాకెట్లు, పండ్లు, పలహారాలు, పొంగలి పొట్లాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సంఘాలు, మతాలు, రాజకీయ పార్టీలు పాల్గొన్నాయి. డబ్బావాలాలు ఇతోధిక సేవలో పాల్గొన్నారు. పాదరక్షలు లేకుండా నిరంతరాయంగా నడవటం వల్ల అరికాళ్లకు పుళ్లు పడి ఇబ్బందిపడుతున్నవారిని గమనించి ప్రాథమిక చికిత్స చేసి పాదరక్షలు కొని పంచినవారు కొందరైతే, తమ పాదరక్షల్ని ఇచ్చినవారు మరికొందరున్నారు. వివిధ సామాజిక సంస్థల నిర్వాహకులు ఆజాద్ మైదానం చేరుకున్న రైతుల ఆకలిదప్పుల్ని తీర్చారు. కొన్ని ఆసుపత్రులు, కొందరు వైద్యులు స్వచ్ఛంధంగా రైతులకు వైద్య సేవలందించారు.

కమ్యూనిస్టులంటే ససేమిరా గిట్టని శివసేన ఈ యాత్రకు మద్దతు ప్రకటించడం ఒక విశేషమైతే, తమపార్టీ ఎంపి తెలిసీ తెలియక మాట్లాడిన మాటలను బిజెపి తిరస్కరించడం మరో విశేషం. ఈ ఆందోళన మహారాష్ట్ర పాలకులకు మాత్రమే కాదు అన్ని రాష్ట్రాల పాలకులకూ హెచ్చరికే. వాగ్దానాలిచ్చి మాట తప్పితే రైతులు మునుపటిలా మౌనంగా ఉండరని, తిరగబడతారని వారు గుర్తించడం ఉత్తమం. మహారాష్ట్ర రైతుల ఆందోళనలతోనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అనుకూలంగా వ్యవహరించాలి. రైతు ఉద్యమాలను విస్మరిస్తే ప్రభుత్వాల పునాదులు కదులుతాయి. చరిత్రలో రైతులకు హాని చేసిన పాలకులెవరూ మనగలిగిన దాఖాలాల్లేవు. అందువల్ల అభివృద్ధి పేరుతో అటవీ హక్కుల చట్టం (2006)ను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి ఎక్కుపెట్టిన యాత్ర. రుణమాఫీ పథకాల్లో జరుగుతున్న అసమంజస విధానాన్ని ఎండగట్టే యాత్ర. గిట్టుబాటు ధర అమలుపరంగా చేతులెత్తేసిన ప్రభుత్వాన్ని ఎదిరించే యాత్ర. నిపుణుల కమిటీల సిఫార్సుల్ని అమలుపరచటంలో మోసం చేస్తున్న ప్రభుత్వానికి హెచ్చరిక ఈ యాత్ర. ఓదార్పు యాత్రలతో పాలక ముఠా పొద్దుపుచ్చుతున్నదనే విషయాల్ని బయట పెడుతున్న మహాయాత్ర.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు అమలు ప్రారంభంతో వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుంది. ఇందులో భాగంగానే రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. నూతన ఆర్థిక విధానాలు అమలు తర్వాత వ్యవసాయంలో వృద్ధి రేటు 1.5 వద్ద స్థిరంగా ఉంది. 1960లలో సస్యవిప్లవ కాలంలో వ్యవసాయరంగ ఉత్పాదకత పేద, మధ్యతరగతి రైతాంగ శ్రమ వల్లనే సాధ్యమయింది. కాని ఫలితాలు బహుళజాతి కంపెనీలు బడా వాణిజ్య సంస్థలు పొందాయి. నూతన ఆర్థిక విధాన అమలుతో సస్య విప్లవ కాలంలో రైతాంగానికి ప్రభుత్వమందించిన మద్దతునంతా క్రమంగా ఉపసంహరించారు. బహుళజాతి కంపెనీల వ్యవసాయ వ్యాపారం రైతుల్ని సంక్షోభంలోకి నెట్టింది. భూమి, నీరు, పర్యావరణం వంటి వనరులపై రైతులకున్న హక్కుల్ని హరించి వేసింది. చిన్న చిన్న వాతావరణ ఒడిదుడుకులక్కూడా తట్టుకోలేని స్థాయికి రైతులను దిగజార్చారు. ఫలితంగా వ్యవసాయ ఉత్పాదకాల ధరలన్నీ పెరిగిపోయాయి. ఇది రైతాంగాన్ని వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లోకి నెట్టింది. సంస్థాగత రుణ సౌకర్యాన్ని తగ్గిస్తూ రావటంతో, ఈ పరిస్థితి మరింత దిగజారింది.

1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఓ) ఒప్పందంపై సంతకం చేయటంతో పంటను తెగనమ్ముకునే పరిస్థితి ఈ కాలంలో తీవ్రమైంది. ఇది పేద, మధ్యతరగతి రైతాంగానికే కాకుండా ధనిక రైతాంగానికి కూడా కష్టాలు కొనితెచ్చింది. ఈవిధంగా, సబ్సిడీల ఉపసంహరణలతో ఉత్పాదకాల ధరలు పెరిగిపోవడం, మద్దతు ధరలు లభించకపోవడం రైతాంగాన్ని రుణాలవైపుకు నెట్టివేసింది. వ్యవసాయరంగంలో నరసింహం కమిటీ చేసిన సిఫార్సుల ఆమోదంతో, షెడ్యూల్డు బ్యాంకులు వ్యవసాయ రంగానికి కేటాయించే రుణభాగాన్ని తగ్గించివేశాయి. ఈవిధంగా చిన్న రైతాంగం సంస్థగత రుణసౌకర్యం నుండి గెంటివేయబడ్డారు. ఈ

# కారు చీకట్లో కాంతి రేఖ

*అమెరికాలో ప్రైవేట్ ఆయుధ వ్యాపారుల లాభాపేక్ష కారణంగా తుపాకుల రాజ్యం నడుస్తోందనీ, ఇటీవలి కాలంలో యువతలో వచ్చిన చైతన్యం కొత్త ఆశలు చిగురింప చేస్తుందనీ అంటున్నారు* **రాజేంద్రబాబు అర్విణి**

**తు**పాకీ సంస్కృతి పెచ్చరిల్లి పోవడంతో ఒక్కసారి ఉలిక్కిపడ్డ అమెరికా సమాజంలో కారు చీకట్లో కాంతి రేఖ లాగా ఒక ఆశా కిరణం పొడసూపింది.

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 14న ప్రపంచమంతా ప్రేమికుల దినోత్సవం (వాలంటైన్స్ డే) జరుపుకుంటారు. కాని, ఈ సంవత్సరం (2018) ప్రేమికుల దినోత్సవం నాడు అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం, పార్క్‌లాండ్ పట్టణం మార్జొరి స్టోన్‌మన్ డగ్లస్ స్కూల్‌లో నికోలస్ క్రూజ్ అన్న మానసిక దౌర్భల్యుడు మరణ మృదంగం వినిపించాడు. మారణాయుధంతో విచ్చలవిడి కాల్పులు జరిపి 17 మంది చిన్నారి బాలురు, ఉపాధ్యాయులు మరణించడానికి కారణమయ్యాడు. భారతదేశంలో బిజెపి పాలిత రాష్ట్రాలలో పసిపిల్లలపై జరుగుతున్న వరుస మానభంగాల లాగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో వరుసగా స్కూళ్లల్లో, క్లబ్బులలో, రోడ్లమీద ప్రైవేటు వ్యక్తులు విచ్చలవిడి కాల్పులు జరిపి మారణహోమం సృష్టిస్తున్నారు. జడలు విప్పి కరాళనృత్యం చేస్తున్న తుపాకీ సంస్కృతితో విసిగి పోయిన అమెరికా యువతరం, విద్యార్థి సమూహం కదం తొక్కుతూ రంగంలోకి వచ్చింది.

ఫిబ్రవరి 14 నుండి మార్చి నెల 23 వరకు వీలయినన్ని పట్టణాలలో, వీలయినన్ని స్కూళ్లలో విద్యార్థులు తరగతులు బహిష్కరించి ర్యాలీలు నిర్వహించారు. మార్చ్ 24 నాడు అమెరికా చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయిలో విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, ప్రజాస్వామ్య ప్రియులు చాలా పట్టణాలలో తుపాకీ సంస్కృతిని నిరసిస్తూ కవాతుగా రోడ్ల మీదకు వచ్చారు. "తుపాకుల నుండి రక్షణకై ప్రతి పట్టణము" (ఎవ్రీ టౌన్ ఫర్ గన్ సేఫ్టీ) అన్న స్వచ్ఛంద సంస్థ ఈ గొప్ప ప్రదర్శనకు మొదట పిలుపునిచ్చినా, చాలా పట్టణాలలో, నగరాలలో, గ్రామీణ ప్రాంతాలలో పలు సంస్థలు తమంతకు తామే తమ తమ సంస్థల తరఫున ఎవరికి వారే జెండాలు పట్టుకొని ఊరేగింపులు చేశారు. లాస్ ఏంజెల్స్‌లోని "విమెన్స్ మార్చ్" అన్న సంస్థ కూడా లక్షలాది మందితో ఈ ర్యాలీలలో పాల్గొన్నది.

నిర్వాహకుల అంచనా ప్రకారం అమెరికా రాజధాని నగరం, అధ్యక్ష భవనం తెల్లపీఠం (వైట్ హౌస్) ఉన్న వాషింగ్టన్ డి.సి. లోనే 8 లక్షల మంది నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. 1969లో వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా జరిగిన నిదర్శన ప్రదర్శనకంటే ఎక్కువ స్థాయిలో జరిగిన ప్రదర్శన ఇది. "ఒకే రోజు అంత మంది నిరసన కారులతో అమెరికా రాజధానిలో ప్రదర్శన ఇంతకుముందెన్నడూ జరగలేదు" అని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక రాసింది. అమెరికా రాజధానిలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తదుపరి మహిళల పట్ల, మానవ హక్కుల పట్ల ఎన్నికల సమయంలో ఆయన చేసిన దురుసు వ్యాఖ్యలను ఖండిస్తూ "విమెన్స్ మార్చ్" (మహిళల నిరసన) అన్న సంస్థ 2017వ సంవత్సరంలో

---

పరిస్థితుల్లో రైతాంగం ఆత్మహత్యలకు నెట్టబడ్డారు. ఇవాళ దేశానికి అన్నం పెట్టే రైతులు అన్నం అడుక్కునే స్థితికి రావడానికి పాలకుల వ్యవసాయ వ్యతిరేక విధానాలే కారణం.

గత దశాబ్ద కాలంగా నెలకొన్న వ్యవసాయరంగ సంక్షోభం, దానిపై ఆధారపడిన రైతులు, ఇతర గ్రామీణ ప్రజల దుస్థితి కొంత హెచ్చు తగ్గులతో దేశవ్యాప్తంగా ఉన్న తీవ్రమైన సమస్య. ఇందుకు ప్రకృతి మాత్రమే కాదు, ప్రభుత్వ విధానాలు కూడా కారణం. ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాలను శిరసావహిస్తున్న కేంద్ర ప్రభుత్వం, పంట దిగుబడులు పెరిగినప్పుడు ఎగుమతులు అనుమతించకుండా, పంట దిగుబడులు తగ్గినప్పుడు దిగుమతులు అనుమతిస్తూ రైతుల నడ్డివిరుస్తోంది. రైతుల పొట్టలుగొట్టే మార్కెట్ శక్తుల మాయలు షరా మామూలే, రైతుల ఉద్ధరణకు ఏవేవో చేస్తున్నామని ప్రభుత్వాలు ఎన్ని కబుర్లు చెబుతున్నా, వారి దుస్థితి నానాటికీ దిగజారటం వాటి వైఫల్యానికి నిదర్శనం. అందువల్ల జాతీయ స్థాయిలో సమగ్రమైన చర్చ జరగాలి. వ్యవసాయ సంక్షోభ నివారణకు శాశ్వత పరిష్కారాలు రూపొందించి అమలు చేయకుంటే ప్రభుత్వాలు రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

ఇవాళ మహారాష్ట్ర రైతులు లేవనెత్తిన డిమాండ్లు కేవలం వారికి మాత్రమే వర్తించేవి కావు. అవి కొంచెం అటూఇటూగా దేశవ్యాప్తంగా రైతులందరికీ వర్తించేవి. వ్యవసాయంలో పెట్టుబడి పెరిగిపోవడం, పెట్టుబడికి తగిన ప్రతిఫలం రాకపోవడమే కాదు కనీస పెట్టుబడి రాకపోవడం వలన రైతుల రుణభారం పెరిగిపోయి, అది ఆత్మహత్యలకు దారితీయడం దేశవ్యాప్తంగా జరుగుతుంది. రైతుల ఆత్మహత్యల సంఖ్యలో మొదటి స్థానంలో ఉన్న మహారాష్ట్రకు ఆ డిమాండ్లు ఎంత వర్తిస్తాయో, రెండో స్థానంలో ఉన్న తెలంగాణకూ అంతే వర్తిస్తాయి. మహారాష్ట్ర రైతులు పెట్టిన పది డిమాండ్లలో చాల డిమాండ్లు తెలంగాణ రైతుల డిమాండ్లే. ఇతర రాష్ట్రాల రైతుల డిమాండ్లు కూడ అవే. కాబట్టి దేశవ్యాప్త సంఘటిత రైతాంగ ఉద్యమ నిర్మాణం జరగాల్సిన చారిత్రక అవశ్యకత నేడు ఎంతగానో ఉంది. ప్రపంచ ఆర్థిక సంస్థ నుండి బయటికి రాకుండా, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు బహుళజాతి సంస్థల కబంద హస్తాల నుండి విడిపించుకోకుండా వ్యవసాయరంగ సంక్షోభాన్ని నివారించలేం. రైతాంగ ఉద్యమం పాలకుల మెడలు వంచి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల నుండి దేశీయ రైతాంగ సానుకూల విధానాలను రూపొందించేదాక సమరశీలంగా ఉద్యమించడం తప్ప మరో మార్గంలేదు.

*(రచయిత ఉపాధ్యాయులు)* వీ

ఒక నిరసన ర్యాలి జరిపింది. ఇంతవరకు వాషింగ్టన్ డి.సి.లో జరిగిన ప్రదర్శనలలో అదే పెద్దదని చెపుతారు. దానిని మించి "మార్చ్ ఫర్ అవర్ లైవ్స్"లో పాల్గొన్న నిరసనకారుల సంఖ్య అధికమని పత్రికలు పేర్కొన్నాయి. కేవలం ఒక్క వాషింగ్టన్ డి.సి. లో పాల్గొన్న వారి సంఖ్యనే 8 లక్షలు. ఇంతవరకూ వాషింగ్టన్ డి.సి. లో జరిగిన ర్యాలీలలో పాల్గొన్న వారి సంఖ్యలను ఈ సందర్భంగా "వాషింగ్టన్ పోస్ట్" పత్రిక ఈ ప్రకారం వెల్లడించింది.

| | | |
|---|---|---|
| మార్చ్ ఫర్ అవర్ లైవ్స్ | 2018 | 8 లక్షలు |
| విమెన్స్ మార్చ్ | 2017 | 5 లక్షలు |
| ది మిలియన్ మార్చ్ (ఉద్యోగాల కోసం, ఉపాధి కోసం) | 1995 | 4 లక్షల 50 వేలు |
| వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా | 1969 | 5 నుండి 6 లక్షల వరకు |
| స్వేచ్ఛ కోసం, ఉపాధి కోసం జరిగిన ర్యాలీ | 1963 | 2 లక్షల 50 వేలు |

(మూలం: యుఎస్ఎ టుడే, వాషింగ్టన్ పోస్ట్)

కేవలం ఒక్క వాషింగ్టన్ డి.సి. లోనే పాల్గొన్న వారి సంఖ్య ఇది. దేశంలోని ఇతర నగరాలలో, ఇతర దేశాలలోని కొన్ని ముఖ్య నగరాలలో కూడా ప్రదర్శనలు జరిగాయి. ఆనాడు దేశ, విదేశాలలో జరిగిన ప్రదర్శనలలో మొత్తం 12 లక్షల మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. మార్చ్ 24 నాడు వాషింగ్టన్ చేరుకోలేని వారు, ఆ మరునాడు కూడా నిరసన ప్రదర్శన జరిపారు. అందులో పాల్గొన్న వారి సంఖ్య 2 లక్షల దాకా ఉంటుంది.

ఆనాడు అమెరికాలో, ప్రపంచవ్యాప్తంగా చాలా చోట్ల నిరసన ప్రదర్శనలు జరిపారు. నిర్వాహకులు ప్రకటించిన దాని ప్రకారం 800 నిరసన ప్రదర్శనలు జరిగాయి. బోస్టన్, హూస్టన్, మినియా పోలీస్, పార్క్‌లాండ్, లాస్ ఎంజెల్స్, షికాగో, మయామి, లాస్ వెగాస్, స్ప్రింగ్ ఫీల్డ్, శాన్ ఫ్రాన్సిస్‌కో, డాలస్, న్యూయార్క్ సిటి లాంటి అమెరికా పట్టణాలలోనే కాదు, లండన్, టోక్యో, హాంకాంగ్, సిడ్నీ లాంటి దేశాంతర ప్రాంతాలలో కూడా ర్యాలీలు జరిగాయి. ఈ ర్యాలీలకు ప్రజలు స్వచ్ఛందంగా భూరి విరాళాలు అందజేశారు. నిర్వాహకులు "గో ఫండ్ మి" అన్న పేరుతో నిధిని ఏర్పాటు చేస్తే దానికి సినిమా నటులు, క్రీడాకారులు, జర్నలిస్టులు, లాయర్లు ఇంకా ప్రముఖ వ్యక్తులెందరో విరాళాలు ప్రకటించి తమ మద్దతు తెలియజేసారు.

నిరసన ప్రదర్శనలో విద్యార్థులు ఈ క్రింది లక్ష్య ప్రకటన చేశారు.

"ఇక చాలు. స్కూళ్లలో ఏ ఒక్కరూ తుపాకీ తూటాలకు బలికావటానికి వీల్లేదు. విద్యార్థుల ప్రాణాలు కాపాడడానికి ఇక ఏ ఒక్క ఉపాధ్యాయుడు గుళ్ల వర్షం కురిపిస్తున్న మారణాయుధం ముందుకు దూకి ప్రాణాలర్పించ టానికి వీలు లేదు. ఇక ఏ ఒక్క కుటుంబం శాశ్వతంగా మూగబోయిన తమ పిల్లల ఫోన్ల నుంచి పిలుపు కోసం, మెసేజ్ కోసం ఎదురు చూడటానికి వీల్లేదు. మన పిల్లలు, టీచర్లు చచ్చిపోతున్నారు. వారి ప్రాణాలు కాపడడమే అమెరికా సమాజం ముందున్న ప్రధాన కర్తవ్యం.

ఇవి స్కూళ్లల్లో మాత్రమే కాదు. చర్చిలు, నైట్ క్లబ్బులు, సంగీత కార్యక్రమాలు, సినిమా హాళ్లు, విమానాశ్రయాలు ఇంకా... ఇంకా.. పలు చోట్ల ఈ అర్థరహితమయిన, అవివేకమయిన కాల్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇక ఏ పిల్లవాడు ఇంటికి తిరిగి వెళుతూ ఎటువైపు నుండి బుల్లెట్ దూసుకు వస్తుందో అని భయపడకూడదు. మేము విద్యార్థులమే కావచ్చు కాని, మేం విద్యార్థుల కోసం మాత్రమే పోరాడడం లేదు. ప్రతి ఒక్కరి ప్రాణాలు విలువయినవే. ప్రభుత్వ ప్రధాన బాధ్యత పౌరుల రక్షణ.

"మా ప్రాణ రక్షణకై కవాతు" సృష్టికర్తలు, స్ఫూర్తిదాతలు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మతాలకు, అన్ని జాతులకు, అన్ని లైంగికతలకు చెందిన విద్యార్థులు, యువకులు మహమ్మారి లాగా వ్యాపిస్తున్న సామూహిక హత్యల పరంపర ఆపడానికి ఎవరో వస్తారని మేము ఇక ఎంత మాత్రము ఎదురుచూస్తూ కూర్చోలేము. విచ్చలవిడిగా విజృంభిస్తున్న తుపాకీ సంస్కృతితో ముడిపడి ఉన్న సమస్యలపై దృష్టి సారించి అవసరమయిన కఠిన చట్టాలను ఆమోదించడం కంటె రాజకీయ కార్యక్రమం ఏదీ ముఖ్యమైనది కాదని ప్రభుత్వానికి, రాజకీయ నాయకులకు తెలియజెప్పటమే "మా ప్రాణ రక్షణకై కవాతు" ముఖ్య లక్ష్యం.

ప్రధానంగా మా దృష్టి అంతా ఈ క్రింది వాటిపైనే ...

1) తుపాకీ కొనుగోలుదారు గురించి సమగ్ర, సార్వత్రిక తనిఖీ

2) మారణాయుధాలపై నిషేధం

(సూచన: ఇంకా కొన్ని డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచారు. కాని, అవి తెలుగు పాఠకులకు సందర్భోచితమయిన డిమాండ్లు కావు. అందుకే వాటిని ఇక్కడ పేర్కొనడం లేదు.)

మేమంతా 2018 మార్చ్ 24న కలిసికట్టుగా మా ప్రాణ రక్షణకై కవాతు చేశాం. మేము డిమాండ్ చేస్తున్న మార్పును మా కళ్లారా చూసే వరకు మేము వాదనను వినిపిస్తూనే ఉంటాము. ఈ మార్పు దేశవ్యాప్తంగా అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోకుండా కాపాడడానికి ఎంతైనా అవసరం."

ఈ పై లక్ష్య ప్రకటనను ప్రదర్శనకారులు చప్పట్లతో ఆవేశపూరిత రకరకాల ధ్వనులతో ఆమోదించారు.

ఆనాడు తుపాకీ సంస్కృతికి వ్యతిరేకంగా అమెరికా నవయవ్వన తేజం అమెరికా అధ్యక్ష భవనం వైపు కోపోద్రిక్తమయిన కళ్లతో తేరిపార జూచింది. "స్కూళ్లు యుద్ధ ప్రాంతాలు కావు" అని నినదించింది. పార్క్‌లాండ్ కాల్పుల్లో బతికి బయటపడ్డ విద్యార్థులు ప్రదర్శన అగ్రభాగాన నిలిచారు. వారిలో కొందరు ఆవేశపూరితంగా, కోపంగా, ఉత్తేజపూరితంగా మాట్లాడారు. మరికొందరు విచార వదనాలతో ఆనాటి భయంకర దృశ్యాలను నెమరు వేసుకున్నారు. ఎమ్మా గొంజాలెజ్ పార్క్‌లాండ్ స్కూల్లో చదువుకున్న 19 ఏళ్ల విద్యార్థిని. ఫిబ్రవరి 14న జరిగిన కాల్పుల తరువాత స్ఫూర్తిదాయకమయిన తన ఉపన్యాసం ద్వారా ప్రపంచవ్యాప్తంగా టీవీలలో ప్రేక్షకులను ఉత్తేజపరిచిన ఈ యువతి సరిగ్గా 6 నిమిషాల 20 సెకండ్ల పాటు చనిపోయిన 17 మంది అమరులకు నివాళులర్పించింది. తన స్కూల్లో వాలెంటైన్స్ డే నాడు హంతకుడు సరిగ్గా 6 నిమిషాల 20 సెకండ్ల పాటు తుపాకీ గుళ్ల వర్షం కురిపించి 17 మంది పిల్లలు, టీచర్ల ప్రాణాలు బలిగొన్నాడు. అందుకు సంకేతాత్మకంగా అంతే సమయంలో తాను నివాళులర్పించింది. ప్రదర్శనలో ఉన్న ప్రతి ఒక్కరూ మరో 17 మందిని సమీకరించి తుపాకీ సంస్కృతికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగస్వాములను చెయ్యాలని పిలుపునిచ్చింది. "నీ జీవితం కోసం నీవు పోరాడు. నీవు చంపబడ్డ తర్వాత వేరొకరు నీకోసం ఉద్యమం చేయక ముందే నీవు పోరాటంలోకి రా" అని తన ఉపన్యాసం ద్వారా ప్రదర్శకుల్లో స్ఫూర్తినింపింది. "విప్లవ కెరటానికి స్వాగతం" అన్న వాక్యాలతో తన ఉపన్యాసం ప్రారంభించింది.

పార్క్‌లాండ్ ఘటనలో ప్రాణాలతో బయటపడ్డ విద్యార్థులతో పాటు షికాగో, వాషింగ్టన్, న్యూయార్క్, లాస్ ఏంజెల్స్ మొదలగు ప్రాంతాలలో జరిగిన హింసాత్మక తుపాకీ కాల్పుల భయానక దృశ్యాలను ప్రత్యక్షంగా చూసి వాటికి గురికాకుండా బతికి బయటపడ్డ విద్యార్థులు, వేల కొలది స్కూళ్ల నుండి తరలివచ్చిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తమ బాధను, ఆందోళనను ప్రదర్శనకారులతో పంచుకున్నారు. తదుపరి కార్యాచరణ గురించి కూడా మాట్లాడుకున్నారు. ఎడ్నా ఛావెజ్ అన్న 17 ఏళ్ల అమ్మాయి మాట్లాడుతూ తుపాకీ సంస్కృతికి తన తమ్ముడు బలి అయ్యాడని కన్నీళ్లు పెల్లుబికి రాగా, తాను నివసిస్తున్న ప్రాంతంలో కొవ్వొత్తుల ప్రదర్శనలు, పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించడం మామూలయిపోయిందని బాధ వ్యక్త పరిచింది. మిడిల్‌టన్ అన్న 16 ఏళ్ల విద్యార్థిని మాట్లాడుతూ కొంతకాలం క్రితం షికాగో స్కూల్లో జరిగిన కాల్పుల్లో అదృష్టవశాత్తు తాను రక్షింప బడ్డానని, హంతకుడు తన వైపు పిస్తోలు గురిపెట్టి "శాశ్వతంగా ఇక నీ పని ముగిసినట్టే" అని గర్జించాడని "అయినా నేను ఇప్పుడు మీ అందరి ముందు నిలబడ్డానని, మీ అందరితో మాట్లాడుతున్నానని" గద్గద స్వరంతో చెప్పినప్పుడు అందరి హృదయాలు బరువెక్కాయి. మిస్సోరీ రాష్ట్రంలోని సెయింట్ లూయిస్ పట్టణంలో 21 సంవత్సరాల కాలేజి విద్యార్థి హాలే జింక్ "కోపంతో గట్టిగా అరుస్తున్న పిల్లల గుంపుగా మమ్మల్ని భావించకండి. మేం అలా కాదు. మా గొంతు మీకు వినిపించేలా గట్టిగా అరిచే ఆలోచనాపరులం" అని గర్జించాడు. "మా ప్రణాళిక మాకుంది. మేం చిన్న పిల్లలం కాబట్టి, మా చుట్టూ ఉన్న పరిస్థితులను చక్కదిద్దుకో లేమని భావించకండి. ఇది మా భవిష్యత్తుకు సంబంధించింది. ఈ ప్రపంచంలో మేం పెరుగుతున్నాం. మా ముందున్న ప్రపంచం లోపభూయిష్టంగా ఉంది. తుపాకీ భయం లేకుండా సాధారణంగా నడిచే స్కూలు వ్యవస్థ లేని ప్రపంచంలో మేమున్నాము. ఇది సరి అయినది కాదు. దీన్ని సరిచేసే బాధ్యత మేము తీసుకున్నాము" అని ఆవేశ పూరితంగా ఇంకో అమ్మాయి ఉపన్యసించింది.

"మా ప్రాణ రక్షణకై కవాతు"కు మద్దతుగా పార్క్‌లాండ్ స్కూల్లోనే పెద్ద ప్రదర్శన ఒకటి అనాడే నిర్వహించారు. కామెరాన్ కాసిన్ అన్న విద్యార్థి మాట్లాడుతూ "రాజకీయ నాయకుల్లారా! ప్రజల ఇబ్బందులు పట్టించుకొండి లేదా వైదొలగండి" అని హెచ్చరించాడు. "ప్రజలు మారణాయుధాలను నిషేధించమని డిమాండ్ చేస్తున్నారు. వరుస బుల్లెట్లున్న తుపాకీ గుళ్ల పెట్టెలను నిషేధించమని ప్రజలు కోరుతున్నారు. తుపాకీ లైసెన్స్ జారీ చేసేటప్పుడు వారి గురించి పూర్తి వివరాలు తెలుసుకోండి అని ప్రజలు హెచ్చరిస్తున్నారు. వారి మాటలు వినండి లేదా జాగ్రత్త. ప్రజలు ఊరుకోరు" అని తీవ్ర స్వరంతో మాట్లాడాడు. వర్జీనియా విద్యార్థి క్రిష్టా వాన్ డర్ పూయే "ఇది ఇక్కడ ఆరంభమయ్యింది. ఇక్కడ ఇది అంతం కాదు" అని ధీమాగా ప్రకటించాడు.

ఇది విద్యార్థులు, యువకులు తలపెట్టిన పోరాటమయినా, ఇది స్కూళ్లకు పరిమితం కాదని, సమాజంలో ప్రబలిపోతున్న తుపాకీ హింసను తుదముట్టించడానికి తుది దాకా కొనసాగుతుంది అని పలువురు వక్తలు వేదికపై నుండి హామీ ఇచ్చారు. ఇది స్కూళ్ల సమస్య కాదు. ఒక సామాజిక రుగ్మత. దీనివైపు సమాజం దృష్టిని ఆకర్షించేందుకు బృహత్తరమయిన రాజకీయ కార్యాచరణ వైపు అమెరికా విద్యార్థి లోకం అడుగులు కదిపింది. సూటిగా రాజకీయ నాయకులను ప్రశ్నించింది. ఆయుధ వ్యాపారులు ఇచ్చే లంచాల కోసం, కమీషన్ల కోసం ప్రజల ప్రాణాలకు భరోసా ఇవ్వలేని నీచస్థాయిలో రాజకీయ నాయకులు ఉన్నారని దుయ్యబట్టింది. ఇలాంటి సంఘటనలు ఇక జరగకుండా ఉండడం కోసం తాము నడుం బిగించారు. "షూటింగ్ జరిగిన దృశ్యాలు టీవీలో చూస్తున్నప్పుడు, విద్యార్థుల మెదళ్లలో వచ్చే ఆలోచనలు.. రేపు స్కూలుకు వెళితే క్లాస్‌రూంలో ఎక్కడ కూర్చోవాలి... ఎవరైనా తుపాకీ పట్టుకొని వచ్చి కాల్పులు జరిపితే.. ఎక్కడ కూచుంటే సురక్షితంగా ఉండగలము .. అన్న ఆలోచనలే వచ్చే పరిస్థితులే ఉంటే ఎంత దారుణం. ఇలాంటి కాల్పుల యుగం లోంచి బయటికి రావాలని పిలుపునిచ్చింది ఆ ప్రదర్శన.

ఆయుధ వ్యాపారుల సంఘం "జాతీయ రైఫిల్స్ అసోసియేషన్ (ఎన్ఆర్ఏ) ఈ మార్చ్‌కు వ్యతిరేకంగా తామూ ప్రదర్శనలు జరుపుతారని, ప్రదర్శనకారులపై కాల్పులు జరిపే అవకాశం ఉందని పుకార్లు షికార్లు చేశాయి. కాని, సునామీ లాగా రోడ్ల మీదకు వచ్చిన లక్షలాది ప్రజల ఆగ్రహానికి జడిసి ఆయుధ విక్రయదారులు వెనుకంజ వేశారు. కాని, ఫాల్స్ లేక్ సిటీ, బోస్టన్ లాంటి చోట్ల పిస్టళ్లు, జెండాలు పట్టుకుని కొంతమంది ప్రతికూల ప్రదర్శనలు చేశారు.

తదుపరి కార్యక్రమంగా ఏప్రిల్ 20 నాడు స్కూళ్ల బహిష్కరణ కార్యక్రమం రూపొందించుకున్నారు విద్యార్థులు. 19 ఏళ్ల క్రితం కొలరాడోలోని కొలంబైన్ స్కూల్లో కాల్పుల ఘటన జరిగిన ఏప్రిల్ 20వ తేదీనే ఈ బహిష్కరణకు తగిన సమయంగా ఎంచుకున్నారు. దేశ వ్యాప్తంగా కొన్ని వేల పాఠశాలలు ఏప్రిల్ 20న బహిష్కరణలో పాల్గొంటున్నట్టు ప్రకటనపై సంతకం చేశాయి. వరుస కాల్పుల సంఘటనలు ప్రారంభమయి దాదాపు 19 ఏళ్లు గడిచినా వాటికి అంతం కానరావటం లేదని, ఆ ఘటన తర్వాత పుట్టిన పిల్లలే కోట్ల మంది ఉన్నారని "ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో జన సమూహాలపై తుపాకులు మోగని ప్రపంచం మాకు తెలియనే తెలియదు. అలాంటి ప్రపంచం కోసం మేము మా నిరసనను వచ్చే ఏప్రిల్ 20న వ్యక్తపరుస్తాం" అని "మార్చ్ ఫర్ అవర్‌లైన్స్" ప్రదర్శనలో విద్యార్థులు నినదించారు.

ఈతరం యువత చేతుల్లో ఉన్న ఆయుధం సోషల్ మీడియా. "మమ్మల్ని సోషల్ మీడియా తరం అని చిన్నచూపు చూస్తారు. ఎప్పుడూ ఫోన్ల మీదే ఉంటారని, కార్టూన్లు వేస్తారు, విమర్శిస్తారు. కాని, మా చేతుల్లోని ఫోన్ల ద్వారానే ఈ ర్యాలీని చరిత్రాత్మకం చేసుకున్నాం. లక్షలాది మంది విద్యార్థులను, మాజీ విద్యార్థులను, వారి కుటుంబాలను, ప్రజాస్వామ్య ప్రియులను ఒక చోట చేర్చగలిగాము. తుపాకీ సంస్కృతి పట్ల ఉన్న వ్యతిరేకతను జాతీయ సమస్యగా గుర్తింప జేయగలిగాము" అని కార్యక్రమ నిర్వాహకులు ప్రకటించారు.

విద్యార్థుల నుండి వచ్చిన ఈ వత్తిడిని తట్టుకోలేక తుపాకీల అమ్మకంపై చాలా రాష్ట్రాలు చట్టపరమయిన నియంత్రణకై చర్యలు ఆరంభించాయి.. ఫ్లోరిడా రాష్ట్రం ఈపాటికే కొన్ని నిబంధనలను ప్రభుత్వం విధానంగా ప్రకటించింది. కాన్సస్, న్యూయార్క్ రోడ్ ఐలాండ్, వాషింగ్టన్ రాష్ట్రం, సిన్‌సినాటి, ఓహాయో, ఇలినాయిస్, టెక్సస్ రాష్ట్రాలు తమ పరిధిలో మారణాయుధాల నియంత్రణకై కొన్ని చర్యలు ప్రారంభించాయి. అయినా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తానుగా చేయాల్సిన పనులు చేయట్లేదని, ఇంకా నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్ కనుసన్నలలో మెలుగుతూ, వారికి అనుకూలమయిన విధానాలనే కొనసాగించే మార్గంలోనే ఉన్నాడని ప్రజలు అభిశంసిస్తున్నారు.

*(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్)* వీ

# ఆంధ్రప్రదేశ్‌లో కుల-మత పాలన

*చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల స్థితిగతులను పట్టించుకోకుండా, ప్రగతి అంటూ అభివృద్ధి అంటూ దేశ విదేశాల పర్యటనలు, పెట్టుబడిదారులతో వ్యాపార సంబంధాలకే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారని అంటున్నారు* **డా. కత్తి పద్మారావు**

ఒకపక్క చంద్రబాబు విదేశీ బడాబాబులతో నిరంతరం మంతనాలు, మరొకపక్క పదవ తరగతి విద్యార్థులు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు పరీక్షల కోసం ప్రిపేరవుతూ స్పృహతప్పి పడిపోవడం చూస్తుంటే అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌లో ఒకపక్క రాజసం మరొకపక్క దు:ఖం అసమ సమాజపు నీరసపు ధ్వనులు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో వృద్ధులు, శిశువులు, విద్యార్థులు నిసత్తువతో పౌష్టిక ఆహారం లేక నీరసపడి పోతున్నారు. గర్భవతులు రక్తలేమితో పిల్లల్ని కనలేక మరణిస్తున్నారు. గర్భస్థ శిశువుకు సరైన ఆహారం అందక కడుపులోనే మరణిస్తున్నారు.

దేశం దుర్భర దారిద్ర్య దావానలంలో మాడి మసైపోతుంది. మరణించే వారి సంఖ్య పెరుగుతూ స్మశానంలో పూడ్చి వేయడానికి చోటులేక బడుగుజీవులు గుండెలు బాదుకొంటున్నారు. తాగుడు విపరీతమై తన కళ్లముందే బిడ్డ మరణించిన ఘట్టాలు తల్లుల గుండెలు పిండేస్తున్నాయి. మూలవాసుల జీవనాధారమైన అటవీ భూములను పెద్ద పెద్ద కంపెనీలకు లీజులకిచ్చి వారి నుండి ఎన్నికల కోసం ధనం సేకరిస్తున్న నాయకుని కనులు ప్రజలపై ద్వేషంతో ఎరుపెక్కుతున్నాయి.

లక్షా ఏభై ఆరు వేల కోట్ల ఆర్థిక బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం వేల కోట్లు పుష్కరాలకు ఖర్చు పెడుతున్న రాష్ట్రం జీర్ణ దేవాలయ పునరుద్దరణలకు వందల కోట్లు వెచ్చిస్తున్న రాష్ట్రం, తాను తన మంత్రులు, అధికారులు వందల కోట్లు వెచ్చించి విదేశాల టూర్లకు కుటుంబ, వందిమాగదులతో సహా తిరిగి వచ్చే రాష్ట్రం నెలలో ఎన్నో రోజులు హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల్లో ముఖ్యమంత్రి తిరిగే రాష్ట్రంలో ప్రభుత్వం పదవతరగతి చదివే పిల్లలకు కొన్ని శనగలు, ఒక గ్లాసు పాలు, వేరుశనగ ఉండలు, ఒక అరటి పండు ఇవ్వలేదా? అంటే తప్పకుండా ఇవ్వగలుగుతుంది.

మరి ఎందుకు ఇవ్వడం లేదు? తప్పక చంద్రబాబు గారికి బడుగుల విద్యాభివృద్ధిపై ద్వేషం ఉంది.

**రిజర్వేషన్ల వ్యతిరేకి చంద్రబాబు**

రిజర్వేషన్లకు వ్యతిరేక ఉద్యమంలో చంద్రబాబు క్రియాశీలకంగా పనిచేయడమే గాక, ఆయన దళిత ద్వేషిగా తన్నుతాను నిరూపించు కోవడం కోసం అగ్రకులాలకు వెన్నుదన్నుగా ఉండి నీరు-చెట్టు పేరుతో దళితుల భూములు ఎన్నో ఆక్రమింప చేస్తున్న ముఖ్యమంత్రి ఆయన.

ఈ నాలుగేళ్లలో ఒక్క ఎకరం పేదలకు పంచకపోగా సబ్‌ప్లాన్ నిధులను తన సొంత భవన నిర్మాణానికి నిస్సిగ్గుగా వాడుకొన్న ఘనుడు. తనకు కూతవేటు దూరంలో ఉన్న జిజిఎచ్‌లో సెల్‌ఫోన్ లైట్లతో వైద్యం జరుగుతుంటే, అంబానీని ప్రత్యేక విమానంలో రప్పించి, డిజిటల్ పాలనా నిర్మాణంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శమని చెప్పించుకొన్న ఘనుడు.

తనకు అతి సమీపంలో ఎన్నో జడ్‌పి, మున్సిపల్ స్కూళ్లలో విద్యార్థులు తన మంత్రి మండలిలోని నారాయణ గారి కాలేజీ బట్టీవ్యవస్థతో పోటీపడలేక జీవితమే యుద్ధంగా బతుకుతున్నారు. ఒక ఆడపిల్లకు ఋతుక్రమంలో సరైన ప్యాడ్స్ ఇవ్వకుండా వారు ధరించిన వస్త్రాలకు మరకలై ఇతర పిల్లలు గోల చేస్తుంటే, ముఖ్యమంత్రిగారు పెద్ద హోటళ్లల్లో విదేశీ ప్రతినిధులకు డిజిటల్ దృశ్య ప్రజెంటేషన్లు చేసి ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారంటే ఆయన ఎంత దయా విహీనమైన వాడో మనకర్థ మవుతుంది. రాతిగుండె గలవాణ్ణని తానే గొప్పలు చెప్పుకొంటున్న ఆయన రాష్ట్ర బడ్జెట్ లక్షా యాభై ఆరు వేల కోట్లు దేనికి ఖర్చుపెట్టారో చెప్పలేని స్థితిలో ఉన్నారు.

పక్కా వ్యాపారస్థులు, బ్రోకర్లు, లిక్కర్ వ్యాపారస్థులు మాఫియాలతో కూడిన మంత్రిమండలి, ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణలో పాలన నడుపు తున్న చంద్రబాబుకు కరుణార్ద్రమైన, సున్నితమైన, పేద ప్రజల జీవించే హక్కులను కాలరాస్తున్న అనేక అంశాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారు. తాను ఎన్నికల కోసం కూడగొట్టుకొన్న వేల కోట్ల రూపాయలతో ఓటుకు పదివేలు ఇచ్చి మనం గెలవగలం. మీరేమీ భయపడవద్దు. మళ్లీ మనమే గెలుస్తాం అని తన మంత్రులకు, ఎంఎల్ఎలకు బోధిస్తున్న ముఖ్యమంత్రికి ఒక స్కూల్లో 200 మంది ఆడపిల్లలు ఉంటే మూడు మాత్రమే మూత్రశాలలుంటే ఎలా వారి దిన కార్యక్రమాలు తీర్చుకొంటారనే ఇంగితజ్ఞానం లేకపోవడం ఆశ్చర్యం కాదా!

తన పూర్వ రాజ్యంలో బుద్ధిపూర్వకంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు కాలేజీ హాస్టళ్లు రద్దుచేసి బిఎల వల్ల, ఎంఎల వల్ల ప్రయోజనం లేదని తానే చెప్పి ఇంజనీరింగ్ కాలేజీలు విపరీతంగా పెట్టించి చివరకు అటు సాధారణ విద్యను ధ్వంసంచేసి ఇటు సాంకేతిక విద్యకు విలువ లేకుండా చేసి విద్యార్థులను అటుఇటు కాకుండా చేసిన ఈ ఘనుడు ఇప్పుడు ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి రాష్ట్రానికి ప్రాజెక్టులు, పరిశ్రమలు లేకుండా చేయడం నిజం కాదా!

**విద్యార్థినులకు బాత్‌రూమ్‌లు కట్టలేరా?**

విద్యార్థినులకు 18 వేల బాత్‌రూమ్స్ కట్టవలసిన పని ముఖ్యమైందా కాదా! దానికి మన దగ్గర డబ్బులేదా! భారతదేశ వ్యాప్తంగా పెట్టుబడిదారు లుగా ప్రఖ్యాతి చెందిన టాటా, ముఖేష్ అంబానీ, బిర్లా, అనిల్ అంబానీ, భారతి, వేదాంత, ఎచ్‌డిఎఫ్‌సి, ఆదాని, ఎల్&టి, ఐసిఐసిఐ సంస్థలకు తెలుగు నేలలో ఎన్నో విలువైన నేలలు ధారాదత్తం చేస్తున్న ముఖ్యమంత్రి ఆ సంస్థలతో అంగన్‌వాడీల్లోకి పౌష్టికారాన్ని సప్లయ్ చేయమని, ఆడపిల్లలకు విద్యాలయాల్లో మూత్రాలయాలు నిర్మించమని చెప్పలేరా!

తన హెరిటేజ్ ఫుడ్స్‌ను అమ్ముకోవడానికి ప్రభుత్వంలో ఉండే అన్ని శాఖలను ఉపయోగించుకొంటున్న ముఖ్యమంత్రికి మధ్యాహ్న భోజనానికి 5,6, రూపాయలు చాలవని తెలియదా! నిత్యం స్టార్ హోటళ్ల నుండి ఆహారం, జూస్, ఓట్స్, బాదం, జీడిపప్పు పదార్థాలు తెప్పించుకొని తినే ముఖ్యమంత్రికి రోజుకు పదిగంటలు చదువుకొనే విద్యార్థినులకు

శక్తివంతమైన ఆహారం ఇవ్వడం మన బాధ్యత అని తెలియదా!

చంద్రబాబు నిర్లక్ష్యం వల్ల, నిర్దాణత వల్ల, కేవలం రాజకీయ ప్రయోజనాలనే ఆశించడం వల్ల రాష్ట్రంలోని పుట్టే శిశువులతోపాటు, అనేక జీవులు మరణిస్తున్నాయి. పశువులు గ్రాసం లేక తాగే నీళ్లు లేక మరణిస్తున్నాయి. విద్యార్థులకు మంచినీళ్ల కొరత వల్ల గొంతులెండి, పేగులెండి, సాయంత్రానికి ముఖాలు మాడిపోతున్నాయి.

చిరుధాన్యాలను పండించండి అని నినాదం ఇస్తున్న చంద్రబాబు వరిగలు, జొన్నలు, రాగులు వంటి వాటితో బెల్లం కలిపి చిన్న పిల్లల నుండి 10వ తరగతి చదివే విద్యార్థుల వరకు చిరుధాన్యాలు ఎందుకు అందించడం లేదు. ఉదయాన్నే సూర్యవందనం చేయండి అని చంద్రబాబు పిలుపునిస్తున్నారు. ఏ ఆహారం తీసుకోకుండా ఉదయాన్నే కళ్లుతిరిగి పడడం తప్ప ఒరిగేది ఏమీలేదు. అన్ని విటమిన్లతో పాటు డి విటమిన్ కావాలి కానీ కేవలం సూర్యుని ముందు నిలబడితే అంత శక్తి వస్తుంది అనుకోవడం అజ్ఞానం.

చంద్రబాబు పాలనలో విద్యా పునాదులు కూలుతున్నాయి. విద్యార్థుల అంత:శక్తి తగ్గుతుంది. విద్యార్థుల్లో మనోవైకల్యం పెరుగుతుంది. దానికి కారణం ఏమిటి? సరైన ఆహారం లేక. లేదా ఆహారేతర అంశాల మీద శ్రద్ధ. సెల్‌ఫోన్లు, సినిమాలు, క్రూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌లు, ఇలా జ్ఞానేతరమైన వస్తువులు, శక్తి హీనమైన ఆహారాలు పిల్లలకు అలవాటు అవ్వడం వలన కూడా ఈ వైపరీత్యం.

ఇకపోతే హెడ్‌మాస్టర్లను ప్రభుత్వ కార్యక్రమాలకు వాడేస్తున్నారు. మీటింగ్‌లను బ్యాంక్ పనులని విద్యార్థుల ఆధారకార్డుల నెంబర్లు నెట్‌లో చేర్చడమని, ఒకపని కాదు వంద పనులు చెబుతున్నారు. పొద్దున, రాత్రి వేరే రిటైర్డ్ ఉపాధ్యాయులను ఓపికున్న వారిని వాడుకోవచ్చు కానీ వీరినే ఉపయోగిస్తున్నారు. వీరి కుటుంబ వ్యవస్థ కూడా ఇబ్బందుల్లో పడుతోంది. ముఖ్యంగా ఉదయం వెళ్లి రాత్రికి రావడం వల్ల పిల్లల ఆలనా పలనా దెబ్బతింటున్నాయి. ఇంటి పర్యవేక్షణ కూడా లోపిస్తుంది. చాలా మంది ఎచ్‌ఎంలు సిక్కు అవుతున్నారు. వారి మీద విపరీతమైన ఒత్తిడి కూడా పెరుగుతోంది. ఉపాధ్యాయుల్లో కొందరు బాధ్యతగా ఉంటున్నారు. కొందరు ఉండలేక పోతున్నారు. ప్రభుత్వ విద్య విధ్వంసం అవ్వడానికి కారణాల్లో ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం ఒకటి.

ముఖ్యంగా చంద్రబాబు పుత్రవ్యామోహం హద్దులు దాటిపోయింది. తన కుమారుడే ముఖ్యమంత్రిలా వ్యవహరించడం, ఇతను లేనప్పుడు ఆ కుర్చీలో కూర్చోవడం, అన్ని పదవులకు ప్రమోషన్లకు ఓపెన్‌గా డబ్బు తీసుకోవడం, 26 మంది ఎంఎల్‌ఎలను కోట్ల డబ్బులు ఇచ్చి కొనడం ఇలా రాజ్యాంగేతరగా చంద్రబాబు మారాడు. నీతి నిజాయితీ లేని ఒక రోబోగా వ్యవహరిస్తున్నాడు.

చంద్రబాబు సంగతి ఇలా ఉంటే మోడీ భారతదేశంలోని పెట్టుబడిదారులకు లోబడి ఇక మోడీ నల్లధనంపై పోరాటానికే పెద్ద నోట్లు రద్దు చేసినట్లు చెప్పారు. పెద్దనోట్ల రద్దు తరువాత దాచిపెట్టిన డబ్బు ఇప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చినట్లు కూడా ప్రధాని పేర్కొన్నారు. బ్యాంకులు ఇప్పుడు ఆర్థికంగా పరిపుష్టతను సంతరించు కున్నాయని, యువతతో సహా ఎటువంటి గ్యారంటీ లేకుండానే రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు. రు.8 వేల కోట్ల బినామీ సంపదను స్వాధీనపర్చుకున్నట్లు చెప్పారు.

ప్రధాని ప్రకటించిన దాన్నిబట్టి చూస్తే ఆర్థికాభివృద్ధి ఉరకలు వేయాలి. కానీ అందుకు భిన్నంగా, ఏప్రిల్ 11న విడుదల చేసిన ఆర్థిక సర్వే రెండోభాగం ఆర్థిక సంవత్సరం రెండో భాగంలో కూడా ఆర్థికాభివృద్ధి ఆశాజనకంగా లేదని స్పష్టంచేయడం ప్రధాని ప్రసంగంలోని డొల్లతనాన్ని వెల్లడిస్తోంది. 6.75 శాతం నుండి 7.5 శాతానికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) ఉంటుందన్న గత అంచనాలకు చేరుకోవడం కష్టతరమని కూడా ఆర్థిక సర్వే తేల్చిచెప్పింది. ఆర్థికరంగం ఎంతో కోలుకోవలసి ఉందని, సాధించవలసిన దానికి ఎంతో దూరంలో ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది.

ఇదిలా ఉండగా భారతీయ రిజర్వ్‌బ్యాంకు (ఆర్బీఐ) కూడా ప్రభుత్వానికి తాజాగా షాకిచ్చింది. ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చే డివిడెండ్‌లో భారీగా కోత పెట్టింది. గత ఏడాది రూ.65,876 కోట్ల డివిడెండ్‌ను ఆర్బీఐ ప్రభుత్వానికి చెల్లించగా, ఈసారి అది రూ.30,660 కోట్లకే పరిమితమైంది. అంటే 50 శాతానికిపైగా కోత పెట్టింది. నోట్ల రద్దు, కొత్త నోట్ల ముద్రణతో ఖర్చులు పెరిగిపోవడం వల్ల ఈసారి ఆర్బీఐ ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. మరి పెద్దనోట్ల రద్దు చర్చ గురించి గొప్పగా చెబుతున్న ఏలికలే నోట్ల రద్దువల్ల ఒరిగిందేమిటో చెప్పాలి. దేశ ఆర్థిక వ్యవస్థనంతా కూడా కుప్పకూల్చాడు మోడీ.

**పెట్టుబడిదారుల బానిస మోడీ**

2018 నాటికి పెట్టుబడిదారుల ఆస్తి, వారి సంవత్సరిక ఆదాయం (కోట్లలో)

| | ఆస్తి | సంవత్సరిక ఆదాయం |
|---|---|---|
| టాటా | 5,96,537 | 6,22,921 |
| ముకేష్ అంబానీ | 4,99,483 | 3,20,126 |
| బిర్లా ఎ.వి. | 2,77,611 | 1,96,337 |
| అనిల్ అంబానీ | 2,18,372 | 77,355 |
| భారతి | 1,86,887 | 99,663 |
| వేదాంత | 1,57,752 | 80,610 |
| ఎచ్‌డిఎఫ్‌సి | 1,51,802 | 1,47,237 |
| అదానీ | 1,51,722 | 73,724 |
| ఎల్&టి | 1,25,859 | 1,10,750 |
| ఐసిఐసిఐ | 1,05,751 | 1,14,454 |

భారతదేశంలో కొందరి చేతుల్లోనే ఆస్తి ఉంది. ఎక్కువ మంది పేదలే. ఈ విషయాన్ని గూర్చి సర్వే ఏమి చెప్తుంది అంటే జాతీయ ఆదాయ పంపిణీ తీరు జనాభా 50 శాతం లోపు జాతీయ ఆదాయంలో వాటా 11 శాతమే. జనాబా 40–50 శాతం జాతీయ ఆదాయంలో వాటా 23 శాతమే, జనాభా 9 శాతం పైన జాతీయ ఆదాయంలో వాటా 37 శాతం, జనాభా 1 శాతం పైన జాతీయం 29 శాతమే, జనాభా 0.1 శాతం పైన 12 శాతం, 90 శాతం ప్రజలు పొందుతున్న జాతీయాదాయం 34 శాతం మాత్రమే. 10 శాతం ధనవంతులు 66 శాతం పొందు తున్నారు.

గత నాలుగు సంవత్సరాలలో ధనవంతుల శాతంలో పెరిగిన లెక్కలు అందరికీ తెలిసిందే. భారతదేశంలో కుబేరులు ఎలా పెరుగుతున్నారో యుయన్‌ఐ రిపోర్టు ఇలా చెప్తుంది. గత మూడు దశాబ్దాలుగా భారత్‌లో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఓక్స్‌ఫామ్ ఇండియా తెలిపింది. భారత కుబేరుల (బిలియనీర్ల) సంపద మొత్తం కలిపితే, జీడీపీలో 15 శాతానికి చేరిందని ప్రభుత్వాల విధానాలే ఇందుకు కారణమని ఒక నివేదికలో పేర్కొంది. బిలియనీర్ అంటే దాదాపు రూ.6500 కోట్లకు పైగా సంపద ఉన్న వ్యక్తి.

ఓక్స్‌ఫామ్ రూపొందించిన 'పెరుగుతున్న అంతరాలు: భారత అసమానతల నివేదిక 2018' ఇంకా ఏమందంటే – దేశంలో ఎక్కువ

భాగం సంపద అధికారం ఉన్న వారి దగ్గర కుబేరుల వారసుల దగ్గర ఉండిపోయింది. సామాన్యుల వద్ద సంపద మరింత తగ్గింది. 1991 తర్వాత చేపట్టిన సంస్కరణలే ఈ అసమానతలకు కారణం. తాజా అంచనాల ప్రకారం భారత కుబేరుల మొత్తం సంపద జీడీపీలో 15 శాతానికి సమానం. అయిదేళ్ల కిందట ఇది 10 శాతంగానే ఉంది. 2017 నాటికి భారత్‌లో 101 మంది బిలియనీర్లున్నారు. ఆదాయం, వినియోగం, సంపద విషయాల్లో ప్రపంచంలోనే అత్యంత అసమానత లున్న దేశాల్లో భారత్ ఒకటి.

ప్రభుత్వాలు అవలంబించిన విధానాలు కార్మికులకు బదులుగా వ్యాపారవేత్తలకు సానుకూలతలను తెచ్చిపెట్టాయి. నైపుణ్యం లేని కార్మికులకు బదులు నైపుణ్యం ఉన్న కార్మికులకు మంచిని చేశాయి. 1980ల్లో అసమానతల్లో అంతరాలు తక్కువగా ఉన్నప్పటికీ 1991 తర్వాత దూరం పెరిగిపోయింది. 2017 వరకు అది పెరుగుతూనే ఉంది. కులం, మతం, ప్రాంతం, లింగ భేదాలతో అప్పటికే కునారిల్లిన భారతీయ సమాజానికి ఆర్థిక అసమానతలు మరింత ఆందోళన కలిగించేవే. ప్రగతిశీల ప్రత్యక్ష పన్నుల ద్వారా పన్ను వసూళ్లను పెంచుకోవడం ద్వారా ఈ ధోరణిలో మార్పు తీసుకురావొచ్చు. సంపద, వారసత్వ సంపదపై పన్నులు వేయవచ్చు. వాటితో పేదలకు ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారం లాంటివి అందజేయొచ్చు. అపుడే దేశంలో సమాన అవకాశాలు వస్తాయి.

### స్త్రీల దయనీయ స్థితి

ఈ ఆర్థిక అసమానతల వల్ల దళిత, బహుజన, మైనార్టీల స్త్రీల పరిస్థితి అదోగతి పాలైంది. హిందూమత ఆచారాల వల్ల స్త్రీలకు బాల్య వివాహాల తంతు పెరుగుతుంది. స్త్రీలకు బాల్య వివాహాలు చేయకూడదు. కట్నాలు తీసకోకూడదు. గృహ హింస చేయకూడదు అనేక రాజ్యాంగ సూత్రాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. స్త్రీ అంటే చులకన భావం కుటుంబానికే కాక దేశానికి కూడా ఏర్పడింది. ఎంఆర్‌ఒ ఆఫీసులు, ఎండిఒ ఆఫీసులు, పోలీస్ స్టేషన్లు, గ్రామ కార్యదర్శులు, ఇన్‌ఫార్మర్స్‌లు ఉండి ప్రతి వీధిలో ఉండే విషయాలు తెలుసుకొంటున్న ప్రభుత్వం బాల్య వివాహాలు ఎక్కడ జరుగుతున్నాయని తెలుసుకోలేకపోవడం ఆశ్చర్యం.

స్త్రీకి స్వేచ్ఛలేదు. ఆమెలో ఉండే ఎన్నో ప్రతిభలు, ఎన్నో విలువలు, ఎన్నో భావోద్వేగాలు రోజురోజుకు ధ్వంసం అవుతున్నాయి. ఆమె ఒక అడ్మినిస్ట్రేటర్‌గా సక్సస్ అవుతుంది గాని తనను తాను నిర్మూలించుకోలేక పోతుంది. శ్రమని, డబ్బుని, సేవని కోరుకోవడంలో ఉన్న వణుకు ఆమె విలువల్ని విస్తృతం చేయడంలేదు. బాల్య వివాహాల వల్ల స్త్రీలు తమ పునాదిని కోల్పోతున్నారు. తమ జ్ఞానాన్ని కోల్పోతున్నారు, తమ స్వేచ్ఛను కోల్పోతున్నారు. తమకు ఒక వయస్సు రాకుండానే పిల్లలు పుట్టడం, ఆస్పత్రుల్లో కాన్పులకు కూడా భారతదేశంలో అవకాశం లేకపోవడం బాధాకరమైన విషయం. 24 లక్షల కోట్ల రూపాయల భారతదేశ వార్షిక బడ్జెట్ పెట్టుకొని ఒక అమ్మాయి కాన్పుని మనం నిర్వహించలేక పోతున్నాం అంటే హిందూ మతంలో ఉండే అనేక అణచివేత ధోరణులు భారతదేశ పాలక వర్గాన్ని ఎలా నడిపిస్తున్నాయో మనకు అర్థమౌతుంది.

2006 నాటి బాల్య వివాహాల నిషేధ చట్టం ఆచరణలో చట్టుబండ లైందనడానికి దేశవ్యాప్తంగా ఏటా లక్షల సంఖ్యలో జరుగుతున్న పెళ్లితంతులే రుజువు. ఇండియాలో సగటున రోజుకు 3,600 బాల్య వివాహాలు నమోదవుతున్నాయని, వాటి కట్టడిపై రాష్ట్రాలు ప్రత్యేకంగా దృష్టి సారించాలని జాతీయ మానవ హక్కుల సంఘం నెల రోజులనాడు చేసిన హెచ్చరికకు మన్నన దక్కితీరాలిప్పుడు. సతీ సహగమనం, బాల్య వివాహాల వంటి అనాచారాలు భారతీయ సమాజాన్ని అనాగరికంగా మార్చేసి జాతి నీతినే ప్రశ్నార్థకం చేశారు. విధవా పునర్వివాహాలను విప్లవీకరించారు. వధూవరుల వయోభేదాలు నేడు గణనీయంగా తగ్గినా, బాల్య వివాహాలకు మాత్రం తెరపడింది లేదు. పద్దెనిమిదేళ్లలోపు బాలికలు ప్రతి ముగ్గురిలో ఇద్దరికి బాల్య వివాహాలతో బంగ్లాదేశ్ ప్రపంచంలోనే అగ్రాస్థానంలో నిలిచి అప్రతిష్ఠ మూటకట్టుకుంటే, దాని వెన్నంటే భారత్, నేపాల్, ఆఫ్ఘానిస్థాన్‌లు ఉన్నాయని యునిసెఫ్ అధ్యయనం 2014లో నిర్ధారించింది.

భారత్‌లో తొమ్మిదేళ్ల వ్యవధిలో కోటీ 53 లక్షల మంది బాలికలుగానే పెళ్లిపీటలెక్కారని, ఆ కాలంలో వివాహితుల సంఖ్యలో వారు 20 శాతంగా ఉన్నారని 2011 నాటి జనాభా లెక్కలు చాటుతున్నాయి. ఈ మధ్య విడుదలైన జాతీయ కుటుంబ ఆరోగ్య నాలుగో సర్వే– పశ్చిమ్ బంగలో జరిగిన మొత్తం వివాహాల్లో 40.7 శాతం, బీహార్‌లో 39.1 శాతం, జార్ఖండ్‌లో 38 శాతం, రాజస్థాన్‌లో 35.4 శాతం బాల్య వివాహాలేనని కుండ బద్దలుకొట్టింది. పదేళ్ల కాలావధిలో పంజాబ్ 61.42 శాతం, కేరళ 50.65 శాతం బాల్య వివాహాల్ని తగ్గించగలిగాయన్న సమాచారం.

### శిశువును రక్షించుకోని భారతం

భారతదేశంలో ఒక శిశువును రక్షించుకోలేని దయనీయ స్థితి గుండెల్ని పిండేస్తుంది. భారతదేశ సంపద గురించి భారతదేశ భౌగోళిక పరిస్థితుల గురించి నరేంద్రమోడీ దేశదేశాల్లో విస్తృతమైన ప్రచారం చేసుకొంటు న్నాడు. భారతీయ సంస్కృతి చాలా గొప్పదని విస్తృతమైన ప్రచారం చేస్తున్నాడు. భారతీయ సంస్కృతి అంటే ఏమిటి? శిశువును రక్షించుకో లేకపోవడమా?

చిన్ని చిన్న దేశాలు కూడా తమ సంతానాన్ని తాము రక్షించుకోవ డానికి శ్రద్ధ పెడుతుంటే అనంతమైన సంపద, మానవ వనరులు, శారీరక శ్రమ కలిగిన భారతదేశం చిన్న పిల్లల్ని రక్షించుకోకపోవడం సిగ్గుచేటైన విషయం కాదా? ఆలోచించవలసిన అవసరం లేదా?

చంద్రబాబు, మోడీ ఇద్దరు కూడా హిందూ కులవాద భావజాలంతో కొట్టుమిట్టాడుతున్నారు. శిశువు చనిపోతే భూ భారం తగ్గుతుందనే మూఢనమ్మకాలతో తాము మాత్రం ఎక్కువ కాలం జీవించడానికి యోగాని ఆచరిస్తున్నామని చెప్తున్నారు. కరుణార్ద్రత లేని మనుష్యులు కట్టెల్లాగ జీవించడం తప్ప వారి జీవితానికి అర్థమేముంది. ఎంతో మంది భారతదేశాన్ని పాలించారు. రాజులు, ప్రభువులు, ప్రధానమంత్రులు భారతదేశాన్ని పాలించారు. కానీ ఒక మహాత్మాఫూలే, ఒక డా. బి.ఆర్.అంబేద్కర్, ఒక పెరియార్ రామస్వామి నాయకర్‌లాగా ప్రజల గుండెల్లో వారు నిలబడ్డారు.

ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు వస్తారు పోతారు. కానీ ప్రజలు వారి ఆశలు, వారి ఆశయాలు, వారి శ్రమ, వారు జీవించే హక్కు నిరంతరం పోరాట రూపంలో కొనసాగుతున్నాయి. అంబేద్కర్ ఆలోచనల్లో చంద్రబాబుని, నరేంద్రమోడీ వ్యక్తిత్వాలను విశ్లేషిస్తే భారతీయ మానవత్వ పునాదుల్ని కూల్చే నాయకులుగా మనకు అర్థమౌతుంది. అవినీతి, ఆశ్రయ పక్షపాతం, ఆత్మద్రోహం, అబద్ధ వాచకం, స్త్రీ అణచివేత, విద్యావ్యవస్థ ధ్వంసం వీరి నిరంతర కార్యక్రమం.

లౌకిక వాదులందరూ కలిసి ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను నిర్మించాలి. మహాత్మాఫూలే, అంబేద్కర్ ఆలోచనా పునాదుల మీద నిర్మించుకున్నప్పుడే భారతదేశానికి వెలుగుల సవ్వడి. ఆ కృషిలో భాగస్వాములం అవుదాం.

*(రచయిత సామాజిక తత్వవేత్త, వ్యవస్థాపక అధ్యక్షుడు, నవ్యాంధ్రపార్టీ)* వీ

### పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర సభలు

హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా, భావ ప్రకటనా స్వేచ్ఛా హక్కుకై ఉద్యమిద్దాం అనే అంశం పై పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలు ఏప్రిల్ 7-8 తేదీల్లో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. అరుంధ తీరాయ్ దేశంలో హిందూ ఫాసిజం విభిన్న రూపాల్లో అమలవుతోందని, మతోన్మాదులు ప్రజలపై దాడిచేయడానికి మూలాలు సామ్రాజ్యవాదంలో ఉన్నాయని అన్నారు. మతపరంగా మెజారిటీగా భావిస్తూ కులాలుగా విభజించి ఒంటరి చేసి దాడి చేస్తున్నారన్నారు. పెద్దనోట్ల రద్దు చేసి నరేంద్రమోడీ ప్రజల వెన్నుముక విరగొట్టారన్నారు. ప్రొ. హరగోపాల్ దళితులు చదవడం ప్రభుత్వాలకు ఇష్టంలేకే ప్రైవేట్ విద్యా విధానాన్ని తీసుకు వస్తున్నారన్నారు. వక్తలుగా ప్రొ. నందిని సుందర్, ప్రొ. కాత్యాయని విద్మహే, శేషయ్య మాట్లాడారు.

### ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసు విచారణ నిలిపివేత

మావోయిస్టు పార్టీ నాయకుడు ఆజాద్, జర్నలిస్టు హేమచంద్రపాండేల ఎన్‌కౌంటర్లో పాల్గొన్న పోలీసులపై ట్రయల్ కోర్టులో విచారణను నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. కింది కోర్టు విచారణను సవాల్ చేస్తూ ఇన్‌స్పెక్టర్‌తో పాటు పలువురు పోలీసులు దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ షమీమ్ అక్తర్ ఏప్రిల్ 9న విచారించి పై తీర్పునిచ్చారు. 2010లో ఆజాద్, హేమచంద్ర పాండేల ఎన్‌కౌంటర్ మృతిపై ఆజాద్ సహచరి పద్మ, హేమచంద్రపాండే సహచరి బబితలు పోలీసులు వారిని పట్టుకెళ్లి కాల్చిచంపారని ఆదిలాబాద్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు.

### మక్కా మసీదు పేలుడు కేసులో తీర్పు

మక్కామసీదు పేలుడు కేసులో నిందితులను కోర్టు నిర్దోషులుగా ప్రకటిస్తూ ఏప్రిల్ 16న తీర్పు వెల్లడించింది. ప్రధాన సూత్రదారులుగా ఉన్న ఐదుగురికి ఆ ఘటనతో ఎలాంటి సంబంధం లేదని కేసును ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. స్వామి అసిమానంద సహా మొత్తం ఐదుగురిపై మోపిన అభియోగాలపై జాతీయ దర్యాప్తు సంస్థ సరైన ఆధారాలు చూపలేకపోయిందని నాంపల్లిలోని 4వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి రవీందర్‌రెడ్డి ప్రకటించారు. అసిమానంద వాంగ్మూలం ఇచ్చారని తప్ప నేరం రుజువు చేసేందుకు దర్యాప్తు అధికారులు మరే ఇతర ఆధారం చూపలేదు. తీర్పు ఇచ్చిన కొద్దిసేపటికే జడ్జి రవీందర్‌రెడ్డి హైకోర్టు ఎంఎస్‌జెకు రాజీనామా లేఖను అందించారు.

### ప్రత్యేక హోదా కోసం ఆంధ్రప్రదేశ్ బంద్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యే హోదా కోరుతూ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఏప్రిల్ 16న బంద్ పాటించాయి. బంద్ సందర్భంగా ఉదయమే ప్రజా సంఘాలు, ప్రజలు రోడ్లపైకి వచ్చారు. సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం), వై.సి.పి., జనసేన, కాంగ్రెస్ కార్యకర్తలు ఆర్.టి.సి. బస్‌స్టాండ్‌లు, డిపోల వద్దకు చేరుకున్నారు. దీంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఈ కారణంతో జనం రాకపోకలు స్థంబించిపోయాయి. ప్రజా సంఘాల, పార్టీల కార్యకర్తలు, నాయకులు రోడ్లపై ఉన్న షాపులను మూసివేయించారు. విద్యా సంస్థలకు ముందుగానే సెలవు ప్రకటించారు.

### ఎన్నికల హామీలు నెరవేర్చాలని సిపిఐ జైల్ భరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ సి.పి.ఐ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 16న జైల్ భరో కార్యక్రమాన్ని రంగారెడ్డి, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ జిల్లాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌లలోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించిన నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలను అమలు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు.

### చంద్రబాబునాయుడు ధర్మపోరాట దీక్ష

కేంద్రం విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 20న విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో 'ధర్మ పోరాట దీక్ష' చేశారు. 175 నియోజక వర్గాల్లో నిరాహార దీక్షలు చేశారు. 13 జిల్లాల్లో 13 మంది మంత్రులు దీక్షలో పాల్గొన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వడంలేదన్నారు. హామీలు నెరవేర్చేంతవరకు పోరాడతామన్నారు. అందులో భాగంగానే కేంద్ర మంత్రి పదవుల నుంచి తప్పుకొని కేంద్రానికి మద్దతు ఉపసంహరించారు.

### ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లును ఉపసంహరించాలి

ప్రైవేట్ యూనివర్సిటీల బిల్లు – 2018ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని టి.ఎన్.జి.ఒ భవన్‌లో ఏప్రిల్ 15న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. వ్యక్తులు మాట్లాడుతూ ప్రభుత్వం బిల్లు అమలు చేస్తే సామాజిక రిజర్వేషన్లు, ఫీజుల నియంత్రణ ఉండదన్నారు. రాష్ట్రంలో నారాయణ, శ్రీచైతన్య కార్పొరేట్ కాలేజీలను మూసివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకలంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఎలాంటి అభిప్రాయ సేకరణ లేకుండా మూడు రోజుల్లో హడావుడిగా బిల్లును తీసుకువచ్చారని మండిపడ్డారు. ప్రైవేట్ యూనివర్సిటీల్లో నాణ్యమైన విద్య ఎలా అందుతుందో ప్రభుత్వం చెప్పాలన్నారు. ప్రభుత్వం బిల్లును ఉపసంహరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు.

### బాలాంత్రపు రజనీకాంతరావు మృతి

ప్రముఖ వాగ్గేయకారుడు, రచయిత బాలాంత్రపు రజనీకాంతరావు (98) మృతిచెందారు. విజయవాడ సీతారామపురంలోని ఆయప స్వగృహంలో ఏప్రిల్ 22న కన్నుమూశారు. రజనీకంతరావు 1920 జనవరి 29న పశ్చిమగోదావరి జిల్లా నడదవోలులో జన్మించారు. ఆయన 1941లో మద్రాస్ ఆలిండియా రేడియోలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా చేరి స్టేషన్ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. ఆయన స్వయంగా రచించిన బాణీలు సమకూర్చిన మోగించు జయబేరి వాయించు నగారా గీతం మద్రాస్ ఆకాశవాణి నుంచి ప్రసారమైంది. రజనీకాంతరావు రచించిన వాగ్గేయకర చరిత్రకు కేంద్ర సాహిత్య పురస్కార అకాడమీ పురస్కారం 1961లో లభించింది. ఇదేకాక కళారత్న అవార్డు, కళాప్రపూర్ణ, ప్రతిభా మూర్తి జీవితకాల సాఫల్య బహుమతి లాంటివి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

### తెలంగాణలో సిపిఐ (ఎం) జాతీయ మహాసభలు

సిపిఐ(ఎం) జాతీయ 22వ మహాసభలు హైదరాబాద్‌లో ఐదు రోజులపాటు, ఏప్రిల్ 18 నుండి 22 వరకు జరిగాయి. ఏప్రిల్ 22న హైదరాబాద్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో పార్టీ మూడు తీర్మానాలను ఆమోదించింది. రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా), ఉన్నత విద్య సాధికారత ఏజెన్సీ (హీరా)ను ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగంలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రోత్సహించాలని, విశ్వవిద్యాలయాలపై దాడులను నిరోధించాలని తీర్మానించారు. 17 మందితో పొలిట్‌బ్యూరోను, 95 మందితో కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. పొలిట్‌బ్యూరో ప్రధాన కార్యదర్శిగా సీతారాం ఏచూరి తిరిగి ఎన్నికయ్యారు. వీ

## కశ్మీర్‌లో కల్లోలం

జమ్మూ కశ్మీర్‌లో షోపియాన్, అనంత్‌నాగ్ జిల్లాల్లో ఏప్రిల్ 1న జరిగిన మూడు ఎన్‌కౌంటర్లలో 13 మంది మిలిటెంట్లు చనిపోయారు. ముగ్గురు జవాన్లు మృతిచెందారు. ద్రగాడ్, కాచ్‌దూరా ఎన్‌కౌంటర్ల సందర్భంగా స్థానిక యువకులు భద్రతా బలగాలపై రాళ్లు రువ్వడంతో భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో నలుగురు పౌరులు చనిపోగా వంద మందికి పైగా గాయపడ్డారు. కుల్గాం జిల్లా ఖుద్వానీలో ఏప్రిల్ 11న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ జవాను మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఎన్‌కౌంటర్ జరుగుతుండగా స్థానిక ప్రజలు జవాన్లపై రాళ్లు రువ్వడంతో జవాన్లు తిరిగి కాల్పులు జరపడంతో నలుగురు పౌరులు మృతిచెందారు.

## భారత్ బంద్‌లో 11 మంది మృతి

మార్చ్ 20 సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చేలా ఉందని ఆరోపిస్తూ దళిత సంఘాలు ఏప్రిల్ 2న భారత్‌బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా దళితులు దేశ వ్యాప్తంగా ఆందోళన చేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పంజాబ్, హరియానా తదితర రాష్ట్రాల్లో నిరసన ప్రదర్శనలు జరిపారు. రైలు, రోడ్డు రవాణా స్థంబింపజేశారు. ఆందోళనకారులపై పోలీసులు, హిందూ మతోన్మాదులు లాఠీఛార్జి చేసి కాల్పులు జరపడంతో 11 మంది మృతిచెందగా పెద్ద సంఖ్యలో గాయపడ్డారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం కింద ఆటోమెటిక్‌గా చేసే కేసు నమోదును సుప్రీం కోర్టు నిషేధించింది. అనుమతి లేకుండా అరెస్ట్ చేయవద్దని, కోర్టులు ముందస్తు బెయిల్ కూడా ఇవ్వవచ్చని స్పష్టం చేసింది.

## రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ భారత్ బంద్

విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషనకు వ్యతిరేకంగా వివిధ సంస్థలు ఏప్రిల్ 10న భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్ సందర్భంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో పలు దుకాణాలు తెరవలేదు. ఉత్తరప్రదేశ్‌లో బంద్ ప్రభావం అంతగా కనబడలేదు. బిహార్‌లో మాత్రం బంద్ ఉద్రిక్తతలకు దారితీసింది. హింసాత్మక ఘటనలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పెద్దఎత్తున పోలీసు బలగాలను దింపింది.

## పెరుగుతున్న అత్యాచార హత్యలు

జమ్మూ కశ్మీర్‌లోని కఠువా జిల్లాలోని రస్సానాలో బక్రావాలాలకు చెందిన 8 ఏళ్ల ముస్లిం అమ్మాయిని కిడ్నాప్ చేసి ఏప్రిల్ 10 నుండి 14 వరకు అత్యాచారం చేసి చంపారు. తన ఇంటి ముందు గుర్రాలను మేపుతున్న బాలికను అపహరించి సాంజీరామ్‌కు చెందిన గుడిలో బంధించి మత్తుమందు ఇచ్చారు. ఆమెపై అత్యాచారం చేయాల్సిందిగా తన మేనల్లుడిని సాంజీరామ్ పురికొల్పాడు. అతడు, అతని స్నేహితుడితో పాటు సాంజీరామ్ కుమారుడు విశాల్, పోలీసు అధికారి దీపక్ ఖజూరియా కూడా ఆ బాలికపై అత్యాచారం చేశారు. అ తర్వాత సాంజీరామ్ మేనల్లుడు ఆమెను దుడ్డుకర్రతో కొట్టి చంపాడు. ఆమె మృతదేహాన్ని గుడికి సమీపంలోని అడవుల్లో పడేశారు. దీనికంతటికి బక్రావాలాలను ఆ ఊరిలో నుంచి తరిమేసి అక్కడి భూములను తమ సొంతం చేసుకోవాలనే కుట్ర దీనివెనక దాగి ఉందంటున్నారు. ఉన్నావ్‌లో జూన్ 4న 17 ఏళ్ల బాలికపై కుల్‌దీప్, అతని సోదరుడు తనపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించింది. కొన్నిరోజుల క్రితం సిఎం యోగి ఆదిత్యనాథ్ ఇంటిముందు ఆత్మహుతి యత్నం చేయడంతో నాటి దుర్మార్గం బయిటి ప్రపంచానికి తెలిసింది. ఏప్రిల్ 9న ఆమె తండ్రి పోలీసు కస్టడీలో మృతిచెందారు. ఆమె తండ్రిని కుల్‌దీప్ గూండాలు తనను దారుణంగా కొట్టడాన్ని చూపిస్తున్న వీడియో దృశ్యం బయటికి వచ్చింది. దీంతో ఎంఎల్ఏ సోదరుడు అతుల్‌సింగ్‌ను అరెస్టు చేశారు.

## అత్యాచార, హత్యలకు వ్యతిరేకంగా నిరసనలు

మహిళల పట్ల, చిన్నారుల పట్ల దేశవ్యాప్తంగా అత్యాచార, హత్య సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో నిందితులకు కఠిన శిక్షలు వేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా నిరసనలు ఊపందుకున్నాయి. ఢిల్లీ పార్లమెంట్ రోడ్‌లో గుర్‌గ్రామ్‌కు చెందిన సినీ దర్శకురాలు సబాధావన్ నేతృత్వంలో దర్శక, నిర్మాతలు, విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఢిల్లీతోపాటు, జమ్మూకశ్మీర్, సూరత్, ముంబై, బెంగళూరు, గోవా, హైదరాబాద్, భోపాల్ నగరాలు, కేరళలో రాష్ట్రవ్యాప్తంగా కొవ్వొత్తులతో ప్రదర్శనలు చేపట్టారు. కశ్మీర్‌లో బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ సర్వమత ర్యాలీ నిర్వహించారు.

## జస్టిస్ రాజిందర్ సచార్ మృతి

ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజిందర్ సింగ్ సచార్ (94) కన్నుమూశారు. హృద్రోగ సమస్యలతో కొద్దిరోజుల క్రితం ఢిల్లీలోని ఫోర్టిస్ ఆస్పత్రిలో చేరిన ఆయన ఏప్రిల్ 20న మరణించారు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయన 1985 ఆగస్టు 6 నుంచి 1985 డిసెంబర్ 22 వరకు పనిచేశారు. పదవీ విరమణ తర్వాత కూడా పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ అనే హక్కుల సంస్థతో అనుబంధం కొనసాగించారు. దేశంలోని ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై యుపిఎ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి ఆయన అధ్యక్షత వహించారు. సచార్ కమిటీ 2006 నవంబర్‌లో 403 పేజీల నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది.

## నరోదా పాటియా కేసులో గుజరాత్ హైకోర్టు తీర్పు

నరోదా పాటియా (గుజరాత్) అల్లర్ల కేసులో మాజీ మంత్రి మాయా కొద్నానీ సహా 18 మందిని హైకోర్టు ఏప్రిల్ 20న విడుదల చేసింది. మాజీ భజరంగ్‌దళ్ నేత బాబు భజరంగీతో పాటు 13 మందిని దోషులుగా పేర్కొంటూ దిగువకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఒకరికి పదేళ్లు.. భజరంగీ సహా మిగతా అందరికీ 21 ఏళ్ల జైలుశిక్ష విధించింది. దోషుల్లో ప్రకాశ్ రాథోడ్, సురేష్ ఝూలా అనే ఇద్దరితో కలిపి భజరంగీ నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు హైకోర్టు తేల్చింది. అల్లర్లల్లో కొద్నానీ పాత్రపై సాక్షుల వాంగ్మూలాల్లో వైరుధ్యాలున్నట్లు జస్టిస్ హర్ష దేవాని, జస్టిస్ ఎ.ఎస్. సుపాహియాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఆమెకు సంశయలాభాన్ని కూడా ఇచ్చింది. దోషుల శిక్షను పెంచాలంటూ గుజరాత్ ప్రభుత్వం చేసిన విజ్ఞాపనను తోసిపుచ్చింది. దిగువకోర్టు విడుదల చేసిన వారిలో ముగ్గురిని కూడా దోషులుగా తేల్చిన హైకోర్టు వారికి మే 9న శిక్షలు ఖరారు చేయనుంది.

## ఎన్‌కౌంటర్ హత్యలు

జార్ఖండ్‌లోని లాతేహర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. లాతేహర్ జిల్లాలోని కెడు అటవీ ప్రాంతంలో స్థానిక పోలీసులతో కలిపి సిఆర్‌పిఎఫ్ జవాన్లు మావోయిస్టుల కోసం ఏప్రిల్ 4న ఉదయం కూంబింగ్ సందర్భంగా ఇరు పక్షాల మధ్య కాల్పులు జరిగాయి. అందులో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారని ఎస్‌పి ప్రశాంత్ తెలిపారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోని భమ్రాగడ్‌లోని తాడ్‌గావ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లో 16 మంది మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టుల కదలికలపై పక్కా సమాచారంతో గడ్చిరోలి ఎస్.పి. అభినవ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో సి-60 కమెండోలు ఏప్రిల్ 21న కూబింగ్ ప్రారంభించారు. గడ్చిరోలి జిల్లాలోని ఖన్నా ప్రాంతంలో ఏప్రిల్ 23న జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు తెలిసింది. కొందరు గాయపడి తప్పించుకునే క్రమంలో ఇంద్రావతి నదిలో కొట్టుకుపోయిన వారిలో పదిహేను మంది ఏప్రిల్ 25న శవాలుగా తేలారని పోలీసులు తెలిపారు. ఏప్రిల్ 27 నాటికి మృతుల సంఖ్య మొత్తం 39కి చేరిందని ప్రకటించారు. వీ

## మయన్మార్ నూతన అధ్యక్షుడు

మయన్మార్ నూతన అధ్యక్షుడిగా ప్రభుత్వ సలహాదారుడు విన్ మింట్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మార్చ్ 28న ఆ దేశ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. విన్ మింట్ మయన్మార్ ప్రభుత్వ సలహాదారు ఆంగ్‌సాన్ సూకీకి అత్యంత సన్నిహితుడు. రోహింగ్యా ముస్లింలపై దాడుల నేపథ్యంలో దేశధ్యక్ష పదవి నుంచి హిటిన్ క్యావ్ తప్పుకున్నారు.

## పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ దాడులు

గాజా సరిహద్దుల్లో పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ బలగాలు దాడులకు పాల్పడుతుండడంపై పాలస్తీనీయులు నిరసనలు చేపట్టారు. ప్రస్తుతం ఇజ్రాయిల్‌లో ఉన్న తమ ఇండ్లలోకి రావడానికి అనుమతించాలని కోరుతూ గత కొంతకాలంగా నిరసన కార్యక్రమం 'మార్చ్ ఆఫ్ రిటర్న్' చేస్తున్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్నవారిపై ఇజ్రాయిల్ దళాలు దాడులు జరిపాయి. ఈ దాడిలో 17 మంది పాలస్తీనీయులు మరణించగా, ఐదు వందల మందికి పైగా గాయపడ్డారు. మార్చ్ 30న జరిగిన నిరసన కార్యక్రమంలో దాదాపు మూడు వేల మందికి పైగా పాల్గొన్నారు.

## జర్మనీలో నిరసనలు

కాటలోనియా మాజీ అధ్యక్షుడు కార్లెస్ ఫ్యుగ్దేమాంట్‌ను తక్షణమే విడుదల చేయాలంటూ జర్మనీలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శలు జరిగాయి. స్పెయిన్ నుంచి కాటలోనియా వైదొలగాలని ఫ్యుగ్దేమాంట్ మద్దతు ఇచ్చారు. స్పెయిన్ రాజ్యాంగాన్ని అగౌరవపరచి కాటలోనియన్లను రెచ్చగొడుతున్నారన్న ఆరోపణపై ఆయనను అరెస్టు చేశారు.

## అమెరికా ఉత్పత్తులపై చైనా దిగుమతి సుంకం

అమెరికా నుంచి చైనాకు దిగుమతి అవుతున్న వందకు పైగా ఉత్పత్తులపై చైనా భారీ సుంకం విధించింది. ఇటీవల అమెరికా స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై భారీ సుంకాన్ని విధించడంతో చైనా ఈ చర్యలు చేపట్టింది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే దాదాపు 3 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులపై ప్రభావం పడనుంది. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న 120 ఉత్పత్తులపై 15 శాతం, మరో ఎనిమిది వస్తువులపై 25 శాతం దిగుమతి సుంకాన్ని పెంచాలని చైనా నిర్ణయించింది.

## కోస్టారికా నూతన అధ్యక్షుడు

కోస్టారికా అధ్యక్షుడిగా కార్లోస్ అల్వరాడో క్వెసాడా ఎన్నికయ్యారు. ఏప్రిల్ 1న జరిగిన ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థి కార్లోస్ కన్జర్వేటివ్ ప్రొటెస్టెంట్ అభ్యర్థి అల్వారాడో మునోజ్‌పై విజయం సాధించారు. కార్లోస్‌కు 60 శాతం ఓట్లు రాగా, మునోజ్‌కు కేవలం 39 శాతం ఓట్లు వచ్చాయి. కోస్టారికా ఆధునిక చరిత్రలో పిన్నవయస్కుడైన అధ్యక్షుడిగా 38 ఏళ్ల కార్లోస్ రికార్డు సృష్టించారు. ప్రగతిశీల భావాలతో ముందుకు సాగాలని కార్లోస్ ప్రజలను కోరారు.

## ఫ్రాన్స్‌లో విడతల వారీ సమ్మె

ఫ్రాన్స్‌లో వివిధ కార్మిక సంఘాలు దేశవ్యాప్త విడతల వారి సమ్మెకు పిలుపునిచ్చాయి. ఏప్రిల్ 3 నుంచి విడతలవారీగా వారానికి రెండు లేదా మూడు రోజుల పాటు సమ్మె నిర్వహించడానికి కార్మిక సంఘాలు తెలిపాయి. అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రోన్ తీసుకు రావాలనుకుంటున్న కార్మికరంగ సంస్కరణలకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రైల్వే కార్మికులు సమ్మెతో రవాణా వ్యవస్థ స్థంభించిపోయింది. 77 శాతం మంది ఏప్రిల్ 3న జరిగిన సమ్మెలో పాల్గొన్నారు. దీంతో 45 లక్షల మంది ప్రయాణీకులపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఎయిర్‌లైన్స్ ఉద్యోగులు, ఇంధన రంగ కార్మికులు, ఉద్యోగస్తులు కూడా ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. అలాగే విశ్వవిద్యాలయ ప్రవేశాల్లో కఠిన నిబంధనలన్ని ప్రభుత్వం తీసుకువచ్చిన కారణంగా పెద్ద ఎత్తున విద్యార్థులు కూడా సమ్మెలో పాల్గొన్నారు.

## ఈజిప్టు అధ్యక్ష పదవికి ఎన్నికలు

ఈజిప్టు అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ 2న జరిగిన ఓటింగ్‌లో ప్రస్తుత అధ్యక్షుడు అబ్దెల్ ఫథాల్ అల్ సిసి గెలుపొందారు. దీంతో ఆయన మరోసారి ఈజిప్టు అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నారు.

## సిరియాపై దాడులు

సిరియా రాజధాని డమాస్కస్‌కు సమీపంలోని డౌమా నగరంపై రసాయనిక దాడి జరిగింది. ఏప్రిల్ 7న జరిగిన ఈ దాడిలో 150 మందికి పైగా మరణించారు. దాదాపు వెయ్యి మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో అధిక సంఖ్యలో పిల్లలు, మహిళలు ఉన్నారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తుండగా అధిక మంది శ్వాస అందక తీవ్రంగా అవస్థ పడుతున్నారు. సిరియా తిరుగుబాటుదారులకు, అమెరికా దాని మిత్రపక్షాల మధ్య తీవ్రమైన యుద్ధ వాతావరణం అలుముకుని ఉంది. డౌటా నగరంపై రసాయనిక దాడి నేపథ్యంలో ఏప్రిల్ 8న సిరియా తిరుగుబాటుదారుల సైనిక స్థావరాలపై క్షిపణి దాడి జరిగింది. ఈ దాడిలో 14 మంది మరణించారు. ఈ దాడుల్లో ఎక్కువగా సామాన్య పౌరులు, పిల్లలు మరణిస్తున్నారు.

## హంగరీలో ఎన్నికలు

హంగరీలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పాలక పార్టీ ఫిడ్జెజ్-కెడిఎన్‌పి సంకీర్ణ కూటమి విజయం సాధించింది. మొత్తం 190 సీట్లకు గాను 134 సీట్లు గెలుచుకుంది. సంకీర్ణ కూటమి అభ్యర్థి విక్టర్ ఓర్బాన్ మరోసారి ప్రధాని బాధ్యతలు చేపట్టారు. మొత్తం 69 శాతం సంకీర్ణ కూటమికి 49.42 శాతం ఓట్లు రాగా, మాజీ రాడికల్ జోబిక్ పార్టీకి 20 శాతం, ఎంఎస్‌జెడ్‌పికి 12 శాతం ఓట్లు వచ్చాయి.

## బంగ్లాదేశ్‌లో విద్యార్థుల నిరసన

బంగ్లాదేశ్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగాల రిజర్వేషన్ కోటాను వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళన చేశారు. సివిల్ సర్వీస్ ఉద్యోగాల్లో 54 శాతం ఉద్యోగాలు 1971 యుద్ధంలో పాల్గొన్న సైనికుల కుటుంబాలకు, వెనుకబడిన మైనారిటీలకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. మిగతా 44 శాతం ఓపెన్ కేటగిరీగా పేర్కొంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 9న రాజధాని ఢాకా యూనివర్సిటీ విద్యార్థులు శాంతియుత నిరసన ప్రదర్శలు చేపట్టారు. నిరసనకారులను అణచివేసేందుకు పోలీసులు బలప్రయోగం చేయడంతో వంద మందికి పైగా విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా కోటాను 10 శాతానికి తగ్గించాలని విద్యార్థులు డిమాండ్ చేయగా, ప్రధాని షేక్ హసీనా ఈ డిమాండ్‌ను తిరస్కరించారు.

## అల్జీరియాలో విమాన ప్రమాదం

అల్జీరియాలో మిలిటరీ విమానం ఐ1-76 ఏప్రిల్ 10న ప్రమాదానికి గురయింది. ఈ ప్రమాదంలో 257 మంది మరణించారు. ఈ సైనిక రవాణా విమానంలో 247 మంది సైనికులు, వారి కుటుంబ సభ్యులతో పాటు 10 మంది సిబ్బంది ఉన్నారు. విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న వారి ఒకరు తప్ప అందరు మరణించారు.

## అఫ్ఘనిస్తాన్‌లో దాడి

అఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. ఏప్రిల్ 22న కాబూల్‌లో ఓటర్ల నమోదు కేంద్రం వద్ద క్యూలో నిలబడిన ప్రజలను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో యాభై మందికి పైగా చనిపోయారు. వంద మందికి పైగా గాయపడ్డారు. ☐

# అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

**(మార్చ్ 1 నుండి మార్చ్ 31, 2018 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (848), ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో (819) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1667)**

| జిల్లా | ఆకలి | ఆత్మహత్యలు | | | | చికిత్స అందక, అనారోగ్యం | | | గుర్తు తెలియని | | హత్యలు | | ప్రమాదాలు | | | | పోలీసు కాల్పుల్లో | | పోలీసులు, సైన్యం | మిస్సింగ్/ లాకప్ మరణాలు | ప్రకృతి వైపరీత్యాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | వ్యవసాయ రంగం | చేనేత రంగం | ఇతరాలు | | | | | | | | | పనిచేసే స్థలంలో | కరెంట్ | రహదారి | ఇతరాలు | ఉద్యమ కారులు | ఇతరులు | | | |
| | | | | స్త్రీ | పు. | స్త్రీ | పు. | పి. | స్త్రీ | పు. | స్త్రీ | పు. | | | | | | | | | |
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) | (10) | (11) | (12) | (13) | (14) | (15) | (16) | (17) | (18) | (19) | (20) | (21) | (22) |
| ఆదిలాబాద్ | – | 2 | – | 26 | 21 | 4 | 2 | 3 | 2 | 3 | 4 | 4 | 1 | 3 | 21 | 32 | – | – | – | 3 | 8 |
| హైదరాబాద్ | – | – | – | 8 | 18 | 6 | 8 | 2 | – | – | 5 | 5 | 6 | 2 | 27 | 12 | – | – | – | – | – |
| కరీంనగర్ | – | 2 | – | 5 | 4 | 2 | 3 | 2 | – | 1 | 1 | 7 | 1 | 1 | 22 | 8 | – | – | – | – | – |
| ఖమ్మం | – | 8 | – | 6 | 12 | 3 | – | 2 | 1 | 6 | 1 | 3 | 3 | 3 | 32 | 18 | – | – | – | – | 1 |
| మహబూబ్‌నగర్ | – | – | – | 3 | 5 | 4 | 5 | 5 | 5 | 2 | 6 | 3 | 4 | 5 | 40 | 1 | – | – | – | – | – |
| మెదక్ | – | 10 | – | 2 | 3 | 4 | 9 | 1 | 2 | 4 | 2 | 4 | 2 | 9 | 20 | 22 | – | – | – | 2 | 2 |
| నల్గొండ | – | 7 | – | 8 | 7 | 1 | 1 | – | – | – | 2 | 2 | 1 | 5 | 14 | 12 | – | – | – | – | 1 |
| నిజామాబాద్ | – | 4 | – | 4 | 9 | 2 | 4 | – | – | 1 | – | – | 1 | 1 | 16 | 6 | – | – | – | – | – |
| వరంగల్ | – | 13 | – | 5 | 5 | 10 | 11 | 1 | 2 | 2 | 3 | 4 | 9 | 20 | 25 | 20 | – | – | – | 2 | 1 |
| వికారాబాద్ | – | – | – | 3 | 3 | 1 | – | – | – | – | 1 | 1 | – | 2 | 8 | 5 | – | – | – | – | – |
| **తెలంగాణ** | **-** | **46** | **-** | **70** | **87** | **37** | **43** | **16** | **12** | **19** | **25** | **33** | **28** | **51** | **225** | **136** | **-** | **-** | **-** | **7** | **13** |
| అనంతపురం | – | 1 | 1 | 19 | 18 | 3 | 6 | 1 | 2 | 6 | 1 | 6 | 23 | 12 | 41 | – | – | – | – | – | 6 |
| చిత్తూరు | – | – | – | 3 | 4 | 8 | 6 | – | – | – | 2 | 3 | 10 | – | 17 | 5 | – | – | – | – | 6 |
| కడప | – | 1 | – | 1 | 1 | – | – | – | 1 | 1 | – | 3 | – | 3 | 10 | 4 | – | – | – | – | – |
| గుంటూరు | – | 2 | – | 2 | 4 | 2 | 5 | – | 1 | 3 | – | – | – | 4 | 19 | 11 | – | – | – | – | – |
| కృష్ణా | – | – | – | 5 | 5 | 2 | 5 | – | – | – | 4 | 2 | 1 | 2 | 13 | 9 | – | – | – | – | – |
| కర్నూలు | – | 1 | – | 4 | 7 | 2 | 5 | – | – | 2 | 3 | 3 | 2 | 2 | 24 | 13 | – | – | – | – | 1 |
| తూర్పు గోదావరి | – | 1 | – | 3 | 2 | – | 2 | 2 | 3 | 8 | – | – | – | 2 | 35 | 20 | 1 | – | – | 3 | – |
| ప్రకాశం | – | 1 | – | 4 | 6 | – | 4 | – | 1 | 3 | 3 | 3 | – | 3 | 20 | 12 | – | – | – | – | 2 |
| శ్రీకాకుళం | – | – | – | 3 | 8 | 2 | 14 | 3 | – | 1 | 1 | 3 | 4 | 8 | 31 | 9 | – | – | – | – | 1 |
| పశ్చిమ గోదావరి | – | – | – | 1 | 1 | 3 | 2 | – | – | 3 | 1 | – | 1 | 1 | 12 | 8 | – | – | – | – | – |
| నెల్లూరు | – | 1 | – | 3 | 6 | 1 | 1 | – | 2 | 3 | 2 | – | – | 3 | 15 | 11 | – | – | – | – | – |
| విజయనగరం | – | – | – | 3 | 3 | 2 | 2 | 2 | – | 1 | – | – | 2 | – | 19 | 5 | – | – | – | – | 1 |
| విశాఖపట్నం | – | – | – | 3 | 9 | 1 | 4 | – | 1 | 3 | 1 | 2 | 6 | 2 | 17 | 10 | – | – | – | 6 | – |
| **ఆంధ్రప్రదేశ్** | **-** | **8** | **1** | **50** | **74** | **26** | **56** | **8** | **11** | **34** | **18** | **25** | **49** | **42** | **273** | **117** | **1** | **-** | **-** | **9** | **17** |

# వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం


## మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

| | | |
|---|---|---|
| రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్) | ఆబిడ్స్, హైదరాబాద్ | 96666 80857 |
| నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ | హైదరాబాద్ | 90004 13413 |
| సహచర బుక్‌మార్క్ | బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ | 98483 48173 |
| బాల రాజేశ్వర బుక్ డిపో | నల్లకుంట బస్ స్టాప్ | 9705055738 |
| వెంకటేశ్వర బుక్ స్టాల్, స్టేషనరీ | నల్లకుంట, శంకర్‌మఠ్ | 040-66131071 |
| పస్ట్ లక్ష్మీ పాన్ షాప్ | విద్యానగర్ సిగ్నల్స్ | 9848672831 |
| సుధాకర్ బుక్ స్టాల్ | సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక | 9949337605 |
| వెంకటేశ్వర బుక్ స్టాల్ | రామ్‌నగర్ గుండు | 9502964995 |
| భవాని బుక్ స్టాల్ | శివం రోడ్ | 9849836996 |
| శ్రీభవాని బుక్ స్టాల్ | శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర) | 9640712555 |
| ఓరియన్ బుక్ స్టాల్ | అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర) | 7702535137 |
| అరవింద్ బుక్ స్టాల్ | రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా) | 8977995537 |
| రెడ్డి బుక్‌స్టాల్ | అశోక్‌నగర్, హైదరాబాద్ | |
| నేషనల్ బుక్‌హౌస్ | అబిడ్స్, హైదరాబాద్ | 9394495189 |
| దుర్గా భవన్ బుక్‌స్టాల్ | నాంపలి, హైదరాబాద్ | 9030656640 |
| డైమాండ్ బుక్‌స్టాల్ | నాంపలి, హైదరాబాద్ | 9885127491 |
| రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్ | మెహిదీపట్నం, హైదరాబాద్ | 7799244409 |
| రిలెబుల్ బుక్ సెంటర్ | నానల్‌గూడ, హైదరాబాద్ | 040-23512447 |
| ఇస్పెక్ట్రం బుక్‌హౌస్ | లంగర్‌హౌజ్, హైదరాబాద్ | 98486 68354 |
| శ్రీలక్ష్మి బుక్‌స్టాల్ | హైదర్‌గూడ, హైదరాబాద్ | 98855 81249 |
| లక్ష్మణ్ | చిక్కడపల్లి, హైదరాబాద్ | 93910 12051 |
| మల్లిఖార్జున్ బుక్‌స్టాల్ | దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ | 90594 40756 |
| సుధీర్ బుక్‌స్టాల్ | తార్నాక, హైదరాబాద్ | 95426 04166 |
| లడ్డు బుక్‌స్టాల్ | పంజగుట్ట, హైదరాబాద్ | 99492 15135 |
| వినోద్ బుక్‌స్టాల్ | సరూర్‌నగర్, హైదరాబాద్ | 95536 03603 |
| రాజ్ బుక్స్ స్టేషనరీ | ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్ | 87905 60097 |
| బాల్‌రెడ్డి బుక్‌స్టాల్ | ఆర్‌టిసి బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్ | 98660 18829 |
| శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్ | ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్ | 90592 85948 |
| భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్ | కోహెడ | 95021 82545 |
| భండారి కిష్టయ్య బుక్‌స్టాల్ | ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని | 98497 93836 |
| గణేష్ బుక్‌స్టాల్ | కళాభారతి ఎదురుగా, కరీంనగర్ | 97019 99007 |
| సాయిగణేష్ బుక్‌స్టాల్ | టు టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, కరీంనగర్ | 93979 94268 |
| మహాలక్ష్మి బుక్‌స్టాల్ | సిటీ బస్‌స్టాండ్, హన్మకొండ చౌరస్తా, వరంగల్ | 99893 30297 |
| వినయ్ బుక్‌స్టాల్ | ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల | 94407 57503 |
| పాండు బుక్ స్టాల్, కూల్ డ్రింక్స్ | ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ | 98857 38144 |
| శరత్ బుక్ స్టాల్ | షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్ | 98662 73720 |
| సత్యసాయి బుక్‌స్టాల్ | ఖమ్మం | |
| మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్ | ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం | 73825 60366 |
| మణి బుక్‌స్టాల్ | సండేమార్కెట్, నెల్లూరు | 73862 23538 |
| సురేష్ బుక్ స్టాల్ | శివాలయం వీథి, ప్రొద్దటూరు | 81210 02112 |
| పద్మావతి బుక్‌స్టాల్ | ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్ | 73965 09767 |
| అనేక బుక్‌స్టాల్ | ఏలూరు రోడ్డు, విజయవాడ | 92472 53884 |
| మైత్రీ బుక్‌హౌస్ | మజీద్ వీథి, అరండల్‌పేట, విజయవాడ | 98486 31604 |
| రాజేశ్ బుక్ సర్వీస్ | ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం | 99483 19842 |
| వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ | డాబా గార్డెన్, విశాఖపట్నం | 99482 90318 |
| రాఘవేంద్ర బుక్‌స్టాల్ | ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్ | 90595 23091 |
| శ్రీసత్యసాయి బుక్‌స్టాల్ | ఆర్‌టిసి కాంప్లెక్స్, రాజమండ్రి | 73860 66226, 94419 07321 |

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 202 - May 2018 • **ISSN 2231-6892**
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/4/2018 • Postal Regn. No. L II/RNP/HD/1100/2017-19

Date of Posting : 29th, 30th

**కె.వి.ఆర్., శారదాంబ స్మారక కమిటీ**





**పేజీలు : 428**
**వెల: రు. 200**

# కె.వి.ఆర్. శీర్షికలు

ప్రతులకు :
**డా. ఎస్. రామకృష్ణ**
శాంతి నర్సింగ్ హోమ్
నిర్మలా కాన్వెంట్ ఎదురుగా,
పటమట, విజయవాడ – 520 010
ఫోన్: 98490 83137

Advt.

**తెలంగాణ ఆత్మగౌరవ వేదిక ప్రచురణ**




**పేజీలు : 272**
**వెల: రు. 180**

# వందేళ్ల ఓయూ

## జ్ఞాపకాలు – అనుభవాలు

సంపాదకులు: **దేవిడ్**

ప్రతులకు :
**మలుపు బుక్స్**
ఫ్లాట్ నం. 302, 3వ ఫ్లోర్, ఎంఎస్‌కె టవర్స్,
స్ట్రీట్ నం. 11, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ – 500 029
ఫోన్: 9866559868

Advt.

ఈ రెండు పుస్తకాలు
**వీక్షణం**
జి1, మైత్రీ రెసిడెన్సీ, స్ట్రీట్ నం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ – 500 029, ఫోన్: 66843495
**దగ్గర కూడ దొరుకుతాయి**

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao